
డ్రాక్యులా
మైథిలీ వెంకటేశ్వరరావు

తెలుగులో హర్రర్ నవలలు సరయినవి రావటం లేదని అనుకునే పాఠకులు ముక్త కంఠంతో మెచ్చుకునే నవల.

# డ్రాక్యుల

ఇది

మైథిలీ వెంకటేశ్వరరావు రచన

**ద్రాక్ష్యల**

By

**మైథిలీ వెంకటేశ్వరరావు**

**ధర: రూ. 90/-**

ె

**ముద్రణ :**

**మార్చి 2008**

**పబ్లిషర్స్:**

**G. VENKATESWARA RAO**

**D.No : 28-23-21, Arundelpet,**
**Kaza Venkateswararao Street,**
**VIJAYAWADA - 520 002.**

# ద్రాక్ష్యలి

మైథిలీ వెంకటేశ్వరరావు

# మైథిలీ వెంకటేశ్వరరావు రచనలు

చిత్రాంగి

స్... స్... స్నేక్

వయ్‌లెన్స్

రాజధాని ఎక్స్‌ప్రెస్

ఇంద్రజ

డ్రాక్యుల

బీస్ 2008

మధు విలాస్

అరణ్య ఘోష

అనూ! నను ప్రేమించానను

# ప్రారంభం

**ఆకాశంలో నక్షత్రాలు లేవు.....**

**అంతా చీకటే...ఊరి బైట బీడు పడిన పొలాల్లో ఎండి పోయిన పిచ్చి మొక్కల మధ్య కాపురముంటున్న కీచురాళ్ళు ఛీ....ఛీ...అని శబ్దం చేసస్తూ అరుస్తున్నాయి. అలాంటి సమయంలో వచ్చిందామె,అదికూడా పరిగెత్తుతూ - జుట్టు చెదిరిపోయి ఉంది....ఎగిసి పడుతున్న కెరటంలా ఉంది... పెట్టుకున్న బొట్టు చెదిరి ఉంది.**

"అదిగో అక్కడుంది" ఎవరిదో మగగొంతు.

ఆమె ఉలిక్కిపడింది...

చీకటిని చీల్చుకుని బాణంలా పరిగెత్తింది.

ఆమె వెనుక ఆరుగురు వ్యక్తులు అదే వేగంతో పరిగెడుతున్నారు. నిండా పద్ధెనిమిది ఏళ్ళు కూడా ఉండవామెకి. కాలికి ఉన్న వెండి పట్టీలు ఎగిరెగిరి పడుతున్నాయి. కట్టుకున్న చీర ముందుకు పోనీయటం లేదు. అయినా ఆమె, ఓ చేత్తో కుచ్చీళ్ళు ఎత్తి పట్టుకుని శక్తివంచన లేకుండా పరుగులు తీస్తోంది.

వెనుక పరిగెడుతున్న ఆరుగురులో ముగ్గురు ఆమెకి సమీపంలో ఉన్నారు. ముగ్గురు మగవారే...అందులో ఒకరి చేతిలో పెట్రోల్ టిన్ను ఉంది. అది పట్టుకునే పరిగెడుతున్నాడు. ఆ వెనుకున్నది ఆడవాళ్ళు... మొత్తం ఆరుగురు వేటాడుతున్నది ముందు పరిగెడుతున్న ఆమె కోసమే....

రాత్రి సమయం కావటంతో క్రింద ఏముందో కూడా తెలియటం లేదు. అవన్నీ పట్టించుకునే స్థితిలో లేరు ఎవరూ...

ముళ్ళు...రాళ్ళు....రప్పలు......ఒకరిది ప్రాణభయమైతే, మిగతా వారిది బ్రతుకు భయం. వారు బ్రతకాలంటే ఆమె చావాలి.

ముందు పరిగెడుతున్న ఆమెకి ఎదురు రాయి తగిలింది. ఒక్క ఎగురు ఎగిరి పడింది..

ఆ పడటంతో తలకి దెబ్బ తగిలింది...చిట్లి రక్తం వచ్చింది....ఆమె ఆ బాధని ప్రదర్శించే స్థితిలో లేదు. పడీ పడటంతోనే వెనక్కి చూసింది.

ఆ ముగ్గురూ వచ్చేస్తున్నారు... బాగా దగ్గరికి...లేవాలి. పరిగెత్తాలి, ప్రాణం కాపాడుకోవాలి...తన ప్రాణం కాపాడుకుంటేగాని వాళ్ళమీద పగ తీర్చుకోవటానికి అవకాశం ఉండదు...

అవును...వాళ్ళకి దొరకకూడదు.... దొరికితే చంపేస్తారు.. తాను చావకూడదు. ఆ ఆరుగురి మీద పగ తీర్చుకోవాలి. ఆమె లేచింది. మళ్ళీ చీకటిలో పరుగు ప్రారంభించింది.

అప్పటికే వారు చాలా దగ్గరికి వచ్చేశారు. శరీరంలో శక్తి లేదు. తలకి దెబ్బ భరించలేని బాధ... టెన్షన్‌తో...ఆమె పరిగెడుతుందనేగాని తెలిసి పోతోంది తాను వాళ్ళకి దొరకక తప్పదని. అదే జరిగితే తన ప్రాణం పోవటం ఖాయం.

ఆమె పరిగెడుతూనే భగవంతుని తలుచుకుంది. ‘ఓ భగవాన్ వీళ్ళనుంచి కాపాడు...లేదా వీళ్ళ చేతిలో చావటమే నా నుదుటన రాసి ఉంటే చచ్చాక సాధించే అవకాశం ఇవ్వు....దెయ్యంగా మారి వీళ్ళని పీక్కుతినేలా చేయి. చావబోతూ కోరుకునే ఏ కోర్కెనయినా నువ్వు తీరుస్తావని నేను చదువుకున్న పురాణాల్లో ఉంది. అదే నిజమైతే నాకా అవకాశం ఇవ్వు”.

ఆమె ఇక పరిగెత్తలేకపోయింది..ఎడారిలో ఎండమావిలా ఆమెకి ఎదురుగా

ఏదో పాడుబడ్డ ఇల్లు కనిపించింది. అదేమిటో ఎందుకక్కడ ఉందో చూడలేదు..అటుకేసి పరిగెత్తింది. లోనికెళ్ళి తలుపులేసుకుందామని–

దగ్గరి కెళ్ళాక గాని తెలియలేదు. దానికి తలుపులు లేవని....ఆమె అదిరే గుండెలతో వెను తిరిగింది. అప్పటికే వాళ్ళు తాపీగా చుట్టూ నిలబడ్డారు. వెనకనించి ఆడవాళ్ళు కూడా పరిగెత్తుకొచ్చారు. ఆరుగురు రొప్పుతూ చూశారు కసిగా–

ప్రాణ భయంతో వెనకడుగు వేసింది.

పెట్రోల్ టిన్ను పట్టుకున్న అతను మూతతీసి విసురుగా ఆమె పై చల్లాడు. చల్లగా ఐస్‌పడ్డట్టు అన్పించింది.

ఆమెకి ఎటు పోవటానికి ఆస్కారం లేదు. అసహాయంగా నిలబడి ఉంది.

మరొకతను అగ్గిపుల్ల గీసాడు. ఆమె గుండెలు గుబగుబలాడాయి. అతను వికృతంగా నవ్వుతూ అగ్గిపుల్ల ఆమె మీదకి విసిరేశాడు.

అగ్గిపుల్ల వచ్చి పెట్రోల్‌తో తడిసిన శరీరం మీద పడటం ఆలస్యం, భగ్గున మంటలు ఆమె భయంకరంగా అరిచింది.

"పోసేయ్ మిగిలిన పెట్రోలు కూడా"

టిన్నులోని మిగతా పెట్రోల్‌ని కూడా గుమ్మరించాడు.

నిలువెల్లా మంటలు, కట్టుకున్న చీరని పద్ధెనిమిది సంవత్సరాల శరీరాన్ని కాలుస్తున్నాయి. ఆ బాధకి భయంకరంగా అరుస్తోంది.

మాంసం ఉడుకుతున్న వాసన చుట్టూ ఆవరించింది. దానితోపాటు గుడ్డలు కాలుతున్న వాసన కూడా.

కొంతసేపటికి ఆమె కేకలు ఆపేసింది. దబ్బున క్రింద పడిపోయింది. మంటలు మాత్రం ఆమెని కాల్చేస్తూనే ఉన్నాయి.

శ్మశానంలో శవాన్ని కాల్చే కాపరిలా వాళ్ళు కుళ్ళబొడిచారు. ఇంకా పచ్చి మాంసం కాలకుండానే మిగిలి పోయింది.

"ఆనవాలు తెలియకూడదు తమ్ముడు. మరి కొంత పెట్రోలు పోసి తగులబెట్టు"

చచ్చిపోయిన ఆ శరీరం మీద మళ్ళీ పెట్రోలు పోశారు. ఈ సారి అగ్గిపుల్ల

వెలిగించకుండానే అగ్నిదేవుడు తన సహస్రనాలుకలతో ఆవులించాడు. విరుచుకు పడ్డాడు.

అరగంటసేపు జరిగిందా శవదహనం-

అయిదడుగుల శరీరం బూడిదగా మారింది. అప్పుడు గానివాళ్ళు వెనుతిరగలేదు.

వాళ్ళు ఆ ప్రదేశం నుంచి వెళ్ళిన మరుక్షణం ఆకాశం భయంకరంగా ఉరిమింది.

నల్లటి మేఘాలు మిడతల దండులా తరలి వచ్చాయి... ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ప్రచండంగా పడటం ప్రారంభించింది.

ప్రకృతి పరశురామ అవతారం ఎత్తింది - చెట్లు వ్రేళ్ళతో సహా కదిలి పోతున్నాయా అన్నట్టు ఊగటం ప్రారంభించాయి.

చూస్తుండగానే కనుచూపు మేరంతా నీటితో నిండిపోయింది.

ఎప్పుడో తెల్లవారుజామున శాంతించింది. మళ్ళీ కన్న తల్లిలా ప్రశాంతంగా ఉండి పోయింది ప్రకృతి మాత.

ఇప్పుడు ఓ శవాన్ని కాల్చిన దాఖలాలు అక్కడేమి లేవు. ఎముకలు ఇంకా కాలకుండా మిగిలి పోయిన మాంసం ముద్దలు వరద నీటిలో కొట్టుకు పోయాయి.

శరీరం కాలి బూడిదగా మారింది. అక్కడే ఆ మట్టిలోనే కలిసిపోయింది. పాలమీద మీగడ కట్టినట్టు తెల్లగా పరుచుకుని ఉంది.

మట్టిలో మట్టిగా మారిపోయి ఉంది...

**కొన్ని సంవత్సరాల తరువాత**

# డ్రాక్యుల

**ఆకాశం మేఘావృతమై వుంది...**

**తూర్పు నుంచి చల్లటిగాలి రివ్వున వీస్తోంది... వున్నట్టుండి ఒక్కసారి ఆకాశం అదిరింది... భూమి ఒణికింది. మహోజ్వాలా ప్రకాశంగా పిడుగు ఆ మేఘాన్ని చీల్చుకొని బయటపడింది.**

పై నుంచి ఎవరో మండుతున్న కాగడాని విసిరినట్టు వస్తోంది.... అది పడ్డ శబ్దానికి బిడ్డని కన్న తల్లిలా భూమి అరిచింది.

అప్పుడే చినుకులు ప్రారంభమయ్యాయి. టప....టప....టప..... ఒక్కసారిగా ప్రకృతి మారిపోయింది. చెట్లు విరబోసుకున్న దెయ్యాల్లా కదులుతున్నాయి. వర్షం ఉధృతమయింది. తెరపి ఇచ్చే ఉద్దేశ్యం లేనట్లు తూర్పునుంచి మేఘాలు హడావుడిగా వస్తున్నాయి.

నల్లటి తారు రోడ్డుమీద పాదరసంలా జారిపోతోంది మారుతి లేటెస్ట్ మోడల్ కారు అద్దాలమీద ఎడతెరిపిలేకుండా వర్షపు దారలు కురుస్తూనే వున్నాయి.

డ్రైవింగ్ చేస్తున్న శ్యామ్ పక్కకి చూసి.... "డియర్! మనం ఆగడం శ్రేయస్కరంలా ఉంది. ఎదురు వర్షం తప్ప మరేం కనబడ్డం లేదు" చెప్పాడు.

అటుకేసి వున్న రోజీ భారంగా కదిలింది... 'అమ్మా' అంది బాధగా.

"జాగ్రత్త.... నిండు నెలల మనిషివి. ఇంతదూరం తీసుకురావడం రిస్క్ అని ఆలోచించలేదు. నిన్ను తీసుకురాకుండా, నేనొక్కడినే పెళ్ళికి ఎటెండ్ అయినా బాగుండేది"

రోజీ తన తొమ్మిది నెలల కడుపును పదిలింగా పట్టుకుంటూ సర్దుకుని కూర్చుంది. శ్యామ్ కారుని ఓ పక్కగా ఆపాడు. ఉరుములతో మెరుపులతో ప్రతిధ్వనిస్తోంది.

"పిడుగులు పడేలా ఉన్నాయి. చెట్టుకింద ప్రమాదం డియర్" పిడుగులతో వర్షం వచ్చేటప్పుడు చెట్ల క్రింద ఉండకూడదు అంది రోజీ.

శ్యామ్ కారు స్టార్టు చేసి ముందుకు పోనిచ్చి ఓపెన్ ప్లేస్‌లో అపాడు. వర్షం తగ్గే సూచనలు కనిపించడంలేదు. క్షణక్షణానికీ పెరిగిపోతోంది. గాలి వేగానికి కారు కదులుతోంది. కనుచూపు మేరలో ఏ వాహనమూ వస్తున్న జాడలేదు.

రాత్రి పదకొండు గంటలు.... చుట్టూ చిమ్మ చీకటి.... భయంకరమైన వర్షం– భయంగా భర్తని ఆనుకుని కూర్చుంది. శ్యామ్ హెడ్‌లైట్స్ ఆన్‌చేసి భార్యని పొదివి పట్టుకున్నాడు.

"భయంలేదులే. ఉరుములూ, మెరుపులూ, దేవతల చప్పట్లు..."

"అమ్మా!" అంది... పొత్తికడుపుని పట్టుకొని తిరిగిపోతూ....

శ్యామ్ మరింత భద్రంగా పట్టుకున్నాడు.

" భరించలేకుండా వున్నానండి.... పడుకోవాలనిపిస్తుందండి"

"ఏసుప్రభూ నువ్వే మాకు రక్ష" వేడుకున్నాడు శ్యామ్.

రోజీకి నొప్పులు ఎక్కువయ్యాయి. ప్రకృతిలా ఆమె ఊగిపోతోంది. ఉధృతమౌతున్న వర్షాన్ని, ప్రకృతిని లెక్క చేయకుండా కారుని స్టార్టు చేశాడు.

ఫ్లడ్‌లైట్ కాంతి వర్షపు చినుకులను చీల్చుకొని పోతోంది.

"లాభంలేదండి... పదిమైళ్ళ దాకా ఊరు కనపడదు...." బాధని బిగపెట్టుకుంటూ అంది.

"పావుగంట ఓర్చుకో... పదినిమిషాలలో తీసుకెళతాను" ఎక్సిలేటర్ బలంగా అదుముతూ చెప్పాడు.

రోజీ ఎగిరెగిరి పడుతోంది. కారు టాపు అదిరేలా అరుస్తోంది.... కారు

వేగానికి కడుపులో బిడ్డ కదులుతూ వుండటంతో దాని తాలూకు బాధతో ఆమె అతలాకుతలమవుతోంది.

శ్యామ్ ఏదయితే అదయిందని కారు స్లో చేసాడు. గాఢాంధకారమైన చీకటి. రోజీని పొదివి పట్టుకుని...

"పడుకో డియర్" అన్నాడు.

"లాభం లేదండి, బిడ్డ ఎక్కువసేపు లోపల వుండనంటున్నాడు. ఈ ప్రపంచంలోకి రావటానికి ఉవ్విళ్ళూరుతున్నాడు. ఆపటం నా వల్ల కాదు"

"రోజీ రిలాక్స్" చెబుతున్నాడు శ్యామ్.

"దగ్గరలో ఇల్లేమన్నా ఉందేమో చూడండి.. ఈ....బా....ధ...త....ట్టు....కో- లే.....కుండా...."

శ్యామ్ చుట్టూ చూశాడు.

గాఢాంధకారమైన చీకటి.... ఆ చీకటిలో చిరుదివ్వె.... దూరంగా సన్నని వెలుగు.... బహుశ పొలంలో మంచె అయి వుంటుంది.

"రోజీ అక్కడేదో మంచె వున్నట్లుంది..... వెళదామా"

రోజీ తలూపింది. కారులో ఆమె పడుకోలేకపోతోంది. కాళ్ళు కదల్చటానికి కూడావీలేదు.

"రాగలవా?" లేవనెత్తుతూ అడిగాడు.

రోజీ పళ్ళ బిగువున బాధని అదిమిపెట్టి లేచింది. శ్యామ్ ఓ చేతితో డోర్ తెరిచాడు. రివ్వున గాలి దూసుకొచ్చింది. వేగంగా పడుతున్న వర్షపు తాలూకు జల్లు ఇద్దరిని తడిపేసింది.

క్షణంలో-

శ్యామ్ రోజీని పట్టుకుని దిగాడు.

"దగ్గరలో ఉంది.... నెమ్మదిగా పద" డాష్‌బోర్డులోంచి టార్చిలైటు అందుకుని డోర్ మూస్తూ చెప్పాడు. రోజీ అడుగుతీసి అడుగు వేసింది భర్త సహాయంతో.

"క్రింద ముళ్ళున్నట్లున్నాయి జాగ్రత్త" చెపుతూనే తీసుకెళుతున్నాడు శ్యామ్.

క్రిందంతా బురద..... పంటపొలమనుకున్నారు కాని కాదు..... బీడు భూమి.... అడుగు తీసి అడుగేయటం కష్టంగా ఉంది.

"పోనీ కారులోనే కూర్చుందామా?" అరిచాడు. ఆ హోరులో అరిస్తే కాని వినిపించటంలేదు. రోజీ తల అడ్డంగా ఆడించింది.

"ఈ సమయంలో ఆడదాని బాధ మీకు తెలీదండి... కష్టమైనా వెళదాం. కాస్త విశాలంగా పడుకొనే స్థలముంటే చాలు"

క్రింద వర్షపు నీటిలో పాదాలు మునిగిపోతున్నాయి. అడుగు వేసినప్పుడల్లా తియ్యటానికి కష్టపడవలసి వస్తోంది. బురదలో వేసిన కాలు రానంటోంది.

"ప్రభువా....నీ బిడ్డకి ఎంత కష్టం తెచ్చావయ్యా... ఈ నడి సముద్రంలో నువ్వే మాకు రక్ష" శ్యామ్ మరోసారి ప్రభువును తలుచుకున్నాడు.

గాలి ఝుంకార శబ్దంచేస్తూ తిరుగుతోంది. రోజీ పమిటచెంగు గాలి పటంలా రెపరెపలాడుతోంది. పైగా ఆమెను బ్యాలెన్స్‌గా వుండనీయటం లేదు.

శ్యామ్‌కి పమిటకొంగుని పట్టుకోవటం సాధ్యం కావడంలేదు. ఓ పక్క భార్య, మరోపక్క పమిటచెంగు... బ్యాలెన్స్ చేసుకోలేకపోతున్నాడు.

"లాభంలేదు రోజీ! చీర విప్పేయ్... లేదంటే ఈ గాలి తాకిడికి మనం నిలబడటం కష్టం"

ఆ ఈదురు గాలిలోనే ఆమె తలాడించింది. శ్యామ్ ఆగి టార్చిలైటు నోట్లో పెట్టుకుని రోజీ పమిట పట్టుకొని విడదీశాడు.

వట్టి లంగా మీదుంది. అదికూడా అతుక్కుపోయి వుంది. శ్యామ్ చీరని చుట్టగా చుట్టి మెడలో వేసుకున్నాడు. మళ్ళీ ముందుకు కదిలాడు.

చాలా దగ్గరికి వచ్చాకగాని అర్థం కాలేదు– అదో పాడుబడిన రెండు గదుల ఇల్లు అది మంచెకాదు....

కాని తాను కారులోంచి లాంతరిని వెలుగును చూశాడే? మరి ఆ వెలుగు ఏమయింది?

ఆ బ్రహ్మాండమైన పెనుతుఫానులో కళ్ళు చిట్లించి చూశాడు వెలుగు... లాంతరు వెలుగు.... కాని ఇక్కడ ఆ జాడకూడా వున్నట్లు లేదు. టార్చిలైటు ఆ ఇంట్లోకి వేశాడు.

రాజులూ, రాజ్యాలున్నప్పటి వారెవరో కట్టించినట్టు చూడగానే తెలుస్తోంది...

కొంపదీసి ఏ రాజుదో, రాణిదో సమాధి కాదుగదా?? సరిగ్గా గమనించి

ఉంటే ఎవరి సమాదో శ్యామ్‌కి తెలిసి ఉండేది. ఆ హడావుడిలో గమనించ లేకపోయాడు.

ఆకాశం పెళ్ళున విరిగినట్టు మధ్యకు చీలింది. మెరుపు మెరిసి మాయమైంది.

రోజీని ఓ పక్కగా పడుకోబెట్టాడు. కటిక నేలపై.... చిరుగాలికి ఎగిరే ఎండుపుల్లలా ఎగురుతోంది రోజీ.

"కొద్దిగా ఓర్చుకో" సముదాయిస్తున్నాడు శ్యామ్.

"దాహం.... దాహం" రోజీ మెలికలు తిరుగుతూ చెప్పింది.

చుట్టూ నీరే శ్యామ్ విరక్తిగా నవ్వుకున్నాడు. సముద్రం మీద వున్నవాడికి తనకి తేడా లేదు. చుట్టూ నీళ్ళే... తాగటానికి పనికి రావు. తన స్థితి అదే. అనంతమైన జలధార ఆకాశాన్ని చీల్చుకుని కురుస్తోంది. పట్టడానికి, తాగడానికి పనికి రావు. అసలే రోజీ ఒట్టి మనిషికాదు... త్రాగిస్తే ఏదన్నా అయితే?

ఏమవుతుంది? తప్పదు.... అంతకుమించి గత్యంతరం లేదు. టార్చిలైటుని నలువైపులా ప్రసరింపచేసాడు తిప్పుతూ–

పగిలిన కుండలూ, విరిగిన మూకుళ్ళూ.... వర్షపునీరు పట్టడానికి పనికిరావు. పక్క గదిలో చూస్తే? అనుకోవటం ఆలస్యం....

"రోజా డియర్ వన్ మినిట్. చీకటిని చూసి భయపడకు..." అని పక్క గదిలోకి వెళ్ళాడు. వెళ్ళీ వెళ్ళటంతోనే టార్చిని ముక్కు సూటిగా వేసాడు.

టార్చిలైటు వెలుగుతో పాటు అతని కనుచూపు సాగింది.

అంతే! కళ్ళు పెద్దవయ్యాయి. చేతులూ, కాళ్ళూ వణికాయి. ఖచ్చితంగా చుట్టూ వున్న ప్రకృతి వల్ల కాదు. ఎదుట దృశ్యాన్ని చూసి గుండెలు తీసిన బంటుకి కూడా గుండెలు దడదడ లాడించేలా ఉంది.

పుర్రెలు, ఒకటి కాదు, రెండు కాదు... ఓ నాలుగు దాకా– వాటి తాలూకు ఎముకులు, చేతులవి, మోకాళ్ళవి కుప్పగా పోసి ఉన్నాయి. శ్యామ్ భయానికి తగ్గట్టు అవి కదులుతున్నాయి. ఆ పుర్రెలు ఒకేసారి కదలటం ప్రారంభించాయి.

శ్యామ్ నెత్తురు పరుగులు తీసింది. కళ్ళార్పకుండా చూస్తున్నాడు. అవి కదులుతూనే ఉన్నాయి. పుర్రెలు కరకరమని శబ్ధం చేసినట్లన్పించింది. బయట రోజీ రోదనలు విన్పిస్తూనే ఉన్నాయి.

శ్యామ్ చేతిలో టార్చిలైటు వెలుగుతూనే ఉంది. అతను మాత్రం నిశ్చేష్టతగా నిలబడిపోయాడు. కదలిక, మెదలిక లేదు.

అయితే శ్యామ్ స్థాణుఅయ్యాడు. ఆ పుర్రెలను చూసి కాదు. గాలికి కదిలిన వాటిని చూసి అసలేకాదు–

ఎక్కడో దూరంగా ఊరకుక్క బాధగా అరిచిన అరుపు.

ఆ గది దాటబోతూ వెనక్కి చూసాడు ఓరగా–

అదే– అదే –అదే ప్రదేశం. కాకపోతే తను మొదట గుర్తుపట్టలేకపోయాడు.

అదే ప్రదేశం. సందేహంలేదు. అంటే? అంటే? నెత్తురు గడ్డకట్టినట్టు స్థంభించిపోయాడు. సన్నగా వెన్నుముక్క సైతం జారినట్లనిపించింది.

రోజీ అరుపులు మాత్రం విన్పిస్తూనే ఉన్నాయి. క్షణ క్షణానికి పెరుగుతున్నాయి.

మరోసారి ఆకాశం మధ్యకి చీలినట్టు మెరుపు. అదే సమయానికి రోజీ కెవ్వున కేక వేసింది. ఆ మరుక్షణంలోనే పసివాడి ఏడ్పు–

కేర్ర్.... కేర్ర్....

శ్యామ్ గిర్రున తిరిగాడు. రోజీ కాళ్ళ దగ్గర రక్తపు బిడ్డ. అప్పుడే బయటకొచ్చిన ప్రాణం... చుట్టూ ప్రకృతి కూడా శాంతించింది. రోజీ నీరసంగా "ఆడబిడ్డా– మగబిడ్డా?" అంది.

శ్యామ్ మోకాళ్ళమీద వంగుతూ "మగబిడ్డ. అది కాదు ముందు మనమెక్కడున్నామో చూడు వీలయినంత త్వరగా వెళితే మంచిది" అన్నాడు.

రోజీ పరిసరాలు చూసింది.

ప్రకృతి శాంతించడంతో కొద్దిపాటి వెలుగుకూడా వచ్చింది. రోజీ పరిశీలనగా చూసింది కొద్ది కొద్దిగా గుర్తుకు వచ్చింది.

"ఇక్కడ– ఇక్కడా – నేను మగబిడ్డను కన్నది" అంది భయంగా.

"ముందు పద" అన్నాడు ఆమెని పొదవి పట్టుకుంటూ.

## 2

ఎనిమిది సంవత్సరాల తర్వాత–

ఆ భవనం ప్రహరీకి ప్రాకారాలకి రంగు రంగుల కాగితాలు, బెలూన్‌లు కట్టి ఉన్నాయి.

ప్రధాన ద్వారం ముందున్న విశాలమైన ప్రదేశంలో పెద్ద టెంట్ వేసి ఉంది. ఆ మధ్యలో పూర్వకాలం నాటి టేబుల్, అందమైన నగిషీలతో మంచిటేకు చెక్కతో అందంగా ఉంది. దానిపైన బర్త్‌డే కేక్, దానిమీద ఏడు కొవ్వొత్తులు. చిరుగాలికి కదులుతూ ఆరిపోకుండా ఉన్నాయి. ఆ క్రొవ్వొత్తుల వెలుగు సరిగ్గా కేక్‌మీద రాసిన 'రాజీవ్' అన్న అక్షరాలమీద పడుతున్నాయి.

ఆ టేబుల్ ముందు శ్యామ్, మధ్యలో రాజీవ్....ఆ పక్కనే రోజీ....

ఆ రోజు రాజీవ్ పుట్టిన రోజు

ఆ తల్లిదండ్రుల మధ్య సరికొత్త సూట్‌లో చిద్విలాసంగా నవ్వుతూ ఉన్నాడు రాజీవ్.

శ్యామ్, రోజీ ఇద్దరూ కలిసి పుత్రుడి చేయి పట్టుకుని కేక్ కట్ చేయించారు. దానికి ముందు రాజీవ్ చేత క్రొవొత్తులు ఆర్పించారు.

పిల్లలూ, పెద్దలూ చప్పట్లు... రాజీవ్ కేక్ మొదటి ముక్కని ముందు తండ్రి నోటికి అందించి మిగిలిన ముక్కని చప్పున తల్లినోటికి అందించాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ...

మరోసారి చప్పట్లు...

రోజీ రాజీవ్ నెత్తిన చిన్నగా మొట్టి. 'గడుగ్గాయ్' అంది.

శ్యామ్ కొడుకుని ఎత్తుకుని నుదుటన చుంబించి-

"డియర్ ఫ్రెండ్స్....మీరంతా ఈ బర్త్‌డే ఫంక్షన్ కొచ్చినందుకు సంతోషం, విందు భోజనానికి ముందు చిన్న చిన్న ఎంటర్‌టైన్ మెంట్స్ ముందు లేడీస్‌కి...అని ప్లీజ్" అన్నాడు ఆడవాళ్ళ వంక చూసి.

ఈ లోగా పనివాడు సలీం ఓ ప్లాస్టిక్ డబ్బాతెచ్చి మరో విశాలమైన టేబుల్‌మీద పెట్టాడు.

"దయచేసి ఇందులో లేడీసే పాల్గొనాలి. గెలిచిన వారికి అరుదైన బహుమతి".

ఆహ్వానితుల్లో లేడీస్ ఆ టేబుల్ చుట్టూ చేరారు. వారి వెనుకే వారి మగాళ్ళు....

రోజీ ఆ ప్లాస్టిక్ డబ్బా మూత తెరచి అందులోంచి కుంకుడు కాయల్లోని నల్లని గింజలని గుప్పెటతో తీసింది.

"వీటిని పైకి ఎగరేసి చేయి తిప్పి వాటిని ఆపాలి. చేయి మీద ఎన్ని వున్నాయో వాటినన్నింటిని పరిగణలోకి తీసుకుంటాం. అలా మీరు ఎన్నిసార్లయినా ఎగరేసి చేయి వెనక్కి తిప్పి నిలబట్టెవచ్చు. కేవలం ఒన్‌మినిట్ మాత్రమే. ఆలోగా మీరు ఎగరేసి చేతిమీద నిలబెట్టిన అన్ని గింజలని లెక్కవేస్తాం. అందరిలో ఎవరెక్కువ కుంకుడు గింజలని ఎగరేసి చేయి వెనక్కి తిప్పి ఆపగలిగారో నిర్ణయించి వారికి బహుమతి ఇవ్వబడుతుంది"

"మొదట అరుంధతి" పేరు చెప్పింది రోజీ నవ్వి.

"అమ్మోనేనా?" గుండెలమీద చెయ్యేసుకుంది భయంగా.

"ఒక డాక్టరు అయుండి అలా భయపడితే ఎలా? కమాన్" చేయి పట్టుకుని లాగింది రోజీ.

అరుంధతి కొత్తపెళ్ళి కూతురిలా సిగ్గుపడుతూ ప్లాస్టిక్ డబ్బాలో చేయిపెట్టి గుప్పెటతో గింజలని తీసుకుంది.

"అమ్మో చాలా పట్టిందే" నవ్వింది ఆహ్వానితులలోని ఓకామె.

"మరే, మేడమ్‌గారు ఫీజేకాదు, ఇలాంటి చోట కూడా ఎక్కువే పడుతుంది".

అరుంధతి ఆ కామెంట్‌ని పట్టించుకోకుండా గుప్పిటలోని గింజలన్ని చిన్నగా పైకి వేసి చప్పున చెయ్యి వెనక్కి తిప్పింది.

పైకి ఎగిరిన గింజలు తిప్పిన చేతిమీద చాలా పడ్డాయి. అయితే చాలా జారిపోయాయి.

ఐదు చెప్పాడు శ్యామ్, ఓ పక్కటైమ్ చూస్తూ మరోపక్క పెన్‌తో అరుంధతి అన్న దగ్గర 'ఐదు' అని వేసి.

మరోసారి ప్రయత్నించింది ఆరుంధతి....ఈసారి ఆరు.. వెరసి పదకొండు...

"ఇంకా రెండు సెకన్స్ మాత్రమే మిగిలింది" హెచ్చరించాడు శ్యామ్.

ఆరుంధతి కంగారుగా మరోసారి పైకివేసి చేయి తిప్పింది. హడావుడి పడటంతో రెండే వచ్చాయి.

"చివరిసారి....ఇంకా ఒక్క సెకనే ఉంది"

ఆరుంధతి సీరియస్‌గా దృష్టి సారించింది. వీలయినన్ని ఎక్కువ పట్టాలి. ఇంత మందిలో ఆ బహుమతి తనకే రావాలి. ఆరుంధతి పైకి వేసింది.

అందరూ ఉత్సాహంగా చూస్తున్నారు. పైకి ఎగిరిన గింజలను ఆరుంధతి ఆత్రంగా ఆపింది...అటూ ఇటూ జారిపోకుండా బ్యాలెన్స్ చేసింది..పది....

"శభాష్" అభినందించాడు శ్యామ్.

ఆరుంధతి పక్కకొచ్చింది.

"ఈసారి.....మిసెస్ కల్పనారాయ్" చెప్పింది రోజీ.

ఆ పేరు గల భారీకాయం నవ్వింది గల గల.. చుట్టూ ఉన్నవారు చప్పట్లు కొట్టారు.

దాదాపు కొండను కదిలించినట్టు తన శరీరాన్ని కదిలించి నడిచింది.

పిల్లలు కిల కిల నవ్వారు. రాజీవ్ గడుసుగా–

"మమ్మీ, ఆంటీ కదులుతుందా? లేక పెద్ద కొండ కదులుతుందా అనేది అర్థం కావటం లేదు".

"ష్.........అలా మాట్లాడకూడదు. తప్పు" మందలించింది కొడుకుని రోజీ.

మిసెస్ కల్పనారాయ్ గింజలను చేతిలోకి తీసుకుని పైకి లేపింది. చేయి తిప్పింది గాని ఒక్కటీ నిలవలేదు.

"చేతులను మరీ అంత సుతారంగా ఉంచకూడదు" అంది అరుంధతి.

మిసెస్ కల్పనారాయ్ ఆ మాటలని పట్టించుకోకుండా ఏకాగ్రతగా మరోసారి ప్రయత్నించింది....రెండు.....

"రెండు...." అన్నారు చుట్టూ ఉన్న వారు.

మిసెస్ కల్పనారాయ్ ఈసారి మరింత ఉత్సాహంగా పైకి వేసింది.

"మూడు, ఇందాక రెండు కలిపి ఐదు, నీ టైం అయిపోయింది" చెప్పాడు శ్యామ్.

ఆమె పక్కకి వచ్చింది.

"తరువాత ఎవరో రండి" చెప్పింది రోజీ.

"ఎప్పుడూ మేమేనా – మీ తమ్ముడి భార్యని పిలవండి" చెప్పింది ఆరుంధతి.

"రాగిణి రా, అలా దూరంగా ఉంటావే" ఆహ్వానించింది రోజీ తోడికోడల్ని..... "పాపం...వాళ్ళ ఆయన మీద బెంగపెట్టుకుందేమో" మోచేత్తో పొడిచి అంది అరుంధతి.

ఆడవాళ్ళు కిల కిల నవ్వారు. మగవాళ్ళు పక్కకు తిరిగారు సంస్కారంగా.

"వాడికి రెండు సార్లు కేబుల్ పంపించాను. ఈ సారి రానీయ్ చెబుతాను" అన్నాడు తమ్ముడ్ని దెప్పిపొడుస్తూ శ్యామ్.

"అవును....బాబాయ్‌ని రానీయ్, చెబుతాను" అన్నాడు రాజీవ్ ముద్దగా.

"ఏదో పని ఉండి రాలేక పోయుంటారు" అని రాగిణి డబ్బాలోని గింజలను తీసింది.

సరిగ్గా అప్పుడే సైకిల్ దిగాడో వ్యక్తి. చేతిలో టెలిగ్రామ్స్ ఉన్నాయి కట్టగా.

శ్యామ్ అతన్ని చూస్తూనే ఎదురెళ్ళాడు.అతనిచ్చిన కాగితం మీద సంతకం పెట్టి తీసుకున్నాడు.

"ఎవరండి" అడిగింది రోజీ పక్కకొచ్చి.

"ఇంకెవరు, తమ్ముడుగారు" అని చించి చదివాడు.

"ఎవరు? మావారేనా?" హడావుడిగా వచ్చి అడిగింది రాగిణి.

శ్యామ్ టెలిగ్రామ్‌ని మడిచి....."అర్జెంట్ మీటింగ్ ఉండటం వల్ల రాలేకపోతునాన్నని – రాజీవ్‌కి ఆశీస్సులు తెలియచేస్తూ టెలిగ్రామ్,అది సరే, అదేంటి వచ్చేశావ్...."

"ఏం చెయ్యను, నా స్కోరు ఆరు" అంది ఏడ్వలేక నవ్వుతూ.

"అయితే బహుమతి ఆరుంధతికి తప్పదన్నమాట....."

"మరే" అంది నవ్వుతూ ఆరుంధతి.

"ఏమైనా...ఈ ఇంటిసొమ్ముకి పెట్టి పుట్టావ్".

"అబ్బ ఊరికనే ఇస్తున్నట్టు చెబుతున్నారే, కష్టానికి తగ్గ ఫలితమేగా".

"కాని ఈసారి నీ కష్టం వృధా. రోజీ చివరి ఛాన్స్ నువ్ తీసుకో. ఆరుంధతి ఎలా బహుమతికి అర్హమౌతుందో చూద్దాం".

రోజీ పళ్ళు బిగించి, చీరను నడుం చుట్టూ బిగించి నడిచింది.

పందెం ఉత్సుకత, ఉత్కంఠతగా మారటంతో అందరూ ఉద్వేగంగా చూస్తున్నారు.

రోజీ డబ్బా లోని గింజలను పైకి వేసి చప్పున చేయి తిప్పింది. మొదటి రౌండ్‌లోనే నాలుగు......

శ్యామ్ చప్పట్లు కొట్టాడు. భార్యని ప్రోత్సహించాడు.

ఆరుంధతి మూతి మూడు వంకర్లు తిప్పుతూ రోజీ పక్కకు వచ్చింది.

రెండో రౌండ్‌లో ఐదు....అప్పటికే నలభయ్ సెకన్స్ గడిచిపోయాయి.

"ఇంకాపట్టురోజీ" చెప్పాడు శ్యామ్.

ఆరుంధతి మొహంలో రంగులు మారాయి....చివరిసారి పైకి వేస్తున్న రోజీని వురిమి చూసింది తన కాలుని నెమ్మదిగా జరిపి ఒక్క తొక్కు తొక్కింది.

"అబ్బా....." అంది చేయి తీసి.

గింజలు కింద పడిపోయాయి.

"గెలుపునాదే" అంది అరుంధతి.

"అన్యాయం– నా కాలెవరో తొక్కారు" అంది గారంగా.

"అదినాకు అనవసరం....బహుమతి ఇవ్వండి" అంది చిన్న పిల్లలా.

"అప్పుడేనా, ఈసారి చిన్న పిల్లలకి....వారికి కూడా పోటీ పెట్టి చివరగా పెద్దల ఆశీస్సులు రాజీవ్‌కి ఇప్పించి ఆపై బహుమతి ప్రధానాలు, విందు"

"చిన్న పిల్లలకు, ప్లస్ రాజీవ్‌కి....పిల్లలంతా రండి" చెప్పింది రాగిణి.

పిల్లలంతా ఎగిరారు...ఆనందంగా చూశారు.

"ఈబాక్స్‌లో చాలా పిన్నీసులున్నాయి. వీటిని కేవలం నిముషంలో చకచకా ఒకదానిలో ఒకటి గుచ్చాలి. ఆ టైంలో ఎవరెక్కువ గుచ్చితే వారే విజేత"చెప్పాడు శ్యామ్.

పిల్లలంతా అమాయకంగా మొహం పెట్టారు.

రోజీ నవ్వి,"అర్థం కాలేదా? పిన్నీసు క్రింద భాగంలో ఉండే రౌండ్‌లో ఒక్కక్కటి వేసుకుంటూ పోవాలి" అంది.

"మొదట నవీన్" చెప్పాడు శ్యామ్.

ఆ పేరుగల కుర్రాడు హడావుడిగా ప్రారంభించాడు. ఒకదానిలో ఒకటి గుచ్చుతూ తొందరపడుతున్నాడు.

"జాగ్రత్త పిన్నీసు మొన గుచ్చుకోగలదు" హెచ్చరించిందతని తల్లి.

ఆ కుర్రాడు ఒక్క నిమిషంలో డజను దాకా గుచ్చాడు.

నవీన్ గుచ్చిన పిన్నీసుల సంఖ్యవేసి మరొక కుర్రాడిని పిలిచాడు.

పావుగంటసేపు గడిచిన ఆ కార్యక్రమంలో నవీనే గెలిచాడు.

ఈసారి మరో పందెం చెప్పాడు శ్యామ్.

గుట్టగా చాక్లెట్స్ పోసి– వీటి రాపర్స్‌ని తీసేయ్యాలి. గడువు అన్నిటిలా ఒక్క నిమిషం” చెప్పాడు.

రాగిణి కలగచేసుకుని – “లోపలి చాక్లెట్‌ని తినకూడదు అని రూల్ ఏమీ లేకపోయినా, తినే సమయం వృధా అయిపోవటం వల్ల ఎక్కువ రేపర్స్‌ని ఊడదీయలేరు” చెప్పింది.

పిల్లలు ఈ పందెంలో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు పెద్దలంతా చిన్న పిల్లల ఉత్సాహాన్ని ఎంజాయ్ చేస్తూ పాల్గొన్నారు.

జరిగిన పోటీలో రాజీవ్‌కి బహుమతి రాకపోవటంతో వారి మనస్సుల్లో ఏదో వెలితి చోటు చేసుకుంది. ఎట్టకేలకు ప్రైజ్ రాజీవ్ కొచ్చింది. శ్యామ్, రోజీ మొహాలు ఆనందంతో విచ్చుకున్నాయి.

ఆ వెలితి రాజీవ్ గెలవటంతో పోయింది. శ్యామ్ కొడుకుని ఆనందంగా ఎత్తుకుని ముద్దుచేసాడు. రోజీ బుగ్గలు చిదిమింది ఆప్యాయంగా.

రాగిణి ఓ టిఫిన్‌ని వ్రేలాడదీసింది. శ్యామ్ కొడుకుని క్రిందకిదించి– అందరినీ ఉద్దేశించి చెప్పాడు.

“ఇదే చివరి పోటీ, పిల్లలకి, పెద్దలకి, ఉత్సాహమున్న ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చు. వ్రేలాడదీసిన టిఫిన్‌ని బాగా గమనించండి. మీ చేతికి ఓ కర్ర ఇస్తాం. మీరు సరిగ్గా వెళ్ళి ఆ టిఫన్‌మీద కొట్టాలి”.

“ఓస్, ఇంతేనా. ముందు అవకాశం నాకివ్వండి. ఓ ఊపు వూపుతాను” అంది అరుంధతి.

“ఆఁ నీ అంత గొప్పోళ్ళు లేరని... కర్ర చేతికిచ్చేటప్పుడు కళ్ళకు గంతలు కడతాం”.

అరుంధతి సరేనన్నట్టు తలాడించింది.

“అప్పుడే తయారవ్వకు, కళ్ళకు గంతలతోపాటు, ఎత్తుకుని గిరగిర తిప్పి ఓ పక్క వదిలిపెడతాం.

అరుంధతికి నీరసం వచ్చింది. అయినా వెనక్కి తగ్గదలచుకోలేదు. తొలి అవకాశాన్ని తానే తీసుకుంది.

అరుంధతి కళ్ళకు గంతలు కట్టి చేతికి కర్ర ఇచ్చింది రాగిణి.

అప్పుడే వచ్చింది అసలు సమస్య కళ్ళకి గంతలు కట్టి చేతికి కర్ర అయితే

ఇచ్చిందిగాని, ఎత్తి గిరగిర తిప్పటమంటే మాటలా? అదో భారీకాయం, నూటయాభయ్ కేజీలుంటుందనటంలో సందేహం లేదు.

"ఎత్తండి, తిప్పండి" ఆరుంధతి  అసహనంగా అరిచింది.

"ఏమిటి ఎత్తేది....నిన్ను ఎత్తాలంటే మాటలా? రెండుటన్నులున్నావ్?" నవ్వింది రాగిణి.

అందరూ పెద్ద పెట్టున నవ్వారు.

అరుంధతి కోపంగా కాలిని నేలకేసి కొట్టింది.

"చిన్నగా, నేల పగలగలదు" అన్నారు. ఆమె కళ్ళకి గంతలు ఉన్నాయి కాబట్టి తమ భద్రతకి ఢోకాలేదని తలంచి.

"ఎవరు? ఎవరే ఆ మాటన్నది?" ఆరుంధతి గంతలు తియ్యబోయింది.

శ్యామ్‌చప్పున ఆపి–"నో సీరియస్! సరదాగా ఎవరేమన్నా పట్టించుకోకూడదు. అదే పార్టీ ప్రాథమిక రూల్. "నిన్ను నేను ఎత్తుతాను. గిరగిర తిప్పుతాను" చెప్పాడు.

రోజీ భర్త వంక చూసి తలవూపింది. రాజీవ్ ఎగురుతూ చప్పట్లు కొట్టాడు.

శ్యామ్ ఆమెని ఎత్తుకుని గిరగిరమని రెండుసార్లు తిప్పి వదిలాడు. ఆరుంధతి ఒక్కసారి తలవిదిలించుకుంది.

ఏమీ అర్థం కావటంలేదు. అంతా చీకటి...

చేతిలోని కర్రని ముందుకు చాపి....మరోచేత్తో తడుముకుంటూ ముందుకు కదిలింది.

"కమాన్ ఇటూ" అరిచారు పిల్లలు.

"డాక్టరుగారూ ఈ వేపు" చెప్పారు మరికొంతమంది.

"కాదు, ఇటు, ఇటువైపు అంటే"

"అరుంధతి ఇటే"

అరుంధతికి అర్థం కాలేదు. మాటలు ఏవైపు నుంచి వస్తున్నాయో అర్థమవుతుంది కాని టిఫిన్ ఏవైపు వుందో అర్థం కావటంలేదు.

అడుగులో అడుగేసుకుంటూ నడుస్తోంది. ఒక్క నిమిషం వృథా అయిపోయింది.

తర్వాత అరుంధతినుంచి తీసుకున్న గంతలని భార్యకి కట్టాడు శ్యామ్.

రోజీ వద్దు, వద్దంటూనే కట్టించుకుంది. శ్యామ్ అల్లరిగా పైకెత్తుకుని గిర గిర తిప్పి వదిలేశాడు.

చప్పట్లు....

కేకలు....

ఒకటే గోల....

“మమ్మీ ఇటువేపు, నా వేపు తిన్నగా అలాగే రా”

“అన్యాయం, అలా చెప్పకూడదు” అరిచింది అరుంధతి.

రాజీవ్ చివ్వున తల ఎత్తాడు.

“రాజీవ్ ప్లీజ్” చెప్పి “రోజీ కమాన్” అరిచాడు శ్యామ్. అరుంధతి రాజీవ్‌ని ఎత్తుకుని మరోపక్క నిల్చోబెట్టింది.

రోజీకి కొడుకెక్కడ ఉన్నాడో అర్థం కాలేదు. చప్పున ఆలోచన వచ్చింది. తాను తూలి పడబోతే రాజీవ్ కంగారుగా ‘మమ్మీ’ అని పిలుస్తాడు. దాన్ని బట్టి ముందుకెళ్ళి కొడితేసరి....అనుకోవటం ఆలస్యం...అడుగు ముందుకువేస్తూ జారింది.

ఆమె ఆలోచన ఫలించింది.

శ్యామ్ కంగారుగా “రోజీ డియర్......జాగ్రత్త” అరిచాడు.

“అరే, పడతావ్”

“మమ్మీ.....” రాజీవ్ గొంతు, రోజీ ఎవరి గొంతుని పట్టించుకోలేదు. కొడుకు పిలుపు వినిపించినవేపే దృష్టి సారించింది.

ఆ వైపు నడిచింది. పది అడుగులు వేసి కర్ర ఎత్తింది. శక్తి కొద్దీ వేసింది.

ఠంగ్‌న శబ్దం రాలేదు. పైగా కర్ర మధ్యలో ఆగింది. రోజీ గంతలు ఊడదీసుకుంది.

తాను పైకెత్తి కొట్టబోయిన స్థానంలో ఆరుంధతి ఉంది. చిరునవ్వుతో కర్ర పట్టుకుని ఉంది.

రోజీ పక్కకి చూసింది ఆమెకి పదిగజాల దూరంలోనే టిఫిన్ వ్రేలాడుతూ ఉంది.

“నేనే నీ కొడుకుని, అక్కడనుంచిఇక్కడ తెచ్చిపెట్టాను” నవ్వింది... రోజీ తినేసేలా చూసి పక్కకొచ్చింది.

ఈసారి మిసెస్‌కల్పనారాయ్ ఆమె ప్రారంభంలోనే హడావుడి పడింది. గందరగోళమై, బిత్తరపోయి, తత్తరపడి దడేల్‌మని పడింది.

"డాడీ నేను డాడీ" అడిగాడు రాజీవ్.

"నవీన్ తరువాత నువ్వు" చెప్పాడు శ్యామ్.

రాజీవ్ అరుంధతి కేసి చూసాడు. అతని చిన్న చిన్న కళ్ళు తమాషాగా కదిలాయి. పంటితో పెదవిని అంటిపెట్టాడు. మొహంలో ఏదో తెలియని రౌద్రం వచ్చేసింది.

టప్....పెదవి చిట్లింది....రక్తం ఉప్పగా తగిలింది. దాన్నెవరూ గమనించలేదు.

నవీన్ అటూ ఇటూ అర్థంగాక నడుస్తున్నాడు. పడబోతున్న నవీన్‌ని రోజీ పట్టుకుని గంతలు తీసింది.

"డాడీ నేను డాడీ" చెప్పాడు మూతి తుడుచుకుని.

"అలాగే నాన్న" అని "రోజీ గంతలు ఇలాతే" అన్నాడు.

"డియర్ ఫ్రెండ్స్! రాజీవ్‌తో ఆట ఇక సరి. ఆపై విందే....ఇప్పటికే కాలాతీతమైంది. ఘుమఘుమలాడే విందు భోజనం మన కోసం అవతల పక్క ఎదురుచూస్తోంది".

స్పెషల్ ఏమిటో తెలుసా కట్టెలు మీద వండిన మటన్ బిర్యానీ మాసలీవ్, నేతి మటన్ బిర్యానీ చెబుతుంటేనే నోట్లో నీళ్ళూరుతున్నాయి.

రాజీవ్ ఆరుంధతి కేసి చూశాడు. ఆమె ఎక్కడుందో కనుక్కోవటం అంత కష్టం కాదు. కారణం ఎప్పుడూ వాగుతూ ఉంటుంది. ఆమె దగ్గర్నించి టిఫిన్ ఏవైపు ఉందో చూశాడు. సరిగ్గా వ్యతిరేక దశలో ఆమె కదలకుండా ఉంటే చాలు.....టిఫిన్ ఎక్కడుందో తనకి తెలుస్తుంది.

శ్యామ్ కొడుక్కి గంతలుకట్టి పైకెత్తి గిరగిర తిప్పి వదిలి పెట్టాడు.

రాజీవ్ కర్ర చేత్తో పట్టుకుని ముందుకు కదిలాడు.

"రాజీవ్....రా" "ఇటు....."

"చక చక రావాలమ్మా" పిల్లలు కోరస్‌గా అరిచాడు.

రోజీ ఆందోళనగా చూస్తోంది... కంగారు పడతాడేమోనని శ్యామ్ ఉత్సాహంగా ముందుకు వచ్చి తలమీద కొట్టాడు.

"రాజీవ్ త్వరగా...అప్పుడే ఇరవై సెకన్స్ అయిపోయింది" చెప్పింది మిసెస్ కల్పనారాయ్.

"రా.....రావయ్యా రా....." అరిచింది అరుంధతి. రాజీవ్ చేతిలోని కర్ర బిగుసుకుంది.

ఆ గోలలో తండ్రి అరుపుల్లో పిల్లల కేరింతల్లో ఆహ్వానితుల మాటల్ని రాజీవ్ విన్నది. ఒకటే గొంతు... అది...అరుంధతి గొంతు.

ఆమె గొంతు విన్పించిన వైపు నడిచాడు. అరుంధతి ఏదో మాట్లాడుతోంది. రాజీవ్ కర్రని చేతిలోకి తీసుకున్నాడు.

పళ్ళు పట పట కొరికాడు.

గంతల చాటున కళ్ళు ఎరుపెక్కాయి.

తన తల్లిని....తన....త.....త....ల్లి.....ని.....గొణుక్కున్నాడు. కర్రని విసురుగా పైకి లేపాడు. ఆ బాలుడి కళ్ళల్లో తల్లే మెదులుతోంది.

ఆ ప్రదేశం నుంచి వస్తున్నట్టు పక్కకి తిరిగాడు.

అందరూ రాజీవ్ తిరిగాడని అనుకున్నారు కూడా అప్పుడు కదిలాడు. ముందు శరీరం కదిలిందో, చేయి కదిలిందోగాని గాలిని చీల్చుకుంటూ లేచింది.

లేచిన కర్ర సరిగ్గా అరుంధతి తలమీద పడింది. అరుంధతి 'ఆవ్ఁ' అంది. నడినెత్తిన పిడుగు పడ్డట్లనిపించింది. మొత్తం అంతా నోరు తెరిచారు.

దాదాపు స్థాణువయ్యారు.

స్లో మోషన్‌లోలా అరుంధతి చేతిని తలమీద పెట్టుకుంది. వెచ్చగా తగిలింది. తీసి చూసుకుంది. రక్తం ఎర్రని చిక్కని రక్తం....

అప్పుడు అరిచింది భయంకరంగా. పిడుగులు పడ్డట్టుగా....మొత్తం ప్రదేశమే అదిరింది అందరూ షాక్ నుంచి తేరుకుని కదిలారు. అయితే అప్పటికే అరుంధతి క్రిందకి వాలిపోయి పడి ఉంది.

## 3

"ఎలా ఉంది!" అడిగింది రోజీ.

అరుంధతి ఫర్వాలేదన్నట్టు తలాడించింది.

"మేము చాలా బాధపడుతున్నాం, అలా జరిగినందుకు" నొచ్చుకుంటూ చెప్పాడు శ్యామ్.

"సిల్లీ! వదిలేయండి, మీ కంటే నేనే ఎక్కువగా బాధపడుతున్నాను. ఆనందంగా చేసుకుంటున్న పుట్టినరోజునాడు ఏమిటా ఈ అపశ్రుతి అని".

"చీముపట్టే వస్తువులు తినకు" సలహా ఇచ్చింది రోజీ.

"డాక్టర్‌కా నువ్వీ సలహా ఇచ్చేది" సన్నగా నవ్వాడు శ్యామ్.

అరుంధతి కూడా నవ్వేసింది.

భార్యాభర్తలిద్దరూ నవ్వేశారు. అరుంధతికి వస్తామని చెప్పి తెచ్చిన పళ్ళు టేబుల్ మీద పెట్టి వచ్చారు.

"నాకెందుకో రాజీవ్ కావాలనే కొట్టాడనిపిస్తోంది" దారిలో చెప్పింది రోజీ.

"చ....ఛ.....అరుంధతి మీద అంత కోపం ఎందుకుంటుంది. అయినా వాడి వయసెంతని.."

"లేదండి నేను చూస్తూనే ఉన్నాను. రాజీవ్ కావాలనే కర్రతో కొట్టాడు. అక్కడ అరుంధతి ఉందని నిర్ణయించుకున్నాకే".

"రోజీ వాడి వయసెంతో తెలుసా ఏడు సంవత్సరాలు. ఆ వయసులో అంత పగా, ద్వేషం ఉండదు – అనవసరంగా ఆలోచించకు ఏదో కాకతాళీయంగా జరిగింది".

"అంతే!"

"కాదండి!"

శ్యామ్ విసుగ్గా చూశాడు.

"అదే నిజమయితే వాడి నెందుకు అడగలేదు. అరుంధతిని హాస్పటిల్‌కి మోసుకెళుతుంటే గారంగా ఎత్తుకుని అక్కున ఎందుకని చేర్చుకున్నావ్. భయపడ్డాడనేగా, నిజంగా కావాలని కొట్టిన వాడయితే అలా భయపడేవాడా, నువ్ ఎత్తుకుంటావా?".

"నేనుఎత్తుకున్నది అందుకు కాదండి. నేను వేగంగా వెళ్ళి వాడిని ఎత్తుకుని ఉండకపోయినట్లయితే, మళ్ళీ కొడతాడేమోనని దగ్గరికి తీసుకున్నాను".

శ్యామ్ వింతగా భార్యవంక చూశాడు.

"నిజమా? అయితే నిన్నే ఎందుకు నాకు చెప్పలేదు – ఇంతకీ వాడిప్పుడు ఎక్కడున్నాడు.

"నేను స్కూలుకి వద్దని చెప్పి, ఆపి ఇంట్లోనే ఉండమన్నాను".

శ్యామ్ మౌనంగా ఊరుకున్నాడు. బంగ్లా వరకూ అలానే ఉన్నాడు. బంగ్లాకి వస్తూనే విసురుగా దిగి అంతకన్నా విసురుగా నడిచాడు.

రోజీ అతని నడక వేగంతో నడుస్తూ – ఆయాసపడుతూ –

"కొంపదీసి వాడ్ని నాలుగు దులుపరు కదా!".

శ్యామ్ అవునూ, కాదన్నట్లు తలాడించి, కొడుకు రూమ్ తలుపు తీశాడు.

గదిలో డబల్‌కాట్‌మీద రాజీవ్....అంతకు ముందు నుంచి చూస్తున్నాడో లేక తలుపు శబ్దమై చూస్తున్నాడోగాని, నిశ్చలంగా చూస్తూ కనపడ్డాడు.

శ్యామ్ నెమ్మదిగా వచ్చి పరుపుమీద కూర్చున్నాడు రోజీ ఆందోళనగా భర్తనే చూస్తోంది.

"కన్నా" పిల్చాడు శ్యామ్.

రాజీవ్ అలానే చూస్తున్నాడు. ఆ నిశ్చలమైన చూపుని భయమనుకున్నాడు శ్యామ్.

"అరుంధతి ఆంటీని కావాలనే కొట్టావా?"

రాజీవ్ మాట్లాడలేదు. కనీసం తల్లివంక కూడా చూడలేదు.

"నోరు తెరువ్ – తెలుసుగా నా సంగతి, ప్రేమించేటప్పుడు ప్రేమిస్తాను కోపం వస్తే ప్రేమా గీమా ఉండదు. కమాన్ మాట్లాడు, అరుంధతి ఆంటీని కావాలనే కొట్టావా?"

రాజీవ్ సూటిగా తండ్రి కళ్ళలోకి చూశాడు. ఆ చూపుల్లో నిర్లక్ష్యము శ్యామ్‌కి తిక్కరేగిపోయింది.

కోపంగా చెయ్యెత్తాడు. కాని కొట్టలేదు.

"అలా గుడ్లు మిటకరిస్తూ చూస్తావే – చెప్పు – లేదా?" కళ్ళు ఉరిమాడు శ్యామ్.

"పోనీలెండి – భయపడుతున్నట్లున్నాడు. మీరెళ్ళండి. నేను అడుగుతానుగా, బుజ్జగించి...."

శ్యామ్ నిప్పులు కురిసే కళ్ళతో భార్యవంక చూశాడు.

రోజీ నీళ్ళు నమిలింది.

"ఇదే చివరిసారి....మొండితనంతో నీకంటే బలవంతుడని చెప్పు".

రాజీవ్ తల్లివైపు చూశాడు. ఆమె మాట్లాడమన్నట్టు సైగ చేసింది.

రాజీవ్ నవ్వాడు చిన్నగా. శ్యామ్ విస్తుపోయాడు అది చూసి రాజీవ్ మరింతగా నవ్వాడు.

"ష్–బొత్తిగాభయంలేకుండా పోతోంది. ఓ పక్క నేను తిడుతు ఉంటే వాడు చూడు, వాడి అల్లరిని చూడు" భార్యకి ఫిర్యాదు చేశాడు.

"వాడ్ని మనం కొట్టమని ధైర్యం. అందుకే" నవ్వింది రోజీ.

"ఆఁఆ.... మంచిగా ఉన్నంతవరకే గారం....క్రమశిక్షణ తప్పితే గారం కాస్త కారం అవుతుంది".

రాజీవ్ ఒక్క ఉదుటున తండ్రి మీదకి ఎగబాకి రెండు చేతులు భుజాలమీద వేసి "మా మంచిడాడీ" అన్నాడు.

శ్యామ్ బలవంతాన తన కోపాన్ని తిరిగి తెచ్చుకుని –

"చెప్పు రాజీవ్, అరుంధతి ఆంటీని కావాలనే కొట్టావా?" అడిగాడు.

"నో....డాడీ....అలాంటి తప్పుడు పని నేనెందుకు చేస్తాను అయినా పెద్దలని గౌరవిస్తాను గాని కించ పరుస్తానా?".

"మరి మమ్మీ ఏంటి అలా చెప్పింది"

"నో డాడీ, మమ్మీ పొరపడి ఉంటుంది".

"మరయితే, నేను రాగానే అలా మౌనంగా ఉన్నావే, అడుగుతు ఉంటే చాలా సేపు మాట్లాడలేదే".

"అదా, నిన్ను ఆట పట్టిద్దామని సరదాగా"

"అరుంధతి ఆంటీని ఆ సరదా కోసమే కొట్టావా?"

"చూడు మమ్మీ" రాజీవ్ తల్లివైపు చూశాడు.

రోజీ ప్రేమగా కొడుకుని ఎత్తుకుని "మీరు ఊరుకోండి, వాడెంతని, వాడి వయసెంతని, ఆమెనలా కొట్టడానికి ఆమె మీదేమన్నా పగ ఉందా!" చెప్పింది.

"బావుంది. నాకు చెప్పిందీ నువ్వే, తిరిగి నన్ను దబాయిస్తున్నదీ నువ్వే?".

"ఏదో పొరబడే ఉంటాను, నా బంగారుకొండ, ముద్దులరెమ్మ ఆ ప్రభువు ప్రసాదం..... అలాంటి సైతాన్ పనులెందుకు చేస్తాడు...."

రాజీవ్ అవునన్నట్టు తలాడించాడు.

రోజీ  లేచి కొడుకుని పరువుమీద పడుకోబెట్టి, దుప్పటి సర్ది–

"పదండి బిడ్డ పడుకుంటాడు. నిన్నంతా అలసిపోయాడు. శ్యామ్ కొడుకు

జుట్టు నిమిరి నుదుటన ప్రేమగా చుంబించి పడుకో – హాయిగా రెస్ట్ తీసుకో. రేపు ఉదయం ఏడింటికే స్కూల్" చెప్పాడు.

భార్యా భర్తలిద్దరూ కొడుకుని తృప్తిగా చూసుకుని వెనక్కి తిరిగారు.

అప్పుడు పిలిచాడు రాజీవ్...

"డాడీ!"

ఇద్దరూ వెనక్కి తిరిగారు.

రాజీవ్ నిశితంగా చూస్తున్నాడు. అవే చూపులు మొదట తామిద్దరూ గదిలోకి వచ్చినప్పుడు చూస్తున్న చూపులు ఏమీ మార్పులేదు. ముఖంలో సీరియస్ కొట్టవచ్చినట్టు కనబడుతోంది.

రాజీవ్‌ని 'ఎందుకు పిలిచావ్' అన్నట్టు చూశారు.

"ఆంటి, అరుంధతి ఆంటీకి ఎలా ఉంది?".

"పర్వాలేదు పడుకోబాబు, పెద్ద దెబ్బేమీకాదు....తొందరలోనే మానిపోతుంది".

"చావలేదన్నమాట...ఛస్తుందనుకున్నానే"

పునాదులతో సహా తామున్న భవనం ముక్కలైనట్టు ఖంగుతిన్నారు.

"ఆ దెబ్బకి బ్రతికిందా?! చచ్చిపోవాలే" వాళ్ళ ఫీలింగ్స్‌ని పట్టించుకోకుండా అన్నాడు.

ఈ సారి చలిజ్వరం వచ్చినట్టు వణికిపోయారు ఇద్దరూ.

"అదీ ఫాదర్ జరిగింది. నాకెందుకో భయంగా ఉంది" చెప్పింది రోజీ కన్నీళ్ళతో.

దూరంగా రాజీవ్ నిల్చుని ఉన్నాడు. చెర్చి ఫాదర్ ఆమె చెప్పింది విని శ్యామ్ వంక చూశాడు. అతనూ అలానే ఉన్నాడు. ఏడ్పు ఒక్కటే తక్కువ.

"రాజీవ్ అలా అన్నాడా? మీరేమి పొరపాటు పడలేదుగా".

"లేదు ఫాదర్. అరుంధతిని పలకరించి వస్తుంటే, రోజీ చెప్పింది. రాజీవ్ కావాలనే కొట్టినట్టు, నేను కోపంగా రాజీవ్ గదిలోకి వెళ్ళి అడిగాను. మొదట మౌనంగా వున్నాడు. తరువాత తనాపని చెయ్యలేదన్నాడు. మేం నమ్మి వెళుతుంటే

అన్నాడు – ఒక్కసారి కాదు రెండుసార్లు, మేం భయమేసి వెంటనే మీ వద్దకు వచ్చాం, క్షణమాలస్యం చెయ్యలేదు".

"మీరు చెప్పింది నిజమయితే, రాజీవ్‌కి ఆరుంధతి మీద ఎందుకంత కోపం. మీకేమన్నా కారణం తెలుసా!"

"బహుశా ఒకటే అయి ఉంటుంది. అరుంధతి మా ఫ్యామిలీ డాక్టర్. ఏ చిన్న జబ్బు వచ్చినా ఆమే వస్తుంది.

రాజీవ్‌కి ఇంజెక్షన్స్ అంటే భయం, ప్రతిసారి వద్దని గొడవ చేస్తాడు. ఆ సమయంలో ఆరుంధతిని తిడతాడు కూడా".

ఫాదర్ సరళంగా నవ్వారు.

"అదయి ఉండదు. మరేకారణమైనా?"

"లేదు ఫాదర్. ఆమెకి మా ఇంటితో పరిచయం ఆమె వృత్తి వరకే పరిమితం".

"రాజీవ్‌ని నా దగ్గరికి తీసుకురండి" చెప్పాడు.

శ్యామ్ వెళ్ళి కూర్చున్న కొడుకుని ఎత్తుకుని ఫాదర్ దగ్గరికి తీసుకొచ్చాడు.

ఫాదర్ చిరునవ్వు నవ్వి "ప్రభువు సన్నిధికి వెళదామా?"అన్నాడు.

రాజీవ్ తల అడ్డంగా వూపాడు.

"చర్చిలోకి రావా?" అడిగాడు ఫాదర్.

"కాదు...డాడీ,మమ్మీకూడా" చెప్పాడు రాజీవ్

"తప్పుచేసిన వాళ్ళే ప్రభువు ముందుకు రావటానికి భయపడేది"

రాజీవ్ తల వంచుకున్నాడు.

"నాతోరా పెద్దలమాటకి అడ్డుచెబితే ప్రభువుకి నచ్చదు"

రాజీవ్ కిందకి దిగాడు. ఫాదర్‌తో పాటు నడిచాడు.

"కూర్చో" చెప్పాడు ఫాదర్.

"రాజీవ్ కూర్చుంటూ చూశాడు. ఎదురుగా ప్రభువు.

"ఇప్పుడు నువ్వు ఏసునాధుడి సమక్షంలోఉన్నావ్...అబద్దాన్ని ఆయన క్షమించడు. నిజాన్ని ఒప్పుకుంటే పాపాన్ని తుడిచేస్తాడు. చెప్పు ఆరుంధతి ఆంటీని కావాలనే కొట్టావా?"

"ఊహూఁ" తల ఊపాడు అడ్డంగా.

"మరి మమ్మీ డాడీని అలా ఎందుకడిగావ్, నీ ఉద్దేశ్యాన్ని ఎందుకు బయటపెట్టావ్".

"నేను అలా అడగలేదు. అబద్ధం!"

"ఏది మీ మమ్మీ, డాడీ చెప్పిందా!"

రాజీవ్ తల ఊపాడు.

"మీ మమ్మీ, డాడీ చెప్పిన అబద్ధం ఏమిటో"

"దారిలో అడిగారు అదేమీకు చెప్పి ఉంటారు. అరుంధతి ఆంటీ ఇంకా చావలేదా అన్నానని అన్నాడు".

"మరి నువ్వు అన్నావుకదా, అందుకేగా వారు నా దగ్గరికి తీసుకొచ్చింది. ఆంటీ నిన్నేమన్నా అన్నారా? లేక నీ తల్లిదండ్రులు లేనప్పుడు దండించిందా!"

"అలాంటి దేమీలేదు"

"మరయితే ఎందుకలా చేశావ్"

రాజీవ్ బుంగమూతి పెట్టుకుని లేచాడు.

"కనబడుతున్న ప్రభువుసాక్షి....నేనుచెయ్యలేదు. అనలేదు"

ఫాదర్‌లో సరళమైన స్వభావం మారిపోయింది. ఇక అడిగేందుకేమీ లేనట్టు లేచారు.

"అన్ని రకాలుగా ప్రయత్నించాను. నేను అలా ఆనలేదంటున్నాడు. పైగా ప్రభువుమీద ఒట్టుకూడా వేసాడు.

రోజీ అసహనంగా కొడుకుని దగ్గరికి లాక్కుంది.

"చెప్పరా చెప్పు, అలా అనలేదూ? పైగా మేరీ మాత తనయుడి మీద ప్రయాణం చేస్తావా? నీకు క్షమాపణ లేదురా. ఆ ప్రభువు నిన్ను క్షమించడు".

శ్యామ్ అడ్డు చెప్పబోయాడు. ఆమె పట్టించుకోకుండా దబ దబ వంచి బాదింది.

రాజీవ్ ఏడుపు లంకించుకున్నాడు. ఫాదర్ మనసు కలత చెందింది.

"ఊరుకోబిడ్డ....ఏ గాలో సోకి ఉంటుంది. ప్రభువు సన్నిధిలోకి రాగానే మటుమాయం అయి ఉంటుంది. అందుకే ఒట్టువేసాడు. ఆయన సన్నిధిలో ఆయన బిడ్డని దండించకు. ప్రభువుని బాధ పెట్టకు" రోజీ ఆగి కళ్ళు తుడుచుకుంది.

"ఇప్పటివరకూ ఒక్కసారి కూడా ఆయనగాని, నేనుగాని చెయ్యి చేసుకోలేదు. ఇదే మొదటిసారి ఏడ్చింది బాధగా".

శ్యామ్ భార్యని ఓదరుస్తున్నట్టు –

"ఊరుకోమ్మా! కష్టాలు, సమస్యలు కలకాలం ఉంచడు ప్రభువు...నీ బాధ మటుమాయం అవుతుంది వెళ్ళిరండి. ఏ దుష్టసైతానో రాజీవ్‌ని తాకి ఉంటుంది. అందుకే అలా ప్రవర్తించి ఉంటాడు. ఇప్పుడు ఆయన సన్నిధిలోకి రావటంతో అన్నీ దూరమవుతాయి.

"నేను అదే అనుకుంటున్నాను పాదర్! ఇక్కడికి తెచ్చింది కూడా అందుకే. ముక్కుపచ్చలారని బాలుడు చావుల గురించి మాట్లాడేసరికి మాకు నోటిమాట రాలేదు. తేరుకుని మీ దగ్గరికి తెచ్చాం".

"ఆ ప్రభువు అందర్నీ రక్షించుగాక....ప్రశాంతంగా ఉంచుగాక" చెప్పారు ఫాదర్.

# 4

రాత్రి పన్నెండు గంటలు....

ఊరంతా నిద్రాదేవిఒడిలో ఉంది. చలితో మునగదీసుకుని ఉంది. ప్రక్కమీద రాగిణి బద్ధకంగా కదిలింది. విసుగ్గా దుప్పటిని మీదకి లాక్కుంది.

ఊహు....

చలి పోవటంలేదు. ప్రకృతివల్ల కలిగిన చలయితేనేగా పోవటానికి.

శరీరంలోపల చలి. ఏదో కలిస్తేనేగాని పోని జిలి.

మీదున్న దుప్పటిని తీసి లేచింది. పైన ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతోంది.

కురులని సవరించుకుని, చీర చెంగును సర్దుకుని తలుపువైపు నడిచింది. శబ్దం కాకుండా తెరిచి కారిడార్‌లోకి వచ్చింది.

అంతా నిశ్శబ్దం...రాజీవ్ గది తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. రాగిణి అటుకేసి నడిచి మరింతగా తలుపుతోసి చూసింది.

ప్రపంచాన్ని మరచి మునగదీసుకుని పడుకుని ఉన్నాడు. రాగిణి తలుపులని దగ్గరికి వేసింది. నలువేపులా ఓసారి చూసుకుని మెట్లు దిగింది. మెట్లుపక్కనే ఉంది వంటగది. ఆ వంటగదిలోనే ఉంటాడు సలీం.

రాగిణి అడుగులో అడుగేసుకుంటూ వంట గదిలోకి వెళ్ళింది. సలీం గోతంలాంటి దుప్పటి నిండా కప్పుకుని ఉన్నాడు. రాగిణి లోనికి వెళుతూనే తలుపు వేసేసింది.

"సలీం......సలీం" గుసగుసగా పిలిచింది.

అలవాటయిన పిలుపు...అవసరమైన పిలుపు....దబ్బున దుప్పటిని తీసి చూశాడు.

రాగిణి ముప్పై ఆరేళ్ళ రాగిణి...బాదం ముక్కలాంటి రాగిణిని చూసి సలీం తియ్యగా నవ్వాడు. జరిగి చోటిచ్చాడు. రాగిణి భర్త పక్కలోకి జొరబడినంత ఫ్రీగా ఎలాంటి జంకు లేకుండా జొరబడింది.

"అమ్మగారి మీద చెయ్యి వెయ్యచ్చా?" అన్నాడు గుసగుసగా.

"నోరు ముయ్యి వెధవ....ఇంకా అమ్మగారేంటి. అయినా నేను అమ్మలా కనిపిస్తున్నానా?" "అది చెయ్యాలనే నా తాపత్రయం"

"ఏడ్చావులే...అదే వస్తే నిన్ను...నన్ను ఉప్పుపాతర వేస్తాడు మా ఆయన"

సలీం ఒత్తిగిలి ఆమెవైపుకి మరింత జరిగి దగ్గరకు తీసుకున్నాడు. వెచ్చగా, హాయిగా,మత్తుగా, కమ్మగా ఉంది. రాగిణి అతన్ని మరింత హత్తుకుంది.

"పాడు చలి, ఎటు పోయిందో కూడా తెలీటం లేదు. ఇందాకట్నుంచి ఎలా చంపిందనుకున్నావ్".

సలీం కాలు ఆమె నడుం మీద వేసి –

"ఇంకా ఎన్ని రోజులు, కేవలం రోజులేగా, ఆపై ఆయన వస్తాడు. ప్రతిరోజూ వారికి విందు భోజనం...నాకు మాత్రం పస్తు....."

"నీకు వడ్డించానుగా, పది సంవత్సరాలుగా విందుభోజనం. కట్టుకున్న వాడికి వడ్డించింది నీలో ఎంత. మానవుడు చేసుకున్నాడన్నమాటేగానీ చూసుకోవటం, దూరంగా ఉండి ఫోన్‌లో మాట్లాడటమేగా...."

"ఏమైనా నేను అదృష్టవంతుడ్ని" అంటూ మీదకి వచ్చాడు.

"చిన్నగా...చీరా....జుట్టు నలిపెయ్యకు"

"ఆ మాత్రం వేగం, వేడి లేకపోతే రంజేముంటుంది"

"రేపు వచ్చే ఆదివారం మావారు రావచ్చు. మళ్ళీ కుదురుతుందో లేదో ఇవ్వాళ నీ ఇష్టం" చెప్పి కళ్ళుమూసుకుంది.

"అంటే, వారొస్తే నీవు రావా?"

"హమ్మో, ఇంకేమన్నా ఉందా? మొగుడి పక్కలోంచి, అర్థరాత్రి లేచి రావటమంటే మగాడికి నీకేం తెలుసు. అయినా మన ఖర్మకాకపోతే నా మొగుడికి వ్యాపారంలో నష్టం రావటమేమిటి? అన్ని వదిలేసి తిరిగి ఇండియా వచ్చేయాలనుకోవటమేమిటి?"

'అలసిపోయి, సొలసిపోయి' మరో పక్క తిరిగి పడుకున్నాక "రావచ్చుగా, మనసుండాలి గాని మార్గముండదా. అయినా అంత అవసరం ఉండదులే"

"వద్దు...కోరి కోరి రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ఆయనెన్ని రోజులుంటారు. పోగానే నేనే వస్తాగా నీకు నైవేద్యం పెట్టడానికి...అదేంటి చివర అంత అవసరం లేదులే అన్నావ్. మోజుతీరిందా? మరొకతి దొరికిందా? లేక నీలో పులుసు ఇంకిందా?"

దానికి సమాధానంగా రాగిణి బుగ్గ గిలి-

"ఇక మాటలు లేవ్, చేతలే" అన్నాడు పూర్తిగా మీదకు వస్తూ-

రాగిణి చీరే పరుపయ్యింది.

ఆమె పంటి బిగువున కోర్కెనొక్కి పట్టింది. సలీం ఉత్సాహ పడుతున్నాడు.

గది కూడా వేడెక్కింది..... ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తారస్థాయికి పెరిగిపోయాయి.

పది నిమిషాల తరువాత తృప్తిగా కళ్ళు మూసుకుని ఓ పక్కకు తిరిగింది.

సలీం రొప్పును తీర్చుకుంటూ ఆమెని అంటి పెట్టుకుని ఉన్నాడు.

మరో పది నిమిషాల తరువాత లేచింది.

"నే వెళతానురా?" అంది తలమీద మొట్టి.

"అబ్బ" అన్నాడు సలీం.

"చూడు, జుట్టు ఎలా రేగిందో, చీర ఎలా నలిగిందో, రెండువేల రూపాయల చీరరా వెధవా?"

"రెండువేలు, బోడి రెండు వేలు, నా సంపాదనలో అదెంతా ఓ సంవత్సరం కష్టం అంతేగా..."

రాగిణి నవ్వి తల పూపింది వెళతానన్నట్టు-

"పని పూర్తికాగానే వెళ్ళటమేనా, లేక నా గోడు వినేదేమన్నా ఉందా?"

"డబ్బులేగా, ఉదయం టిఫిన్ తెచ్చినప్పుడు రూమ్‌లో ఇస్తాను"

"అది కాదు కూర్చో" చెప్పాడు సలీం బాధగా.

రాగిణి అయిష్టంగానే కూర్చుంది.

"పది సంవత్సరాల పరిచయం రెండోకంటివాడికి తెలియకుండా నడిపాం.... ఏ నిమిషాన మన ఇద్దరికీ పరిచయం ఏర్పడిందోగానీ, నన్ను ఈ ఇంటిలో కట్టిపారేసింది...ఇక తప్పదు".

"ఏమిటి తప్పనిది" అడిగింది ఆశ్చర్యంగా రాగిణి.

"నేను వెళ్ళిపోవటం....అయ్యగారికి కూడా చెప్పాను..... అందుకే ఇందాక నువ్ క్రిందకు వచ్చే అవసరం ఇక ఉండదు అన్నది".

"ఎక్కడికి, నన్ను వదిలి వెళతావా?"

"తప్పదు, నేనూ మనిషినే, నాకూ నా అనేవాళ్ళు కావాలి, మా వాళ్ళ దగ్గరికి వెళ్ళిపోతాను"

"అంటే నేను పరాయిదాన్నా"

"కాదా! ఉదయమంతా నీకు పనివాడ్ని, రాత్రి సంగతి వదిలేయ్. రేపొద్దున్న నాకే రోగమన్నా వస్తే నువ్ మెట్లు దిగి రాగలవా? నన్ను వెళ్ళి పొమ్మంటే వద్దని పెద్దాయనకు చెప్పగలవా? చెప్పలేవు. అందుకే....."

"మళ్ళీరావా?"

సలీం తల అడ్డంగా ఊపాడు.

"రాను. యుక్త వయస్సు వచ్చినప్పటి నుంచి ఈ ఇంటినే అంటి పెట్టుకుని ఉన్నాను. పాపాల్ని, పుణ్యాల్ని, మంచిని, చెడుని, సంతోషాల్ని, బాధల్ని అన్ని ఇంటితోపాటు పంచుకున్నాను. ఇక నా వల్ల కాదు. వెళ్ళిపోతాను. దూరంగా వున్న మావాళ్ళ దగ్గరకు వెళ్ళి కలోగంజో కలిసి త్రాగుతాం"

"ఇంత సడన్‌గా ఈ నిర్ణయం"

"పాపం పగులుతుందేమోననే భయం కూడా ఓ కారణం. దాని కంటే ముందు మరో భయం కూడా...." "భయమా, దేనికి?"

"మన ఇద్దరి గురించి కాదు. మన సంబంధం తెలుస్తుందని కాదు. ఏదో భయం. గత నాలుగు రోజులుగా ఏవో శబ్దాలు, అర్ధంకాని కలలు, అసలు నేను ఈ ఇంట్లో ఉండలేకపోతున్నాను"

"సలీం...." అంది వేదనగా.

"ఆ బాధ నాకూ వుంది... ఒక్కసారి ఈ ఇంటి గడప దాటితే మళ్ళీ నిన్ను చూడటానికి కూడా అవకాశం వుండదని తెలుసు. అయినా వెళుతున్నాను. వయస్సు నలభై వస్తోంది. త్వరలో... శరీరపు కోర్కెల కోసం ముందు భవిష్యత్తుని గడ్డు రోజులుగా చేసుకోలేను. అసలు ఇన్నేళ్ళు ఇక్కడ ఈ ఇంటిలో వున్నానంటే కారణం నువ్వే.... నీ కోసమే ఇప్పుడు వెళ్ళుతున్నది నీ కోసమే."

"నా కోసమా?"

"అవును. మీ ఆయన త్వరలోనే వస్తున్నారు. మళ్ళీ విదేశాలకు వెళ్ళరని నీకూ తెలుసు. ఇక నీ భర్తే నీకు సర్వస్వం....."

"ఛీ.....ఛీ.... వాడి పేరెత్తకు. పెళ్ళయితే చేసుకున్నాడు గాని ఏనాడయినా మంచి, చెడ్డ చూశాడా? పట్టుమని పది రోజులు గడిపాడా? నన్ను చేసుకోకపోయినా, నా కులం కాకపోయినా నువ్వే నాకు అసలు..."

సలీం రాగిణి నోటి మీద చెయ్యేసి ఆపాడు.

"వద్దు..... అతన్ని ఏమీ అనొద్దు.... అతనలా నిన్ను వదిలెయ్యకపోతే ఇన్ని సంవత్సరాలు నీవద్ద స్వర్గం చూసేవాడిని కాదు... ఈ అమరత్వాన్ని పొందేవాడిని కాదు...."

"అయితే తప్పదా!"

"ఇక ఈ జీవితానికి శెలవ్...."

"రేపు ఉదయం నా రూమ్‌కి వచ్చి వెళతావ్‌గా."

సలీం తలవూపాడు.

రాగిణి లేవబోయి ఆగింది.

"అవునూ, ఇందాకేంటి అన్నావ్? ఏవో శబ్దాలని, కలలని" అడిగింది.

"అదే నాకు అర్థం కావటంలేదు. ప్రతిరోజు ఒకటే కల.... ఆ కల....."

"ఏ కల" అడిగింది.

"అదే..... నువ్వు నేనూ, వాళ్ళు చేసిందంతా కలగా వస్తోంది."

రాగిణి మొహం విచ్చుకుంది.

"దేని గురించి నువ్ చెప్పేది?"

"పదిహేను సంవత్సరాల క్రితం. మీరు కొత్తగా పెళ్ళికూతురిగా గడపలో పెట్టినప్పటి రోజులు గుర్తుతెచ్చుకోండి."

"ఏది అది?"

"అదే రంచనగా వస్తోంది."

"ఒకే కల ప్రతిరోజూ వస్తుందా!"

"అదే ఆశ్చర్యం... భయంతో చచ్చిపోతున్నాను. కలలెప్పుడైయినా జరగనవి, జరగబోయేవి వస్తాయి. అదేంటో జరిగిపోయిన పాపం మనం చేసిన పాపం తెరమీది సినిమాలా చాలా క్లియర్‌గా కలగా వస్తోంది."

"నువ్ అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తున్నావ్. ఎప్పుడో మన మందరం కలిసి చేసిన పాపం నీ వక్కడికే ఎందుకు కలలా వస్తోంది? అది నీ భ్రమ"

"ఏది ఏమైనా నేను వుండలేను."

"అయితే సరి... రేపు వెళ్ళేముందు నన్ను కలువ్. చివరిసారి ఇద్దరి ఋణం తీర్చేసుకుందాం."

సలీం భుజం మీద చెయ్యేసి నొక్కాడు ఆప్యాయంగా.

రాగిణి లేచింది...

వంగి బయటికి చూసింది.

ఎవరూ లేరు. ఎవరూ వుండరు కూడా.... సలీం తప్పించి మిగతా వారంతా ఇళ్ళకి వెళ్ళిపోతారు.

పైన నాలుగో అంతస్థులో శ్యామ్, రోజీ పడుకుంటారు.

రెండో అంతస్థులో తానూ, రాజీవ్... క్రింద వంటగది హాలు.... డైనింగ్ రూమ్.

రాజీవ్ లేవడు.... పైన వాళ్ళు క్రిందికి దిగాల్సిన అవసరం వుండదు. అందుకే అన్ని సంవత్సరాల పాటు వాళ్ళిద్దరి రహస్యం రహస్యంగానే వుండిపోయింది.

రాగిణి చకచకా నడుచుకుంటూ తన రూమ్‌లోకి వెళ్ళింది.

బెడ్‌లైట్ కూడా తీసేసి..... దుప్పటి ముసుగు పెట్టింది.

అప్పుడు సమయం రాత్రి రెండు.... కేవలం నిమిషాల్లోనే నిద్రలోకి జారిపోయింది.

ఆమె అలా నిద్రలోకి జారిపోవడం ఆలస్యం సన్నగా కేక..... అది సలీంది.... అయితే ఆమె దాన్ని వినే స్థితిలో లేదు. చాలా గాఢ నిద్రలోకి జారిపోయి ఉంది.

బాగా అలసిపోయిందిగా మరి.....

అయితే ఈ కేకని శ్యామ్ విన్నాడు.

## 5

తెల్లవారు జామున నాలుగు గంటలు...

ఇంకా వెలుగు రేఖలు పూర్తిగా విచ్చుకోలేదు.

శ్యామ్ బద్ధకంగా కదిలాడు. భార్య తగిలింది... కళ్ళు తెరిచి చూశాడు.

రోజీ గాఢ నిద్రలో వుంది.

దుప్పటిని తీసి కూర్చున్నాడు.

కిటికీ లోంచి సన్నగా చల్లగాలి వీస్తోంది.

టీపాయ్ మీద వాటర్ జగ్గు వంచి గ్లాస్‌లో వాటర్ పోశాడు.

శ్యామ్‌కి ప్రతిరోజు డ్రింక్ అలవాటు. డ్రింక్ అలవాటున్న వారికి రాత్రిపూట మంచినీళ్ళు అవసరం. విపరీతంగా దాహం వేస్తుంది.... అందుకే రోజీ మర్చిపోకుండా టీపాయ్ మీద వాటర్ వుంచుతుంది.

గ్లాస్ చేతిలోకి తీసుకోబోతుండగా జారింది. గాజు గ్లాస్ భళ్ళున శబ్దం..... ఒక్కసారి నిశ్శబ్దం మయామైంది. ప్రశాంతంగా వున్న ఆ సమయంలో గ్లాస్ పగిలిన శబ్ధం కర్ణకఠోరంగా విన్పించింది శ్యామ్‌కి.

ఆ శబ్ధానికి రోజీ లేచింది. కళ్ళు నులుముకూంటూ చూసింది.

"పడుకో, గ్లాస్ చేతిలోకి తీసుకుంటుంటే జారింది అంతే!"

రోజీ రెండు కాళ్ళు కిందపెట్టి- వుండండి, వంటగదిలోంచి మరో గ్లాస్ తెచ్చిస్తాను.

"ఇప్పుడా, వద్దులే, అన్ని మెట్లు దిగి ఏం తెస్తావులే" అని జగ్గువంచి రెండు గుక్కలో నోట్లో పోసుకున్నాడు.

రోజీ తిరిగి పడుకుంది.

శ్యామ్ కూడా వత్తిగిలి...

"నిద్రపట్టడంలేదు రోజీ- చెప్పాడు."

రోజీ భర్తకేసి తిరిగి ఆప్యాయంగా నుదుటి మీద చెయ్యేసి..... "ఒంట్లో బాగాలేదా?" అడిగింది. "అదేమీలేదు- ఎందుకో అనీజిగా వుంది. అది సరే తెల్లవారుజాము అంటే ఓ గంటా, గంటన్నర ముందు ఏదన్నా కేక విన్పించిందా?"

రోజీ విస్మయంగా అంది.

"కేకా? అలాంటిదేమీ లేదే."

"బాగా లీలగా విన్పించింది మొగ గొంతు. నేను కలత నిద్రలో వున్నానేమో చాలా క్లియర్‌గా విన్పించింది. అప్పటికి లేచి కిటికీలోంచి చూసి.... క్రింద అంతస్థులోకి వెళ్ళి చూశాను కూడా. రాజీవ్, రాగిణి గదుల్లో కూడా చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నారు."

"మగవాడి కేకంటున్నారు. ఈ బంగ్లాలో సలీం తప్ప మరెవరు వున్నారు... వంటగదిలోకి వెళ్ళి చూడకపోయారా?"

"చూశాను, వాడు బాగా ముసుగుతన్ని పడుకొని వున్నాడు."

"ఏదో పీడకల కనివుంటారు– వుండండి సలీంని లేపి కాఫీ పెట్టిమంటాను. కొద్దిగా రిలాక్స్ అవుతారు."

శ్యామ్ తలూపాడు.....

రోజీ లేచింది.

"నేనూ వస్తాను పద, రాజీవ్ గదిలోకి వెళదాం."

రోజీ ఆశ్చర్యంగా చూసింది. దగ్గరకొచ్చి– " మీరు వాడి విషయములో బాగా బాధపడుతున్నట్లు వున్నారు" అంది.

"చాలా.... వాడీ వయస్సులో అబద్ధాలు. అలాంటి క్రిమినల్ మైండ్, తల్చుకుంటే వాడేమవుతాడో, ఎలా తయారవుతాడో నని భయంగా వుంది"

"వాడికి మీరూ, నేనూ అంటే ప్రాణం... మనల్ని ఎవరేమన్నా సహించడు. అందుకే అలా చేశాడు."

"అసలు వాడు... వాడు... అంతలా అరుంధతిని కొట్టడం తల్చుకుంటే వళ్ళు జలధరిస్తోంది."

"చెప్పాను కదండి, పార్టీలో టిఫిన్ ఏ వైపు వుందో రాజీవ్ నాకు చెబుతుంటే అరుంధతి అడ్డుపడింది. నేను వోడిపోయానని, దానికి అరుంధతే కారణమని ఆ చిన్న మనసు ఆక్రోశపడింది. అందుకే అలా చేశాడు."

"సర్ది చెప్పద్దు రోజీ, ముందు మనకి కొట్టలేదని చెప్పాడు. తీరా వెళుతుంటే అది చావలేదా, చస్తుందని అనుకున్నానే అన్నాడు. ఫాదర్ దగ్గరికి తీసుకెళితే బుకాయించాడు. తనకేమీ తెలియదని జీసస్‌మీద ఒట్టు కూడా వేశాడు. తల్లి

తండ్రులం మనం క్షమించినా, అబద్ధం చెప్పినందుకు ఆ మేరిమాత తనయుడు క్షమించడు."

"మీరు చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి ఆలోచిస్తున్నారు. లేవండి కొడుకుని చూద్దామన్నారుగా."

శ్యామ్ లేచి లుంగీ తిరిగి కట్టుకొని రోజీని అనుసరించాడు.

రాజీవ్ గదిలో ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. డిమ్‌లైట్ కాంతి గదిని ఆక్రమించలేకపోతోంది.

"లేపద్దు, పిచ్చితండ్రి ఎలా నిద్రపోతున్నాడో చూడండి"

శ్యామ్ అలికిడి కాకుండా పక్కమీద కూర్చుని ప్రేమగా జుట్టు నిమరబోయాడు. చేయి మధ్యలోనే ఆగింది.

గాలిలోన ఆగింది....

శ్యామ్ కళ్ళు పెద్దవయ్యాయి. ఆ కనులలో భయం, శరీరం కూడా వణికింది.

"రో....రో....రోజీ" అన్నాడు.

"ఏమిటండి?" ముందుకు వచ్చింది రోజీ.

శ్యామ్ కళ్ళతో చూపించాడు.

రోజీ అటుకేసి తిరిగింది.

నిద్రపోతున్న రాజీవ్ పెదాలమీద రెండు చుక్కలు...

సరిగ్గా పెదాలమీదే..... ఎర్రగా.... ఎర్రగా....

"ర.....ర....రక్తం! ఏమయిందండి? నిద్రలో కొరుక్కున్నాడా" అడిగింది ఆందోళనగా.

"నీబొంద, సరిగ్గా చూడు, అవి పెదవి కొరుక్కుంటే వచ్చిన రక్తం కాదు. ఎవరిదో...."

రోజీ భర్తను కిందనుంచి పైదాకా చూసి.....

"చాల్లేండి మీకేదో పట్టినట్లుంది" అని రాజీవ్ పెదాలమీద ఏదో అద్ది భర్తకి చూపించింది.

"చూశారా? వేళ్ళకి కూడా అంటలేదు. రెడ్ ఇంక్ పెన్ను నోట్లో పెట్టుకుని వుంటాడు. దానికి మీ హడావుడి. చూడబోతే నా బంగారు తండ్రిని సైతాన్ని చేసేలా వున్నారే...."

"సరిసరిపద.... సలీంని లేపి కాఫీ పెట్టి పైకి తెమ్మను"

"మళ్ళీ పైదాకా ఎందుకు? ఇక్కడే వుండండి చెప్పి వస్తాను" అని బయటికి నడిచింది.

వంటగది తలుపులు తీసి సలీంని చూసింది.

'వెధవ! అయిదు కావొస్తుంది ఇంకా గుర్రుపెట్టి పడుకున్నాడు' అనుకుని....

"సలీం లే" అంది.

తలమీద దుప్పటి తీయలేదు, సలీం లేవలేదు.

రోజీ దగ్గరకెళ్ళి......

"లేవరా అయిదు అవొస్తుంది. మమ్మల్ని లేపాల్సినవాడివి, నిన్ను మేం లేపాల్సి వచ్చింది–లే" అరిచింది.

సలీంలో ఉలుకూ, పలుకూ లేదు.

రోజీ వంగి తలమీద కొడుతూ....

"ఒరే మొద్దు... లే" అంది.

అప్పటికీ లేవకపోవడంతో చిరాకుగా...

"సలీం....సలీం" అంటూ తలమీద దుప్పటిని లాగింది.

అంతే!

కత్రాటలా అయిపోయింది.

సలీం కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి! చూడగానే తెలిసి పోతూంది ప్రాణం లేదని.

మెడమీద రెండు గాట్లు....

పులిపంజాతో కొట్టినట్టు రెండే రెండు గాట్లు... ఆ గాట్లమీద ఎర్రగా మెరుస్తోంది.

రక్తం.... వెచ్చని రక్తం.

రోజీ చేతిని అడ్డంగా పెట్టుకుని వెనక్కి అడుగేసింది.

వెనుకే వున్నాయి స్టీల్‌సామాన్లు, ఆమెకు తగిలాయి.

దడదడమని శబ్దం చేసుకుంటూ జారాయి.

రోజీ భయంతో కదిలిపోయింది. ఓ పక్కన శబ్దాలు మరో పక్క సలీం మృతదేహం.

పైన కొడుకు పక్కన కూర్చుని దీక్షగా నిద్రపోతున్న పుత్రుడినే చూస్తున్న శ్యామ్‌కి మొదట గిన్నెల శబ్దం వినపడింది.

మరుక్షణమే.....

భయంకరంగా....

మొత్తం భవనం మారుమ్రోగి ఉంటుందా కేకకి.

రోజీ కేక.......

శ్యామ్ దిగ్గున లేచాడు.

రోజీ అంతలా కేకెందుకు వేసిందో అర్థంకాక ఆందోళనగా పరుగెత్తాడు వంటగది కేసి.

.....

......

.......

తలుపులు బ్రద్దలయ్యేలా చప్పుడు.... రాగిణికి టక్కున మెలకువ వచ్చింది.

అంతలా తలుపులు బాదుతున్న వాళ్ళను నాలుగు దులపాలనిపించింది.

అంత కొంపలేమి మునిగాయ్! ఆరు కూడా కాలేదు. ఒకవేళ సలీం ఏమో, అతనయితే అంతలా తలుపులు బాదడు... రోజీనా–? రాజీవా.....?

ఎవరయితే ఏం? బంగారంలాంటి నిద్ర పాడుచేశారు.

'వాళ్ళని' కసిగా అనుకుని దుప్పటిని విసురుగా పక్కన పడేసి జుట్టుకూడా సవరించుకోకుండా వడివడిగా తలుపుల వైపు నడిచింది.

అంతకన్నా వేగంగా తలుపులు తీసింది.

ఎదురుగా శ్యామ్. ఆవేశాన్ని కంట్రోల్ చేసుకుంది. చికాకుని అదుపులో ఉంచుకుంది.

"ఇక్కడింత గొడవగా ఉంటే నీకు మెలుకువ రాలేదా?" అడిగాడు చిన్నగా శ్యామ్.

"గొడవా? ఏమయింది....?" ఆశ్చర్యం, ఆదుర్దా కలగలిపి అడిగింది.

"సలీం చచ్చిపోయాడు...."

లాగి చెంపకేసి కొట్టినట్లనిపించింది రాగిణికి. తల తిరిగిపోయి......

"ఏవంటున్నారు?" అంది.

"సలీం చనిపోయాడు"

"చ....చ...చనిపోయాడా? ఎలా?"

"చనిపోయాడంటే ఎలా అంటావే... ముందురా" అన్నాడు.

రాగిణి అచేతన స్థితితో తలాడించింది.

శ్యామ్ వెళ్ళిపోయాడు.

రాగిణి లోపలకొచ్చి జుట్టుని ముడివేసుకని నైట్‌డ్రస్ తీసేసి దొరికిన చీరచుట్టుకుని వచ్చింది.

బయట పుట్టిన రోజుకి వేసిన టెంట్ అలానే వుంది. దాని మధ్యలోనే పడుకోబెట్టారు సలీం దేహాన్ని.

చుట్టుపక్కలవారూ, ఇంటిపనివాళ్ళూ అందరూ చేరారు. శ్యామ్ బాధగా అన్నాడు.

"నిన్నకూడా బాగానే వున్నాడు. చక్కగా మాట్లాడాడు కూడా"

"ఏదన్నా జబ్బా?" అడిగాడు ఆ వీధిలోని వ్యక్తి.

"అలాంటిదేమీ లేదు. నిన్నకూడా నేనడిగాను. ఒంట్లో బాగుండకపోతే చెప్పు నేను చూపిస్తాను అన్నాను కూడా.

లేదు నే వెళతాను. నాకెందుకో దిగులుపట్టుకుంది అన్నాడు. నేను సరే అన్నాను. ఇవ్వాలో, రేపో వెళ్ళిపోవాలి. కాని ఇక్కడే తెల్లారిపోయాడు"

"రాసి పెట్టటమంటే ఇదే శ్యామ్‌గారూ! నాకూ చెప్పాడు. నేను తొందరలోనే ఈ ఊరిని, మిమ్మల్ని అందరినీ వదిలి వెళతాను. మా వాళ్ళ దగ్గరే వుండిపోతానని కాని ఇలా వెళ్ళిపోతాడనుకోలేదు"

"ముందు జరగాల్సిన కార్యక్రమం చూడండి" అన్నాడో పెద్దమనిషి.

"రెండువందల కిలోమీటర్ల దూరం. వాళ్ళవాళ్ళు రావాలి. అప్పుడే" చెప్పాడు శ్యామ్ తలొంచుకుని.

"అసలు వాళ్ళు వస్తారంటావా? వాడిక్కడ, మీ దగ్గర పనికి కుదిరి పదిహేనేళ్ళు అవుతుంది. ఒక్కసారన్నా వచ్చారా? ఇప్పుడు మాత్రం వస్తారని, నమ్మకం ఏంటి? ఆ పనేదో మనమే చేద్దాం"

"ఎక్కడివాడో, ఇక్కడ పొయ్యాడు. పాపం ప్రాణం పోతే రెండు కన్నీటి చుక్కలు కూడా విడిచేవాళ్ళు లేరు."

"ఇలాంటి చావు పగవారికి కూడా వద్దు"

రాగిణి గోడవారగా నిలబడిపోయి ఉంది.

తలా ఒకరకంగా మాట్లాడుతున్నారు. ఆమె ఏది వినిపించుకోవటం లేదు.

ఒకటే బాధ... గుండెల్లో గూడు కట్టుకుని ఉంది.

పది సంవత్సరాల పైన పరిచయం....శారీరక పరిచయం..... మామూలప్పుడు పదిమందిలో సలీంని అరేయ్, ఒరేయ్ అని పిలిచినా రాత్రి పూట ముద్దు చేస్తుంది. గారంగా బ్రతిమిలాడుతుంది. ప్రేమగా పలకరిస్తుంది.

అదీ ప్రేమే, భర్త తనని ఇలా వదిలేసిన తర్వాత తానింకా జీవితం మీద విరక్తి పెంచుకోలేదంటే కారణం సలీం....

జీవితం తాలూకూ అపురూప మకరందం అందించినవాడు. వాడు... వాడు పొయ్యాడంటే.... గుండెల్లోని బాధ కన్నీరు రూపంలో తన్నుకు వస్తోంది.

కాని ఏం లాభం... ఏడ్వలేదు... సలీం గుండెలమీద పడి రోదించాలని ఉంది... నోరారా ఏడ్వాలనివుంది. చుట్టూ సమాజం... భారంగా కళ్ళు మూసుకుంది.

అక్కడ ఉండలేనట్టు లోపలికి వెళ్ళిపోయింది.

తన గదిలోకి వెళుతూనే పరుపుమీద పడి దిండు మధ్యలో తల పెట్టి భోరున ఏడ్చింది.

అలా ఏడుస్తూనే వుంది మధ్యాహ్నం వరకూ. కనీసం భోజనానికి, కాఫీకి కూడా బయటికి రాలేదు.

బయట శవాన్ని ఉంచారో, తీసుకెళ్ళారో కూడా తెలీదు. మళ్ళీ వెళ్ళాలనిగాని, చూడాలనిగాని అనుకోలేదు.

తాను బయటకి వెళితే మళ్ళీ ఆ సన్నివేశం చూస్తే నిగ్రహించుకోలేదని తెలుసు.

అందుకే బయటికి రాలేదు. అలా నిశ్శబ్ధమైన కౌగిలిలో రోధిస్తూనే వుంది.

## 6

మరుసటి రోజు....

"రాజీవ్! స్కూల్‌కి వెళ్ళడా?"

రోజీ నెమ్మదిగా తలాడించింది.

"రాగిణి ఏం చేస్తోంది?"

"నిన్ననగా రూమ్‌లోకి వెళ్ళింది. రాత్రిదాకా బయటికి రాలేదు. ఓ గ్లాస్ పాలు తీసుకుని వెళ్లింది. అంతే!!

శ్యామ్ టైం చూసుకున్నాడు. పది....

"వెళ్ళి, రాగిణిని పిలుచుకురా?" చెప్పాడు శ్యామ్.

"ఇప్పుడొద్దండి.... భయపడినట్లుంది. తర్వాత అదే తేరుకుంటుంది. అయినా ఇప్పుడా విషయం..."

"ప్లీజ్ వెళ్ళి పిలుచుకురా?" అసహనాన్ని కంట్రోల్ చేసుకుంటూ చెప్పాడు.

రోజీ మారు మాట్లాడకుండా వెళ్ళి పిలుచుకువచ్చింది.

పది రోజులు లంకణాలు చేసినట్టుగా పాలిపోయి వుంది రాగిణి మొహం.

నీరసంగా కుర్చీలో కూర్చుంది.

రోజీ ఆమె పక్కనే నిలబడింది.

శ్యామ్‌కి ఎలా మొదలు పెట్టాలో అర్థం కాలేదు. పదినిమిషాలు ఒకరి నొకరు చూసుకుంటూ గడిపారు.

ముందు రోజీనే నోరు తెరిచింది.

"చెప్పండి, అలా మూగనోము పట్టినట్టు వుంటారే."

రాగిణి రోజీ కేసి విస్మయంగా చూసింది.

"నాకూ తెలీదు.... మాట్లాడతాను వెళ్ళి పిలుచుకురా అన్నారు"

"అది..... అది..." నసిగాడు శ్యామ్.

"చెప్పండి..." అడిగింది రాగిణి.

శ్యామ్ రాగిణి వంక చూసి–

"సలీం.....సలీం ముందు రాత్రి నీతో ఏమన్నా చెప్పాడా?" అన్నాడు.

రాగిణి విస్తుపోయింది. తెచ్చిపెట్టుకున్న కోపంతో చూసింది.

"మరోలా అనుకోవద్దు.... కారణం వుండబట్టే అడుగుతున్నాను. అసలు నిన్నిలా అడగాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు"

"ఏంటి మీరంటున్నది. నాకేమీ అర్థం కావటంలేదు"

"ఇందులో అర్థం కాకపోవటానికేం లేదు. సలీం చనిపోవటానికి ముందు, నీతో ఏదయినా మాట్లాడాడా అని అడుగుతున్నాను"

"సలీం నాతో...."

"నాకు తెలుసు. నాకే కాదు రోజీకి కూడా, తెలిసి కూడా తెలియనట్టే ఇన్నేళ్ళుగా వూరుకున్నా మనుకుంటే పొరపాటు.... మాకూ కొత్తగా, ఇంతకు ముందే తెలిసింది. సలీం సూట్‌కేస్ చూస్తుంటే తెలిసింది... వాడి బట్టలూ, వస్తువులూ వాళ్ళవాళ్ళకి ఇచ్చేద్దామని తెరిచి చూస్తే తెలిసింది...." చెప్పి శ్యామ్ లేచి డ్రాయర్ తెరిచి చిన్న పుస్తకం తీసి రాగిణి ముందు పెట్టాడు.

"ఇది.... ఇది.... ఏముంది ఇందులో...."

"మీ ఇద్దరి రహస్యం... ఎన్నో సంవత్సరాలుగా మీ ఇద్దరిలోనే వుండిపోయిన పాపం ఈ పుస్తకం ద్వారా బయటపడింది... సలీం నీ గురించి , తన గురించి ఓ ప్రేమ కావ్యంలా రాసుకున్నాడు... కాని అదిపాపమనీ తెలీదు...."

"ఏ పాపం, మనం చేసిన పాపమా? లేక మా ఇద్దరి పాపమా?" తెగించినట్టు అడిగేసింది.

"రాగిణి" దాదాపుగా అరిచాడు.

"కొన్ని తెలిసినా తెలియనట్టు వుండాలి బావగారు. అదే మర్యాద. మరియు మర్యాద నిలబెట్టుకోవడమూనూ..."

"నా మర్యాద ఎలా నిలబెట్టుకోవాలో తెలియక నిన్ను పిలవలేదు. నా తమ్ముడి భార్య తప్పు దోవ తొక్కిందని తెలిసి మందలించి నేనోదో పెద్దవాడినని, పెద్దమనిషినని నీ ముందు ప్రదర్శించాలని అసలే కాదు."

"మరలాంటప్పుడు నన్నెందుకు అడుగుతున్నట్టు, ఈ ఇంటిలో మొదట్నించి తప్పుడు దోవలు తొక్కటం, తప్పుడు పనులు చేయటం అలవాటేగా......"

"రాగిణి టాపిక్ మార్చద్దు, నీవన్నది కొంత వరకే నిజం.... మా ఇళ్ళల్లో ఇలాంటి తప్పు ఇంతవరకూ చెయ్యలేదు."

"నేను చేసిందాంట్లో న్యాయం ఉంది. కాబట్టి అది తప్పుకాదు. ఇదే మాట మీ తమ్ముడి ముందు కూడా చెబుతాను. పెళ్ళి చేసుకొని వదిలేసి సంవత్సరానికొకసారి వచ్చిపోతుంటే, నేనే కాదు ఉప్పుకారం తింటున్న ఏ ఆడదయినా నాలానే చేస్తుంది."

"ఆహాఁ హత్య కూడా చేస్తుందా?" శ్యామ్ తాపీగా అన్నాడు.

"హత్యా!....

అవి మాకలవాటు లేవు బావగారు... వస్తే గిస్తే మీ ఇంటి గడపలోకి వచ్చాకే అలవడి ఉంటుంది.

"రాగిణి! నీ భర్త అన్నయ్యతో మాట్లాడుతున్నావని మర్చిపోతున్నావ్."

"అది మీరూ గుర్తుపెట్టుకోండి... మొదట నా అక్రమ సంబంధం గురించి అడిగారు. ఇప్పుడు హత్య చేశానని అంటున్నారు. ఎవర్ని ఎవరు చేశారు. ఇంకా నయం సలీంని చేశానని అనలేదు" అంది ఆవేశంగా.

తన రహస్యం బయటపడిందని తెలియగానే ఉద్రేకపడింది. ఆ ఉద్రేకంలో ఏం మాట్లాడుతుందో కూడా గ్రహించలేకపోయింది.

"అనే అంటున్నాను. సలీంని కావాలనే చంపావంటున్నాను. వచ్చేవారం మీ ఆయన వస్తున్నాడు. అతనొస్తే రహస్యం బయటపడుతుందని చంపావ్.... నువ్వే హత్య చేశావ్ సలీంని"

"అబద్దం...."

"నిజమేమిటి?" అడిగాడు విసురుగా.

"మా రహస్యం తెలిసి మీ కుటుంబ గౌరవం పోతుందని మీరే చంపి వుండచ్చుగా"

శ్యామ్ తల విదిలించుకుని భార్య కేసి చూశాడు.

రోజీ అనునయంగా చేయి వేసి– "చూడు రాగిణి! నువ్వు నిజంగా సలీంని చంపివుంటే చెప్పు..... హత్యలు చేయటం... చేస్తుంటే చూస్తూ వుండటం మనకు మామూలేగా. నువ్వు చెప్పినదాన్నిబట్టి ఓ అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలి. అంతేగాని నిన్ను నిందించాలని, నీ కాపురాన్ని చెడగొట్టాలని మేం అనుకోవడం లేదు. మా బిడ్డలా మేం కడుపులో దాచుకుంటాం"

"అంటే సలీం నిజంగా హత్య చేయబడ్డాడా?"

"హాస్యాలాడటానికి ఇదా సమయం...." శ్యామ్ సీరియస్‌గా చెప్పాడు.

"మైగాడ్! సలీంకి నాకు వున్న సంబంధం తెలిసి, మామూలుగా చనిపోయిన అతన్ని నేనే చంపానని ఒప్పించి, నన్ను ఇంట్లోంచి బయటికి వెళ్ళగొట్టాలనుకుంటున్నారని అనుకుంటున్నాను"

"ఒకసారి చేసిన పాపం చాలు! అదే ఇప్పటికి వెంటాడుతోంది. మళ్ళీ మరొకటా?"

"అయితే సలీంని ఎవరు చంపారు?"

"అది తెలియకే నిన్ను పిలిచింది!"

"అసలు అతను... నిజంగా.... నిజంగా హత్య చేయబడ్డాడా?"

"ఖచ్చితంగా, నిన్న రాత్రి నాకు నిద్రపట్టక తెల్లవారుజామున నేను లేచిందిగాక రోజీని కూడా లేపాను. ఇద్దరం కలిపి రాజీవ్ గదికి వెళ్ళాం. సలీంని లేపి కాఫీ పెట్టమని చెప్పొస్తానని వంటగదిలోకెళ్ళింది రోజీ.....

వెళ్ళిన కొద్ది సేపటికే కేక....

నేను పరుగు పరుగున వెళ్ళాను.

వంట గదంతా స్టీల్ గిన్నెలు.....

క్రింద సలీం కళ్ళు తెరుచుకుని, నోరు తెరుచుకుని భయంకరంగా....

మెడమీద గాట్లు.... రెండే రెండు... పదునయిన కత్తులతో గుచ్చినట్లు ఉన్నాయి.

కాని ఆశ్చర్యం! ఒక్క చుక్క రక్తం కూడా నేలమీద అంటలేదు.

మొదట తేరుకుంది నేనే... ముందు రోజీని తీసుకెళ్ళి సముదాయించి ఓ నిర్ణయానికొచ్చాను.

హత్య ఎవరు చేశారో, ఎందుకు చేశారో తెలియాలంటే, సలీంది హత్య అని ప్రపంచానికి తెలియకూడదు. అందుకే హత్యని మసిచేశాను. సహజంగా మరణించినట్టు చేశాను. అందుకే వాడి బంధువులను కూడా పిలవకుండా కార్యక్రమాన్ని పూర్తి చేశాను.

ఇప్పుడు చెప్పు.....

ఈ ఇంట్లో ఉంది నువ్వు, నేనూ, రాజీవ్, రోజీ- మన నలుగురిలో ఎవరు చంపారు?

బయటనుండి ఎవరూ వచ్చే అవకాశం లేదు. ఇంట్లో వాళ్ళే .... ఎవరూ? ఎవరు చేశారా పని? అంత కరెక్టుగా, ఆయువుపట్టుమీద కరెక్టుగా ఒక్క చుక్క రక్తం నేల చిందకుండా"

"నేను కాదు" రోజీ చెప్పింది.

"నాకా అవసరం కూడా లేదు. అన్ని సంవత్సరాలు పరిచయం వున్నవాడిని నేనే కాదు. ఏ ఆడది అంత దారుణంగా చంపదు"

"మరి నేనూ కాదు. ఒకవేళ నీవన్నట్టు కుటుంబ గౌరవం కోసం ఆ పని చేసానని భావించినా, సలీం చనిపోయాకే మీ ఇద్దరి గురించి నాకు తెలిసింది... ఈ పుస్తకం  నాకు కనిపించి కేవలం గంటలే అవుతోంది"

రాగిణి భయంగా చూసింది.

"ఈ ఇంటికేదో శని దాపురించింది" గొణుక్కుంది రోజీ.

"ముందురాత్రి మీరు కలిశారా? నా ఉద్దేశం మాట్లాడుకున్నారా?అని"

రాగిణి తలూపింది.

"ఎప్పుడు?"

"రాత్రి రెండుదాకా వంటగదిలోనే ఉన్నాం. సలీం వెళ్ళిపోతున్నాని కూడా చెప్పాడు"

"నాకూ చెప్పాడు, ఎందుకు వెళుతున్నావంటే సమాధానం చెప్పలేదు. నీకేమన్నా చెప్పాడా?"

"మా ఆయన వస్తున్నందుకు ఒక కారణం....రెండు...."

"ఆఁరెండు" రెట్టించింది రోజీ.

"కలగా వస్తోందంటూ...."

"కలా? ఏ కలా?"

"అదే ఒక్కప్పుడు మనమంతా కలిసి చేసిన పాపం....అదే....అదే ప్రతి రోజు కలగా వస్తోందంట. అందుకే వెళుతున్నాని చెప్పాడు"

శ్యామ్ నుదుటన చెమటలు పట్టాయి.

రోజీ గుటకలుమింగింది.

"అన్ని సంవత్సరాల క్రితంది. అది కూడా ఇన్నాళ్ళకు వాడికి కలగా...."

"అదే నేనూ అన్నాను. వాడు చాలా భయపడ్డాడు"

"అదే నిజమయితే...వాడ్ని సైతాన్ ఏదన్నా కొరికి చంపిందా?

"సైతాన్ ఎందుకు కొరికి చంపుతుంది? అదే – అదే చంపి ఉండవచ్చుగా ప్రేతాత్మగా మారి"

శ్యామ్ టేబుల్ మీదున్న జగ్గుని విసురుగా తోశాడు.

"ఏవండి?" అంది కంగారుగా. "ఇంకా ఈ రోజుల్లో కూడా దెయ్యాలూ, భూతాలూ... బుల్‌షిట్...ఎవరో ఏదో చేస్తున్నారు"

"అంటే వాళ్ళ వాళ్ళెవరయినా పగసాధిస్తున్నారంటారా? వాళ్ళ తరుపురక్త సంబంధీకులూ, బంధువులూ, స్నేహితులూ చెప్పుకోదగ్గవాళ్ళు లేరే?"

"కావచ్చు, కాకపోవచ్చు, ఏది ఏమయినా మనమో నిర్ణయానికి రావటానికి తొందరపడవద్దు. ఇంకో విషయం- రాత్రిపూట జాగ్రత్త... బయటికి రావద్దు. రాజీవ్‌ని కూడా మాతోనే పడుకోబెట్టుకుంటున్నాం నేటి నుంచి. రాగిణి నువ్వు గదిలోంచి బయటికి రావద్దు....వెళ్ళు".

"నేనొక్కదాన్నా నాకు భయంగా ఉందిప్పుడు"

"ఇంకా ఎన్ని రోజులు? కేవలం రోజులేగా! మీ ఆయన వచ్చేస్తాడుగా అప్పుడు ఆలోచిద్దాం. అప్పుడు తేలుద్దాం సలీం మర్డర్ మిస్టరీ....మళ్ళీ చెబుతున్నాను జాగ్రత్త" చెప్పాడు శ్యామ్.

"నా సంగతి మీ తమ్ముడికి......"

"తెలీదు, చెప్పను కూడా. ఎందుకో తెలుసా? న్యాయం నీ పక్షాన ఉంది.

కొన్ని సందర్భాల్లో తప్పు చేసినా ఒప్పే అవుతుంది. వాడు నిన్ను పట్టించుకోకుండా డబ్బుమధంతో విచ్చలవిడిగా వ్యాపారం పేరుతో తిరుగుతున్నాడు.

నువ్వు మాత్రం ఎంత కాలం ఆగగలవ్! అర్థం చేసుకున్నాను. దాని గురించి మర్చిపోతున్నాం ఇద్దరం కూడా" భార్యని కూడా కలిపి చెప్పాడు.

రాగిణి లేచి తలూపింది వెళతానన్నట్టు.

"అదిసరే నీకేమన్నా కేక వినిపించిందా?" అడిగాడు రాగిణిని.

"లేదు, ఒక్క అరుపు వినిపిస్తే ఎందుకు లేవకుండా ఉంటాను? వినిపించలేదు".

"రోజీది కాదు, మొగగొంతు, బహుశ సలీందే ఆయుండాలి....రెండూ మూడు మధ్య".

"లేదే! సరిగ్గా ఆ సమయంలోనే నేను నా గదిలోకి వచ్చాను. వస్తూనే నిద్రపోయాను".

"అయితే అప్పుడే ఏదో జరిగి ఉండాలి. అయితే నేను విన్నది ఖచ్చితంగా సలీందే"

రాగిణి గుండెలమీద చెయ్యేసుకుని లేచింది.

"ఏమిటండి ఇది. నా మనసెందుకో కీడు శంకిస్తోంది" రాగిణి వెళ్ళగానే శ్యామ్ పక్కకొచ్చి అంది రోజీ.

"ఎటు తేల్చుకోలేకుండా ఉన్నాను –

ఆ రోజు పాపంలో భాగస్వామురాలైన ఆరుంధతికి తల పగిలింది. సలీం ఏకంగా చంపబడ్డాడు"

"అంటే మీ ఉద్దేశ్యం?"

"రాజీవ్‌మీద – నిజంగా రాగిణి చెప్పినట్టు రాజీవ్‌కి ఎవరన్నా పూని ఈ పనులు చేయించటం లేదు కదా!".

"ఛ......ఛ....వూరుకోండి....

నా బుజ్జి తండ్రి గురించి మరో మాట మాట్లాడితే సహించను. అయినా ఈ రోజుల్లో అలాంటివి నమ్మితే నవ్వుతారండి"

"నేనూ నమ్మను. కాని జరిగినవి చేస్తుంటే...." ఆగాడు భార్య ఎక్కడ విరుచుకు పడుతుందోనని.

''ఏం జరిగాయండి ఇప్పటి వరకూ....అరుంధతిని కొట్టడవేగా...వాడెందుకు అలా చేశాడో నేను చెప్పాను....రెండోది సలీందేగా....దానికి వాడికి ఏ సంబంధం....హాయిగా నిద్రపోతుంటే ....ఎవరో ఏదోచేస్తున్నారు. ముసుగులో – వాళ్ళని బయటికి లాగండి చేతనయితే....."

"అందుకేగా రాజీవ్‌ని కూడా మనతో పడుకోబెట్టుకుంటుంది"

"నువ్వు వాడ్ని చూసుకో...రాత్రిళ్ళు ఏ శబ్ధమయినా నేను స్వయముగా వెళతాను...చూద్దాం....."

"అయితే రాగిణిని కూడా ఈ రూమ్‌లోనే పడుకోమని చెప్పండి. పాపం చాలా భయపడుతోంది".

శ్యామ్‌కి భార్య చెప్పింది కూడా సబబే అన్పించింది. అలానే అని తలాడించాడు.

అయితే ఆ సమయంలో శ్యామ్,రోజీ ఇద్దరూ అరుంధతి సంగతి మర్చిపోయారు.

ఎక్కడో దూరంగా ఉన్న తమ్ముడిని కూడా....

కనీసం తెలియచేయాలని కూడా మర్చిపోయారు.

# 7

ఇంగ్లాండ్....

డబ్బుండి అనుభవించాలనుకునే వాళ్ళకి అమెరికాలోని లాస్ వేగాస్‌లా అక్కడ ఓ నగరముంది....ప్రపంచంలో అన్ని ప్రాంతాల మత్తు మందుల దగ్గర్నుంచి అన్ని వయసులు, అన్ని ప్రాంతాల ఆడపిల్లలు దొరికే చోటొకటుంది.

దానిపేరు .....ఎడెన్ బర్గ్.....

అక్కడ అది ఇది అనిలేదు. జూదం.....మత్తుమందులు....కావలసిన అమ్మాయిలు.

అక్కడ అన్ని వున్నా థామస్ వచ్చేది ఒకందుకు. ఎప్పుడు ఇంగ్లాండ్ వచ్చినా ఆ ప్రదేశానికి తప్పక వస్తాడు. అతనికి అక్కడ నచ్చే ఆట.

నీలి చిత్రపు ఆట. మిత్రుడు బర్గ్‌తో వచ్చాడు.

ప్రతి దేశంలోనూ అలాంటి క్యాసెట్స్ ఏదోరకంగా దొరుకుతాయి.

కాని అక్కడ ఓ ప్రత్యేకత ఉంది. రియల్ బ్లూఫిలిమ్.

థామస్ వచ్చినప్పుడల్లా ఆ ఆటకోసమే అంత దూరం వస్తాడు. తనివితీరా వూపిరి బిగపట్టి చూస్తాడు.

నరాలు తెగిపోయేదాక కూర్చుంటాడు. ఆపై తట్టుకోలేక లేచివస్తాడు.

ప్రస్తుతం ఇప్పుడు అదే స్థితిలో ఉన్నాడు. స్టేజిమీద విరవిహారము జరుగుతోంది.

వచ్చిన ప్రేక్షకులు ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

బాక్ గ్రౌండ్ మ్యూజిక్ తగ్గట్టుగా అనుగుణంగా వస్తోంది. చల్లటి ప్రదేశం పూర్తిగా వేడెక్కింది.

ప్రతివారి చేతులు సీట్లమీద ఉన్నాయి. బలంగా బిగిస్తున్నారు తట్టుకోలేక.

స్టేజి మీద ఆట తారాస్థాయికి వెళ్ళింది.

థామస్ భరించలేక లేచాడు.

అతనితోపాటు మిత్రుడు బర్గ్ కూడా–

విశాలమైన విక్టోరియా రోడ్‌లో బెంజికారు జారిపోతోంది.

థామస్ స్టీరింగ్ వెనుకున్న మినీ టివి ఆన్ చేశాడు.

ఏదోర్యాప్ మ్యూజిక్ వస్తోంది.

"ఫ్లయిట్ టైమింగ్స్ ఏ ఛానల్" అడిగాడు బర్గ్‌ని.

"ఏం వెళ్ళిపోతున్నావా? నిర్ణయంలో మార్పులేదా?"

"ఆహాఁ రేపో, ఎల్లుండో, నేను వస్తున్నాని ఇండియాకి లెటర్ కూడా వ్రాసాను. తప్పదు వెళ్ళాలి... ఉండిచెయ్యగలిగింది కూడా ఏమీ లేదు. ఉండి ఉన్నది పోగొట్టుకోవటమే – ఇహ ఈ వ్యాపారము నా వల్లకాదు"

"వెళ్ళి ఆ పల్లెటూరిలో ఉండగలవా?"

"నీకు తెలియని దేముంది. బిజినెస్ డల్‌గా ఉంది. ఇప్పటికే లాస్. ఇన్నేళ్ళు సంపాదించిందంతా నా సరదాలకే అయిపోయింది. మిగిలింది అసలు. మొన్న దెబ్బతో సగం అయిపోయింది. మిగిలిన ఆ కొద్ది మొత్తాన్ని వ్యాపారాన్ని డిస్పోజ్ చేసి, ఇక ఈ దేశాలు తిరిగే పనికి ఫుల్‌స్టాప్ పెట్టిహాయిగా విశ్రాంతి తీసుకుంటాను.

"అంటే ఇన్ని సంవత్సరాల వ్యాపారంలో ఏమీ మిగల్చలేదా? ఒక్క చిన్నదెబ్బకి వెనక్కి వెళుతున్నావ్"

థామస్ నవ్వాడు.

"డబ్బు గురించి కాదు. సరదాల కోసమే ఈ వ్యాపారంలో అడుగుపెట్టాను. చాలా వరకు అనుభవించాను. అన్నిటి మీద విరక్తి".

"పెళ్ళాం,బిడ్డలు గుర్తుకు వస్తున్నారా?"నవ్వాడు బర్గ్.

"రెండోది లేదు. మొదటిదే చాలా మంచిది". చెప్పాడు స్టేజి కోచ్ రోడ్డులోకి తిప్పుతూ....

"అయితే ఈ మిత్రుడిని వదిలి వెళ్ళడం తప్పదన్నమాట"

థామన్ నవ్వి – "ఇంతకీ ఏ ఛానలో చెప్పలేదు?" అన్నాడు.

"అరవై ఐదు"

థామస్ చక చకా ఛానల్స్ మార్చాడు.

స్క్రీన్ మీదున్న టైమింగ్స్ వంగిచూసి "ఎల్లుండికి ఒక టిక్కెట్ ప్రయత్నించగలవా?" చెప్పాడు.

"ష్యూర్...ఆ సంగతి వదిలేయ్.....మళ్ళీ మన కలయిక"

"ఇండియాలోనే...." నవ్వాడు థామస్.

"అయితే చివరిసారి సరదాగా, దగ్గరిలోనే గడుపుదామా?"

"నో, ఫ్లాట్‌లో నా కోసం ఎదురు చూస్తుంటుంది. ఇక్కడ, అక్కడ రెండు సార్లు నా వల్లకాదు.

"సారీ, నేను అడిగింది దాని గురించి కాదు. ఓడ్కా....రెండు సిప్‌లు...."

"దానికయితే ఆలస్యమెందుకు....." అని డాష్ బోర్డ్ తెరచి ఓడ్కా బాటిల్ బయటికి తీశాడు.

బర్గ్ అదే డాష్ బోర్డ్‌లోంచి రెండు గ్లాసులు తీసి వంపి ఒకటి థామస్‌కి ఇచ్చాడు.

బర్గ్ సిప్ చేసి "నాకు చాలా బాధగా ఉంది. నెలకోసారి రావటం, వ్యాపార డీలింగ్స్ పూర్తి చేసి సరదాగా గడపటం, ఒకరకంగా నాకలవాటయింది. ఓ నెలలో నువ్వు రాకపోతే ఒకరకమైన దిగులు...అలాంటిది మళ్ళీ రానంటున్నావ్!".

"ఒదిలేయ్– అక్కడి కెళ్ళిన తరువాత మూడ్ మారితే....వస్తానేమో"

"వచ్చినా, రాకపోయినా, గుర్తుపెట్టుకో"

"గుర్తు పెట్టుకోవటానికి ఈ మిత్రుడి కేదన్నా చెయ్యొచ్చుగా"

"నీకు బహుమతి ఇచ్చేంత పెద్దవాడిని కాదు. మళ్ళీ నువ్ ఇంగ్లాండ్ వస్తావో రావో – ఓ అద్భుతమయిన ప్లేస్ చూడాల్సిన ప్రదేశము. వెళదామ్ పద"

"ఇప్పుడా, ఎక్కడికి, ఏ ప్రదేశానికి....అయినా చెప్పెనుగా మిత్రమా ఫ్లాట్‌లో నా కోసం ఎదురుచూస్తుంటుందని"

"కౌంట్ డ్రాక్యుల దగ్గరికి....ప్లాట్‌లో పాప ఎక్కడికి పోదుగాని పోదాం పద".

థామస్ సీరియస్‌గా చూసాడు.

"అదే వద్దు....చూడాల్సిన ప్లేస్....

ఇంగ్లాండ్ వదిలి వెళితే చూడాలన్నా చూడలేవ్....నేను డ్రైవింగ్ చేస్తాను. కేవలం రెండుగంటలు. నీ ప్లాట్‌లో పాప ఎగిరిపోదులే....వచ్చేటప్పుడు మార్గ మధ్యలో 'స్నో పౌడర్' దొరుకుతుంది.

ఆ మాట వినగానే థామస్ నరాలు జివ్వున లాగాయి.

'స్నో పౌడర్' వాసన చూస్తేనే మత్తెక్కిపోతుంది. రెండు రోజుల పాటు ఆ ప్లేవర్ ఉంటుంది. సిటీలో దొరకనిది తన కోసం బర్గ్ తెచ్చిచ్చేది. ఇంగ్లాండ్‌లో

ఇపుడిపుడే పాపులర్ అవుతున్న మాదకద్రవ్యం....చాలా బావుటుంది. దానికోసమైనా వెళ్ళాలి. చివరిసారి గుండెల నిండాపీల్చాలి.

"మొత్తానికి నా వీక్‌నెస్ పట్టుకున్నావ్"

"ఛ.....ఛ మనిద్దరి మధ్యనున్నది స్నేహము. దానికి గుర్తుగానే ఆ రెండు గిఫ్ట్స్....మొత్తం ఖర్చంతా నాదే"

"ఒకే" అన్నాడు థామస్ ఓ పక్కగా కారాపి.

ఇద్దరూ దిగి ఒకరి ప్లేస్‌లోకి ఒకరు వచ్చారు.

బర్గ్ డ్రయివ్ చేస్తున్నాడు. థామస్, ప్లేమేకర్ సిగరెట్ తాగుతూ అద్దాల్లోంచి వెనక్కి వెళుతున్న రోడ్డుని చూస్తున్నాడు.

అరగంటలోనే స్నో పౌడర్ కార్నివాల్‌కి వాళ్ళిద్దరూ ఎక్కిన కారు చేరుకుంది.

అక్కడ చాలా కార్లు, లోపల జంటలూ ఉన్నాయి. ఏం చేసుకుంటున్నారో చెబుతున్నట్టు ఇన్ డైరెక్ట్‌గా కార్లు ఊగుతున్నాయి.

పౌడర్‌ని వాసన చూడటం మత్తుగా జంటలు కారులోకి పోవటం – అక్కడ కామన్ థామస్ ఉత్సాహంగా అరచేతిలో పౌడర్ పోసుకున్నాడు.

గుండెలనిండా పౌడర్‌ని పీల్చి....

"అబ్బా! అప్పుడే ఫుల్‌బాటిల్ కొట్టినట్లుంది. ముందు వెళదాం పద ప్లాట్ కెళ్ళిమత్తుగా పడుకుందాం"

"ఏది డ్రాక్యులాని చూడకుండానే...ఇంతదూరం వచ్చాం..... మళ్ళీ మొదటికొస్తావే...ఇక్కడ్నించి అయిదునిమిషాలు.. డ్రాక్యులా ఉన్న ప్లేస్"

"అంటే దెయ్యమేగా? బుల్‌షిట్! దేముడూ, దెయ్యం అంతా ట్రాష్"

"నువ్వు ఆ ప్లేస్ చూస్తే అలా ఆనవ్, ఇంతదూరం వచ్చావ్.. వద్దంటే నీ ఇష్టం...మళ్ళీ చూడాలన్నా చూడలేవ్"....

"అయితే పద! సరదాలో ఓ భాగం.నమ్మకం. ఉత్సాహం లేక పోయినా వస్తున్నాను నీ కోసం. విడిపోయే ముందు నీ ఆతిధ్యాన్ని కాదనలేక"...

బర్గ్ కారుని ముందుకు దూకించాడు.

మెయిన్‌రోడ్డు మీదనుంచి సన్నటి కాలిబాట గుర్తులున్న బాటలోకి కారు మలుపు తిరిగింది.

"ఇదేమిటిరా! ఇండియాని గుర్తుకు తెస్తున్నాయి రోడ్లు?"

"ఇది నిషిద్ధ ప్రదేశం. అందుకే రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయలేదు".

"అయితే తప్పకుండా చూడాల్సిందే"

''ఎందుకు? గవర్నమెంటు ఈ ప్రాంతాన్ని, ఆ ప్రదేశాన్ని నిషేధించినందుకా?"

"మరే...అప్పుడేగా సగం ఇంట్రెస్ట్ పెరిగేది"

"అదేమీకాదు. ఇప్పుడింకా చాలా తక్కువ. ఒకప్పుడయితే జనం విపరీతంగా వచ్చేవారట."

"ఎప్పుడు"?

"యాభై సంవత్సరాల క్రితం....ఇదే ఫేమస్ ప్లేస్"

మాటల్లోనే ఆ ప్రదేశం వచ్చింది.

థామస్ కారు దిగాడు.

చుట్టూ చెట్లు... నలువైపులా పిచ్చి మొక్కలు... దగ్గరలోనే జీర్ణవస్తమైన ఇల్లు.

"ఇదేరా డ్రాక్యులా స్థిరనివాసం. ఇప్పుడు కూడా అందులోనే ఉందని ఓ పుకారు"

"అయితే మనల్ని పీల్చి పిప్పి చేస్తుందేమో" నవ్వాడు థామస్

"అలా కాదులే....యాభై సంవత్సరాల క్రింతం, ఇంగ్లాండ్‌ని భయభ్రాంతి చేసిన డ్రాక్యులాని ఓ డాక్టర్ బంధించి బూడిద చేసి ఇక్కడే పాతిపెట్టాడు. అప్పట్నించి ఇక్కడికి ఎవరూ రారు. లోపలికి వెళ్ళారు. ఆ తరువాతే ప్రభుత్వం ఇక్కడికి రావటం నిషేధించింది"

"అయితే లోపలికెళదాం పద"

"అమ్మో వద్దు....."

"అయితే ఇక్కడే ఉండు నే వెళ్ళి వస్తాను" చెప్పి తూలుకుంటూ ఆ పాడుబడిన ఇంటి వైపు వెళ్ళాడు.

"థామస్ వద్దు...." అరిచాడు.

బర్గ్ వారిస్తూనే ఉన్నాడు.

థామస్ వినిపించుకోలేదు.

చక చకా వెళ్ళిపోయాడు. బర్గ్ చూస్తుండగానే ఆ పాడు బడిన కొంపలోకి వెళ్ళాడు.

లోపల కూడా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి ఉన్నాయి – విరిగిపోయిన దూలాలు....థామస్ దాటుకుంటూ ముందుకెళ్ళాడు.

ఎత్తయిన పీఠం....

ఆ పక్కనే శిలువ....విపరీతమయిన బూజు....పేరు తెలియని కీటకాలు విపరీతంగా అరవటం ప్రారంభించాయి....దానికి తోడు....క్రింద ఏవేవో ఎండిపోయిన ఆకుల రేకులు.

థామస్‌కు ముందుకు వెళ్ళాలనిపించలేదు...వెనక్కి వచ్చాడు.

బర్గ్ అతన్ని చూస్తూనే ముందుకెళ్ళి – తప్పు చేశావ్ లోపలికి వెళ్ళి అన్నాడు.

"అదేమీ లేదులే....నేను కూడా లోపలి దాకా వెళ్ళలేకపోయాను. ఎందుకో తెలీదు. భయమేసింది. వెనక్కి వచ్చాను"

"మంచి పని చేశావ్ పద" అన్నాడు కారు వేపు తిరిగి బర్గ్.

కారు మళ్ళీ మెయిన్‌రోడ్ ఎక్కేదాకా ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు.

ముందు థామసే అడిగాడు.

"నిజంగా డ్రాక్యులా ఉందంటావా?"

"యాభై సంవత్సరాల క్రితం ఆ ప్రశ్న అడిగితే సమాధానం ఆ డ్రాక్యులానే వచ్చి చెప్పేది"

"ఇప్పుడు రావటానికేమో"

"ఇప్పుడు లేదుగా. ఆ డాక్టర్ పూడ్చి పెట్టాడు. మళ్ళీ ఎవరయినా బయటికి లాగితేగాని రాదు".

"అసలది ఎలా బయట కొస్తుంది?"

"అది తెలిస్తే వెళ్ళి నేనే బయటకు తీసేవాడిని. మళ్ళీ ఇంగ్లాండ్‌ని ఓ వూపు వూపి చరిత్రలో నా పేరు నిలిచేలా చూసుకునేవాడ్ని.

"మరి మా దేశంలో దెయ్యాలూ, భూతాలున్నాయని అంటారు. ఇక్కడేమో డ్రాక్యులా, ఏది నిజం....."

"అన్ని నిజమే మీరు ఆ పేరుతో పిల్చుకుంటారు. మేం ఇక్కడ ఇలా పిల్చుకుంటాం"

"అంటే దేవుడొక్కడే అన్నట్టు దెయ్యాలు, అదే ప్రపంచానికంతటికి డ్రాక్యులా ఒకటే ఉంటుందా?"

"అదేమో నాకు తెలియదు గాని, ఒక్కటి మాత్రం తెలుసు. చనిపోయినవారి పగా, కోరికలూ తీరక ఆత్మగా తిరుగుతూ, డ్రాక్యులాని తిరిగి జన్మించటానికి ప్రయత్నిస్తాయని కొంతమంది చెబితే విన్నాను. అదే నిజమని నమ్ముతున్నాను".

"నాకయితే నమ్మకం లేదు"

"దేవుడ్ని నమ్ముతాను నేను. అందుకే నేనూ దీన్ని నమ్ముతాను".

బర్గ్ తన అభిప్రాయాన్ని చెప్పాడు.

"అదే నిజమయితే నేను చాలా అన్యాయం చేశాను. చాలా దారుణం చేశాను. మరి నేను చంపిన ఆ ఆత్మ కూడా డ్రాక్యులాని బ్రతికించటానికి ప్రయత్నిస్తున్నాయంటావా?"

"నువ్. అన్యాయం చేశావా?"

"ఆహాఁ...డబ్బుకోసం.... ఇప్పుడీ దేశం వరకూ నేను రాగలిగానంటే, అంత దారుణం చెయ్యబట్టే.... తద్వారా చాలా ఆస్తి వచ్చింది...."

"అంటే....

"పూర్తిగా వినాలని ఉందా?" అన్నాడు థామస్.

బర్గ్ ఉత్సాహంగా తలాడించాడు.

థామస్ చెప్పటం ప్రారంభించాడు.

బెంజికారు నల్లటి రోడ్డు మీద సరళంగా జారిపోతోంది.

కొద్దిసేపట్లో సిటీ లిమిట్స్ వస్తుందనగా మొత్తం చెప్పి బర్గ్ వేపు చూశాడు.

"ఎలా ఉంది." అడిగాడు.

బర్గ్ మాట్లాడలేదు.

మౌనంగా థామస్‌నే చూశాడు.

"నన్ను చూస్తే అసహ్యంగా ఉందా? తప్పదు. అది చెయ్యకపోతే ఇప్పుడున్న కోట్ల ఆస్తి దక్కేది కాదు... మొత్తం విన్నావుగా, ఇంత దారుణం చేసిన నన్ను ఆ ఆత్మ వదిలిపెడుతుందా! ఎన్నో సంవత్సరాలు గడిచిపో యాయ్....కాలగర్భంలో చేసిన పాపంకూడా ఇమిడిపోయింది...."

"ఒక్కోసారి కాలం తిరిగి రిపీట్ అవుతుంది 'బావగారూ!'

థామస్ ఉలిక్కిపడ్డాడు. బర్గ్‌వేపు చూశాడు.

"నన్ను బావగారు అంటున్నావా? అదీ ఆడగొంతుతో ఆటపట్టిస్తున్నావా?"

"ఆడగొంతుకాదు...మర్చిపోయ్యావా? సుజనా గొంతు...."నవ్వాడు బర్గ్.

థామస్‌కి నెత్తిన పిడుగులు పడ్డట్టు అన్పించింది.

బర్గ్ అలా అన్నందుకు కాదు.

సంవత్సరాల క్రితం సమాధి అయిన గొంతు. తనకి బాగా గుర్తు ఆ గొంతు.....ఆ గొంతు....సుజనాదే....

బర్గ్ సడన్ బ్రేక్‌తో కారు ఆపేశాడు.

థామస్ భయాశ్చర్యాలతో చూశాడు.

బర్గ్ నవ్వాడు.

నవ్వినప్పుడు పళ్ళు కన్పించాయి. ఆ చివరా ఈ చివరా రెండు కోరలు....తళుక్కున మెరిశాయి.

"ను.....ను....నువ్వు" థామస్ గొంతు తడబడింది.

"సుజనా! కౌంట్ డ్రాక్యులాని కాదు – ఇండియా దెయ్యాన్ని ఇండియన్ డ్రాక్యులాని....." నవ్వింది.

ఒక ప్రభంజనమయిన కెరటం పెటేలున తగిలినట్లు అనిపించింది.

"సు.......జ.......నా....."

"అవును, ఆ సుజనానే.... నా నోటిలో రెండు కోరలు చూశావా? బావున్నాయా? తెల్లగా ఉన్నాయి కదూ.....మెరుస్తున్నాయి కదూ.......వాటితో నీ రక్తం త్రాగనా.....? పదునుగానూ ఉన్నాయి. దిగేటప్పుడు తెలుస్తుంది నీకు... మెత్తగా... చాలా మెత్తగా... కమ్మగా...

"నన్ను......నన్ను వదిలేయ్" అన్నాడు కారు డోర్ తెరుస్తూ అది తెరుచుకోవటం లేదు.

బర్గ్ నవ్వాడు తెరలు తెరలుగా....

"పిచ్చివాడా – అది తెరుచుకోదు. ఇప్పుడు ఈ చుట్టూ ఉన్న ప్రకృతి నా ఆధీనం."

థామస్ వెనక్కి జరిగాడు.

బర్గ్ ముందుకు వస్తున్నాడు స్టీరింగ్‌ని వదిలి నోటిలోని కోరలు మరింతగా పొడుచుకు వచ్చాయి.

"వద్దు....వద్దు.....నన్నేం చెయ్యద్దు"

“ఆ రోజు నేనూ ఇలానే అడిగాను.....కాని మీరు చలించలేదు. జాలి చూపలేదు”

థామస్ బిగ్గరగా అరిచాడు. “హెల్ప్.....హెల్ప్.......” అని

“మూర్ఖుడా – నీ గొంతు పెగులుతుందిగాని – మాట వినపడదు” అంటూనే మీదకి వంగాడు.

థామస్ విలవిలాడిపోయాడు. కాళ్ళు టప టపా కొట్టుకుంటున్నాయి.

స్.....స్......స్.....

శరీరంలోని రక్తంతోడుతున్న భావన. క్షణాల్లోనే అది భావనకాదని అర్థమయింది. రెండే నిమిషాలు... ఆ తరువాత...

థామస్ మీదకి వంగిన బర్గ్ లేచాడు. అతను వంగిన ప్రదేశంలో రెండు గాట్లు....థామస్ కళ్ళు తెరుచుకుని డోర్‌కి అనుకుని పడి ఉన్నాడు. ప్రాణం ఎప్పుడో పోయింది.

శరీరంలోని రక్తం పీల్చడం ద్వారా.....

బర్గ్ నోరు తుడుచుకుని తూలాడు. కళ్ళు తిరుగుతున్నట్లనిపించి స్టీరింగు పట్టుకున్నాడు.

అప్పుడే తెల్లగా, అతని శరీరంలోంచి బయటికెళ్ళిపోయింది మరుక్షణం బర్గ్‌కి స్పృహ తప్పింది.

## 8

“రాగిణి, రాజీవ్, రోజీ....మీ ముగ్గురూ అక్కడ, నేను ఇక్కడ” చెప్పాడు శ్యామ్.

“ఎందుకు డాడీ ఇలా, నా గదిలో నేను పడుకుంటాను”.

“నో, బుద్ధిగా పడుకోవాలి. ఇక్కడే....”

“హోం వర్క్ చేసుకోవాలి డాడీ”

“ఇక్కడే చేసుకో, వద్దన్నది ఎవరు? పిల్లలు చదువుకుంటానంటే ఏ పెద్దలూ అడ్డు చెప్పరు”.

“అయితే, నా రూమ్‌కెళ్ళి బుక్స్ తెచ్చుకుంటాను”.

శ్యామ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం ఆలస్యం. తుర్రున పొయ్యాడు. చక చకా మెట్లుదిగి తన రూమ్‌లోకి వెళ్ళాడు. డ్రస్సింగ్ టేబుల్ పక్కనే టేబుల్.

దానిమీదున్నాయి అందంగా పేర్చిన క్లాస్ బుక్స్...... రాజీవ్ తనకి కావలసిన బుక్స్ తీసుకుని వెనుతిరుగుతూ ఓ టెక్ట్సబుక్ పేజీ తిప్పాడు.

నల్లటి ప్రింట్ అయిన అక్షరాలు కనపడలేదు. ఏదో కాదు...ఏదో కారు....రాజీవ్‌కి కళ్ళు దిమ్మనిపించింది.

ఇప్పుడు కారులో ఉన్న వ్యక్తులు కనపడుతున్నారు ఇద్దరు. ఒకరే తెలుసు రాజీవ్‌కి. మరొకరు ఎవరో....తెలిసిన ఒక్కరూ....

'బాబాయ్...థామస్ బాబాయ్!'

బాబాయ్ ఏదో చెబుతున్నాడు. పక్కనున్న వ్యక్తి కళ్ళు పత్తికాయలని చేసి వింటున్నాడు. రాజీవ్‌కి బుక్‌లో కనపడటంతోపాటు వినబడుతోంది కూడా. థామస్ చెబుతున్నదంతా విన్నాడు.

అలా.....అలా ...సుజనాని చంపేశాం చాలా దారుణంగా, చెప్పానుగా ఎలా చంపానో......

రాజీవ్ కళ్ళు తీక్షణంగా చూసాయి...పెదాలు ఆదురుతున్నాయి. పళ్ళు బిగించాడు.

పట పట కొరికాడు.. 'ఎక్కడ....ఎక్కడున్నావ్" అరిచాడు.

పేజీమీద దృశ్యం మారిపోయింది. ఇంగ్లాండ్....సిటీ లిమిట్స్....అన్న అక్షరాలు పడ్డాయి.

గదిలో కిటికీ రెక్కలుకూడా వూగటం ప్రారంభించాయి. కిటికీ లోంచి కనపడుతున్న చెట్టు కొమ్మలు జడల దెయ్యాల్లా వూగుతున్నాయి.

అప్పుడు బయలుదేరింది రాజీవ్ శరీరంలోంచి తెల్లగా ఏదో ఆకారం, రాజీవ్ డబ్బున పడిపోయాడు. ఆ ఆకారం రాజీవ్‌ని పట్టించుకోకుండా కిటికీలోంచి వెళ్ళి గాలిలో మాయమైంది......

☟ ☟ ☟ ☟ ☟

"ఏడివీడు? బుక్స్ తెచ్చుకుంటానని వెళ్ళినవాడు యింతసేపా?"

"వెళ్ళి చూసిరండి"

శ్యామ్ చదువుతున్న పుస్తకం పక్కన పడేసి లేచాడు. కారిడార్ అంతా నిశ్శబ్ధంగా ఉంది. శ్యామ్ నేరుగా రాజీవ్ గదిలోకి వెళ్ళి తెరిచిన తలుపులని పూర్తిగా వెనక్కి తోసాడు.

రాజీవ్ క్రింద....క్రింద పడి ఉన్నాడు. పుస్తకాలు చిందర వందరగా పడి ఉన్నాయి.

తండ్రి మనస్సు ఆందోళన చెందింది. ఒక్క ఉదుటన రాజీవ్ దగ్గరికి వెళ్ళాడు. చప్పున ఎత్తుకున్నాడు....నాడి చూశాడు.

టక్ ......టక్.....టక్......బలహీనంగా కొట్టుకుంటోంది.

తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు.

"రాజీవ్....రాజీవ్..."పిల్చాడు రాజీవ్‌లో ఉలుకూ పలుకూలేదు. ప్లాస్టిక్ జగ్గులోంచినీళ్ళు తీసుకుని మొహం మీద చల్లాడు.

కదలిక లేదు. ఇక లాభం లేదనిపించి కొడుకుని భుజాన ఎత్తుకుని పైకి తీసుకెళ్ళాడు.

శ్యామ్‌ని చూస్తేనే ఇద్దరాడవాళ్ళు కంగారుగా లేచారు. రోజీకైతే ఏడుపు ఒకటే తక్కువ.

అడిగితే ఏం వినవలసి వస్తుందోనని....భర్తవంక.....భుజంమీద కొడుకు వంకా చూస్తుండిపోయింది.

శ్యామ్ కొడుకుని పరుపుమీద పడుకోబెట్టాడు. సరిగ్గా అప్పుడే కిటికీరెక్కలు టపటప కొట్టుకున్నాయి. ప్రకృతి కూడా మారిపోయింది. చల్లనిగాలి, జివ్వున వీస్తున్న గాలి......

ఓ తెల్లటి ఆకారం....పదినిమిషాల క్రితం రాజీవ్ శరీరంలో నుంచి వెళ్ళిన ఆ తెల్లని ఆత్మ.....పై నుంచి అలా.....అలా......అలా....తేలివచ్చి ముగ్గురి మధ్యలో కళ్ళు మూసుకుని పడున్న రాజీవ్ శరీరంలోకి తిరిగి వచ్చేసింది.

ఆత్మ శరీరం లోనికి వెళ్ళటం ఆలస్యం. రాజీవ్ ఠక్కున కళ్ళు తెరిచాడు. అందరిలోనూ రిలీఫ్......

"ఏమైంది నాన్న...." అడిగింది ఆత్రుతగా రోజీ?

"ఎందుకలా పడిపోయావ్ రాజీ" రాగిణి గారంగా అడిగింది.

శ్యామ్ విసుగ్గా.....

"ఎందుకలా వాడిని ప్రశ్నలతో చంపుతారు. ముందు విశ్రాంతి తీసుకోనీయండి. కొద్దిసేపు పలకరించకండి" చెప్పాడు.

"మమ్మీ" అంటూ ఏడుపుగొంతుతో చేతులు చాపాడు.

తల్లి హృదయం ద్రవించింది. కళ్ళల్లో తిరిగిన నీళ్ళని తుడుచుకోకుండానే కొడుకుని హృదయానికి హత్తుకుంది.

"ఏమైందినాన్న.....గదిలో పడిపోయి ఉన్నావట....కళ్ళు తిరిగాయా.....?"

"కాదు మమ్మీ, వస్తుంటే కాలు జారింది. ధడేల్‌మని పడ్డాను"

"చిన్నగా రావాలమ్మా...రాత్రిపూట అలా పరిగెట్టకూడదు....భూదేవి నిద్రపోతుంటుంది. పాపం ఆమెకి నిద్రాభంగం అవదూ?"

రాజీవ్ కొత్త విషయం తెలుసుకున్నట్టు తలాడించి.....

"అయితే ఇక రాత్రిపూట గెంతను"

రోజీ నుదుటన ముద్దు పెట్టుకుని, "హోం వర్క్ రేపు చేసుకోవచ్చు. మా మధ్యలో పడుకుందువుగానిరా" అని తీసుకెళ్ళింది.

అటుప్రక్క రాగిణి....ఇటు ప్రక్క రోజీ....మధ్యలో రాజీవ్....ఆ ముగ్గురికి దూరంగా శ్యామ్, పరుపుమీద ఒక్కడే......

"ఎందుకుమమ్మీ, మనిద్దరం ఇలా ఒకే గదిలో పడుకున్నాం"

"ఖర్మ నాయనా, ఖర్మ....."

"ఖర్మంటే చేసుకుంటే వచ్చేదాగా మమ్మీ....మనం చేసిన పనులకు వచ్చే ప్రతిఫలమే కదా మమ్మీ ఖర్మంటే...."

"రాజీవ్, నోరుమూసుకు పడుకో"

"అబ్బ, ఊరుకోండి, నా బిడ్డ కర్మసిద్ధాంతాన్ని ఎంత బాగా చెబుతున్నాడో" విసుక్కుంది రోజీ

రాజీవ్ తల్లివైపు తిరిగి–

"నాకు చెప్పనేలేదు మమ్మీ...మనందరం ఇలా ఒకే గదిలో ఎందుకు పడుకున్నామో"

"అదేరా, కర్మని చెప్పిందిగా" రాగిణి బుగ్గగిల్లి అంది.

"చూడు మమ్మీ నా బుగ్గ ఎలా గిల్లిందో"

రోజీ నవ్వి "ఇంకెన్ని రోజులు. బుగ్గలు గిల్లటమేకాదు, కొరికే వాడు కూడా వస్తున్నాడు, బాబాయికి చెప్పి తన్నిద్దాం" అంది.

రాగిణి ముసి ముసిగా నవ్వింది.

"బాబాయ్ వస్తున్నాడా మమ్మీ"

"ఆ త్వరలోనే అలా అని లెటరు కూడా వచ్చిందిగా"

"రాదు మమ్మీ"

రోజీ కాక్షణంలో కోపం వచ్చేసింది. రాజీవ్ చెంపకేసి కొట్టింది.

"అలా అనొచ్చా....చెంపలేసుకో"

రాజీవ్ చెంప సవరించుకున్నాడు

రాగిణి రాజీవ్‌ని ఎత్తుకుని తనమీద కూర్చోబెట్టుకుని "ఏదో అన్నాడే అనుకో అంతలా కొట్టాలా" అంది.

"ఇదే అలవాటు అవుతుంది. పెద్దా,చిన్నాలేదూ....'రాదుమమ్మీ' అంటావే నువ్వేమన్నా బాబాయ్‌కి బొడ్డుకోసి పేరు పెట్టావురా వెధవా?"

"సారీ.మమ్మీ....

బాబాయ్ రారు మమ్మీ"

రోజీ లేచి కూర్చుంది. రాగిణి నోరుతెరచి చూసింది.

"ఎందుకురాడు...వస్తాడు...ఇక పడుకో...ఉదయాన్నే స్కూల్ కెళ్ళాలి" చెప్పాడు శ్యామ్.

రాజీవ్ అటుకేసి తిరిగాడు.

"బాబాయి రారు డాడీ....మనమే ఆయనకోసం వెళ్ళాలి"

శ్యామ్ అయోమయంగా చూసాడు భార్యవైపు. అప్పటికే ఆమె కూడా అదే స్థితిలో ఉంది.

రాజీవ్,రాగిణి పొత్తికడుపుమీద నుంచి లేచాడు. అరిందలా నడుంమీద చెయ్యి పెట్టుకుని "ఖచ్చితంగా రారు, మనమే ఆయనకోసం వెళ్ళాలి" చెప్పాడు తిరిగి.

ముగ్గురూ తదేకంగా చూస్తున్నారు. రాజీవ్ మాటలేకాదు– అతని ప్రవర్తన నడిచే విధానం, చెప్పే పద్ధతి....వాటిల్లో కసి.....ద్వేషం....పగా....

మాట్లాడేటప్పుడు బుగ్గలు అదురుతున్నాయి. కళ్ళు నిప్పుల్లా ఉన్నాయి... అది తమ భ్రమా, వాస్తవమా తెలుసుకుందామని పరీక్షగా చూడాలనుకునేంతలో మామూలుగా కనబడతాడు, అమాయకంగా అడుగుతుంటాడు.

"రాక ఎక్కడికి పోతాడు... నీకేమన్నా ఫోన్ చేసాడా, అంత కరెక్టుగా రాదు అంటున్నావు"

"చెయ్యలేదు డాడీ తెలుసు, థామస్ బాబాయి లేదు, రాడు.....ఎందుకంటే మరణించాడు కాబట్టి" తాపీగా చెప్పాడు.

"ఫాదర్" పిల్చాడు శ్యామ్ చిన్నగా.

పూర్తిగా విని కళ్ళు మూసుకున్న ఫాదర్ శ్యామ్ పిలుపుతో కళ్లు తెరిచాడు.

"రాజీవ్ ప్రవర్తనలో ఎప్పట్నించి ఈ మార్పు"

"ఈ మధ్య నుంచే ఫాదర్....పుట్టినరోజు దగ్గర్నించి....ఆ రోజు అరుంధతిని కొట్టడం దగ్నర్నించి".

"అంటే ఖచ్చితంగా చెప్పగలవా? ఇలా మాట్లాడ్డం... ఇత్యాది విషయాలు"

"నేను కాసేపు వాడితో ఉండేవాడినే, రోజీనే చెప్పాలి"

"చెప్పమ్మా, ఏదీ దాయవద్దు"

రోజీ కళ్ళు తుడుచుకుంది.

"పుట్టినరోజు నుంచి ఫాదర్...పిచ్చిపిచ్చిగా మాట్లాడతాడు....చావుల గురించే అదీనూ"

"అదిసరే...మామూలప్పుడు ప్రవర్తన"

"బాగానే ఉంటుంది.....కాని"

"ఆఁచెప్పమ్మా ఆ కానీ ఏంటో"

"పుట్టిన రోజు తరువాతనుకుంటా.... ఓ రోజు ఉదయం స్కూలు కెళుతుంటే..... పాలుతాగమని చెప్పాను. ఆ రోజు ససేమిరా వద్దన్నాడు. నాకు అయిష్టమన్నాడు. నేను కోప్పడితే...అసలు గ్లాసులో పాలు ఉండాలిగా నేను తాగాలంటే అన్నాడు అశ్చర్యం....గ్లాస్‌లో పాలు లేవు"

"ఆ విషయం శ్యామ్‌కి చెప్పలేదా?"

"లేదు ఫాదర్, ఒక రకంగా నాకు అనుమానమే. పాలు తెచ్చానో లేదోనని, ఒక్కోసారి నాకూ మైండ్ మైండ్‌లో ఉండదు! ఉదయంపూట ఇంటిపని హడావిడిలో ఓ గ్లాస్ తీసుకురాబోయి మరో గ్లాస్ తెచ్చి ఉంటాననని సరిపెట్టుకున్నాను"

"థామస్ మరణించాడని రాజీవ్ చెప్పి ఎంతసేపయి ఉంటుంది"

"వాడు అలా అనటం ఆలస్యం మేం వెంటనే మీ దగ్గరికి పరుగెత్తుకొచ్చాం.

రాత్రి అనికూడా ఆలోచించకుండా...మిమ్మల్ని లేపామంటే ఆలోచించండి. మేమెంత ఆవేదనకి గురి అవుతున్నామో"

"అలా అనుకోవద్దు, ఈ తలుపులు ఎపుడూ తెరుచుకుని స్వాగతం పలుకుతూ ఉంటాయి".

"ఫాదర్, కొన్నాళ్ళు రాజీవ్‌ని మీ వద్దే ఈ చర్చిలోనే ఉంచితే ఏదన్నా మార్పు ఉంటుందేమో"

"దానికంటే ముందు థామస్‌కి ఫోన్ చేయండి"

"అంటే రాజీవ్ మాటలని సీరియస్‌గా"

"అవును శ్యామ్, తేలిగ్గా తీసి పడెయ్యద్దు..... యింత చిన్న లేత వయస్సులో మిమ్మల్ని, నన్ను అంతలా కదిలించేలా మాట్లాడుతున్నాడంటే తేలిగ్గా తీసి పారెయ్యకూడదు".

"అదే మంచిది బావగారు – ముందు వారికి ఫోన్ చేద్దాం" రాగిణి గాభరాగా అంది.

"ఛ.....ఛ....ఊరుకోమ్మా! ఎవరన్నా వింటే నవ్వుతారు...వాడు, ఆనడం,,,గాభరాపడడం"

"అలాంటప్పుడు ఇంతరాత్రి మరెందుకు ఇక్కడిదాకా తెచ్చినట్టు. ఫాదర్‌ని కలవటం ఎందుకు? ఏదో ఉందనేగా, నాకూ ఆవేదనగా ఉంది బావగారూ. నా ఆదుర్దాని అర్థం చేసుకోండి, ముందు మా వారికిఫోన్ చేద్దాం"

ఫాదర్ పదమన్నట్టు తలాడించాడు. అందరూ తిరిగి బంగ్లాకి వచ్చారు.

"నెంబర్ చెప్పమ్మా"

రాజీవ్ కలగ చేసుకొని టకటక చెప్పాడు 2281612. శ్యామ్‌కి కూడా నెంబర్ గుర్తుఉండదు. ఫోన్ బుక్‌లో చూడాల్సిందే అలాంటిది రాజీవ్... టక్కున.. మరోసారి కొడుకు చెప్పిన నెంబర్ మననం చేసుకున్నాడు ఉహు... ఆ నెంబర్ కాదు... ఇంతలో రోజీ కొడుకుని కసిరింది.

"నువ్వు నోర్మయ్ నిన్నెవరు అడిగారు" ఉరిమాడు కొడుకుని.

"చూడు మమ్మీ." అన్నాడు బుంగమూతి పెట్టుకుని తండ్రి మీద ఫిర్యాదు చేస్తూ –

"అదీ వరస ఫాదర్. మాట్లాడితే భయప్రకంపనాలు పుట్టించేలా

మాట్లాడతాడు. లేదా రెండేళ్ళ పిల్లాడిలా ఏడ్పు లంకించుకొని గారంపోతూ రోజీ కుచ్చిళ్ళలోకి పోతాడు."

ఫాదర్ చిరునవ్వు నవ్వి "కోడ్ చెప్పండి" అన్నారు.

"లేదు ఫాదర్ రాజీవ్ చెప్పిన నెంబర్ రాంగ్ - 22 81 126" చెప్పి కోడ్ కోసం డైరీ తీసి చూసాడు.

ఫాదర్ ముందు కోడ్ కొట్టి ఆ తరువాత శ్యామ్ చెప్పిన నంబర్ డయిల్ చేశాడు. టిక్ టిక్ వేవ్స్ పోతున్న శబ్ధం....ఫాదర్ రిసీవర్ మరింత గట్టిగా పట్టుకున్నారు.

టిక్.....టిక్.....టిక్......ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్

"రింగ్ అవుతోందా ఫాదర్" అడిగింది రాగిణి

ఫాదర్ తల వూపారు.

నిమిషం....

రెండు నిమిషాలు భారంగా గడిచాయి....అంతా ఉత్కంఠతగా చూస్తున్నారు.

ఫాదర్ అందరివంకా చూసి తియ్యటం లేదన్నట్టు చెప్పాడు.

"ఫ్లాట్‌లో వాడు తప్ప మరెవరూ ఉండరు. ఇంకా వచ్చి ఉండడు"

ఇంతలో ఫాదర్ హలో అన్నాడు.

"థామస్ కావాలి....ఇండియా నుంచి" ఇంగ్లీషులో అడిగారు.

అవతల ఏం మాట్లాడారో గాని ఫాదర్ మొహం చిన్నబోయింది.

ఆయన మధ్యలో పెన్ అన్నట్టు చేత్తో చూపించారు. శ్యామ్ అందించిన పెన్నుతో నెంబరు వేసుకుని రిసీవర్ పెట్టేశాడు.

అందరూ ఫాదర్ వంక చూశారు.

"ఈ నెంబర్‌లో ఉన్నారంటా ?" అడిగింది రాగిణి. శ్యామ్ దగ్గర పెన్ను తీసుకుని వేసిన నెంబర్‌ని చూపిస్తూ.

"ఫాదర్" అరిచింది రోజీ.

"ష్.....ఎందుకలా అరుస్తావ్" విసుక్కున్నాడు శ్యామ్.

"చూడండి ఆ నెంబర్ క్షణం క్రితం రాజీవ్ చెప్పిన నెంబర్ మీరు రాసిన నెంబరు ఒక్కటే".

అంతా ఆ నెంబర్‌కేసి చూశారు. నిజమే రాజీవ్ చెప్పిన నెంబరే ఇంగ్లాండ్‌లో థామస్ ఫ్లాట్‌కి ఫోన్ చేస్తే ఏ నెంబర్‌లో ఉన్నాడో చెప్పిన నెంబర్ ఒక్కటే –

"నేను చెబితే విన్నారా? అనవసరంగా ఫోన్ కాల్ వేస్టు.... ఈ నెంబర్‌లోనే బాబాయ్ ఉంది"

"అది ఇందాకే ఏడ్వచ్చుగా....చెయ్యండి ఫాదర్".

"బాబాయ్ ఫోన్ చేశారా? మేం లేనప్పుడు" అడిగింది రోజీ.

రాజీవ్ లేదన్నట్టు తల ఊపాడు.

"అయితే ఈ నెంబర్ నీకెవరు చెప్పారు మాకూ తెలీదే"

"అదే సస్పెన్స్" నవ్వాడు రాజీవ్.

రోజీ ముద్దుగా మురిపంగా నిమిరింది.

తల్లికొడుకులని తినేసేలా చూసి "చెయ్యండి ఫాదర్....." అన్నాడు శ్యామ్.

"చెయ్యటానికేం లేదు.... ఇంగ్లాండ్ ఫ్లయిట్ ఎప్పుడుందో కనుక్కో రాజీవ్‌ని నేను ఉంచుకుంటాను. మీ ముగ్గురూ ఇంగ్లాండ్ వెళ్ళండి"

"ఏమంటున్నారు ఫాదర్"

"నేను అనటం కాదు అవతల థామస్ ఫ్లాట్ నుంచి మాట్లాడింది. ఇంగ్లాండ్ సిటీపోలీస్".

"పోలీసా?"

"థామస్ ఫ్లాట్‌లోనా?"

"చెప్పండి ఫాదర్....వాడే కేసులోనయినా ఇరుక్కోలేదు కదా! ఇంతకి వాడిప్పుడు ఎక్కడున్నాడు?"

రాజీవ్ చెప్పేడు కదమ్మా.... '2281612' అని ఆ నెంబర్ టెలిఫోన్ గల భవనంలో భద్రంగా ఉంచబడ్డాడు"

"వుం.....వుం....వుంచబడ్డారా?"

"నా నోటితో చెప్పాలని ఆ ప్రభువు నిర్దేశించినప్పుడు తప్పుతుందా! థామస్ హత్యచెయ్యబడ్డాడు. బర్గ్ అనే మిత్రుడే దీనికి పాల్పడ్డాడట! ప్రస్తుతం అతన్ని అరెస్టుకూడా చేశారట. బాడి. పోస్టుమార్టమ్‌లో ఉంది. శవాన్ని పోస్టుమార్టమ్ చేసే భవనం స్టివెన్ రోడ్‌లో ఉంది. దాని నెంబరే నేను రాసిన

నంబర్... రాజీవ్ చెప్పిన నంబర్ 2281612....ఆ నెంబర్ ఇంగ్లాండ్ విక్టోరియా హాస్పటల్‌ది".

అందరూ అ ప్రయత్నంగా రాజీవ్ వంక తిరిగారు. అతను చిద్విలాసంగా కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

గౌతమబుద్ధిడిలా నిమ్మలంగా చూస్తున్నాడు. జీసస్‌లా....సౌమ్యం, సరళంగా చూస్తున్నాడు.

అంత చిన్న మొహంలో అన్ని భావాలు....అసలు వాడు - మనిషేనా?

## 7

"డాక్టర్....డాక్టర్" బిగ్గరగా విన్పించాయి అరుపులు.

కొంపలు మునిగిపోతున్నట్టు, తలుపు బాదుతున్నది ఎవరా అని అరుంధతి బద్ధకాన్ని వదిలించుకుని లేచింది.

అప్పుడే ఆమె భోజనం ముగించుకుని భుక్తాయాసంతో శరీరాన్ని పడకమీదకు చేర్చింది.

అలా ఆమె వొత్తిగిలిందో లేదో కాలింగ్‌బెల్ అనే వస్తువు ప్రపంచంలో ఒకటుందని తెలియనట్టు తలుపులు బాదుతున్నారు.

ఆ సమయంలో తలుపు శబ్దమయినా, కాలింగ్‌బెల్ మ్రోగినా ఒకందుకే డాక్టర్ కోసం...డాక్టర్ అవసరం తప్పనిసరయిన వాళ్ళే ఆ రెండూ చేస్తారు.

అరుంధతి తన భారీకాయాన్ని ఈడ్చుకుంటూ కీహోల్‌నుంచి చూసి తలుపు తీసింది.

ఆమె తియ్యటం ఆలస్యం దబ్బున రెండు కాళ్ళమీద పడ్డాడు రామయ్య.

రామయ్య పక్కనున్న పల్లెటూరిలో ఆ ఊరి ప్రెసిడెంట్ దగ్గర పెద్దపాలేరు.

ఆ గ్రామం ఎంతో దూరం ఉండదు. అడ్డదారిన వెళితే మూడు మైళ్ళు. మెయిన్ రోడ్డుమీద వెళితే ఐదుమైళ్ళు.

ఆ గ్రామజనాభా కేవలం రెండు వేలు.

ఏ చిన్న అవసరమొచ్చినా యిక్కడకు పరిగెత్తుకురావాల్సిందే.

"లే.....లే.....రామయ్య....ఏమిటిది పెద్దవాడివి....నా కాళ్ళమీద పడకూడదు".

నా కంటే నువ్వే పెద్దదానివని వాదించే మూడ్‌లో లేడు. లేచి రెండు చేతులు వినయంగా కట్టుకుని "అమ్మా! మీరే రక్షించాలి...నా భార్య కడుపులో బిడ్డ అడ్డం తిరగటంతో ఆమె మెలికలు తిరిగిపోతోంది. దానిబాధ చూడలేకున్నాను" చెప్పాడు.

"ఇప్పుడా...." అంది.

"మీరు రాకపోతే దాని ప్రాణం పుటుక్కుమంటుందమ్మా.....ఒకటి కాదు రెండు పాణాలు మీ చేతుల్లో ఉన్నాయి.

"ఎలా రామయ్యా.....రాత్రి సమయం.....సమయానికి బండికట్టే వీరిగాడు కూడా లేడు....దగ్గిరా దాపా...."

"అడ్డదోవన వెళదామమ్మా....అరగంటలో వెళ్ళిపోతాం"

"అడ్డదోవనా....ఈ చీకటిలోనా?"

"నే ఉన్నాను కదమ్మా.....అరచేతిలో పెట్టుకుని తీసుకెళతాను భయంలేదు"

"నీ బొంద.....నాకు భయమా ? అది కాదు...."

"మీరేమీ ఆలోచించకండమ్మా.....మొన్ననే ప్రెసిడెంటుగారు గింజలు కొలిశారు. సగం ఇస్తాను. ఆ రెండు జీవాలని రక్షించండి"

"సరే...బయటుండు...లాంతరూ, మెడికల్ కిట్ తీసుకుని వస్తాను" చెప్పింది.

రామయ్య ఆదుర్దాగా చేతులు నలుపుకుంటూ బయటే నిల్చున్నాడు.

ఆరుంధతి డ్రస్ మార్చుకుని, లాంతరు కిట్‌తో వచ్చింది. ఆమె చేతుల్లోని రెంటిని వినయంగా అందుకుని నడిచాడు.

"అమ్మా అడ్డదోవన వెళదామమ్మా....తొందరగావెళ్ళిపోతాం"

అరుంధతి అభ్యంతరం లేదన్నట్టు తలాడించింది.

ఊరి పొలిమేరలు దాటగానే మామిడితోపు వస్తుంది. అక్కడ్నించి ముళ్ళకంపలు దాటుకుంటూ ముష్యులు మాత్రమే నడవగలిగే దారిలో వెళితే ఎర్రపాలెం వచ్చేస్తుంది.

ఊరి పొలిమేరల్లోనే ఉంది చర్చి....దాన్ని దాటుకుంటూ వెళుతుండగా విన్పించింది.

"నమస్తే ఆంటీ" అని.

అరుంధతి ఆ పిల్పు వినిపించిన వైపుచూసింది.

రాజీవ్ చర్చిగేటు దగ్గర నిలబడి ఉన్నాడు.

"ఏం రాజీవ్ ఇక్కడున్నావ్. అదీ ఈ సమయంలో".

"మమ్మీ, డాడీ ఇంగ్లాండ్ వెళ్ళారు."

"ఇంగ్లాండ్ దేనికి....? మీ బాబాయిని దగ్గరుండి తీసుకురావడానికా?"

"ఏమో తెలీదు ఇంతకీ మీరెక్కడికి"

"ఎర్రపాలెంకి...రామయ్య భార్య నొప్పులు పడుతుంటేనూ"

"ఇంతరాత్రా, మళ్ళీ మీరు క్షేమంగా రాగలరనే వెళుతున్నారా?"

"రాజీవ్" కోపంగా అంది అరుంధతి.

"లేకపోతే ఏంటి ఆంటీ, ఇంత రాత్రి అడ్డదోవన వెళ్ళి....మళ్ళీ తిరిగి రాగలరనే అనుకుంటున్నారా?"

అరుంధతి అతి ప్రయత్నం మీద కోపం ఆపుకుని–

"చిన్నవాడివి, దానికితగ్గట్టు మాట్లాడు...మొన్న నీ పుట్టిన రోజునాడు చూడక కొట్టావని అనుకుంటున్నాను. నీ మాటల ధోరణి చూస్తే కావాలనే కొట్టినట్టుంది...మీడాడీ రానీయ్ చెబుతాను"

"డాడీ, వచ్చినా చెప్పటానికి నువు ఉండాలిగా"

"ఉండక పోతానా.... చస్తానా"

"ఎర్రపాలెం వెళుతున్నారని చెప్పారుగా అందుకన్నాను".

రామయ్య ఇక లాభం లేదనుకుని, మధ్యలో కలుగచేసుకుని...

"అమ్మా అవతల నా భార్య" అన్నాడు.

"వీడు చూడు రామయ్య, నిన్నటి దాకా బాగానే ఉన్నాడు, ఈ మధ్యనే పుట్టింది మాయరోగం.....చిన్నా పెద్దా లేకుండా పోతోంది....."

"బాబు ఇంటికెళ్ళు ఇంత రాత్రి తిరుగుడేంటి?"

"నేను ఉండాల్సినచోటే ఉన్నాను రామయ్య...ఆమె వెళ్ళకూడని ప్లేసులోకి వెళుతోంది".

"నోర్మూయ్" అన్నది అరుంధతి కాదు, ఫాదర్.....

ఆయన్ని చూస్తూనే "నమస్తే ఫాదర్" అంది....

"నువ్వు వెళ్ళమ్మా....వాడంతేగాని" అని రాజీవ్‌వైపు తిరిగి.

"అలా అనొచ్చా రాజీవ్. అవతల ఓ మనిషి ప్రాణాపాయంలో ఉంటే ఓ డాక్టర్‌గా ఆమె వెళుతుంటే అలా అనొచ్చా...."

"అలా చీవాట్లు పెట్టండి" అంది కోపంగా చూస్తూ-

"శ్యామ్ వాళ్ళు ఇంగ్లాండ్ వెళుతూ ఇక్కడ వదిలిపెట్టారు. నాతోపాటు ఉండమంటే ఉండడు....ఇరవైనాలుగు గంటలూ తిరుగుడే...."

"అందరూ ఎందుకెళ్ళారు ఫాదర్"

"శ్యామ్ వచ్చాక చెబుతాడు. ముందు మీరెళ్ళండి. అవతల పేషంట్‌కి ఎలా ఉందో ఏమిటో......"

రామయ్య కృతజ్ఞతగా చూసి, అరుంధతిని కదలమన్నట్టు చూశాడు అరుంధతి రాజీవ్‌ని రుసరుస చూస్తూ ముందుకు కదిలింది.

వాళ్ళు కనుమరుగు అవ్వగానే "ఇక పద రాజీవ్ పడుకుందువుగాని...." అన్నారు ఫాదర్....

"పాపం అరుంధతి" అని పైకి చూసి లోపలికి నడిచాడు రాజీవ్.

ఫాదర్ మనసు కీడు శంకించింది....అరుంధతిని పిలుద్దామని చూశాడు. జాగ్రత్త చెబుదామనుకున్నాడు. ఒంటరిగా రావద్దని హెచ్చరిద్దామనుకున్నాడు.

అప్పటికే వారు మామిడితోపులోకి ప్రవేశించారు.

అప్పటికీ మామిడితోపు దాకా పరుగులాంటి నడకతో వెళ్ళాడు కూడా ఫలితం మాత్రం శూన్యం.......

ప్రభువే ఆమెకి రక్ష.....అనుకుని వెనుదిరిగాడు.

"రామయ్య జాగ్రత్త చూసుకుని నడవు...ఈ చీకటిలో దీపం లేకుంటే.... నానా ఇబ్బంది...అదీగాక పరుగూ పుట్రాకూడా కనపడవు దీపం లేకుంటే"

"భద్రంగా పట్టుకున్నానమ్మా"

"వచ్చేటప్పుడు ఇటే వచ్చావా"

"అవునమ్మా... పరుగు పరుగునవచ్చాను. లాంతరు కూడా లేకుండా"

"చాలా రోజులయింది. ఈ పక్కకొచ్చి, రాత్రిపూట రావటం ఇదే ప్రధమమనుకో....నడవలేకపోతున్నాను"

"క్షమించండమ్మా నా ఆడదాని బాధ చూడలేక పరుగు పరుగున రావాల్సి వచ్చింది.... మిమ్మల్ని ఈ రాత్రివేళ ఇబ్బందిపెట్టాల్సి వచ్చింది"

"అదేమీ లేదులే....మా వృత్తే అంత.....రామయ్య నీకు చెప్పినా అర్థం కాదుగాని, ఓ చిల్లర కొట్టువాడు కూడా, రాత్రి పదింటికెళ్ళి తలుపుకొడితే తియ్యడు. అంతెందుకు బ్యాంక్‌లో చలానా కట్టాల్సి బ్యాంక్ కెళితే టైమ్ అయిపోయిందంటాడు. నేను పదినిమిషాలు ఆలస్యంగా వెళ్ళాను. కట్టించుకోనంటాడు. అదే మాకూ టైమూ గీమూ ఉండదు. వేళా పాళా అర్థరాత్రి అపరాత్రి ఉండదు, రావాలి, వెళ్ళాలి......మా కష్టాన్ని త్యాగాన్ని ఎవరు గుర్తిస్తున్నారు."

"అంత అంత మాటలు నాకు తెల్వదండి...తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటే మీ రుణం, కష్టం ఉంచుకోను"

"నీ గురించి కాదులే చెప్పేది, చకా చకా నడువ్" చెప్పింది అరుంధతి.

ఎర్రపాలెం దరిదాపుల్లోకి వచ్చేశారు. రామయ్య పరుగులాంటి నడకతో సాగిపోతున్నాడు. అరుంధతి నడవలేక పోతోంది. ఆయాసపడుతోంది.

"అమ్మా కొద్దిసేపు కూర్చుంటారా?"

"వద్దులే ఇంకెంత, రెండు నిమిషాలు వచ్చేశాంగా, అక్కడ తల్లీ, బిడ్డా ఎలా ఉన్నారో".

రామయ్య కృతజ్ఞతగా చూశాడు. ఎర్రపాలెం మొదట్లోనే ఉంది. రామయ్యగుడిసె....ఇద్దరూ అక్కడికి వెళ్ళే సరికి సగం ఊరి జనాభా అక్కడే ఉంది. ఊరి ప్రసిడెంట్ కూడా....

లోపల ఆడ గొంతు వికృతంగా అరుస్తోంది.....బాధ తట్టుకోలేక అరిచే అరుపులు....ఆడదానికి భగవంతుడిచ్చిన వరమో, శాపమో.....ఏదయినా ఆ బాధ నరకంతో సమానం...

శరీరాన్ని చీల్చుకుని, మరో జీవి రావటానికి పడే తాపత్రయం...ప్రాణానికి మరో జన్మ ఇచ్చే ప్రయత్నంలో తల్లిపడే వేదన.....

ఓహో .....

ఆ సమయంలో ప్రతి ఆడది ఒకటే అనుకుంటుంది. మరోసారి పడుకోకూడదని.....భర్త దగ్గరికొస్తే విదిలించి కొట్టాలని – పచ్చి ఆరగానే జీవన పోరాటం ప్రారంభమవుతుంది. భర్త ప్రక్కన చేరి తానే సరసం ఆడుతుంది. అదే సృష్టి....భగవంతుడి సృష్టి....

"బిడ్డ అడ్డం తిరిగినట్టుంది. ఆమెని క్రిందికి జరపండి" అంది అరుంధతి. చుట్టు పక్కల ఆడవాళ్ళు సాయం చేస్తున్నారు.

ఆరుంథతిని చూడగానే ఆమె మరింత గగ్గోలు పెట్టింది.

"మొదటి కాన్పా".

ఆమె విలవిలలాడుతూనే తలూపింది.

"ఎందుకయినా మంచిది సనగపిండి, బ్లేడ్ సిద్ధంగా ఉంచండి" చెబుతోంది కనటంలో ఆరితేరిన ఓ యిల్లాలు.

అరుంధతి పొట్టమీద చెయ్యి పెట్టి వత్తింది. బిడ్డ తగులుతున్నాడు లోపల కదలుతున్నాడు. ఫ్లూయిడ్ మధ్య శిశువు ఉండనంటున్నాడు. వూరికే తొందర పడుతున్నాడు. అలా కదిలినప్పుడల్లా తల్లి ఎగిరెగిరి పడుతోంది....ప్రేవులూ..... ఎముకలూ....కణాలు కదిలేలా.....

"ఓర్చుకో....తొలి పురుడు కొద్ది బాధపెడుతూంది. మరేంఫర్వాలేదు" చెబుతూ మెడికల్ కిట్ తెరిచింది.

చకచకా రెండు ఇంజక్షన్స్ చేసింది.

బైట ఆదుర్దాగా ఉన్న వాళ్ళంతా వూపిరి పీల్చుకున్నారు. కేకలు ఆగటంతో–

ఆడవాళ్ళు హడావుడిగా లోపలికి బయటికి తిరుగుతున్నారు.

అరగంట సుదీర్ఘ టెన్షన్‌కి ఫుల్‌స్టాప్ పెడుతూ కేర్....కేర్....కేర్....మని ఏడ్పు వినిపించింది.

"రామయ్యా నీకుమగపిల్లాడు...." చెప్పింది చేతులుకున్న గ్లౌవ్స్ తీసుకుంటూ.

"చాలా సంతోషమమ్మా....సమయానికి లేదుగాని ఉంటే మీ నోటినిండా పంచదారపోసేవాడిని"

"అంటే ఇందాక చెప్పింది ఇవ్వవా?"

"ఎంత మాట అన్నట్టుగానే రేపే మీ ఇంటికి ధాన్యం తోలిస్తాను"

"పదినిమిషాలాగి వెళ్ళి చూసుకో, ఇక నే వెళతాను".

"అయ్యో, ఒక్కరే వెళతారా? ఉండండమ్మా నేను వచ్చి దిగపెట్టివస్తాను"

"నాకేమీ భయంలేదుగాని, నేను వెడతాను" అంది మెడికల్ కిట్ తీసుకుంటూ....

"మందులపెట్టె, లాంతరూ....మీరెళ్ళలేరు. ఈ రెండూ మోసుకుంటూ...."

"అవునండి! వచ్చేటప్పుడు వెంట పెట్టుకు వచ్చి, వెళ్ళేటప్పుడు ఒంటరిగా పంపటం మర్యాద కాదు. రేపొద్దున ఇది తెలిసిందంటే మా ఊరికే చిన్నతనం. అన్నది అక్కడ ఉన్న పెద్దావిడ."

"సరే మీ ఇష్టం"

రామయ్య మెడికల్ కిట్, లాంటరూ పట్టుకున్నాడు. అరుందతి అందరికీ వస్తానని సెలవు తీసుకుని నడిచింది. రామయ్య ఉత్సాహంగా నడుస్తున్నాడు.

"ఏం రామయ్యా, మగపిల్లాడు పుట్టడంతో హుషారెక్కువయినట్లుంది"

"అవునమ్మా.....బావున్నాడామ్మా....ముద్దుగా, ఎర్రగా ఉన్నాడా?"

"వో, చాలా బాగా, ఏం చూడాలని ఉందా? మామిడితోపుదాకా రా అక్కడ్నించి నే వెళ్ళిపోతాను. నువ్ ఆఘమేఘాల మీద వెళ్ళి కొడుకుని చూసుకుందువుగాని.

రామయ్య మామిడితోపు రావటమే తరువాయి "మందుల పెట్టె ఉంచుతానమ్మా...ఉదయాన్నే యింటికి తెచ్చిస్తాను. రెంటిని మీరు తీసుకెళ్ళలేరు"

"ఒరినీయమ్మ కడుపుకాలా, నేనేదో సరదాగా అంటే ఈ అడవిలో వదిలిపెట్టి పోటానికే నిర్ణయించుకున్నావా?"

రామయ్య నవ్వాడు.

"వద్దులే నీ లాంతరు పట్టుకుపో, ఈ తోపు నాకు అలవాటైన ప్రదేశమేలే. రేపు పంపించు మరచిపోకు".

రామయ్య తలాడించి, మెడికల్ కిట్ అందించి వంగి తలొంచి నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు.

అరుంధతి దీర్ఘంగా నిట్టూర్చి తోపు వైపు నడిచింది.

వెన్నెల మసగ్గా పడుతోంది. సన్నటి గాలి సుతారంగా వీస్తోంది.

అరుంధతి ఎండిన ఆకులమీద కాలు వేసినప్పుడల్లా అనీజీగా ఫీలవుతోంది.

తోపులోకి రావటమే చీకటి, కొద్దిపాటి వెన్నెల వెలుగు గుబురుగా ఉన్న మామిడిచెట్లను దాటి తోపులోకి రాలేకపోతోంది.

అనవసరంగా లాంతరు ఇచ్చి పంపాను. ఈ ఎండు ఆకులొకటి కాలు వేసినప్పుడల్లా చిటపట....చిటపట అనుకుంటూ, రామయ్యను తిట్టుకుంటూ నడుస్తోంది.

తోపుదాటితే పొలిమేరే....

తోపు సగానికి వచ్చేసింది....

అరుంధతి చకచకా నడుస్తోంది.

కీచు కీచు మంటూ కీచురాళ్ళ సవ్వడి....నడుస్తూ నడుస్తూ టక్కున ఆగిపోయింది.

మామిడి తోపులోనే ఉందొక ఊడలమఱ్ఱి....ఆకాశానికి అంటేలా పెరిగి ఉంటుంది.

అక్కడ నుంచి దాని ఊడలు భూమిని తాకుతూ లెక్కపెట్టలేనన్ని ఉన్నాయి. భూమిలో దిగిపోయిన ఊడలు భూమిని చీల్చుకుని లేస్తున్నాయి.

అరుంధతి ఆగింది. ఊడల కదలికలు ఆగిపోయాయి.

అరుంధతి మఱ్ఱిచెట్టును చూసింది....

చీకటి తెరని కప్పుకుని గంభీరంగా నిలబడి ఉంది. కళ్ళు చిట్లించి చూసింది.

నిశ్శబ్ధంగా స్థబ్ధంగా ఉంది.

మరి ఇందాక ఊడలలా వికృతంగా కదిలాయే....భూమిని చీల్చుకుని మరి.....

తానే పొరపాటు పడి ఉంటుంది.....

ధ్వజ స్థంబంలా నిలబడి ఉంటే కదిలినట్లుగా కనిపించడటం ఏమిటి?"

అయినా కదిలిందే అనుకో దాంట్లో భయపడాల్సిందేముంది. దాని ధర్మం ప్రకారం గాలికి వూగాయి.

అయినా కదిలినవి ఊడలు కదా! ఆవేమన్నా ఉక్కు స్థంబాలా కదలకుండా ఉండటానికి, తనని తానే చూసుకుని జాలిగా నవ్వి – ముందుకు అడుగువేసింది.

సరిగ్గా అప్పుడు శబ్దమయ్యింది.....

డబ్బున .....వందకిలోల వస్తువు వెనుక పడ్డట్టు.....ముందుకు వెళ్ళబొయ్యేదల్లా దిగ్భ్రాంతిగా ఆగింది.

చుట్టూ ప్రకృతి కూడా కదిలింది–

చీకటిలో మునగదీసుకున్న కీటకాలు గగ్గోలు పెడుతూ అరవడం ప్రారంభించాయి.

ప్రతివైపూ కదలికలే....

అరుంధతికి గుండెల్లో అలజడి ప్రారంభమయ్యింది. భయంగా చూసింది.....

ఏమీలేదు....మరి అంత శబ్ధమయ్యిందే! మరి దానికే కదా చుట్టూ ప్రకృతి కకావికలమయ్యింది.

‘‘ఎందుకయినా మంచిది త్వరగా వెళ్ళిపోతే బెటర్’’ అనుకుని ఆంజనేయస్వామిని తలుచుకుంటూ ముందుకు కదిలింది. తనకి కంఠత వచ్చిన దండకాన్ని వల్లించుకుంటూ.

“ఆంజనేయ మహావీరం...

బ్రహ్మవిష్ణు శివాత్మకమ్...

కరుణాత్మ ప్రభూ.....శాంతం

రామభక్తం...

అరుంధతి రెండడుగులు వేసిందో లేదో....గాలి రయ్యిన వచ్చేసింది.

ఊడలు.... మర్రి వూడలు గిరికీలుకొడుతున్నాయి. అరుంధతి ఆగింది....

మళ్ళీ మొదట్నించీ.....“ఆంజనేయం మహావీరం”... స్మరించుకుంటోంది.

ఊడలు క్షణ క్షణానికి వేగంగా కదులుతున్నాయి. గాలి విసురుగా వీస్తోంది....

చెట్టుకొమ్మలు కూడా కదులుతున్నాయి.

అరుంధతి ఎనిమిదో వింత చూస్తున్నట్టు నిర్ఘాంతపోయింది....కేవలం ఊడల మర్రిచెట్టు మాత్రమే అలా కదులుతోంది....

ఆకులు పిచ్చిపట్టినట్టు కొట్టుకుంటున్నాయి. ఊడలు ఉయ్యాలా అటూ,ఇటూ, ఇటూ అటూ కేవలం ఆ ఒక్క చెట్టే, చుట్టూ మామిడి చెట్లు....కనీసం ఆకు కూడా కదలటం లేదు.....

చల్లటిగాలి జివ్వున మొహానికి తగులుతోంది. అరుంధతి జుట్టు ముడి ఎప్పుడో వూడిపోయింది.

విపరీతంగా తగులుతున్న గాలికి జుట్టు, చీరా రెపరెపలాడుతున్నాయ్. అరుంధతి చేతిలో మెడికల్ కిట్ ఆమె ప్రయత్నం లేకుండానే నేల వైపుగా జారిపోయాయి.

ఇప్పుడు ఊడలు పైకి లేస్తున్నాయి....అరుంధతి దిశగా....అరుంధతి అడుగులు వెనక్కిపడ్డాయి....ఊడలు....నాలుగు ఊడలు కర్రల్లా ఎవరో ముందుకు ఓ పద్ధతి ప్రకారం తోస్తున్నట్టుగా నాలుగు వైపులా వస్తున్నాయి.

ఎక్కడో దూరంగా నక్క వికృతంగా అరచిన అరుపు.

అరుంధతిలో ఇప్పుడు భయం కాదు.....దానికి మించినస్టేజిలో ఉంది.

శరీరంలోని అన్నిరంధ్రాలు స్తంభించిపోయాయి....మెదడు ఎప్పుడో పనిచెయ్యటం ఆపేసింది. కాళ్ళు స్వాధీనం తప్పటానికి ఆయత్తమవుతున్నాయి.

ఓ ఊడ వచ్చి చక్‌మని ఎడమచెయ్యిని చుట్టుకుంది. అప్పుడు పనిచేసింది మెదడు....ఊడ బలంగా చుట్టుకుంది....ఎముకలు విరిగేలా....

టక.....టక....టక....పట....

"అమ్మా" హృదయ విదారకంగా అరిచింది.

అదే సమయంలో కుడిచెయ్యిని చుట్టింది మరో ఊడ. రెండు కలిసి ఆమెని చెట్టువైపుకి లాక్కెళుతున్నాయి.

మరో ఊడ గాలికి రెపరెపలాడుతున్న చీరని చుట్టుకుంది. అలా అలా చుట్టేసుకుంటూనే ఉంది పమిటని. క్షణాల్లో పమిట మొత్తం ఆ ఊడకి చుట్టుకుంది.

ఆపై వదలటం లేదు. ఇంకా ఇంకా బిగిస్తోంది. శరీరానికి చుట్టుకున్న చీరని బలంగా లాగేస్తోంది.

బాధ భరించలేక ఆ ఊడకి సహకరించింది. పక్కకి తిరిగింది. అంతే.... అది చకచకా చుట్టేసుకుంది. కుచ్చిళ్ళు ఊడిపొయ్యాయి. ఊడ చూస్తుండగానే రౌండ్ తిరిగింది. చీర మొత్తాన్ని తీసేసుకుంది.

అరుంధతి రెండు చేతులూ కదిలించలేక, అసహాయంగా లంగా, జాకెట్టుమీద అర్ధనగ్నంగా ఉండిపోయింది. అసలు తానెలా ఉందో గమనించే స్థితిలో కూడా లేదు.

చీరని చుట్టేసిన ఊడ కొరడాలా ఝుళిపించింది. అరుంధతి ఒంటిమీద వేసింది. సరిగ్గా నడుం మీద లంగా బొందుమీద.

పచ్చిపుండుమీద కారంచల్లినట్లనిపించింది – అప్పుడా వూడిన లంగాబొందును టపీమని లాగేసింది. అరుంధతి కెవ్వున అరిచింది.

కుప్పగా జారిపోయింది లంగా....ఆ వెనువెంటనే మరో ఊడ రెండుకాళ్ళని

చుట్టుకుంది – చుట్టుకుని ముందుకులాగింది. అంతే అరుంధతి భయంకరంగా అరుస్తూ వెనక్కి పడింది.

తల పగిలిందో.....భుజాలు చీరుకుపోయాయో దాని గురించి ఆలోచించే పరిస్థితిలో లేదు. రెండు కాళ్ళు కదల్చలేదు. చేతులు రెండు ఏ మాత్రం కదలకుండా ఊడలు నేలకి పట్టి ఉన్నాయి. ఒంటి మీద జాకెట్టు తప్ప ఆచ్ఛాదన లేదు....ఆమె ఎర్రటి శరీరం చీకటిలో కూడా మెరుస్తోంది.

మరో కొత్తఊడ....బాగా లావుగా ఉంది. గుండ్రంగా గట్టి కర్రలా ఉంది. అది నెమ్మదిగా స్లో మోషన్‌లా కదులుతోంది.

అరుంధతి దాని వంక చూసింది. దానికి కళ్ళు లేకపోయినా దాని దృష్టి ఎటు వుందో గమనించేసరికి....నవగ్రంధులు అదిరిపోయాయి. శరీరంలో తడి ఆరిపోయింది. ఆ కర్ర.....ఆ ఊడ నెమ్మదిగా వ.....స్తోం.......ది.....

'నో.....నో' అరిచింది.....

రెండు కాళ్ళు వీలయినంత దగ్గరికి జరుపుకుంటూ చీకటి కూడా చూడలేనట్లు కళ్ళు మూసుకుంది.

ఇప్పుడు మామిడి చెట్లుకూడ ఊగటం ప్రారంభించాయి. పొదల్లో చీకట్లో నక్కిన కీటకాలు వికృతంగా అరుస్తున్నాయి. మిణుగురు పురుగులు పొదల్లోకి దూరిపోయాయి.

ఆ కర్ర వస్తోంది.......

అరుంధతి కుదించుకుపోయింది. అది అలా వచ్చేసింది. అరుంధతి నడుం దగ్గర ఆగింది.

అరుంధతి తలా చేతులతో, ఊపుతూ శరీరాన్ని పక్కకి మళ్ళించటానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

సాధ్యం కావటంలేదు. ఆ కర్రలాంటి ఊడ పైకి లేచింది.

బ్యాలెన్స్ సరిచూసుకుంది...అరుంధతి కళ్ళు మూసుకుంది...అది కదిలింది..తనని తాకటం తెలుస్తోంది.

"స......స.......స......ప్"

దిక్కులు దద్దరిల్లేలా కేక పెట్టింది అరుంధతి. ఆ కర్ర అక్కడ్నించి... దూసుకెళ్ళి... అగింది... అయితే ఆమె అంతా తెలుస్తునే ఉంది.

# 10

ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన బోయింగ్ 787 మేఘాల్లోంచి దూసుకుపోతూంది. ప్యాసింజర్స్ మధ్యనుంచి చిన్నగా ఒక్కొక్కరి ముందు ట్రే పెట్టి వారు చాక్‌లెట్స్ తీసుకున్నాక ముందుకు వెడుతోంది ఎయిర్ హోస్టస్....

రాగిణి....రోజీ కూర్చున్న దగ్గరికి వెళ్ళి చిరునవ్వుతో వారి ముందు ట్రే ఉంచింది. రోజీ వద్దన్నట్టు సైగ చేసింది.

ఎయిర్‌హోస్టస్ ఆశ్చర్యంగా చూసింది.

ఎంత ఉన్నవారియనా మరెంత పెద్ద మనుషులయినా, ట్రేని పెట్టడం ఆలస్యం, గుప్పిళ్ళతో చాక్లెట్స్ తీసుకుంటారు కక్కుర్తిగా.

“అలాంటిది వారు చాక్లెట్స్ కాదు అరగంట నుంచి సర్వ్ చేస్తున్న రకరకాల పదార్థాలు ఏవీ ముట్టుకోవటం లేదు.

“కమాన్ టెల్‌మీ మేడమ్, ఏదన్నా ప్రాబ్లమా, ఐమీన్ మెడికల్ ప్రాబ్లమా?” రాగిణి  పమిటతో కళ్ళు తుడుచుకుంటూ ‘అదేం లేదన్నట్టు’ చెప్పింది.

“ఇంకా ఎంతసేపట్లో ఇంగ్లాండ్ ఎయిర్ పోర్ట్‌లో దిగుతాం” అడిగింది రోజీ.

“జస్ట్ వన్ అవర్.....అప్పుడే హిల్స్ పర్వత శ్రేణులని దాటాం”.

“ఇంకా గంట....” దీర్ఘంగా నిట్టూర్చాడు  ఆ పక్క సీట్లో కూర్చున్న శ్యామ్.

మరో అరగంట తరువాత ఫ్లయిట్ స్పీకర్స్‌లోంచి తియ్యగా విన్పించింది.

“డియర్ రెస్‌పెక్టబల్ ప్యాసింజర్స్....మనమున్న బోయింగ్ 787 ఫ్లయిట్ మరికొద్ది సేపట్లో ఇంగ్లాండ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగబోతోంది. దయచేసి సేఫ్టీబెల్ట్‌లను నడుంకి కట్టుకోండి”.

ఆ తరువాత హిందీలోకూడా చెప్పింది.

బోయింగ్ 787 విమానాశ్రయంలో ఆగగానే ముగ్గురూ దిగారు. లగేజీ ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని బయటికి వచ్చేసరికి మరో గంట పట్టింది.

“ముందు హోటల్‌కెళ్ళి, ఆ తరువాత వెళదామా?” అడిగాడు శ్యామ్.

ఇద్దరూ వద్దని చెప్పారు.

శ్యామ్ టాక్సీ పిల్చి "స్టివెన్ రోడ్" చెప్పాడు.

"స్టీవెన్ రోడ్‌లో ఏ పాయింట్" అడిగాడు డ్రైవర్.

శ్యామ్ చెప్పటానికి సందేహించాడు.

"ముందు పోనియ్" అంది రోజీ ఎక్కి.

"అది కాదు మేడమ్ – ఆ రోడ్డు పొడవు ముప్పయి రెండు కిలో మీటర్లు.....ఏ పాయింటో చెబితే తొందరగా వెళ్ళచ్చు".

"అది.....అదిహాస్పిటల్...విక్టోరియా హాస్పిటల్" చెప్పాడు శ్యామ్ బాధగా.

డ్రైవర్, మిగతా ఇద్దరూ ఎక్కగానే ముందుకు పోనిచ్చాడు.

ముప్ఫైఅంతస్థుల అతిపెద్ద భవనం విక్టోరియా....హాస్పటల్... రాజప్రసాదానికి ఉన్నట్టు రెండు పెద్ద ఇనుపగేట్లు.

టాక్సీని పార్కింగ్ ప్లేస్‌లో ఆపాడు. ముగ్గురూ దిగి తలెత్తి చూసారు.

శ్యామ్ హాస్పిటల్ ఎంక్వయిరీ సెక్షన్‌కెళ్ళి ఏదో మాట్లాడాడు. రాగిణి, రోజి వింతగా భయంగా చూస్తున్నారు. వారి ముఖాల్లో దిగులుకి తోడు అవి కూడా చేరటంతో బాగా వడిలిపోయినట్టు కనబడుతున్నారు.

పదినిమిషాల్లో శ్యామ్ వచ్చాడు.

"మనల్ని ఇక్కడే వెయిట్ చెయ్యమన్నారు" చెప్పాడు.

ముగ్గురూ విజిటర్స్ రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నారు......కొంత సేపటికి ఇంగ్లాండ్ సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఇద్దరు పోలీసులు వచ్చారు.

శ్యామ్‌ని పలకరించారు.

"మేము ఇండియానుంచి వచ్చాం. మీ కమీషనర్‌గారితో మాట్లాడాం.... వారు ఇంగ్లాండ్ వచ్చి బాడీని తీసుకెళ్ళమన్నారు"

"బాడీ ఇక్కడలేదు"

"మరి?"

"కమీషనర్‌గారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. హాస్పటల్‌కి మీరు రాగానే మాకు కబురు చెయ్యమన్నాము హాస్పిటల్‌వారు. కమీషనర్‌గారిని కాంటాక్ట్ చేసి మీరు వచ్చినట్టు చెప్పారు. వారు మిమ్మల్ని వెంటబెట్టుకు రమ్మన్నారు. మా కంతే తెలుసు"

శ్యామ్ ఇద్దరినీ లేవమని చెప్పి నడిచాడు.

వాళ్ళ ముగ్గురిని పోలీస్ జీప్‌లో కాకుండా, ప్రైవేట్ కారులో తీసుకెళ్ళారు నేరుగా సిటీ కమీషనర్ దగ్గరికి'.....

"రండి" ఆహ్వానించారు కమీషనర్. వారు ముగ్గురూ తన గదిలోకి రాగానే....

"ఎక్కడ దిగారు"

"ఇంకా దిగలేదు..ముందు ఇక్కడికే వచ్చాం"

"మీ బాధ అర్థం చేసుకున్నాను. అంత దూరం నుంచి రప్పించి నందుకు బాధపడుతున్నాను. బాడీని మీకు హ్యాండ్‌వర్ చెయ్యటం లేదు"

"దేనకని?"

"మామూలుగా హత్యగాని, యాక్సిడెంట్‌గాని జరిగితే బాడీని పోస్ట్‌మార్టమ్ చేసి వాళ్ళ తాలూకా బంధువులకి అప్పగిస్తాం"

"కాని ఇది హత్యలా అగుపించటంలేదు"

"హత్యకాదా!"

రాగిణి, రోజీకి ఇంగ్లీషురాక అయోమయంగా చూస్తున్నారు.

"మరిఎలా....ఎలా జరిగింది?"

"అదే అర్థం కావటంలేదు. బాడీలో రక్తం అస్సలు లేదు. రక్తం మొత్తం పోవటం ద్వారా మరణించబడ్డాడు థామస్".

"రక్తం అస్సలు లేదా?" తెల్లబోయాడు శ్యామ్.

"ఒక్క చుక్కకూడా లేదు, మీరూ,నేనే కాదు, వైద్యరంగంలో మేధావులయిన డాక్టర్స్ సైతం తల బద్దలు కొట్టుకుంటున్నారు".

"మరి, ఫోన్‌లో బర్గ్ అనే మిత్రుడు హత్య చేసాడని చెప్పారు".

"ప్రాథమిక దర్యాప్తులో అలానే అనుకున్నాము. ఆపై థామస్ బాడీని హాస్పటల్‌కి తీసుకెళితే తెలిసింది. శరీరంలో రక్తపు బొట్టుకూడా లేదని...."

"మైగాడ్....అది సాధ్యమా?"

"సాధ్యమని, నిజమని కళ్ళముందు కనపడుతుంటే ఎలా కాదనగలం".

"ఇంతకు ముందు ఇలాంటి హత్యలు సిటీలో జరిగాయా?"

"గత యాభై సంవత్సరాలుగా ఇలాంటివి జరగలేదు"

"అంటే, అంతక్రితం జరిగాయా?"

"అవును, జరిగాయని అంటారు? మరికొంతమంది అదో నాటకమని, కొంతమంది స్వార్థపరులు కౌంటు డ్రాక్యుల చేస్తుందని నమ్మించి ఇవన్నీ చేశారని అంటారు. ఏది నిజమో, ఏది అబద్ధమోగాని చరిత్రలో ఆ చరిత్ర కలిసిపోయింది".

"డ్రాక్యులానా?"

మొత్తం ముగ్గురూ కోరస్‌గా అడిగారు.

"అవును, యాభై సంవత్సరాలకి పూర్వం ఇంగ్లాండ్‌ని వణికించిన డ్రాక్యుల ఇలానే, అచ్చం ఇలానే మనుష్యుల రక్తం పీల్చి చంపేదట. అలా చనిపోయిన వారి మెడమీద కేవలం రెండుగాట్లు మాత్రమే ఉండేవట. శరీరంలో రక్తం అనేది ఉండదట. అచ్చం అలానే ఇప్పుడు థామస్‌కి జరిగింది".

"మీరనేది డ్రాక్యులా మళ్ళీ ఇన్నాళ్ళకి తిరిగి ఇంగ్లాండ్‌లో ప్రవేశించిందనా?"

"దాన్ని అప్పుడే ఓ డాక్టర్ భూస్థాపితం చేసాడు"

"మరయితే ఇదెవరు చేశారు....అదే తిరిగి వచ్చిందా! లేక ఎవడయినా బ్రతికించారా?" హేళనగా అడిగాడు.

"మీరు దీన్ని నవ్వులాటగా తీసుకుంటున్నారనుకుంటున్నాను"

"కాక, మీరనవలసినది, చెప్పవలసినది ఇది కాదు. మిస్టర్ కమీషనర్, మానవుడు ఆకాశాన్ని చీల్చుకుని వెళుతున్న ఈ రోజుల్లో దెయ్యాలూ, భూతాలూ, డ్రాక్యులాలూ...షిట్....అంతా బూటకం...... మనుష్యులు ఆడే నాటకం....మా కుటుంబం మీద పగతో ఎవరో ఏదో చేస్తున్నారు"

"నేను ఒకప్పుడు మీలానే అనుకునేవాడిని కాని జరిగింది చూసి మనసు మార్చుకున్నాను. మానవ మాత్రుడెవడూ చుక్క రక్తం లేకుండా కేవలం రెండుగాట్ల ద్వారా పీల్చలేడు. అలాంటి సాధనం కూడా లేదు. నాకు తెలిసి"

"నో.....ఏదో మనకి తెలియంది, ఊహించలేనిది జరుగుతోంది"

"మీ ఇష్టం, అదీగాక మీ తమ్ముడు అలా మరణించటానికి కొద్దిసేపటి క్రితం కౌంటు డ్రాక్యులా భూస్థాపితం చేసిన ప్లేస్‌కి వెళ్ళాడు. అది చూసి వస్తుంటేనే ఇది జరిగింది".

"కౌంట్ డ్రాక్యులానా? ఇక్కడ భూస్థాపితం అయ్యిందా! ఎక్కడ....."

"ఎక్కడయినా మీరు వెళ్ళకూడదు....అది నిషిద్ధ ప్రదేశం"....

"మేమోసారి బర్గ్‌ని కలుసుకోవచ్చా?"

"తప్పకుండా, ఇండియన్ ఎంబసిరోడ్...డోర్ నెంబర్ ఎ. బి. 1086 టెర్మినల్ రోడ్డు".

"అంటే అతన్ని వదిలేశారా?"

"మరేం చెయ్యగలం. ఇది హత్య అని ప్రూవ్ చెయ్యటానికి ఏ ఆధారం లేదు....ఇది ఇండియా కాదు.....ఏదో రకంగా లోపలుంచటానికి....నిదానంగా దర్యాప్తు చెయ్యటానికి"

"థ్యాంక్స్ కమీషనర్‌గారు" లేచాడు శ్యామ్.

రాగిణి లేచి కమీషనర్‌గారికి రెండుచేతులతో నమస్కారం పెట్టి శ్యామ్ వైపు తిరిగి–

"చివరిసారి ఆయన్ని ఒకసారి....కమీషనర్‌గాని అడగరూ" అంది.

శ్యామ్ ఇంగ్లీషులో రాగిణి అడిగింది చెప్పాడు బాధగా–

"తప్పకుండా...రేపుఫోన్ చెయ్యండి. ఈలోగా ఎరేంజ్ చేస్తాను. మీ తమ్ముడు శరీరం ఇప్పుడు ఇంగ్లాండ్ వైద్యనికేతన్‌లో ఉంది. వారు పరిశోధిస్తున్నారు ఇదెలా జరిగి ఉంటుందోనని....వారిని కాంటాక్ట్ చేసి మీరు చూసే వీలు తప్పక కల్పిస్తాను".

రాగిణికి దుఃఖం తన్నుకు వచ్చింది. బలవంతాన ఆపుకుంది. థామస్‌మీద ఆమెకి ప్రేమలేదు. ఆపేక్షలేదు. ఒక రకంగా ఆయన ఎప్పుడోలేనట్టేనని నిర్ణయించుకుంది. అయినా పోయాడంటే వ్యధచెందుతోంది...కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.

కారణం ప్రేమకాదు. ఫీలింగ్ కాదు.....బంధం.....భార్యాభర్తల బంధం.....ఆ బంధానికున్న శక్తి అలాంటిది.

"బర్గ్ కావాలండి, మేం ఇండియానుంచి వచ్చాం, థామస్ అన్నయ్యని.... ఈమె థామస్ భార్య రాగిణి, ఈవిడ నా భార్య రోజీ......

ఇరవయ్ ఆరేళ్ళ ఆ యువకుడు వారిని సాదరంగా ఆహ్వానించి చెప్పాడు "నేనేనండి బర్గ్‌ని" అని.

శ్యామ్ అతను కాదనుకున్నాడు. తెల్లగా, నన్నగా గాలివీస్తే పడిపొయ్యేలా ఉన్నాడు. అందుకే తలుపు తెరవగానే ఆ లేత యువకుడితో బర్గ్ కావాలని చెప్పింది.

రాగిణి అతని వంక తేరిపారగా చూసింది. బర్గ్ అతనే అని ఆమెకు అర్థమయ్యింది.

ఇతను తన భర్తని హత్య చేసాడా? ఇంపాజిబుల్, థామస్ బలం ముందు ఇతను పిచ్చుక.... అదీగాక ఆ ముఖంలో లేతతనం....నో....ఇతను కాదు....

ఒక్కొక్కరిని చూస్తే ఎలాంటి వాళ్ళో, వాళ్ళ మనస్తత్వం ఏమిటో తెలిసిపోతుంది. బర్గ్ముఖం చూస్తే నేరస్థుడిగా అగుపించలేదు.

శ్యామ్‌కి ఏం మాట్లాడాలో, ఎలా ప్రారంభించాలో అర్థం కాక భార్యవంక చూసాడు.

రాగిణిది అదే స్థితి... కాకపోతే అనుమానంగా...కోపంగా చూస్తోంది బర్గ్‌ని....ఇంగ్లీషు మాట్లాడ్డం వస్తే దులిపేసేది...రాక తినేసేలా చూస్తోంది.

"మీరంతా అలా మౌనంగా నన్నే ఎందుకు చూస్తున్నారో తెలుసు...అలా చూడకండి...థామస్ నాకు మిత్రుడేకాదు. అన్నయ్య. అతనికి తెలీయకుండా ...చెప్పకుండా ఏ చిన్న పనిని ప్రారంభించను..... అలాంటి అన్నయ్యని నేను....నేను....నో"

"మరి మొదట.....మిమ్మల్ని అరెస్టు చేశారుగా"

"అది మొదట..... ఆపై వదిలేశారు. ఇది హత్యకాదని"

"అసలు థామస్ ఎలా చనిపోయింది వివరంగా చెప్పండి"

బర్గ్ గొంతు సవరించుకుని చెప్పటం ప్రారంభించాడు. థామస్ ఇంగ్లాండ్ నుంచి వెళ్ళిపోతానన్న దగ్గర్నించి డ్రాక్యులా దగ్గరకు వెళ్ళటం వరకూ...

"కమీషనర్ చెప్పింది నిజమేనన్నమాట....డ్రాక్యులా దగ్గరికి వెళ్ళి వస్తుండగా జరిగింది...అంతేగా"

"అవును....థామస్ చాలా ఎగతాళిగా...ఈ డ్రాక్యులాలన్నీ బూటకమని అన్నాడు. అన్యాయం, దారుణం చేస్తే మన వల్ల పోయిన ఆ ప్రాణాలు దెయ్యాలుగా మారి వాటికి పెద్ద దిక్కు అయిన డ్రాక్యులాని వేడుకుంటాయనేది ట్రాష్ అని పనిలేనివాళ్ళు పుట్టించిన పుకారని అన్నాడు. నేను ఒప్పుకోలేదు.

మనిషిగా మనమెంత ప్రగతి సాధించినా, మరెన్నో తెలుసుకున్నా కొన్ని ఒప్పుకోవాలి. మరికొన్ని గౌరవించాలని చెప్పాను. అదే నిజమయితే తాను చేసిన దారుణానికి డ్రాక్యులా ఎప్పుడో తన గొంతుకొరికి ఉండాలని చెప్పాడు. నేను ఉత్సాహంగా ఆడక్కుండానే థామసే చెప్పాడు".

"ఏం చెప్పాడు?"

"ఎన్నో సంవత్సరాల క్రితం దారుణమైన ద్రోహం చేశానని"

"అదే ఏం చెప్పాడు?"

"సుజనా....."

మూడక్షరాలు మూడు పిడుగులుగా పడినట్లనిపించింది.

సుజనా టాపిక్ ఇక్కడెందుకు వస్తోందో అర్థం కాక ఇద్దరు ఆడవాళ్ళు శ్యామ్‌వైపు చూశారు.

"సు....సు.....జ......నా...."

"అవును....ఆ పేరు పోలీస్ కమీషనర్‌కి కూడా చెప్పలేదు"

"దేనికి?" అడిగాడు శ్యామ్.

"థామస్ కూడా అంతవరకే చెప్పాడు...నాకు బాగా గుర్తుంది. అన్యాయం చేసిన ఆ కథ వింటావా? చెబుతాను అని చెప్పటం ప్రారంభించాడు.

'సుజనా....' అన్న పేరు మొదట చెప్పాడు.

అంతే!

ఏం గుర్తులేదు. స్పృహతప్పిన నేను కళ్ళు తెరిచింది. చూసింది పోలీసులని, కటకటాలని"

"ఇంతకీ నువ్వనేది దెయ్యం పని అంటావా, లేక మనిషి పని అంటావా?"

"మొదట దాని పనే అనిభావించి నన్ను వదిలేశారుపోలీసులు. ఓ మనిషి శరీరంలో చుక్క రక్తం లేకుండా చెయ్యటం కేవలం డ్రాక్యులాకే సాధ్యం. అదికాక నా కళ్ళ ముందు జరిగింది. థామస్ సుజనా అంటూ ప్రారంభించాడు.

అంతే....ఆ తరువాత ఏం జరిగిందో....అతను మాత్రం మరణించాడు"

"షటప్......ఇక్కడే ఏదో జరిగింది. మీరే ఏదో చేశారు. పైగా డ్రాక్యులా అని...." కోపంగా అరిచాడు.

రోజీ భర్త చెయ్యిపట్టుకుంది.

"ఏమయిందండి?" అడిగింది.

శ్యామ్ కంట్రోల్ చేసుకున్నాడు.

"మరేం లేదు" అని తెలుగులో చెప్పి బర్గ్‌కేసి తిరిగి....

"క్షమించు బర్గ్! తమ్ముడు పోవటం, ఆ పోవటానికి కారణం దొరక్క...అంతుపట్టక అసహనంతో అరిచాను"

రోజీ భర్తకేసి తిరిగి...

"అసలేమయింది? థామస్ ఎలా చనిపోయాడట" అంది

"చెపుతాను బయటికెళ్ళాక....వెళదాం పదండి"

బర్గ్ బయటివరకూ వచ్చాడు.

రాగిణి శ్యామ్ పక్కకొచ్చి ....

"ఏంటి చివరలో అలా అరిచారు ఎందుకు? సుజనా అన్నారు దాని పేరెందుకు వచ్చింది?" అడిగింది.

"తమ్ముడిని దెయ్యం చంపిందట...అది కూడా సుజనానట?"

"సుజనా.....సుజనా....మళ్ళీ బ్రతికిందా?చచ్చిపోయిన ఆమె బ్రతికిందా?"

ఇద్దరాడవాళ్ళ మొహాల్లో నెత్తురు చుక్కలేదు.

"నాకు పిచ్చెక్కిపోతుంది. ముందు ఈ దేశం వదిలిపోదాం పదండి ఉండి చెయ్యగలిగింది తీసుకెళ్ళగలిగేది ఏం లేదిక్కడ"

"బావగారూ..." వ్యథ భరితంగా అంది.

"ఖర్మ....ఏదో శని పీడిస్తోంది. అందుకే ఇవన్నీ, డ్రాక్యులా దెయ్యం, గియ్యంలేవు మీరేమీ భయపడకండి".

"లేదండీ! నాకెందుకో నిజమేననిపిస్తోంది. సలీం చనిపోవటం, చనిపోవటానికి ముందు మనమందరం చేసిందంతా కలగా వస్తుందని చెప్పటం, దానితో భాగస్వామురాలు అయిన అరుంధతి తల పగటటం, ఇప్పుడు థామస్ ఇలా....ఆలోచించండి".

శ్యామ్ తల పట్టుకున్నాడు.

"ముందు ఈ దేశం విడిచి వెళ్ళిపోదాం....ఇంటికెళ్ళి ఫాదర్‌తో కలిసి చర్చిద్దాం"

"ఆయన్ని" ఆపేసింది రాగిణి.

"ఎందుకమ్మా! తమ్ముడిని అలా చూడగలననే అనుకుంటున్నావా? నేనయితే చూడలేను. వాడిని ఆస్థితిలో చూడలేను. ఈ రోజు ఉందాం– మీరెళ్ళి చూసిరండి. రేపు ఫ్లయిట్‌కి ఇండియా వెళ్ళిపోదాం. ఈ పరిసరాల్లో తట్టుకోలేని ఈ ఆలోచనలతో నేను ఎక్కువసేపు ఈ దేశంలో ఉండలేను".

## 11

తెల్లవారుజామున పొలం పనులకెళ్ళేవాళ్ళు చూశారు.... గుడ్డలు లేకుండా....కేవలం జాకెట్టుతో ఒళ్ళంతా రక్తపు మరకలతో ఓ పక్కగా పడి ఉన్న అరుంధతిని.

వారు మొదట ఎవరో అనుకున్నారు....తీరా పరీక్షగాచూస్తే అరుంధతి.

అదరా బాదరాగా ఊరులోకి విషయం చేరవేశారు.

ఊరు,ఊరే కదిలివచ్చింది.

ఈలోగా మిగతా పనివారిలోని ఆడవాళ్ళు ఓ మర్రికొమ్మకి వేలాడుతున్న చీర తీసుకొచ్చి నగ్నంగా ఉన్నఆమె శరీరానికి చుట్టారు.

ఆరుంధతికట్టెలా బిగుసుకుపోయి ఉంది.

ఫాదర్ అందర్నీ తోసుకుంటూ ముందుకు వచ్చారు. ఆ స్థితిలో అరుంధతిని చూసి "ప్రభూ" అనుకున్నాడు.

"ప్రాణం ఉంది" అరిచారెవరో.

"డాక్టర్‌ని పిలవండి. ముందు ఈమెను పైకి ఎత్తండి".

"ఏంటి డాక్టర్‌ని పిలిచేది? ఈమే డాక్టర్ ఈ చుట్టు పక్కలకి"

"ముందు ఆమెని బయటికి తీసుకురండి. ఎవరయినా బండి కట్టండి పట్నం తీసుకెళదాం" చెప్పారు ఫాదర్.

చకచకా ఏర్పాట్లు జరిగిపోయాయి.

ఓ బండిలో ఫాదర్, ఊరి పెద్దలు కూర్చున్నారు.

మరో బండిలో అరుంధతి.

ఆమెకి సహాయంగా ఇద్దరాడవాళ్ళు కూర్చున్నారు.

రెండు బళ్ళు పట్నం వేపు పరుగులు తీశాయి.

పట్నం మొదట్లో ఉన్న హాస్పిటల్ దగ్గిర బండి ఆపించి ఫాదర్ లోనికెళ్ళి విషయం చెప్పాడు.

ఆ డాక్టర్ పరుగు పరుగున వచ్చి ఆమెను చూసి పరీక్షించి – "లాభంలేదు. చూడబోతే అత్యాచారవెూ! యాక్సిడెంట్‌లానో ఉంది..... వేం చేర్చుకోకూడదు....గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసికెళ్ళండి".

ఫాదర్ చేసేదిలేక ఆయన చెప్పినట్టే చేశారు.

హాస్పిటల్‌లో ఫాదర్ చొరవవల్ల, మాటతీరువల్ల అరుంధతికి సకాలంలో వైద్య చికిత్స అందుబాటులోకి వచ్చేసింది. ప్రత్యేకమయిన గదిలో అరుంధతికి ఇద్దరు డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స జరుగుతోంది.

లోపలికి ఎవరినీ రానీయటం లేదు. బయట ఫాదర్, ఊరునించి వచ్చినవారు మౌనంగా కూర్చుని ఉన్నారు.

అరగంట తరువాత డాక్టర్ తలుపుతీసుకుని వచ్చారు.

"మీలో శ్యామ్ ఎవరు?" అడిగింది అందరినీ చూసి.

"లేరు.....ఇంగ్లాండ్ వెళ్ళారు...దేనికి?" అడిగారు ఫాదర్..

"ఈమె తరుఫున ఎవరున్నారు?"

"తండ్రిలాంటి నేనున్నాను. ఆపై ప్రభువు దీవెనలున్నాయి"

"మీరోసారి నాతో రండి"

ఫాదర్ ఆయనతో నడిచారు.

"అసలిది ఎలా జరిగింది?"

"ఏదీ?"

"మానభంగం, చాలా దారుణంగా – అసలు మనుష్యులా రాక్షసులా వాళ్ళు"

"మైగాడ్ – పాపం, పాపులు శిక్షింపబడెదరుగాక...ఆమెని...అరుంధతిని"

"అవును, ఆమెవయస్సు, శరీరం చూసి కూడాఆ పని చేశారంటే వారు మనుష్యులు కాదు. లోపల కండరాలు బాగా చితికిపోయాయి. చాలా క్రిటికల్‌గా ఉంది. శ్యామ్....శ్యామ్....అని కలవరిస్తోంది."

"ఎవరతను?"

"మా ఊరివారే...ఊరికి మారాజులాంటి వారు. మంచివారు. సౌమ్యులు...పెద్దవారు"

"అయితే ఆయన్ని తీసుకురండి. పేషంటు అతన్ని చూడాలని అంటోంది"

"ఆయన ఇంగ్లాండ్ వెళ్ళారు. ఈ రాత్రికే వస్తున్నారని ఫోన్‌లో చెప్పారు"

"అయితే ఎయిర్‌పోర్టుకెళ్ళి అట్నుంచి, ఇటే తీసుకురండి..ఆమె బ్రతుకుతుందన్న నమ్మకంలేదు. ఆమె పరిస్థితి చూస్తే శ్యామ్ అనే వ్యక్తిని చూడటం చివరికోరికలా ఉంది"

"అలాగే" నెమ్మదిగా లేచారు.

"ఒక్కనిమిషం, ఇది పోలీసుకేసు....వారికి కబురు చేశాను. మీకు తెలిసిన వరకూ వారికి సహకరించండి".

"అది నా బాధ్యత" చెప్పాడు ఫాదర్...

☟ ☟ ☟ ☟ ☟

చెన్నై.... మీనంబాకం విమానాశ్రయం విజటర్స్ గ్యాలరీలోంచి కనపడుతోంది బోయింగ్ విమానం రన్‌వేమీదికి వస్తూ.....ఫాదర్ లేచి నిలబడ్డారు. విమానం నెమ్మదిగా కదులుతూ వచ్చి ఆగింది.

ఆగిన విమానానికి ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు నిచ్చెన తగిలించారు. డోర్ తెరుచుకుంది. ఒక్కొక్కరే దిగటం ప్రారంభించారు.

అందరికంటే ముందే దిగారు.

శ్యామ్ అండ్ కో.....

ఫాదర్ వారిని చూసి చెయ్యి వూపారు. శ్యామ్ ఆయన్ని చూడగానే అచేతనమైన మొహం పెట్టాడు. చెకింగ్ ఫార్మాలిటీస్ అయ్యే వరకూ అలానే ఉన్నాడు.

"ఫాదర్ వచ్చారు ఏమైందోనండి" చెబుతోంది రోజీ.

"రాజీవ్‌కేదన్నా జరగలేదు కదా?"

"ష్ అవి జరిగితేనే ఫాదర్ వచ్చేది మనల్ని రిసీవ్ చేసుకోవటానికి వచ్చి ఉండచ్చు" చెప్పాడు. కాని ఏ కారణం లేకుండారారని తెలుసు.

ఏమయి ఉంటుంది. భగవంతుడా! ఇప్పుడు దేన్ని ఏ చిన్న అశుభాన్ని తట్టుకునే శక్తి నాకు గాని నా కుటుంబం సభ్యులకి గాని లేదు. నీవే రక్ష....మూగగా వేడుకున్నాడు.

అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని ఫాదర్ దగ్గరికి వచ్చారు.

"థామస్ బాడీ" అడిగారు ముగ్గురిని చూస్తూ...

"ఇవ్వరట".....

"దేనికి?"

"చెబుతాను ముందుపదండి"

"అసలు చూశారా?" అడిగాడు ఫాదర్.

"వాళ్ళిద్దరూ వెళ్ళారు"

ఫాదర్ వాళ్ళ వంక చూశాడు. రోజీ చేతులతో కళ్ళు వత్తుకుంది. రాగిణి కట్టతెగిన గోదారిలా భోరున ఏడ్చింది.

ఫాదర్ మనసు ద్రవించింది.

రోజీ, రాగిణి భుజాలు పట్టుకుని గ్యాలరీలోంచి బయటికి తెచ్చింది.

"మీరు...ఇక్కడిదాకా వచ్చారంటే భయపడ్డాను. ఏంజరిగిందోనని హడలిపొయ్యాం" చెప్పాడు శ్యామ్.

ఫాదర్ మౌనంగా ఊరుకున్నారు. ఆయన మౌనానికి సమాధానం తెలియక కొట్టుమిట్టాడుతున్నాడు శ్యామ్.

రోజీ ఆందోళనగా ఫాదర్ వంక చూసింది.

ఎవరికీ అడిగే ధైర్యంలేదు. అడిగితే ఏం వినవలసి వస్తోందో నన్న భయం....

బయటికొచ్చాక ఫాదర్ సైగచేశారు. టాక్సీ వచ్చి ఆగింది. లగేజీ పెట్టిఎక్కాక "గవర్నమెంట్ హాస్పిటల్‌కి పోనీయ్" చెప్పారు ఫాదర్.

పేలుతుందనుకున్న బాంబు పేలనే పేలింది. గవర్నమెంటు హాస్పిటల్‌కా ఎవరున్నారు? ఇక మిగిలింది రాజీవేగా.....

"ఫాదర్ ఏమయింది నా బిడ్డకి" కన్నీళ్ళతో అడిగింది.

శ్యామ్ వణికిపోతూ – "హాస్పిటల్‌లో....హాస్పిటల్‌లో...." అన్నాడు.

రాగిణి ఆందోళనగా చూస్తోంది.

"రాజీవ్‌కేం కాలేదు. శుభ్రంగా చర్చిలోనే ఉన్నాడు"

రిలీఫ్....కొండంత రిలీఫ్.....రోజీ కళ్ళు తుడుచుకుంది. సీటు వెనక్కి వాలింది.

"మరి గవర్నమెంట్ హాస్పటల్‌కి దేనికి?"

"అరుంధతి కోసం. ఆమె నిన్ను చూడాలని అంటోంది"

"అరుంధతికా... ఏమయింది ఆమెకి!?" ముగ్గురూ ఒకేసారి అడిగారు ముందుకు వంగి.

ఫాదర్ చూచాయిగా చెప్పారు. ఇంతలో గవర్నమెంట్ హాస్పిటల్ వచ్చేసింది.

"ఏ వార్డు."

"అరవైనాలుగు" చెప్పారు ఫాదర్.

ఆ వార్ట్ ప్రత్యేకమైన గదిలోంచి పోలీసులు బయటికి వచ్చారు. వారికి ఎదురయ్యారు శ్యామ్ వాళ్ళు....

"వీరే ఫాదర్" పరిచయం చేశారు డాక్టర్, పోలీస్ వారికి.

"ఏమిటండి. ఆమె పిచ్చి పిచ్చిగా మాట్లాడుతుంది"

"చెప్పండి ఇన్‌స్పెక్టర్" నమ్రతగా అడిగాడు ఫాదర్.

"ఇది రేప్‌కేస్....ఎలా జరిగిందమ్మా? అత్యాచారం ఎవరు చేశారంటే... ఏదోదో మాట్లాడుతుంది".

"ఎవరట ?" అడిగాడు శ్యామ్.

"చెట్టు అట...మ్రి ఊడ అట....పిచ్చెక్కిందనుకో...అడిగి అడిగి నీరసం వచ్చింది. ఆ రెండూ తప్ప చెప్పదు"

"మ్రి ఊడా?"

"ఆ పేరుతో గాని మీ ఊరిలో మనుష్యులెవరన్నా ఉన్నారా?"

శ్యామ్ లేదన్నట్టు తలవూపాడు.

ఇన్‌స్పెక్టర్ నవ్వి "ఆమెని, ఆమె భారీకాయాన్ని చూస్తుంటే నిజమేనని పిస్తోంది. లేకపోతే ఆమెని రేప్ చెయ్యటమేమిటి? చివరికి ఒప్పుకోవల్సి వస్తుంది. మ్రివూడ....వేపమొదలు లేచి ఆమెలో జోరబడ్డాయని.... నాకు తెలిసి మగాడెవడు ఆమె మీద చెయ్యి వేయడానికి సాహసించడు".

శ్యామ్ సీరియస్‌గా చూశాడు.

"సారీ! వెనుక లేడీస్ ఉన్నారనుకోలేదు" చెప్పాడు ముందుకు కదులుతూ.

అందరూ లోనికి వెళ్ళారు.

అరుంధతి కళ్ళు మూసుకుని నిశ్శబ్ధంగా పడుకుని ఉంది. నలుగురూ నాలుగుపక్కలా నిల్చున్నారు.

గ్లూకోజ్ ఒక్కో చుక్కా పడుతోంది. ట్యూబ్స్ ద్వారా ఆమె శరీరంలోకి వెళుతోంది.

"అరుంధతి"– పిల్చాడు శ్యామ్.

నాగస్వరం విన్న నాగుపాములా కళ్ళు తెరిచింది. ఎక్కడ్నించి వచ్చినాదో ఓపిక వచ్చేసింది.

శ్యామ్ దగ్గరికొచ్చాడు.

"అయిపోయింది శ్యామ్....ఈ జీవితం ముగిసిపోతోంది" శెలవు తీసుకునే ముందు నిన్ను చూడాలనిపించింది. చూశాను".

"అసలిది ఎలా జరిగింది?"

"మఱ్ఱి ఊడలు....కదిలి...కదులుతూ నా చీరని లాగేసి....ఊడలాటి ఊడ"

"ప్లీజ్ జోక్‌లకి యిది సమయం కాదు".

"నిజం చెబితే జోక్ అంటే ఏం చెయ్యను..." కాని ఒక్కటి మాత్రం తీసి పారేయకు...నేనూ....నువ్వు....రాగిణి....రోజీ....థామస్....సలీం ఎవరూ బ్రతకరు.ఎందుకంటే సుజనా బ్రతికే ఉంది కాబట్టి. నీ కొడుకు రూపంలో అది సత్యం"

శ్యామ్ బిత్తరపోయాడు.

"అవును శ్యామ్ – పగ తీర్చుకుంటోంది... ఎర్రపాలెంలో పురుడుపొయ్యటానికి వెళుతున్న నన్ను మీ వాడు తిరిగిరావని చెప్పాడు...అదే జరిగింది తిరిగి రాలేదు. నలుగురు కలిసి ఎత్తుకొచ్చారు".

"రాజీవ్ ఎక్కడున్నాడు" అడిగాడు సీరియస్‌గా.

"చర్చిలో, అక్కడే మన ఊరిలోనే ఉన్నాడు" చెప్పారు ఫాదర్.

"ఆవేశపడద్దు శ్యామ్ ఇది సుజనా పనే – మఱ్ఱి వూడలు కదులుతున్నప్పుడు చాలా క్లియర్‌గా విన్పించింది. చుట్టూ ప్రకృతి సుజనా – సుజనా అని అరవటం – రాజీవ్ రూపంలో నీ ఇంట్లోనే పుట్టింది...ముందే హెచ్చరిస్తోంది కూడా రాజీవ్ ద్వారా......"

రాగిణి ముందుకు వచ్చింది....“నువ్వు నిజమే చెబుతున్నావా? సుజనా ఆత్మ రాజీవ్‌లో ఉందా.....” అంది.

“అందులో సందేహం లేదు....ఇది చెప్పటానికే, జాగ్రత్త చెప్పటానికే బ్రతికి ఉన్నాను. ఋణం తీర్చుకున్నాను శ్యామ్. నన్నో మనిషిగా, నాకో స్టేటస్ ఇచ్చినందుకు కృతజ్ఞురాలిని – శెలవ్”

అరుంధతి మాట ఆగిపోయింది.

డాక్టర్, నర్స్ హడావుడిగా లోపలికి వచ్చారు. డాక్టర్ నాడి పట్టుకుని చూసి పెదవి విరిచాడు.

నర్స్ దుప్పటి కప్పేసింది....గొల్లున ఏడ్వటానికి ఎవరున్నారు. శ్యామ్ వడి వడిగా బయటికి వచ్చాడు – ఆగలేదు. అలానే బయటికి వెళుతున్నాడు.

“ఫాదర్....ఆయనదూకుడు చూస్తూంటే రాజీవ్ దగ్గరకిలా ఉంది. ఈ ఆవేశంలో చంపినా చంపుతారు ఏది నిజమో, ఏది ఆబద్ధమో తెలియకుండానే”

“శ్యామ్....శ్యామ్” వారించాడు.

ఆగలేదు...వెనక్కి తిరిగి చూడలేదు. అతని వెనుకే ఫాదర్, రాగిణి, రోజీ నడుస్తూ పిలుస్తున్నారు.

శ్యామ్ హాస్పిటల్ బయటికి వచ్చి టాక్సీ బ్యాక్‌డోర్ తెరిచి కూర్చుని.....పోనీయ్ అన్నాడు. టాక్సీ అలానే ముందుకు కదిలింది.

జస్ట్‌మిస్....రోజీ వాళ్ళు రావటం శ్యామ్ ఎక్కిన కారు ముందుకు వెళ్ళటం ఒక్కసారి జరిగిపోయాయి.

“ఫాదర్” అంది ఆందోళనగా రోజీ.

“మరేం పర్వాలేదు. మరో బండికి వెళదామ్” అన్నాడు చుట్టూ చూసి.

దగ్గరిలో ఏ టాక్సీ లేదు. అవసరానికి అర్జంటుకి ఎందుకు కనపడతాయి.

క్షణమొక యుగంలా ఉంది రోజీకి. అంత ఆవేశంలో వెళ్ళిన శ్యామ్ ఏ దురాగతం చేస్తాడోనని తల్లడిల్లిపోతోంది ఆ తల్లి మనసు.

పదినిమిషాలకి గాని టాక్సీ దొరకలేదు.

శ్యామ్ ఎక్కిన టాక్సీ గతుకుల్లో ఎగిరెగిరి పడుతోంది.

“ఏం రోడ్డుసర్...బేరింగ్స్ దెబ్బతినిపోతాయి”.

“నోర్మూసుకుని పోనీయ్....నీకు కావలసినంత డబ్బు ఇస్తాను”.

డ్రైవర్ కిమ్మనకుండా వేగం పెంచాడు.

ఊరి పొలిమేరల్లో చర్చి కనపడుతూనే ఊపిరి బిగపెట్టాడు శ్యామ్.

చేతులు బిగించాడు కసిగా. అతని కళ్ళముందు థామస్ మెదులుతున్నాడు.

సలీం.... అరుంధతి... అందరూ....

చర్చి దగ్గర టాక్సీని ఆపించి- జేబులోంచి మనీ పర్స్ తీసి టాక్సీ లోకి విసిరేసి పరుగున లోనికివెళ్ళాడు.

ఫాదర్ గదిలో చదువుకుంటూ ఉన్నాడు రాజీవ్.

గదిలోకి అడుగుపెడుతూనే సింహంలా గర్జించాడు శ్యామ్.

"రాజీవ్!"

తండ్రిని చూస్తూనే అమాంతంగా పుస్తకం పక్కన పడేసిలేచాడు.

పరుగున శ్యామ్ దగ్గరికొచ్చాడు.

అతనరిచిన అరుపుని కాని మొహంలో కోపాన్నిగాని గమనించలేదు.

రాజీవ్ దగ్గరికి వస్తూనే లాగిపెట్టి చెంపకేసి కొట్టాడు.

"అమ్మా" అరిచాడు రాజీవ్ గజం దూరం ఎగిరి.... ఆ దెబ్బకి ముప్పయి రెండు పళ్ళు కదిలాయి...

శ్యామ్ ఒక్క ఉదుటన ముందుకెళ్ళి లేపి.... చొక్కా పట్టుకుని పైకెత్తి గోడకేసి అదిమి కడుపులో గుద్దాడు. కడుపులో రక్తం ఎగచిమ్మింది.... నోట్లోకి వచ్చేసింది.

"వెధవ..... నా తమ్ముడిని చంపుతావా? నిన్ను .... నిన్ను......

రాజీవ్ విల విల లాడిపోతున్నాడు...

"నిన్ను యిలా కాదురా.... తల బద్దలు కొట్టి చంపుతాను. నా తమ్ముడు శరీరంలో రక్తం లేకుండా పీల్చి చంపిన నిన్ను" అని చుట్టూ చూశాడు.

దగ్గరలో స్టూల్ కనపడింది. దాన్ని విసురుగా ఎత్తాడు.

రాజీవ్ తలకేసి విసురుగా కొట్టబోయాడు.

ఫాదర్ వచ్చి మధ్యలో ఆపారు.

"వదలండి ఫాదర్... వాడు బ్రతకకూడదు"

"ఏవండి..." రోజీ కన్నీళ్ళతో వేడుకుంది.

"శ్యామ్ పిచ్చితనంగా ప్రవర్తించకు. ఆ పసివాడ్ని చంపితే నీ సమస్య తీరదు"

"కనీసం కసి తీరుతుందిగా" విడిపించుకున్నాడు.

"ఇదిప్రభువుస్థానం...ఇక్కడ హింసకి తావులేదు" ఆజ్ఞాపించారు ఫాదర్.

శ్యామ్ స్టూల్‌ని విసిరేశాడు.

"ఒకప్పటి పాపం శాపమై మిమ్మల్ని వెంటాడుతోంది.. దానికి ఈ పసివాడ్ని శిక్షించినంత మాత్రాన ఆ పాపం పోదు"

శ్యామ్ తల కొట్టుకున్నాడు.

"అవును ఫాదర్....పాపం చేశాం....ఘోరమైన దారుణం చేశాం. ఇప్పుడనుభవిస్తున్నాం"

ఫాదర్ అనునయంగా చెయ్యేశారు.

"రిలాక్స్ శ్యామ్. తప్పులు చెయ్యటం మానవనైజం, దారుణాలు చెయ్యటం రాక్షసనైజం. నువ్వు తప్పుచేసావో, రాక్షసంగా ప్రవర్తించావో చెప్పు...ఉన్నదున్నట్టు చెప్పు....ఆపై క్షమించటానికి,రక్షించటానికి ఆ ప్రభువు ఉన్నాడు. క్షమించగలిగేదయితే ఆ ఏసునాధుడు తప్పక క్షమిస్తాడు".

"లేదు ఫాదర్, దానికి క్షమాపణ లేదు"

"అసలేం చేశావో చెప్పు"

"చెబుతాను ఫాదర్ – డబ్బు కోసం, ఆస్థికోసం చేసినఘోరం చెబుతాను– అమాయకమయిన ఆడపిల్లను చంపిన రాక్షసంగా చేసిన వైనం చెబుతాను"......

రాగిణి, రోజీ తలొంచుకున్నారు.రాజీవ్ ఏడుస్తూ తండ్రినే చూస్తున్నాడు.

"ఇప్పుడు చెబుతున్నది, బాధపడుతున్నది మా ప్రాణాలు పోతాయని కాదు...ఇవన్నీ జరగక ముందే మారిపోయాం....రోజీకి వీడు నాలుగో సంతానం....

మొదట ముగ్గురూ పోయారు పురిటిలోనే! ఆ పాపమే శాపమయిందని తెలుసుకున్నాం. చేసినదానికి పశ్చాత్తాపపడ్డాం....ఆమెపేరు మీద ఒక అనాథ శరణాలయం కట్టించాను. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఫీజులు కట్టి చదివిస్తున్నాను....ప్రతి సంవత్సరం ఆ రోజున ఆమె పేరుతో అన్నదానం చేయిస్తున్నాను".

"మీ తండ్రిగారు పోయిన రోజని చెప్పి పెట్టిస్తున్న అన్నదానం వస్త్రదానం అదేనా".

"నిజానికి మా తండ్రిగారి వర్థంతి కాదు...ఆమెది...ఆమెది....ఆమె ఆత్మశాంతి కోసం....ఆమె ఏడ్పు, వేదన మాకు...మా ఇంటికి తగలకూడదని చాలా చేశాను...ఎన్ని చేసినా, చేసిన పాపం పోతుందా! పోదు...పోదు....మమ్మల్ని సర్వనాశనం చేసేదాకా పోదు...."

"ఇంతకి ఆమె?" అడిగాడు ఫాదర్....

"ఆమె పేరు.....?"

"వూఁ చెప్పు, ఆమెపేరు" రెట్టించాడు ఫాదర్.

శ్యామ్ నిస్సహాయంగా కుర్చీలో కూలబడ్డాడు.చెప్పలేనట్లు తలాడించాడు...అసహాయంగా చెప్పాడు.

"నన్నేమీ అడగొద్దు....నేను చెప్పలేను....నాకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆ తల్లికి చేసిన ద్రోహం చెప్పలేను".

ఫాదర్ అతన్ని రెట్టించదలచుకోలేదు.

"రాజీవ్‌ని నా దగ్గరే ఉంచుకుంటాను. అతన్ని పట్టిన సైతాన్ని వదిలిస్తాను".

"నాకు భయంగా ఉంది ఫాదర్".

"రాజీవ్‌ని కదలకుండా ప్రభువు సన్నిధిలోనే ఉంచుతాను.... తెల్లారాక ఆలోచిద్దాం.... .ఇంటికెళ్ళండి....అయినా మీరు భయపడాల్సింది. రాజీవ్ గురించికాదు...మిమ్మల్ని వెంటాడుతున్న ఆత్మ గురించి ఇంగ్లాండ్‌లో థామస్‌ని బలి తీసుకున్న సైతాన్‌కి".

"ఈ రాత్రి మాకు తెల్లవారుతుందున్న నమ్మకం లేదు" అన్నారు రోజీ, రాగిణిలు.

"అలాగయితే మీరన్నాచెప్పండి.ఏం చేసారు....ఎవరి ఉసురు పోసుకున్నారు".

అందరి సమాధానం మౌనమే.

"అయితే ఇక్కడే నాతోనే ఉండండి. ఈ పవిత్రమైన ప్రదేశంలో ఏ గాలీ, దూళి రాదు.....నిరభ్యంతరంగా పడుకోండి...

"రాజీవ్" చూపించింది.

"భయంలేదు.రాజీవ్ ఇప్పుడు పసికూన మాత్రమే...అతనిలో ఉన్న సైతాన్ అతనితోపాటు లోపలకు రాలేదు. బయట తిరుగుతుంటుంది".

ఫాదర్ ధైర్యం చెప్పి అందరూ పడుకోవటానికి సన్నాహాలు చేశారు.

ఫాదర్ కూడా కాసేపు బైబుల్ చదువుకుని వారితోనే పడుకున్నారు.

రాత్రి పన్నెండు గంటలు-

ఎవరూ నిద్ర పోవటం లేదు...శ్యామ్ కూర్చున్నవాడు...కూర్చున్నట్టే ఉండిపోయాడు.

రాజీవ్ ఆదమరచి నిద్రపోతున్నాడు.

ఆడవాళ్ళిద్దరూ లేచారు. కుచ్చిళ్ళు సవరించుకున్నారు.

"ఎక్కడికి?" అడిగాడు శ్యామ్ కళ్ళు తెరిచి.

"బాత్ రూమ్‌కి"

"బయటికా?"

"మరేం ఫర్వాలేదు ఒకరికి ఇద్దరున్నాం..."

"మనల్ని పీడిస్తున్నది రాక్షసుల్లాంటి మనుష్యులు కాదు...ఒకరికి ఇద్దరుంటే వెనక్కి తగ్గడానికి, ఏ రూపంలో వస్తుందో, ఎప్పుడు ప్రత్యక్షమౌతుందో తెలీదు"

"ఈచర్చి ఆవరణలోకి వస్తుందంటారా?"

"నేనూవస్తాను పదండి"

ఇద్దరూ మారు మాట్లాడకుండా నడిచారు. చర్చి ఆవరణలోనే ఉన్నాయి బాత్‌రూమ్స్.

ముగ్గురూ నడుస్తున్నారు. .....

"జాగ్రత్త....రాయి చూడు ఎలా ఉందో...చూసి నడవండి" చెప్పాడు శ్యామ్....

వాతావరణం చల్లగా ఉంది.....చలికి రెండు చేతులు కట్టుకుని రాయిని తప్పించి నడిచారు.

బాత్‌రూమ్ నుంచి బయట కొచ్చేదాకా ఆవరణలోనే అటూ, ఇటూ తిరిగాడు.

వారు రాగానే చర్చి లోపలికి బయల్దేరాడు.

"ఎంత ఖర్మ వచ్చిందండి" ఏడ్పు గొంతుతో అంది రోజీ.

"నవ్వుతూ చేసిందానికి, ఏడుస్తూ అనుభవిస్తున్నాం" విరక్తిగా అన్నాడు.

"మనజీవితాలు ఇంతేనా? ప్రతి రోజు యిలా చస్తూ బ్రతకవలిసిందేనా?"

"ఇంతకంటే ఆత్మహత్య చేసుకోవటం ఉత్తమం" రాగిణి వ్యధగా చెప్పింది.

"అప్పుడు మాత్రం ఆమె వదులుతుందా?" ఆ నమ్మకం నాకు లేదు".

"ఏదయినా ఆలోచించండి. సైతాన్ పారద్రోలే తాంత్రికులుంటారు..."

"ఉంటే....వాళ్ళు నన్నేం చేయగలరు?" పిడుగులు కురిసినట్టు మాటలు వినిపించాయి.

ముగ్గురు ఉలిక్కిపడి చూశారు వెనక్కి.

రాజీవ్....నవ్వుతున్నాడు ఎగతాళిగా.

"రాజీవ్ నువ్వెందుకు బయటికొచ్చావ్" ఒకింత భయంగా అంది రాగిణి.

"రాజీవ్‌ని కాదు.....నేను....గుర్తుపట్టలేదా?" గొంతూ మారింది. ఆడ గొంతు వచ్చింది.

"ను...ను......ను.....వ్వు"

"నేను....థామస్‌ని చంపింది నేనే. అరుంధతిని హడలుకొట్టింది విలవిలలాడుతూ ప్రాణం పోయేలా చేసింది నేనే...నీ ప్రియుడ్ని రక్తం పీల్చి పిప్పి చేసింది నేనే...." తెరలు తెరలుగా నవ్వింది.

గాలి ఒక్కసారి ప్రభంజనంలా వీయడం మొదలుపెట్టింది.

రాజీవ్ వికటాట్టహాసం చేస్తున్నాడు.

టప్...

ముగ్గురి గుండెలవిసిపోయాయి.

వస్తున్నప్పుడు కనబడిన బండ....లావాటి బండ....మధ్యకి చీలిపోయింది...

"అలా...అలానే మీ గుండెలూ పగిలిపోవాలి....పరువు పోయి గొంతుకు తాడు బిగించుకుని చనిపోయిన మా తాతయ్యలా మీరు ఆత్మ హత్యచేసుకోవాలి...క్షణం క్షణం ఛస్తూ బ్రతకాలి.

"వద్దు దీనికంటే ఒక్కసారి గొంతు పిసికి చంపు..."

"ఎవర్ని చంపాలో...ఎవర్ని తమకు తామే చచ్చేస్థితికితేవాలో నాకు తెల్సు.....అటు చూడండి"

ముగ్గురూ అప్రయత్నంగా తలలు అటుకేసి తిప్పారు.

పాము....భయంకరంగా పడగవిప్పి ఉంది. బుసలు కొడుతూ ఉంది.

"పాము...." అరిచింది రోజీ.

"ఒకటికాదు...మూడు..." పలికింది రాజీవ్ గొంతు.

ఆ మాట ఆ నోటి నుంచి రావటం ఆలస్యం మూడు పాములు ప్రత్యక్షమయ్యాయి.

మూడు మూకుమ్మడిగా కదిలాయి.

ముగ్గురూ భయాందోళనలతో జరిగారు.

"ఏవండి తేళ్ళండి" అరిచింది రోజీ.

శ్యామ్ క్రింద చూశాడు.

చుట్టూ అన్నీ తేళ్ళే.

ఎటు చూసినా తేళ్ళే....కొండెలు జాపుకుని....కాళ్ళతో ప్రాకుకుంటూ నలువేపుల నుంచి....వాటి మధ్యలో పాములు.

"ఏవండి నా చీరమీదగా ఎక్కుతున్నాయండి...." రోజీ కీచుమంది.

విపరీతమైన గాలి....

హోరుమని శబ్దం.....

ఎటుచూసినా విషపు కీటకాలే.

"అమ్మో రెండు తేళ్ళు నా జాకెట్టులోకి దూరాయి" భయంకరముగా ఎగురుతూ అంది రాగిణి.

"హా....హా....హా....."

"అమ్మా" అరిచింది దిక్కులు దద్దరిల్లేలా రాగిణి.

సరిగ్గా మడెంమీద వేసింది కాటు...మరొకటి మోకాలిమీద వేసింది.

చీరలోంచి దూసుకెళ్ళి మరీ దిగింది విషపుకోర కస్సున.

రాగిణి పెడబొబ్బలు పెట్టింది.

"ఇంకా...ఇంకా అరవండి. మీ అరుపులు చుట్టూ నా ఆధీనంలో ఉన్న ఈ ప్రకృతిని దాటిపోవు....మీ పెడబొబ్బలు అరణ్య రోధనలే"

రాగిణికి కళ్ళు తిరిగాయి.

కళ్ళముందు ఏమీ కనిపించడం లేదు. గాలికి చీర పల్టీలు కొడుతోంది.

గుండెలమీద పమిట జాకెట్టుకి పెట్టిన పిన్నీసుని వూడబెరుక్కుని వచ్చేసింది.

ఇష్టం వచ్చినట్టు పిచ్చిపట్టినట్టు రెపరెపలాడుతోంది.

రాగిణి కళ్ళతోపాటు స్పర్శకూడా తెలియటంలేదు. కాళ్ళు నిలబడనంటున్నాయి.

దబ్బున పడింది.

శ్యామ్, రోజీ అవాక్కయిపోయి చూస్తున్నారు. తేళ్ళు, పాములు వారిద్దరిని వదిలేశాయి. అన్నీ రాగిణి చుట్టూ చేరి నాట్యం చేస్తున్నట్టు ఎగురుతున్నాయి.

ఆమె పడటం ఆలస్యం.....ఒక్కసారి మీదికి వచ్చేశాయి.

చిన్ని చిన్ని కాళ్ళని కదిలిస్తూ....కొండెలు ముందుకు చాపుతూ అన్నీ – అన్నీ ఒకేసారి రాగిణి మీదికెక్కాయి. ఎన్ని ఉన్నాయోగాని రాగిణి కనబడటం లేదు. అన్నీ తేళ్ళే గుట్టగా ఆమెమీద దాడిచేస్తున్నాయి.

రోజీ ఉండలేకపోయింది. కళ్ళు గిర్రున తిరిగాయి. దబ్బున పడిపోయింది.

శ్యామ్ ఆ స్థితిలోనూ భార్యను పట్టుకున్నాడు.

భార్యని వొద్దికగా పడుకోబెట్టి రాగిణి వైపు చూశాడు.

ఇప్పుడు తేళ్ళు లేవు...గాలిలేదు....రాజీవ్ కోసం చూశాడు.

కిందపడి ఉన్నాడు....

అంతా నిశ్శబ్ధమే...

శ్యామ్ గుండెలు చిక్కపట్టుకుని రాగిణి దగ్గరకు వెళ్ళాడు.

ఆమె కళ్ళు పైకి చూస్తున్నాయి.

వణికే చేతులతో భుజం దగ్గర చేయివేసి లేపబోయాడు. ఆమె భుజానికి అతని చెయ్యి తగలటం ఆలస్యం షాక్ తిన్నాడు.

చెయ్యి సైతం వణికిపోతోంది. నమ్మశక్యంగాక మళ్ళీ పట్టుకున్నాడు.

భుజం పట్టుకోగానే దిగిపోయింది. చేయి తగలగానే కుచించుకుపోతోంది. ఈసారి శ్యామ్ చేతిని పట్టుకున్నాడు. గాలి బూరని పట్టుకున్నట్టు మెత్తగా ఉంది. లోపలేమీ లేదు....డొల్ల....

అంటే రక్తం మొత్తం తేళ్ళన్నీ కలిసి పీల్చివేశాయన్నమాట....ఒళ్ళు జలదరించి కెవ్వుమన్నాడు.

అతని కేకకి అతని చెవులే పగిలిపోయేలా విపరీతమైన భయానికి టెన్షన్‌కి, షాక్‌కి స్పృహ కోల్పోయాడు.

"రాగిణీ!" గది పై కప్పు అదిరేలా అరుస్తూ లేచాడు.

ఇంజక్షన్ చేయబోతున్న నర్సు ఉలిక్కిపడి సిరంజి వదిలేసింది.

ఆ అరుపుకి పక్క వార్డులో ఉన్న డాక్టర్ పరిగెత్తుకొచ్చాడు.

శ్యామ్ రొప్పుతున్నాడు.

శరీరమంతా క్షణంలో చెమట పట్టేసింది.

డాక్టర్ నుదుటిమీద చేయి వేసి చూశారు.

"ఎవరు మీరు? నేనెందుకు ఇక్కడున్నాను?" అడిగాడు హాస్పిటల్ వాతావరణాన్ని అయోమయంగా చూస్తూ.

"మిమ్మల్ని ఫాదర్ చేర్పించారు పది రోజుల క్రితం....అప్పటి నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నాం. ఇదిగో ఇప్పటికి కోమాలోంచి బయటికొచ్చారు".

"పదిరోజులా? పదిరోజులయిందా నేను కోమాలో కెళ్ళి"

"అవును! ఇప్పుడెలా ఉంది? ఆకలివేస్తోందా?

"అబద్ధం! నేను కోమాలోకి వెళ్ళలేదు"

"కాదు నిజం" అప్పుడే వచ్చిన ఫాదర్ చెప్పారు.

"ఫాదర్" చిన్న పిల్లాడిలా చేతులు చాపాడు.

"గాడ్ బ్లెస్ యూ మైసన్" ఆశీర్వదించాడు.

"నిజంగా పది రోజుల నుంచి ఈ బెడ్‌మీద ఉన్నానా....మరి నా భార్య...?

"రోజీ!"పిల్చారుఫాదర్.

జీవచ్ఛవంలా ఉన్న రోజీ వచ్చింది.

ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

ఆమెతో పాటు రాజీవ్ దీనంగా చూస్తూ వచ్చాడు.

రాజీవ్‌ని చూడగానే శ్యామ్ కళ్ళు పెద్దవయ్యాయి. పళ్ళు పటపటకొరికాడు.

పెద్దవయిన కళ్ళు నెత్తుటి ముద్దలయ్యాయి.

"ఒరే.....నిన్ను....చంపేస్తాను...అసలు నువ్వేరా దీనికంతటికీ కారణం" లేచాడు దిగ్గున.

ఫాదర్ చప్పున రాజీవ్‌ను పట్టుకుని–

"డాక్టర్ ఈ కుర్రాడిని తీసుకుని కొద్దిసేపు బయటికి వెళ్ళండి" అన్నాడు.

డాక్టర్, నర్స్ రాజీవ్‌ని తీసుకుని వెళ్ళారు.

"ఫాదర్ నన్నాపకండి....." మంచం మీద నుంచి క్రిందికి దిగి అన్నాడు.

ఫాదర్ అడ్డు తగిలారు.

"వెళ్ళు- కాని ఒక్కదానికి సమాధానం చెప్పు....చంపాలనుకుంటున్నది ఎవర్ని".

"రాజీవ్‌ని" "నీ కొడుకుని?"

"ఫాదర్ వాడు నాకొడుకు కాదు. మా పాలిటి పిశాచం. వాడ్ని చంపితేగాని నా మనసు శాంతించదు".

"నువ్వు చెప్పే పిశాచం రాజీవ్‌లో ఇప్పుడు లేదు. అది ఉన్నప్పుడు దాని ఛాయలకు కూడా వెళ్ళలేవు. వెళ్ళినా చంపినా చచ్చేది నీ కొడుకే గాని ఆ పిశాచం కాదు. మరో శరీరం చూసుకుంటుంది. వాళ్ళ ద్వారా కావాలనుకున్నది చేయిస్తుంది. చెప్పాలనుకున్నది చెబుతుంది".

"ఫాదర్ మీకు తెలీదు. ఆ రోజు మేం ముగ్గురం బయటికి వెళ్ళినప్పుడు అప్పుడు వాడి నవ్వు....నవ్వు" అని....ఆగి ....పోయాడు.

రోజీకి అర్థం అయింది. శ్యామ్ రాగిణి కోసం చూస్తున్నాడని.....

ఫాదర్‌కి తెలిసింది. అతనడగబోయే ప్రశ్నకి సమాధానం...చెప్పటం ఇష్టంలేక పక్కకి తిరిగారు.

"చెప్పండి ఫాదర్ రాగిణి...రాగిణి ఏది?"

రోజి పమిటచెంగు అడ్డం పెట్టుకుంది.

ఫాదర్ కళ్ళు మూసుకున్నారు.

"దయచేసి చెప్పండి...తేళ్ళు.....విషం....ఒంట్లోని రక్తాన్ని పీల్చి ఓగాడ్....పగవాడికి కూడా వద్దు ఆ చావు".

రోజీ ఏడుస్తూ అంది.

"మనకిక రాగిణిలేదు. కనబడదు... ఆ ప్రభువు దగ్గరికెళ్ళింది".

"ఫాదర్" తన చేతులతోనే పిచ్చివాడిలా తల కొట్టుకుంటూ అరిచాడు.

"ఇప్పుడు నువ్వెంత ఏడ్చినా, గోలచేసినా, గుండెలు బాదుకున్నా ప్రయోజనం లేదు.

ఆ ప్రభువు కూడా క్షమించలేని తప్పుకి శిక్ష అనుభవిస్తున్నావ్".

"అంతమాటనకండి ఫాదర్...." ఆయన రెండుకాళ్ళమీద పడ్డాడు శ్యామ్.

"లే....లే....అసలేం జరిగిందో చెప్పు....అది తెలిస్తే రాజీవ్ శరీరంలో ఆ ఆత్మని ఆవహింపచేసి క్షమించమని మీ తరఫున వేడుకుంటాను."

"చెబుతాను ఫాదర్. ఆమెని క్షమాపణ వేడుకోవటం కోసం చెబుతాను. కన్నీళ్ళతో ఆమె ముందు నిలబటం కోసం చెబుతాను. అప్పటికి నాకింకా పెళ్ళికాలేదు. థామస్‌కి కూడా....

"సాహి" తెలుసుగా....మా అమ్మచనిపోయిన తరువాత మా నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకి పుట్టినవాడే సాహి....మంచివాడు.అన్నెం పుణ్యం తెలియని వాడు వాడు.

సాహి పుట్టిన కొన్నాళ్ళకే – ఈ ఊరిలో ప్లేగు వ్యాధి విస్తరించింది.

ఆ విష ప్రభావం వల్ల మా నాన్న, సాహి అమ్మపోయారు. మేం ముగ్గురం ఏకాకుల్లా మిగిలాం. కాకపోతే ఒకే కప్పుకింద ఉండే వాళ్ళం.

థామస్ నేను ఎప్పుడూ వాడ్ని తమ్ముడిలా చూసేవాళ్ళం కాదు. ఇంటి చాకిరి, బయటి చాకిరి మొత్తం వాడిచేత చేయించేవాళ్ళం.

ఇప్పుడు మేం ఉంటున్న భవనం మాదికాదు. తాత ముత్తాతలు సంపాదించింది అసలే కాదు. వెంకట్రామయ్య గారిది.

ఆమె మనవరాలు...ఆమె మనవరాలు...పద్ధెనిమిది సంవత్సరాల అపరంజిబొమ్మ.....అందాల భరిణె.....ఆ పిల్లపేరు.....?

...... ...... ....... ....... ........

...... ...... ....... ....... ........

"సుజన"

ఎంత అందమైన పేరు...గులాబి పువ్వుకి, పిల్ల తెమ్మరకు అంటు కడితే విచ్చుకున్న అపురూప పుష్పం....అద్భుత సౌరభం....

"ఆమె గురించి మీకు తెలీదు....ఎంత చక్కగా, గంగానది పరుగులు తీస్తున్నట్టు రమ్యంగా మాట్లాడుతుందో...అసలందం, కళ్ళు మీనాల్లాంటి కళ్ళు టపటప లాడించిందంటే....అంతే! కళ్ళేనా మొత్తం మోము.....బ్రహ్మ చంద్రుడిని చూస్తూ చేసి ఉంటాడు. పక్కన చదువుల తల్లి సాధిస్తున్నా విన్పించుకోకుండా భూమిమీద వదిలేసుంటాడు"

"అంతేలే, ప్రేమలో పడ్డవాళ్ళు ఇంతేలే అసలు ప్రేమలో ఏ మహత్తువుందో కాని... ప్రేమలో పడటం ఆలస్యం... కవిత్వం తన్నుకొచ్చేస్తుంటుంది."

"పాపం, సాహి, ఎలా ఉండేవాడు, ఎలా అయిపోయాడో"

"నోరు ముయ్యండిరా....నన్ను చూస్తే ఈర్ష్య, మీకు కుళ్ళు"

"దేనికి"

"చల్లగాలికి కూడా ఆహ్లాదంగా ఎవర్ని తాకినప్పుడు ఉంటుందో ఆమె. ఆమెని నేను ప్రేమిస్తున్నందుకు...నా ప్రేమని చూసి మీకు ఏడుపు....

"అంత సీన్ లేదులే– అయినా ఆమెక్కడా, నువ్వెక్కడా....అసలు వాళ్ళింటికి ధైర్యంగా వెళ్ళగలవురా నువ్వు"

"వెళతాను, కాని వెళ్ళను, ఆమె ఆజ్ఞాపిస్తే. ఆమె కనుసైగచేస్తే వెళతాను.

మిత్రులు గట్టిగా నవ్వారు.

"ఎందుకురా నవ్వుతారు" కోప్పడ్డాడు.

"లేకపోతే ఏంమిటిరా...ఇంతవరకూ ఆమె నిన్ను చూసి నవ్విందా? ఎన్నిసార్లయినా నువ్వు చూడటమేగాని. ఒక్కసారన్నా వోరగా నిన్ను చూసిందా. నీగోలే గాని ఆమె నిన్ను ప్రేమిస్తుందా?

"ఎందుకు ప్రేమించదు...మంచి మనసుంది...ప్రేమించే అందం ఉంది"

"ఆ రెండూ ప్రేమకి కొలబద్ధలు కావు"

"మరి?"

"పాతాళభైరవి సినిమా చూడలేదా?"

"చూశాను అయితే"

"సాహసం చెయ్యాలిరా, అప్పుడే రాజకుమారి వరించెను"

"మాంత్రికుడొచ్చినా సుజనాని ఎత్తుకుని పోతే కాపాడుతాను. మరి ఏ మాంత్రికుడు రాడే, తీసుకుపోడే"

"నీ బొంద...సాహసమంటే అదేనా? నువ్ మాంత్రికుడి కోసం ఎదురు చూస్తుండు....ఈలోగా ఆమె పెళ్ళయిపోతుంది. నీ ప్రేమ తుస్సుమంటుంది".

"అంతేనంటావా?"

"అంతకాకపోతే ఎంత? ముందు ఓ సాహసం చేసి ఆమె దృష్టిలో పడు. అప్పుడు నిన్ను తప్ప మరొకరి గురించి ఆలోచించదు"

"సాహసమా? అంటే"

"సాహసమంటే....సాహసమే"

"సగం సగం చెప్పకండిరా. సాహసమంటే తెలుసుకాని ఏమిటో తెలియటం లేదు"

"ఇంటికెళ్ళి తీరిగ్గా ఆలోచించు...రేపు కలుద్దాం అన్నారు మిత్రులు"

సాహి దీర్ఘంగా నిట్టూర్చి ఇంటికేసి నడిచాడు.

బయట నారతో నులకమంచం తాడుని పేనుతున్న శ్యామ్ – "ఏరా ఆలస్యమయింది" అడిగాడు.

"రోజూ సైకిల్‌మీద దింపే ప్రెసిడెంట్‌గారబ్బాయి ఈ రోజు రాలేదు. నడిచి వచ్చేసరికి ఆలస్యమియింది.

"సరిసరి వెళ్ళు......

కరణంగారి తోటకి నీళ్ళు పెడితే వడ్లు పంపిస్తామన్నారు. ఈ రాత్రికి ఆ పని పూర్తిచెయ్".

"అన్నయ్యా....రేపు పరీక్షలు" నసిగాడు.

శ్యామ్ కోపంగా కళ్ళెత్తాడు.

"ముందే చెప్పాను. చదువుకుంటానికి వెళతానన్నప్పుడే చెప్పాను నీ చదువుకి సరిపోయేడబ్బు నువ్వే సంపాదించుకోవాలని"

"అనికాదు, నిన్న రాత్రి కూడా నిద్రలేదు....కరణంగారి కోడలిని పుట్టింట్లో దింపి వచ్చేసరికి పన్నెండయింది. మధ్యలో ఎద్దులు మొరాయించాయి. వాటిని దొడ్డిలో కట్టేసి వచ్చేసరికి తెల్లారిపోయింది"

"సరే అయితే చదువు మానేయ్"

"ఆ.....అదేంలేదు వెళ్తాను" అన్నాడు సాహి వెళ్ళకుండానే.

శ్యామ్ నార ఉండును ఇస్తూ "ఇది పేని ఆ తరువాత వెళ్ళు.... ఏదో అడగాలనుకుంటున్నావ్"అన్నాడు.

"సాహసమంటే ఏమిటన్నయ్యా....."

శ్యామ్‌కి ఎలా చెప్పాలో అర్థం కాలేదు. క్షణం ఆలోచించి దగ్గరికి రమ్మన్నాడు. అందుబాటులోకి రాగానే లాగిపెట్టి చెంపకేసి కొట్టాడు. గూభ గుయ్ మంది. శ్యామ్ అయిదువేళ్ళు సాహి బుగ్గల మీద తేలాయి.

"ఇది కాదు సాహసమంటే, పెద్దాళ్ళు చిన్నవాళ్ళని కొడితే సాహసం అవదు. తిరిగి నన్ను నువ్ కొడితే సాహసం అవుతుంది"

"సాహసం అంటే అదా!"

"నోర్మ్యూయ్" చదువకోవటానికి వెళుతున్నావా, అడ్డమైనవాళ్ళ మాటలు వినటానికి వెళుతున్నావా? నిజం చెప్పు, నిన్నేదో కష్టాలు పెట్టి నీ చేత శ్రమ చేయిస్తూ హింసిస్తున్నామని ఎవరో నూరి పోసారు కదూ! వెళ్ళి ఎదురు తిరిగి సాహసం చెయ్యమని చెప్పారు కదూ.....

"అయ్యో. అయ్యో అదేమి లేదన్నయ్య....."

కళ్ళు మూసుకుని "వెంట్రుక తెంపి చేతికిస్తే చివరేదో,, మొదలేదో చెప్పగలనురా.... నాకు... నాకు ఎదురు తిరగాలనుకుంటావా?" అంటూ దగ్గరకొచ్చి పట్ట పట కొట్టాడు....

ఈ గొడవకి లోపల్నించి థామస్ వచ్చాడు.

"అరే ఏమైంది. ఎందుకలా కొడతావ్....."

"మారు తల్లి కొడుకుని కూడా చూడకుండా సొంత తమ్ముడిలా చూసుకుంటుంటే మనం హింసలు పెడుతున్నామట..... నువ్వెంత అని అడిగే స్థితికి వచ్చాడు."

"అదికాదు థామస్ అన్నయ్య"

"వెదవని చితక్కొట్టు.....బోడి వెధవకి చదువొకటి.......వద్దంటే వినలేదు..." పో కళ్ళముందున్నావంటే చంపేస్తాను.... వెళ్ళి కరణంతోటని తడుపు" హుంకరించాడు శ్యామ్.

– పగిలిన చెంపని నిమురుకుంటూ కన్నీళ్ళతో వెళ్ళాడు.

"అన్నయ్యా వీడ్ని చదువు మాన్పించు....నేను ఇంకా చదువుతానంటే వద్దని ఈ పల్లెటూరిలో పడేశావ్....వాడ్ని మాత్రం చదివిస్తున్నావ్.....నీకు సొంత తమ్ముడు చూస్తుంటే నేనుకాదు వాడని అనిపిస్తోంది."

"ఛ.....ఛ అవేం మాటలురా, పిచ్చోడా, నువ్వు చదువుకునేంత ఆర్థికస్థోమత లేదు ఉన్నంత వరకూ చదివించాను. మరి సాహినెందుకు చదివిస్తున్నావని అనొచ్చు....నిజానికి వాడ్ని చదివిస్తున్నది మన డబ్బుతోకాదు....

"మరి" ఆశ్చర్యంగా అడిగాడు.

"వెంకట్రామయ్య గారి డబ్బుతో...."

"ఇదిగో, అయిదు వందలు మళ్ళీ అవసరమొస్తే అడుగు...మన వూరి పేరుని రాష్ట్ర వ్యాప్తంగా తెలిసేలా చేసిన "సాహి" ఇంకా చదవాలి....మరెంతగానో వృద్ధిలోకి రావాలి పదవ తరగతిలోనే కాదు ఆపై చదువుల్లో కూడా ఫస్ట్ రావాలి"

"ఏదో తమ దయ" అందుకుంటూ చెప్పాడు శ్యామ్.

''రేపట్నించి పరీక్షలటగా, సుజనా చెప్పింది ''సాహి''బాగా చదువుతున్నాడా".

"ఆహా, ఇప్పుడే వచ్చాడు. రాగానే వద్దన్నా వినకుండా కరణం గారి తోటని తడపటానికి వెళ్ళాడు. వద్దంటే వినడాయె?

"అదేవద్దు... మీ నాన్న గారు నాకు మంచి స్నేహితుడు మీ కుటుంబాన్ని ఆదుకుంటే మా స్నేహాన్ని గౌరవించుకున్నట్లే..పోయి ఎక్కడున్నాడో కాని, మంచి మాటకారి, ఏ సమస్యకయినా పరిష్కారం చెప్పేవాడు"

"వస్తాను బాబు"

"ఆఁ..ఆ ఒక్క నిమిషం...." అని సుజి.....సుజి..." అని పిల్చారు.

ఆ పిల్పు విన్న రెండో క్షణంలోనే ఓ అపరంజి బొమ్మ బయటికి వచ్చింది. ఆమె నడుస్తున్నప్పుడు కాళ్ళకున్న మామిడి పిందెల పట్టీలు గల్లు గల్లుమని శబ్ధం చేస్తున్నాయి.

"కృష్ణుడు మురళి ఊదుతున్నట్టు ఉంటుందయ్యా నా మనవరాలి కాలి అందెలు గల్లు మంటుంటే"

"అంతేనా అపరలక్ష్మీదేవి బాబు...."

"నిన్న నేను పట్నం నించి తెచ్చినవి పట్టుకురా".

చిరునవ్వుతో తలూపి లోపలికి పరిగెత్తింది. తాతయ్య అడిగినవి పట్టుకొచ్చి ఇచ్చింది.

ఇవిగో నోట్‌బుక్స్, కరణం గారి తోట రేపు తడపొచ్చుగాని సాహిని ఇంటికి తీసుకెళ్ళండి. బాగా చదువుకోమని చెప్పండి.

శ్యామ్ వాటిని కూడా అందుకని వెను తిరిగాడు.

అతని కోసమే ఎదురు చూస్తున్నాడు థామస్....అన్నయ్య కనపడగానే "ఎంత?" అన్నాడు ఆపి.

"ఆఁ...ఎంతలే రెండొందలు"

"ఓ వంద ఇలాతే"

"దేనికి వంద?"

"వాటా....మనిద్దరం రక్తం పంచుకు పుట్టాం. అలాగే కష్టాన్ని సుఖాల్ని కూడా".

"బుద్ధి తక్కువయి చెప్పానురా చెప్పి పావుగంట కాలేదు. అప్పుడే తగులుకున్నావ్".

"మరి, నువ్వు వెంకట్రామయ్య గారింటికనగానే అర్థమయ్యింది. ఎలాగూ నువ్వే చెప్పావు గదాని, కాపు కాశాను వాటా అడుగుతున్నాను".

"తప్పదంటావా అయినా తాగటానికేగా – ఎందుకురా ఆ తాగుడు కడుపుకి తినకుండా."

అన్నయ్యా, ఎవరి తృప్తి వారిది. అయినా నీకో విషయం తెలుసా? ఎదుటివారి అలవాట్లని గౌరవించడం అన్నింటికి మించిన సంస్కారం".

శ్యామ్ తలకొట్టుకుని జేబులోంచి వందతీసి ఇచ్చాడు.

"మరి ఇందులో"

"ఈ పుస్తకాల్లోనా"

"ఇవి మాత్రం వాడికిస్తావా? సాహి సాయంత్రం వస్తూ వస్తూ బేకరిలో పని చేసి కొనుక్కుంటాడుగా..... మళ్ళీ మనం ఇవ్వటం ఎందుకు?"

"ఇవేం చేసుకుంటావురా?"

"పిచ్చి అన్నయ్య, ఇవి వెంకట్రామయ్యగారు పట్నం నుంచి తెచ్చారు అంటే ఇక్కడ దొరకవనేగా.....దొరకని వస్తువు ఖరీదెక్కువ, విలువెక్కువ.....వీటిని ప్రెసిడెంట్ గారబ్బాయికి నేను అమ్ముతానుగా".

"ప్రతిసారి నేను చేసే పని కూడా అదే.. తగలడు... వెంకట్రామయ్యగారు ప్రెసిడెంట్ మాట్లాడుకోరు. కాబట్టి అక్కడమ్మితే వెంకట్రామయ్యగారికి తెలీదు!".

ఆపనేదో నువ్వే చేసేయ్ – మిగిలిన వంద కూడా ఇచ్చేసి, ఆ పుస్తకాలు అమ్మితే వచ్చిందంతా నువ్వే తీసుకో".

"ఓరే నీకంటే ముందు పుట్టానురా, నా ఎంగిలి పాలు త్రాగి పెరిగావ్ గుర్తు పెట్టుకో, తెలివితేటలు తగ్గించి నడువు"

... ...

.... ....

..... .....

"చల్ – చల్" అదిలిస్తున్నాడు. దున్నల్ని – దిగుడు బావి పైన రెండు కమ్మిలు ఆపక్క, ఈపక్కపాతి, రెండింటికి కలిపి మరో కమ్మి వేసి, ఆకమ్మి మధ్యలో గిలక బిగించారు –

రెండు దున్నల మధ్య కాడి నుంచి బలమైన తాడు గిలకమీదగా బావి లోపలి దాకా ఉంది – ఆ చివర పెద్ద రేకుతో చేసిన తొట్టి లాంటిది. దున్నలని వెనక్కి మళ్ళించినప్పుడల్లా బావిలో మునిగి, తిరిగి దున్నలు ఏటవాలుగా ఉన్న వైపు దిగగానే – నీళ్ళతో మునిగిన తొట్టి గిలక వరకూ వచ్చి, బావి పళ్ళెం తగిలి పక్కకివంగుతుంది. అందులో నీళ్ళు ఆ పళ్ళెం లోంచి తోటలోకి పోతాయి.

"రాత్రి పన్నెండు గంటలు 'సాహి' భోజనం సంగతి కూడా మరచి దున్నలను అదిలిస్తూనే ఉన్నాడు తోట సగం తడిచింది.

చల్లటి గాలి వయ్యారంగా మెలికలు తిరుగుతుంది.

సాహి ఆలోచనల్లో 'సుజనా' నే ఉంది. దున్నలు వాటి పని అవిచేస్తున్నాయి. 'సుజనా' అనుకున్నాడు.–

తల్చుకున్న ప్రతిసారీ ఒళ్ళు పులకరిస్తుంది – మనసు దూది పింజలా అవుతుంది. ఒక్కసారి చుట్టూ ప్రకృతి అందంగా, రమ్యంగా మారిపోతుంది. క్రిందికి దిగుతున్న దున్నలకి –

పళ్ళెంలోంచి క్రిందికి జారుతున్న నీటిగలగలలకి రెంటింకితేడా ఆగుపించదు. రెండు అందంగానే ఉంటాయి. రెంటిలోనూ రమ్యం గోచరిస్తుంటుంది.

ఎందుకు?ప్రేమ శక్తి అదేనా?

అసలు ప్రేమిస్తే కొత్త శక్తి వస్తుందా?

ఇంతకుముందు దున్నల మెడలో గజ్జెలు గల గలలు వింటే ఏమీ అనిపించేది కాదు.

ఇప్పుడో...సుజనా కాలి మువ్వలే.....వంటినిండా నగలతో.....పట్టు పరికిణితో కాలి అందెలు గల్లు గల్లు మని లేడిపిల్లలా గెంతే సుజనానే గుర్తుకు వస్తోంది.

త్యాగరాజు ఆరాధనోత్సవాల సందర్భంగా రాములవారి గుడిలో చేసిన నాట్యం.

తన మనసు చెదిరింది అక్కడేగా....

దగ్గరిగా చూసే అదృష్టం లేకపోయింది.

నేను వాళ్ళ కులంలో పుట్టినా బాగుండేది. దగ్గరగా చూసే వాడిని....

అలా నా మనసులో కొచ్చిన ఓ సుజ.....నా ప్రేమ నీకెలా చెప్పాలి....

నా మిత్రులు చెప్పినట్టు ఏ సాహసం చేయాలి?

అవును ఏదైనా సాహసం చెయ్యాలి.

ఆమె అచ్చెరువు చెంది....'సాహి' అంటూ కమ్మగా పిలవాలి.... 'సాహి' నువ్వే నా కలల పంట అని చెప్పాలి.... నా జీవితమే నువ్వు 'సాహి' అని చెప్పాలి.

ఆ అందమైన ఊహాలోకపు రమ్యంలో తేలియాడుతున్న సాహిమొహాన నీళ్ళు వచ్చిపడ్డాయి.

తల విదిలించుకుని చూశాడు.

కరణంగారు!

"ఓరి నీయమ్మా, మూడుసార్లు పిలిచానురా, కూర్చునే నిద్రపోతున్నావా? అదీ కళ్ళు తెరుచుకుని"

"అది....అదేం లేదు" తత్తరపడి లేచాడు.

"ఆ సంగతి నాకెందుగాని, అర్ధరాత్రి తోట తడపటమేంటిరా? మీకెప్పుడు వీలు కలిగితే అప్పుడు చెయ్యటమేనా?"

"అన్నయ్య చెప్పాడు"

"వూళ్ళోవాళ్ళు చూస్తే నవ్వుతారురా, కరణంగారికి పిచ్చెక్కింది. అర్ధరాత్రి తోటని తడిపిస్తున్నారని...."

"అయితే ఆపేయ్‌మంటారా?"

"ఆపనా అని మెల్లగా అంటావే, సినిమాకి వెళ్ళి వస్తూ చూశాను కాబట్టి సరిపోయింది"

"ఏ సినిమా కరణంగారు"

"రహస్యం....అక్కినేని నాగేశ్వరరావు హీరో, జానపదం, ఆదరగొట్టేశాడనుకో...."

"అక్కినేని నాగేశ్వరరావు సాహసమా, బావుందా"

"ఏమిటి బావుండేది. ఒకేసారి సినిమా పేరు మార్చేశావ్. సాహసం కాదు, ఆ సినిమా పేరు రహస్యం".

"రహస్యమా, సాహసం అనుకున్నాను ఇంతకీ సాహసమంటే ఏమిటి కరణంగారు?"

"సాహసమంటే.....మంటే....ఆc....ఊరికి మకుటం లేని మహారాజు లాంటివారు వెంకట్రామయ్యగారు. ఆయనతో తగాదా పెట్టుకున్నాడు. చూడు మన ప్రెసిడెంట్ అదీ సాహసం.

ఆయన ఆస్థిలో గాని, డబ్బులోగాని పలుకుబడిలోగాని ఎందులోనూ ఈసింతకూడా సరితూగని ప్రెసిడెంట్ ఆయనతో తగాదా పెట్టుకోవటమంటే సాహసమే".

"అబ్బా సాహసమంటే అదికాదు. మరొకటి కూడా అయిఉంటుంది".

"సాహసాల్లో చాలా ఉన్నాయిరా అబ్బి....మన పార్వతీశం లేడూ"

"ఏ పార్వతీశం" అడిగాడు సాహి.

"అదే టైలర్ పార్వతీశం....వాడు ఎదురింటి లావణ్య మొగుడు లేడనుకుని, అర్ధరాత్రి అలవాటు ప్రకారం గోడ దూకి గదిలో దూరి లావణ్య మొగుడ్ని...లావణ్య అనుకుని లేపాడు చూడు అదీ సాహసం."

" ఆ తరువాత ఆ చీకటిలో దొంగనుకుని లావణ్య మొగుడు చిత క్కొట్టాడని విన్నానే"

"అది లావణ్య మొగుడి సాహసం....మొదటిది గోడదూకటం" గదిలో దూరటం పార్వతీశం సాహసం."

"ఓ....అదా...సాహసమంటే.....గోడదూకి ఇష్టమైన అమ్మాయి దగ్గరికెళ్ళటమేనా సాహసమంటే"

"దున్నలని దొడ్లో కట్టేసి ఇంటికెళ్ళు.....రేపొచ్చి మీ అన్నయ్యని నాకు కనపడే సాహసం చెయ్యొద్దను. అర్ధరాత్రి నా తోటని నీ చేత తడిపించినందుకు చీరేస్తానని చెప్పు వెధవని...."

"అలాగే దున్నలని దొడ్లో కట్టేస్తాను. అయితే ఇంటికి మాత్రంవెళ్ళను.

రెండో వాక్యం కరణంగారితో చెప్పలేదు సాహి. మనసులో అనుకున్నాడు...

..... ......

..............

.................

"అన్నయ్యా! ఈ ప్రపంచంలో వీధిలైట్లు కనిపెట్టిన వాడికంటే, మన పార్వతీశంగాడి దగ్గరున్న ఐపాడ్‌ని కనిపెట్టిన వాడికంటే అసలు మనిషిని పుట్టించిన దేవుడు కంటే కూడా గొప్పవాడు ఎవరన్నయ్యా"

"ఇంకెవరు. మందు కనిపెట్టిన మహానుభావుడు".

"శభాష్, నా అన్నయ్య వనిపించావ్. ఎలా ఉందన్నయ్య కిక్".

"బ్రహ్మాండగా ఉంది..." శ్యామ్ తూలుతూ నడుస్తూ అన్నాడు.

"మరి అదే, రమ్మంటే రానన్నావ్, పైగా తాగడం ఎందుకు? కడుపుకి తినచ్చున్నావ్, తీరా తాగాక , మస్థభీర్ అంటున్నావ్..... తాగుడులోని మజా తెలియాలాంటే మరో రౌండ్ పడాలన్నయ్యా. నాకు సరిపోలేదు"

"ఇంకో రౌండ్ పడితే మజాకాదు– మురికి కాలువే....ఇప్పటికే దారి కనపడటం లేదు. అదిగో వెంకట్రామయ్యగారి బంగ్లా, మనం అటు నుంచే పోవాలి. .... ఆయన గాని బయటున్నారంటే అంతే సంగతులు"

"ఏది ఇప్పుడా, పగలు పన్నెండు దాటాక, బుద్ధున్న వాడెవడూ మెలుకువగా బయట నిలబడడు".

"రాత్రి రాత్రి" సరిచేశాడు శ్యామ్.

"అదేమరి, తాగితే ఆ మాత్రం డిఫరెన్సు మాట్లాడకపోతే ఎలా?"

"ఇక ముయ్.....వెంకట్రామయ్యగారి బంగ్లా వచ్చింది"

"మాహానుభావుడు– మహాత్ముడు – మెచ్చుకో తగ్గవాడు. మనల్ని మహా రాజులా చూస్తున్నావాడు"

"ఇక 'మ'శ్లోకం ఆపి నడువ్..."

"అన్నయ్య...." అరిచాడు థామస్.

"ఓరి నీయమ్మ కడుపుకాలా....ఎందుకలా అరుస్తావ్. ఊరు ఊరు మేల్కొనేలా...."

"అటు చూడు....ఏవడో దొంగ వెధవ వెంకట్రామయ్యగారి ప్రహరి ఎలా ఎక్కుతున్నాడో...అమ్మో మన ఊరిలో దొంగతనమా? ఎన్ని గుండెలు వాడికి?"

శ్యామ్ అటుకేసి చూసి ఉలిక్కిపడ్డాడు.

"ఓరి నీ తాగుడు తగలెయ్య.....సరిగ్గా చూడు....వాడు మన సాహి..."

థామస్ కళ్ళు చిట్లించి చూశాడు.

"అవునన్నయ్యా. వాడు మనవాడే, వీడీ మధ్య దొంగతనాలు కూడా చేస్తున్నాడా? బేకరీలో పనిచేసి కాదన్న మాట పుస్తకాలు కొనుక్కుంటుంది".

"వాడికన్ని తెలివితేటలు లేవే, మొత్తానికి మనకి తెలియని కారణం ఉంది..."

"ఏదయినా కానీయ్, చేసేది ఆయనింట్లోనా....శెట్టిగారింట్లో అయితే అంతా క్యాషేగా....."

"ష్....వాడు దూకేది దొంగతనానికి కాదు. నా అనుమానం నిజమయితే అదే...."

"అదే అంటే"

"వాడు చూడు, పైపు గొట్టం పట్టుకుని బల్లిలా ఎలా పాకుతున్నాడో.ఆ గొట్టం చివర కిటికీ చూడు. ఆ గది ఎవరిదో తెలుసా?"

"ఇనప్పెట్టెదా! ఓరి వీడి అసాధ్యం కూలా! ఇంతవరకూ మనకా ఐడియా కూడా రాలేదే?"

"వాడు మనలాంటి లోఫర్ కాదులే. ఆ గది సుజనాది.

"సుజనాదా? అంటే....అంటే...."

"అంటే లేదు, గింటే లేదు.

"అమ్మవెధవ, చాలా పెద్ద ప్లానే వేసాడు. ఇది తెలిసిందంటే వెంకట్రామయ్యగారు కాల్చిపారేస్తారు. ముందు వెళ్ళి వాడ్ని ఆపుదాం పద"

శ్యామ్ విషపు నవ్వు నవ్వాడు.

"వద్దు, వాడ్ని ఆపవద్దు.వెనకుండి మనమే ప్రోత్సహిద్దాం......సాధించాడా మనపంట పండినట్టే. ఆ దివాణం మన స్వంతమయినట్టే".

" ఆ దివాణం మనస్వంతమెలా అవుతుంది? వెంకట్రామయ్యగారికి తెలిస్తే అక్రమ సంబంధం బయటపడితే ఇద్దరితోపాటు మనల్ని కూడా వెలివేస్తారు".

"నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. వాళ్ళది అక్రమ సంబంధం కాదు. ప్రేమ....ప్రేమ....వీలున్నంతవరకూ వాడి ప్రేమని ప్రోత్సహిద్దాం. ఆ ప్రేమలో విజయం సాధించాడా అన్నీ మనవే!"

“ఓడిపోతే?”

“వాడే పోతాడు. మనకేం సంబంధం”

“అన్నయ్యా, నీది నాకంటే పెద్ద బుర్ర”

“చెప్పానుగా, ఎంగిలిపాలు తాగి పెద్దవాడిని అయినవాడ్ని కాదని” చెప్పాడు కిటికీలోంచి గదిలోకి దూకుతున్న సాహిని మురిపెంగా చూస్తూ.

కిటికీలోంచి దూకిన సాహి ఒక్కక్షణం అలానే నిలబడిపోయాడు. గదిలో డిమ్‌లైట్ ఆ కొద్ది వెలుగులోనే మెరిసిపోతూ కనిపించింది సుజనా.

పాలనురగలాంటి పరుపుమీద ....తెల్లటి దవళ వస్త్రాలు కప్పుకుని ఓ యక్షిణిలా,సాగరకన్యలా....అనంతమైన శోభాయమానంగా నిద్రలోనే నవ్వుకుంటోంది చిన్న పిల్లలా, ఆ నవ్వుతో ఆమె నగుమోము మరింత వెలుగుతో ద్విగుణీకృతమవుతోంది.

సాహి ఆదుర్దాగా చూసాడు. అతని మదిలో కోటిగంటల తాండవం. ముందుకు అడుగేసాడు.

సుజనా నిద్రలో ఇంకా నవ్వుకుంటూనే ఉంది.

తాను గుర్తొచ్చే అనుకున్నాడుసాహి. మెల్లగా,పక్కగా పక్క మీద కూర్చున్నాడు.

ఆమె ఉచ్ఛ్వాస, నిశ్వాశాల శబ్ధం కూడా వినబడుతోంది.

“సుజనా” మత్తుగా పిలిచాడు. ఆప్యాయంగా చేతితో నుదుటిమీద నిమిరాడు.

“తాతయ్యా” అంటోంది గారంగా.

సాహి తన్మయంగా విన్నాడు ఆమె గొంతు.

“తాతయ్యా. నేను ఇంకా చదువుకుంటాను పట్నం పంపించవా?”

నిద్రలో తాతయ్యని అడుగుతోంది. అప్పటికే ఆమె ఇంటర్ పూర్తయింది. డిగ్రీ చదవాలంటే పెద్ద పట్నం పోవాల్సిందే. వెంకట్రామయ్యగారు ససేమీరా వద్దంటారు. సుజన గారంగా అడిగినా, బుజ్జగించి బ్రతిమిలాడినా కాదన్నారు. సుజనకి మాత్రం బాగా చదువు కోవాలని కోరిక....ఆ కోరికకు తాతయ్య అడ్డుచెప్పడంతో నిద్రలో కూడా బ్రతిమిలాడుతోంది.

“తప్పకుండా, నేను చదువు మానుకుని నిన్ను చదివిస్తాను” సాహి త్యాగధునిడిలా చెప్పాడు.

సుజన మొహంలో మార్పు... కాళ్ళ రెండు దగ్గరికి తీసుకుని కదిలింది. ఆమె లేస్తుందనిపించగానే కంగారు పడ్డాడు.

ఠక్కున లేచాడు.  ఆ లేవటంతో పక్కన ఉన్న టీపాయ్ కదిలింది. ఆ కదిలిక వల్ల దాని మీదున్న పాలగ్లాసు కదిలి నేలమీదికి జారి భళ్ళున శబ్దం చేస్తూ ముక్కలయింది. ఆ గ్లాసుతోపాటు నిశ్శబ్ధం కూడా....

సుజన కళ్ళుతెరిచింది. బిక్కమొహం వేసుకున్న సాహి....మొదట ఆమెకేమీ అర్థం కాలేదు. రెండో క్షణంలో అర్థమయింది. తన గదిలో...తన గదిలో పరాయి మగవాడు ఉన్నాడని.

స్త్రీ సహజమైన భయంతో దిగ్గున లేచింది. భయంగా చూసి అరవబోయింది.

సాహికి అర్థమవుతోంది ఆమె అరబోతుందని. అనుకోవటం ఆలస్యం....శరీరం వణికింది. ఈ సమయంలో వెంకట్రామయ్యగారు తనని చూస్తే.....

అమ్మో....అని ఒక్క ఉదుటున ముందుకు కదిలి, సుజన నోటిమీద చెయ్యేసి బిగించి పట్టుకున్నాడు.

సుజన విదిలించుకుంది. సాహి మరింత బలంగా పట్టుకున్నాడు.

“అరవకు” అంటున్నాడు.

సుజన వినిపించుకోవటంలేదు. శక్తివంచనలేకుండా విదిలించుకుంటోంది.

సాహి మరింత గట్టిగా బిగించే  ప్రయత్నంలో దగ్గరిగా జరిగాడు. ఆ ప్రయత్నంలో నేలమీద పగిలిన గ్లాసు పెంకులమీద కాలు వేసాడు.

‘సప్’ కస్సున దిగింది. గ్లాసు పెంకు సాహి రక్తాన్ని రుచి చూసింది.

“అమ్మా’ బాధగా అనుకుని కాలు ఎత్తాడు. అప్పుడే సుజన విసురుగా విదిలించింది. ఆ ప్రయత్నంలో సాహి తూలాడు. ఆమె మీద పూర్తిగా పడిపోయాడు.

ఆమె ఆపలేకపోయింది. వొరిగింది. సాహికి పడబోతున్నాననిపించింది ఆమెని పట్టుకుని బ్యాలెన్స్ చేసుకోవాలనుకున్నాడు.

పట్టు తప్పింది. ఆమె మీద పూర్తిగా పడ్డాడు. ఆమె అతనిని మోయలేక వెనక్కి పడింది. తనని అంటిపెట్టుకున్న సాహితో సహా ఇద్దరూ అలా....అలా....పరుపుమీదికి.

ముందు సుజన పడింది. ఆమెపైన సాహి...కిటికీ తెరలు సిగ్గుగా కదిలాయి... సాహికి వెచ్చగా అనిపించింది.

తొలి స్పర్శ చల్లగా, వెచ్చగా,కమ్మగా...మత్తుగా....సుజన తన ప్రమేయం లేకుండానే కళ్ళు మూసుకుంది.

సుజన మీద అతను, సుజన శరీరం మొత్తం అతనికింద నలుగుతోంది. నోటిమీద చేయి అలానే ఉంది.

ఇద్దరికళ్ళు ఒకరినొకరు చూసుకున్నాయి. వెచ్చటి ఆవిరి ఇద్దరికీ తగులుతోంది. సుజన గుండెవేగం పెరిగింది. ఓ మగవాడు తనమీద.....అర్థరాత్రి గదిలోకి వచ్చి....తనమీద....పద్ధెనిమిది సంవత్సరాల తన సొగసులమీద...రమ్యంగా, హృద్యంగా ఉంచుకున్న హృదయం మీద....

సాహి నెమ్మదిగా గుసగుసగా అన్నాడు.

"ఐ లవ్ యూ!'

ఐ లవ్ యూ!!

ఐ లవ్ యూ!!!

ఎంత ధైర్యం? తన గదిలోకి వచ్చి, అదీ అర్థరాత్రి నోరుమూసి చెప్పేది ఇదా? కళ్ళప్పగించి చూసింది.

"సాహసం చేస్తే మెచ్చుకుంటావని... అర్ధరాత్రి గోడదూకి గదిలోకి వచ్చి చెబుతున్నాను. ఏమనుకోకేం?"

సుజనకి ఏడ్వాలో, నవ్వాలో అర్థం కాలేదు.

"నిన్ను ఏ నిమిషాన చూశానో, ఆ రోజు నుంచినిద్రలేదు. చదువు లేదు, ఆకలిలేదు, దాహం లేదు నువ్వే....నువ్వే గుర్తుకువస్తున్నావ్.....కావాలంటే చూడు" అని నోటిమీద నుంచి చెయ్యితీసి చూపించాడు.

చొక్కా పక్కకి తప్పించి చూపించాడు. విశాలమైన అతని వక్షస్థలం మీద–

"సుజన....సుజన" స్పష్టంగా కనిపించింది.

అరవాలన్న ఆలోచన కూడా మర్చిపోయి చూసింది.

ఎప్పుడు తనని చూసినా తల వంచుకొని పక్కకెళుతుంటే, గౌరవం అనుకుంది. మర్యాద అనుకుంది...ఇదా కారణం....

"జీవితంలో నేనింతవరకూ ఆ ప్రభువుని ఏమీ కోరుకోలేదు. మొదటిసారి

కోరుకున్నాను. నాకు నిన్ను జీవిత భాగస్వామిని చెయ్యమని – తీరుతుందని నమ్మకం నాకుంది"

అప్పుడు తెరిచింది సుజన నోరు.

"నీ ప్రేమ మండినట్టే ఉంది. ముందు లే....లేచి మాట్లాడు"

"ఓ....సారీ" లేచాడు సాహి.

"ఓ ఆడపిల్ల గదిలోకి అర్ధరాత్రి వచ్చినందుకు శిక్షేమిటో తెలుసా? ఆమెమీద సొంత మొగుడిలా పడుకుంటే విధించే శిక్షేమిటో తెలుసా?"

సాహి తలొంచుకున్నాడు.

సరిగ్గా అప్పుడే గది తలుపు శబ్దమయింది.

"అమ్మా సుజా"

ఆ గొంతు సుజా తల్లిది...సాహి బిత్తరపోయి చూశాడు.

సుజన గుండెలమీద చెయ్యి వేసుకుని – సాహి చెయ్యిపట్టుకుని ముందుకు లాగి బట్టలు మార్చుకునే స్టాండ్ పక్కకి నెట్టింది. కనపడకుండా స్టాండ్‌మీద బట్టలేసింది. ఈలోగా తలుపు శబ్దం మరింత పెరిగింది.

సుజన చకచకావెళ్ళి తలుపుతీసి – ఆవులించించి– "ఏమిటమ్మా బంగారంలాంటి నిద్ర చెడగొట్టావ్" అంది.

"గదిలో ఏదో శబ్దమైతే"

"ఏ పిల్లో గ్లాస్ పడేసుంటుంది. దానికి నన్ను లేపటమే కాకుండా కిందున్న తాతయ్య లేచేలా ఆ అరుపులేంటి?"

"సరే వెళ్ళి పడుకో"

"అమ్మా, మందులు వేసుకున్నావా" అడిగింది సుజన

ఆమె తలూపింది.

"ఊరికే అలా మెట్లెక్క వద్దని చెప్పానా? అసలే ఆయాసం. దానికితోడు ఈ మధ్యనే దగ్గు కూడా చేరింది. చలిగాలి బాగా ఉంది బయటికి రాకు"

ఆమె కూతురిని మొట్టి– "మరి ఆరిందవవుతున్నావ్" అని వెళ్ళింది. సుజన తలుపువేసి స్టాండ్ ప్రక్క నుంచి సాహిని బయటికి లాగి వెళ్ళు, "నిన్ను రక్షించింది నువ్వు వల్లించిన ప్రేమ పాఠాలు వినికాదు....నా పరువుకోసం, మరోసారి వస్తే నేను చెప్పేది తాతయ్యకే"

"సుజనా" ఏడుపుమొహంతో అన్నాడు.

"అర్థరాత్రి గదిలోకి వచ్చి సొంత మొగుడిలా మీద పడుకుని 'ఐలవ్‌యు' అని చెప్పినంత మాత్రాన కథానాయకుడివనుకోకు. వెళ్ళు. వచ్చిన దారినే....నీ ప్రేమ పేరుతో నా జీవితాన్ని అస్తవ్యస్తం చేయకు"

సాహి బాధగా నడిచాడు.

కిటికీలోంచి సాహి దిగగానే కిటికీ రెక్కలు టపీమని వేసివచ్చి పడుకుంది.

దుప్పటి మీద కప్పుకుంది వెచ్చగా.

'సాహి' మీద పడుకున్నప్పుడుకలిగిన వెచ్చదనం....గుర్తుకొచ్చింది. విసురుగా దుప్పటిని తీసేసింది.

కళ్ళూ మూసుకుంది.

తన మీద 'సాహి....' తన అవయవాలు అతని కింద నలిగి....పంటితో పెదవిని కొరుక్కుంది.

ఏమిటో హాయి. కొత్తగా ఉంది. ఒళ్ళు పులకరించినట్లుంది. ఓ మగాడు అలా ఆడదానిమీద పడుకుంటే హాయిగా ఉంటుందా? లేక 'సాహి' అలా చేస్తేనే కలుగుతుందా!

తన యక్ష ప్రశ్నలకి నవ్వుకుని కాళ్ళు ముడుచుకుని దుప్పటి పూర్తిగా బిగించుకుని దిండుని కావలించుకునిపడుకుంది.

.......

.........

........

"పట్టుకో.....పట్టుకో" అరిచాడు శ్యామ్

థామస్ ఒక్క ఎగురు ఎగిరి ప్రహరీ మీద నుంచి 'సాహి'ని కదలకుండా పట్టేసుకున్నాడు.

ఆ హడావుడికి ఊరి కుక్క గయ్యిన లేచింది. దానికితోడు మిగతా గ్రామపెద్దలు(కుక్కలు) కూడా లేచాయి.

భౌ......భౌ......మని అరవటం ప్రారంభించాయి.

"ఇక్కడకు కాదు...వీడ్ని మన ఇంటికి తీసుకుపోదాం పద" చెప్పాడు శ్యామ్.

"నడువ్.....నడువ్...." తోసాడు థామస్.

"చెప్పమ్మా....ఏంటి నీ కథ....వెంకట్రామయ్యగారి గోడెందుకు దూకావ్".

"ముందు జేబులెతుకు. ఏం పట్టుకొచ్చాడో" చెప్పాడు థామస్.

"నేను అలాంటివాడిని కాదు".

"అర్థరాత్రి గోడదూకి వెళ్ళినవాడ్ని అలా అనుకోక, మహాత్ముడను కుంటారా?"

"నే వెళ్ళింది మాత్రం అందుకు కాదు"

"మరి వెంకట్రామయ్యని పలుకరిద్దామనా?"

"కాదు....సుజనాని చూద్దామని, సాహసం చేసి ఆమె మెప్పుపొందాలని"

శ్యామ్ థామస్ కేసి తిరిగి 'నే చెప్పలా' అన్నట్టు చూసి

"ఆదా సంగతి...ఎన్నాళ్ళ నుంచి సాగుతోంది"

"ఇవ్వాళే"

"ఒరే మా సహనాన్ని పరీక్షించకుండా చెప్పు.....దాచావా తాటతీస్తాను" థామస్ మీదకొచ్చాడు.

"నేను సుజనాని ప్రేమించాను. అది చెబుదామనే వెళ్ళాను"

"ఏది,ఆ మాట చెప్పటానికా?" శ్యామ్ నమ్మలేనట్టు అడిగాడు.

"అవును, వెళ్ళాను" చెప్పాడు.

"ఇంతకీ ఆ ప్రేమికురాలు ఏమంది?"

"బైటికెళ్ళమంది, ఇలా అర్థరాత్రి వచ్చినందుకు చీరేస్తానంది. మరోసారి వచ్చావంటే, వాగావంటే తాతయ్యతో చెబుతానంది"

"నేచెప్పలా, ఈ ముఖాన్నా ఆ పిల్ల ఇష్టపడేది" థామస్ ఎగతాళిగా అన్నాడు.

"మేం తప్ప ఎవరన్నా చూశారా? మరెవరి కళ్ళలోనయినా పడ్డావా?"

"ఉహూఁ మధ్యలో నేను గదిలో ఉన్నప్పుడు సుజన అమ్మగారు వచ్చి తలుపు కొట్టింది.

ఆ పిల్లే నన్ను బట్టలు మార్చుకునే స్టాండ్ వెనుక దాచి, వాళ్ళమ్మని పంపి, నన్ను చివాట్లు పెట్టి పంపింది"

శ్యామ్ కళ్ళు మెరిశాయి. సాహి భుజం తట్టాడు

"సుజన నిన్ను బట్టలు మార్చుకునే స్టాండ్ వెనుక దాచిందా" నిజమా!?"

"అవును, లేదంటే నేను బయట పడిపోయేవాడిని"

"అయితే ఆ పిల్ల నిన్ను ఖచ్చితంగా ఇష్టపడుతోంది. కాకపోతే బయట పడటం లేదు. కారణాలు ఏమయినాకావచ్చు".

సాహి ముఖం మతాబులా వెగిలిపోయింది. మనసు దూది పింజలా అయింది. కానీ మళ్ళీ అనుమానం –

"అంత ఖచ్చితంగా ఎలా తెలుసు?"

"కొన్నింటికి హేతువులుండవ్...

ధైర్యంగా ముందుకు దూసుకెళ్ళు, నీ జీవితంలో ఓ మార్పు త్వరలోనే వస్తుంది".

"ఒరేయ్ తరువాత మమ్మల్ని మర్చిపోయావు"

థామస్ సాహి పక్కకొచ్చి అన్నాడు.

"సుజన నాకు దక్కటానికి మేం ఇద్దరం ప్రేమించుకోవటానికి మిమ్మల్ని మరిచిపోవటానికి ఏంటి సంబంధం!?"

శ్యామ్ సాహి జట్టునిమిరి, షర్ట్ కాలర్‌ని సరిచేసి "చాలా ఉంది. వంద ఎకరాల కొబ్బరితోట, రెండొందల ఎకరాల మామిడితోట, ఎంత బంగారం ఉందో తెలియని ఇనపెట్టె.....ఇంకా.....ఇంకా....ఎన్నో.....అన్ని సుజనాయే అంటే నీవే".....

"అవన్నీ ఏం వద్దు సుజన చాలు".

"అయితే, అవన్ని మాకివ్వు, నీ సుజనాని నువ్వు తీసుకో...." చెప్పాడు థామస్.

"రేపట్నించి నీవు చదువు మానెయ్....వేరే పనేమీ పెట్టుకోవద్దు.....నా బట్టలూ....వాడి బట్టలూ ఏవి కావాలంటే అవి వాడుకో.....రేపట్నించి నీ పని నలుగురి కంట్లో పడకుండా, నీకంట్లో పడేటట్టుగా సుజనని మలుచుకో. వెనుక మేం ఉన్నాం".

"ఎలా ఆ పిల్ల బయటికెప్పుడొస్తుందో తెలియదుగా"

"ఇంతవరకు ఆమె నెక్కడక్కడ చూశావ్?...."

"మొన్న సంక్రాంతికి బయట ముగ్గులు పెడుతున్నప్పుడు స్నేహితులతో వరిచేలుకి మామిడి తోటలకి వచ్చినప్పుడు నాకు తెలిసి అంతే...."

"మరొకప్పుడు కూడా బయటికి వస్తుంది. మన నాట్యాచారుడి దగ్గర నాట్యం నేర్చుకోవటానికి" చెప్పాడు శ్యామ్

☟ ☟ ☟ ☟ ☟

చిన్న చెక్క మీదలావాటి గుండ్రటి పరికరంతో నాట్యాచార్యుడు లయబద్ధంగా కొడుతూ.....పిల్లలకి నాట్యం నేర్పుతున్నాడు.

సుజన ఓ పక్కగా కూర్చుని నాట్యంతో ఓనమాలు దిద్దుకుంటున్న పిల్లలని చూస్తోంది ఆ పిల్లల తరువాత సుజన వయస్సుగల వారికి పాఠాలు మొదలవుతాయి.

నాట్యాచార్యుల వారు వాళ్ళని ఆగమన్నారు. పిల్లలంతా ఆపి.....నాట్య సాంప్రదాయంగా నమస్కారం పెట్టారు.

"ఇవ్వాల్టికి ఇంతవరకూ చాలు.... ఒక పాట యొక్క పరమార్థాన్ని, అర్థాన్ని లయబద్ధంగా, తాళబద్ధంగా, భావ యుక్తంగా అంగ విన్యాసముల ద్వారా అభినయించెదే నృత్యం...... ఇది మన సంప్రదాయమే కాదు....ఆరోగ్యం.....ఆహ్లాదం కూడా.....మళ్ళీ రేపు ఇదే వేళకి రండి".....

సుజన లేవబోతుండగా

"నమస్కారం మాస్టారూ"...

నాట్యాచారుడు, సుజన ఇద్దరూ ఆ పిల్పువైపు కళ్ళు తిప్పారు.

"నేను నాట్యం నేర్చుకోవాలని కుతూహలపడుతున్నాను".

సుజన మొహం మాడిపోయింది. రోషంగా తల పక్కకు తిప్పుకుంది.

"నువ్వు...." నోరు తెరిచారు.

"అవును....కళకి బేధాలు లేవంటారు.....నన్ను మీ శిష్యుడిగా చేర్చుకోండి...."

"కళకి బేధాలు లేకపోవచ్చు....విలువలున్నాయి....అర్హతలు ఉన్నాయి. ఆ అర్హత లేమున్నాయి నీలో?" ఎకసెక్కంగా అడిగారు.

సాహి తలొంచుకున్నాడు.

నాట్యమంటే ఏమనుకున్నావ్....తై.....తై....అని ఎరగటమనుకున్నావా? అసలు నాట్యం, నృత్యం, నృత్తము....ఈ మూడింటికి అర్థం తెలుసా? అసలు నీ కెంత ధైర్యముంటే నా దగ్గరకొచ్చి అడుగుతావ్" కళ్ళెర్ర చేశాడు.

"అంత కాకపోయినా కొంత తెలుసు మాష్టారూ. ప్రకృతికి దర్పణమైన నాట్యాన్ని అభ్యసించాలని నా ఆరాటం...." ఆ ఆరాటంలో విచక్షణా జ్ఞానం మరచిపోయాను."

"ఆహా ఏం తెలుసో తామిక శెలవిస్తారా?

"సంస్కృత భాషలో రచించబడ్డ తొలి నాట్యశాస్త్ర గ్రంథాన్ని భరతుడు రచించాడు. ముప్పై ఆరు అధ్యాయాలు గల యీ గ్రంథం నాట్యానికి సంబంధించినది. ప్రస్తుతం ఈ తాళపత్ర గ్రంథం తమిళనాడులో ఉందని ప్రతీతి. ఈ నాట్యశాస్త్ర గ్రంథం క్రీ.పూ.300.......ప్రాంతంలో రచించి ఉండవచ్చుని...పరిశీలకుల అంచనా....

ఇకపోతే భరతనాట్యం....ఆ భరతుని నాట్యశాస్త్రం ఆధారంగా తమిళనాడుకి చెందిన తంజావూరు ప్రాంతంలో బావ, రాగ,యుక్తంగా రూపొందించబడ్డదే భరతనాట్యం....ఇంకా కథాకళి కధను నృత్యగానాలతో అభినయించుటే కథాకళి....కూచిపూడి భాగవతం వలె వీధి నాటకం.....ఇది కేరళలో బాగా ప్రాచుర్యాన్ని, స్థానాన్ని పొందింది.

ఆంధ్రప్రదేశ్ కూచిపూడి....ఒరిస్సాలో ఒడిస్సీ.....కేరళలో కథాకళి....మణిపురిలో మణిపురి....ఉత్తర హిందూస్థాన్‌లో కథక్.....తమిళనాడులో భరతనాట్యం అని పిలవబడుతున్నాయి. ఏ పేరుతో పిలిచినా, ఎలా అభినయించినా అంతా అదే. అంతా కళామతల్లి ప్రసాదమే".

సుజన కూర్చున్నదల్లా లేచి నిల్చుంది.

నాట్యాచారులవారు తెల్లబోయి చూశారు.

"చెప్పండి మాష్టారూ. నేనేదయినా తప్పుగా చెబితే"

అప్పుడు తెరిచారు – సౌమ్యంగా, సరళంగా, బాధగా మూడు కలగలిపి చెప్పారు.

"నాట్యమే తద్భవిష్యతి" అని చెప్పినవారు శెలవిచ్చిన వారు, దీనికి కొన్ని పరిమితులు విధించారు. అంతకన్నా ఏం అడగకు"

సాహికి అర్థమయ్యింది గిర్రున వెనక్కు తిరిగాడు. వేదనగా కదిలాడు అప్పుడు ఎదురయ్యాడు శ్యామ్.

"ఎక్కడికిరా?" అన్నాడు.

"మామిడితోటలోకి"

"దేనికి?"

"వూరికినే.... అన్నీ చెప్పాలా" అని సాహి వెళ్ళిపోయాడు.

"నమస్కారం అయ్యవారు– ఏదో పనుందని అన్నారట."

"ఆఁ...ఆ....ఆవు....నవును......అలా లోపలికెళ్ళు. వడ్లు ఎక్కువున్నాయి. సంతకి తీసికెళ్ళి అమ్ముకొస్తావని రమ్మన్నాను. అలా వెళ్ళి సుజనకి రెండు పాఠాలు చెప్పి వచ్చేస్తాను.

"వద్దు మాస్టారూ! ఈరోజు ఎందుకో తల నొప్పిగా ఉంది రేపు వస్తాను" అంది సుజన

"నీ యిష్టమమ్మా, రమ్మంటే సాయంత్రం వస్తాను మీ ఇంటికి"

సుజన తల వూపింది.

......

.......

.......

మెత్తటి చిగురాకు పరికిణీని పదిలంగా పట్టుకుంటూ, అడుగులో అడుగు వేస్తూ తోటలోకి వచ్చింది.

పక్షల కిలకిలరాగాలు– ఆమె నలువైపులా చూస్తోంది...ఎక్కడా లేడు.

సంధ్యా సూర్యుడు చిన్న బుచ్చుకున్నాడు. ఆమె తనని చూడటం లేదనిపించిందో, లేక ఆ అందాల బొమ్మ చూపులు సాహి కోసమని తెలిసి ఈర్ష్య పుట్టిందేమోగాని....మొత్తానికి ఎర్రగా ఉన్నాడు.

సుజనకి ఎలుగెత్తి పిలవాలనిపించింది.

అమ్మో, ఎవరయినా వింటే...తూర్పు దిక్కుగా నడిచింది. మామిడితోపు మధ్యలోనే ఉంది ఊడల మర్రి.....పగలు చూస్తే ఏమో గాని రాత్రిళ్ళు చూస్తే రాక్షసిని చూసినట్టే ఉంటుంది. జడల దెయ్యంలా ఉంటుంది.

ఆకాశానికి అంటుకునేలా పెరిగి, దాని కొమ్మల నుంచి ఏపుగా జారిన ఊడలు–

చీకటిలో చూస్తే గుండెలు తీసిన బంటుకి కూడా గుండెలదురుతాయి.

ఆ చెట్టు క్రింద కూర్చున్నాడు సాహి.

"ఓ.....ఇక్కడున్నావా?" కోయిలలా పలికింది.

సాహి గిర్రున తిరిగాడు.

ఆ పిలుపు అమృత వాక్యంలా, అమృతధార తనమీద చిలికించినట్టుగా భావించాడు. కళ్ళు ఆనందంతో మెరిశాయి. శరీరం వుప్పొంగింది.

ఇది నిజమా! 'సుజన' తనకోసం వచ్చిందా. గిల్లిచూసుకున్నాడు.

అబ్బ! నిజం........శ్యామ్ అన్నయ్యా, నీకిదే నా జోహార్....నువ్వు చెబితే నమ్మలేదు...ఆమె వస్తుందంటే కొట్టిపారేశాను. కాదు.....నా ఆలోచనా విధానం సరి అయినది కాదు.

"ఎందుకిక్కడ కూర్చున్నావ్" ?

సాహి ఆలోచనలకి తెరిదించి – "నువ్వు వస్తావని" అన్నాడు.

సుజన దగ్గరకొచ్చి – "బాధపడుతున్నావా?" అంది.

"బాధదేనికి, నీ గదిలోకి రావటం తప్పు...."

సుజన కోపంగా చూసింది.

అలా చూసినప్పుడు మరింత అందంగా కనపడింది.

"నేను అడుగుతున్నది రాత్రి సంగతి కాదు. ఇప్పటి సంగతి. నాట్యం నేర్పనన్నారని బాధపడుతున్నావా అని".

"అర్హత కావాలిగా...నాకా అదృష్టం లేదు"

"అసలు ఇంత సడన్‌గా నీకు నాట్యం నేర్చుకోవాలని ఎందుకనిపించిందో!"

"నీ కోసం....."

సుజన దెబ్బతిన్నట్టు చూసింది.

"నా కోసమా?" అంది.

"అవును, నీ కోసం, నీ ప్రేమ కోసం....నీకు నాట్యమంటే ప్రాణం. నీవు నా ప్రాణం....అందుకే నీ కిష్టమైనది నేను నేర్చుకోవాలనుకున్నాను. అదొక్కటే కాదు, నీ కిష్టమైనది ఏదయినా సరే, ఆట అయినా, పాటయినా సరే,నేర్చుకుంటాను. నీకోసం".

"సాహీ...." అంది.

అది ఆదుర్దాతగా పిలిచిందో, ఆవేదనగా పిలిచిందో, వారిస్తూ పలికిందో తెలియదు సాహీకి –

"కులం....మతం.....భాషా నాప్రేమకి అడ్డుకాదు. ఆఖరికి నువ్వు కాదన్నా.....నా హృదయంలో నిన్ను పూజిస్తూనే ఉంటాను. కొలుస్తూనే ఉంటాను".

ఓ ఆడపిల్ల మనసు కరగటానికి ఆ పలుకులే ఎక్కువ....సుజన కరిగింది.

స్త్రీ సహజమయిన బెట్టుని మాత్రం పోనియలేదు. ఆడది బహుతెంపరి. బహుజాణ....

**మగాడ్ని నమ్మేటప్పుడు, నమ్మినప్పుడు– చాలా రకాలుగా ఆలోచిస్తుంది. అన్ని వైపులా ఆలోచించి గాని బయట పడదు. మగాడు ఇష్టపడగానే తన ఇష్ట సఖి ముందు తన ప్రేమ పుస్తకాన్ని పరుస్తాడు. ఆడది అలా కాదు.మనసులో ఉంచుకుంటుంది.**

సమయం సందర్భం...భద్రతా.... అన్ని.....అన్ని చూస్తుంది. అప్పుడే పమిటలేసిన ఆడపిల్ల సయితం మనసుని కదిలించాడని, తన నోటిని కదిలించదు –

"ప్రేమించావా! నాలో ఏం చూసి ప్రేమించావ్?' సుజన సూటిగా అడిగింది.

"అది.....అది...."

"చూశావా, ఒక్క ప్రశ్నకే తలక్రిందులయ్యావ్. అలాంటిది ఈ లోకం వేసే ప్రశ్నలకి ఏం సమాధానాలు చెబుతావ్?"

"సమాధానం లేక కాదు. ఆగిందీ, తడబడిందీ....ఎలా చెప్పాలో అర్థం కాక.... ప్రతి రోజు ఎంతో మంది ఆడపిల్లలని చూస్తుంటాను. పక్క పక్కనే కూర్చుంటాను కూడా – కాని ఎప్పుడూ ఇలా కలగలేదు. తొలిచూపు కాకపోవచ్చు. గుడిలో నాట్యం చేస్తుంటే నేను కదిలిపోయాను. ఏదో చెప్పలేని, తెలియని అనుభూతి ఇంటికెళ్ళినా, కళ్ళు మూసుకున్నా నీ రూపమే. అదెందుకు కలిగిందో తెలీదు – నీ మీద నాకు ఎలా ప్రేమ కలిగిందంటే... ఏం చూసి ప్రేమించావంటే నా దగ్గర ఉన్న సమాధానం ఇదొక్కటే"–

"సరే, నువ్ ఇష్టపడ్డావ్, మరి నా సంగతి, నా కిష్టమో లేదో తెలుసుకోవాలనిపించలేదా! నాకు మనసొకటుందని గుర్తులేదా!"

"గుర్తుంది కాబట్టే, సాహసం చేద్దామనుకున్నాను. ఆడపిల్ల మనసు గెలుచుకోవాలంటే సాహసం చెయ్యాలంట, అందుకే ఆ సాహసం చేసి నీ మెప్పుపొంది ఆపై నీకు చెబుదామనుకున్నాను"

"ఏది, అర్థరాత్రి గదిలోకి రావటమా సాహసమంటే?"

"అదే అని కరణంగారు చెప్పారు...." చిన్న పిల్లాడిలా చెప్పాడు.

సుజనకి నవ్వొచ్చింది.

సాహి ఆమె నవ్వటం ఆనందంగా చూశాడు.

"ఎందుకలా కళ్ళప్పగించి చూస్తావ్"?

"నువ్వు నవ్వుతుంటే నాకిష్టం – నాకదే ఆనందం"

"సంతోషించాంలే గాని ఇంటికెళ్ళు – నీకు అంతగా నాట్యం నేర్చుకోవాలని సరదా ఉంటే పట్నం వెళ్ళు. అక్కడ ఏదో రకంగా నేర్చుకోవచ్చు – కాని చిన్న సవరణ – నీవు మాష్టారుకి చెప్పినట్టు, నాట్యశాస్త్రాన్ని భరతుడు 300 క్రీ.పూ.క్రీ.శ. 300 మధ్య రచించారని చెప్పావే అది తప్పు– క్రీ.పూ. 200 క్రీ.శ. 200 మధ్య రచించి ఉండవచ్చని పరిశీలకుల అంచనా".

.........

..............

............

"ఆ నాట్యానికి సంబంధించిన వ్యాసం రాసిందెవరూ" ఇంటికి రాగానే విరుచుకు పట్టాడు సాహి.

"ఏరా, మామీదే అరిచే స్థాయికి ఎదిగిపోయావన్న మాట" శ్యామ్ సాహిని ఎగాదిగా చూసి అన్నాడు.

"లేకపోతే ఏంటి? అన్ని పచ్చి భూతులు, ఆ అమ్మాయి ముందు తలకొట్టేసినట్లనిపించింది"

"ముందు నువ్ సరిగ్గా వొద్దికగా కూర్చుని అసలేం జరిగిందో చెప్పు" థామస్ విసుక్కున్నాడు.

"అంతా మీరన్నట్టు జరిగింది. మీరిచ్చిన నాట్యానికి సంబంధించిన వ్యాసాన్ని పూర్తిగా బట్టి పట్టి – మాష్టార్ దగ్గరకెళ్ళి నాట్యం నేర్పమన్నాను. ఆయన ఎగతాళి చేశారు – నీకేం తెలుసురా నాట్యమంటే అన్నారు. కంఠతా పట్టింది. దడ దడ లాడించాను. ఆయన కాదనగానే భావరహితంగా మొహం పెట్టి తిరిగాను"

"అప్పుడు నేను ఎదురొచ్చాను. ఎక్కడికిరా అన్నాను. మామిడి తోపులోకని,

ఆ పిల్ల వినేటట్టు చెప్పమన్నావు. సరిగ్గా అలానే చెప్పాను. అది కాదురా వెధవా, ఆ పిల్ల వచ్చి ఏముంది?"

సాహి సిగ్గుపడ్డాడు.

"ఓరి నీ సిగ్గుచిమడా" థామస్ కసిగా అన్నాడు.

"నా మనసులోని భావం ఆమెకి చెప్పాను".

"ఏదో తగలడ్డారు దాని గురించి మాకెందుగాని, ఆ పిల్ల ఏమంది?" ప్రేమించాననందా?"

"ఉహూ, లేదు"

"మరి కాదందా!"

"రెండు కాకుండా ఏమీ చెప్పకుండా వెళ్ళింది"

"అంటే – ప్రేమిస్తున్నదన్నమాటే! కాకపోతే బిడియపడుతోంది. ఆ బిడియం పోగొడతాను. కథని బాగా రక్తి కట్టిస్తాను"

"అన్నయ్య ఈసారి ఇలాంటి నాటకాలు వద్దన్నయ్య"

"పిచ్చివాడా! నాటకాలు ఆడకపోతే నీ ప్రేమ నీ గుండెల్లోనే సమాదయి పోతుందిరా. అయినా ఆ మాత్రం నాటకాలూ అబద్ధాలూ ఆడకపోతే ధ్రల్ ఉండదు" "ధ్రల్ కాదు థ్రిల్" సరిచేసాడు సాహి.

"ఏదో ఒకటి, ఆ థ్రిల్ కలిగిస్తాను. అ అమ్మాయిని మరోసారి తోటలోకి తీసుకురాగలవా? దానికి కూడా నేనే ఏదో ఒక ఎత్తు వెయ్యాలా?"

"వాడి బొంద! వాడివల్లేమవుతుందనిగాని, అరుంధతిని పంపించు, తోటలో 'సాహి' నీ కోసం ఎదురు చూస్తున్నాడని చెప్పించు"

"అరుంధతా? ఆమెవరు కొత్తగా?"

"కొత్తదే! ఈ వూరికి బ్రతుకుతెరువుకి వచ్చింది. మనవాడు పెద్ద ముదురుగా పట్టేసాడు. ఊరి పెద్దలికి పెద్ద డాక్టరిని చెప్పి ప్రెసిడెంట్‌గారి పెద్ద మేడలో ఇల్లుకూడా ఇప్పించాడు.

నాట్యానికి సంబంధించిన అన్ని విషయాలు మాకెలా తెలుసనుకున్నావ్?" అరుంధతే రానిచ్చింది. ఇప్పుడు నీ కోసం నీ ప్రేమ కోసం వెంకట్రామయ్యగారింటికి వెళుతోంది".

"నమస్కారమండి" వినయంగా చేతులు జోడించింది.

"మీరు...." ఆరోక్తిగా ఆగిపోయాడు వెంకట్రామయ్యగారు.

"నా పేరు అరుంధతండి. డాక్టర్ని. ఈ వూరి ప్రజలకు సేవ చేద్దామనే సంకల్పంతో వచ్చాను".

"చాలా సంతోషమమ్మా! నీలాంటి వాళ్ళు ప్రతి పల్లెటూరికి వెళితే ఈ పల్లెజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్నానికి పరిగెత్తే స్థితి మారుతుంది"

"మీ అమ్మాయిగార్కి వంట్లో బావుండలేదంటే చూడాలి అని వచ్చాను".

"అవునమ్మా! దాని తండ్రిని నేను దుక్కలా ఉన్నాను. దానికి మాత్రం ఎప్పుడూ రోగమే. భగవంతుడు దాని నుదుటన అలా రాసాడు వెళ్ళి చూడమ్మా" అని....

"సుజనా" అని పిలిచాడు.

"ఇది నా మనవరాలు" పరిచయం చేశాడు అరుంధతికి.

"నమస్కారమండి" అంది సుజన.

"కళ్యాణప్రాప్తిరస్తు" దీవించింది.

"వెళ్ళమ్మా! అమ్మ గదిలోకి డాక్టర్ని తీసుకెళ్ళు" చెప్పాడు

సుజన వెంటపట్టుకెళ్ళింది.

ఇద్దరూ వెళ్ళే సరికి దగ్గుతోంది.

"అదీ డాక్టర్! ఇరవయ్ నాలుగుగంటలు దగ్గుతూనే ఉంటుంది. వద్దంటే చలిగాలిలో తిరుగుతుంది. చల్లటి పదార్థాలు అతిగా తీసుకుంటుంది"

"ఆ రెండూ తగ్గించాలి" మందలించింది అరుంధతి.

బ్యాగ్లోంచి కొన్ని టాబ్లెట్స్ తీసి సుజనకిచ్చి రోజూ మూడు పూటలా వేయమంది.

బయటకొస్తున్నప్పుడు చెప్పింది.

"నే వెళతానమ్మా ! ఎవరో 'సాహి' ఆట.....నూటరెండు జ్వరం పెట్టుకుని, ఇంటికి రానని మామిడితోపులోనే కాపురం పెట్టాడట....బహుశ వాళ్ళన్నయ్యలతో తగాదా పడ్డాడేమో!"

"సాహినా"

"అవును! ఇద్దరన్నయ్యలు సరిగా పట్టించుకోరు. కరణంగారు చెప్పారు.

వెళ్ళి మందలించి, మందు మింగించి ఇంటికి వెళతాను. ఏదన్నా అవసరమనుకుంటే ఇంటికి రామ్మా".

సుజన తలాడించింది.

వెంకట్రామయ్యగారి దగ్గర శెలవు తీసుకుని, అరుంధతి వెళ్ళి పోయింది.

ఆమె వెళ్ళిపోవటం ఆలస్యం సుజన వెంక్రటామయ్యగారు చూడకుండా బయటకొచ్చింది.

సుజన అటు వెళ్ళడం ఆలస్యం శ్యామ్ వెంకట్రామయ్యగారింట్లో అడుగుపెట్టాడు.

"వెంకట్రామయ్యగారు....వెంకట్రామయ్యగారు" అరిచాడు.

ఆ అరుపులకు లోపలినుంచి బయటకొచ్చారు.

"ఏంటా అరుపులు కొంపలు మునిగినట్టు?"

"మీరేమన్నా శెట్టిగారికి మామిడికాయలని దులుపుకోమని చెప్పారా?"

"లేదే!" ఆశ్చర్యపోయారు.

"మరెవరో నలుగురు మీ తోటలో కాయలని దులుపుతున్నారు. నేనడిగితే అదే చెప్పారు".

"ఎవర్రా అది పోదాం పద" ముల్లుకర్ర అందుకుని అన్నారు.

"పదండి నేనూ వస్తాను. లోపల సుజనమ్మగారు లేరాండి"

"లోపలెక్కడో ఉంది దేనికి?"

"వడ్లు కొలుస్తానన్నారండి"

"దాని సంగతి తరువాత చూద్దాం. ముందుపద"

సుజన వడివడిగా నడుస్తోంది.

ఆమె నడకే తెలుస్తోంది కోపంగా ఉందని.

సాహికి గట్టిగా చెప్పాలి ఈ ప్రేమా, దోమా మానుకోమని.... ఇలాంటి పిచ్చి వేషాలు మానెయ్యమని మనిద్దరం కలవడం కల్ల అని.

అన్నయ్యలు చెప్పినట్టు సాహి మర్రిచెట్టు నీడన కూర్చున్నాడు.

సుజన వస్తూ కనిపించగానే ఆత్రుతగా లేచాడు.

సంతోషంగా ఎదురెళ్ళాడు.

"నువ్వు వస్తానవి అనుకోలేదు...నాకెంత అబ్బురంగా ఉందో నిన్ను చూడగానే".

సుజనా అతని మాటలు వినిపించుకోలేదు.

"సాహి ఇది పల్లెటూరు. ఏ విషయమైనా గాలికంటే వేగంగా ప్రయాణిస్తుంది. నువ్విలా ప్రేమంటూ ఇక్కడే తిష్ట వేస్తే నీకు దక్కేది ప్రేమకాదు....నా శవం...."

"సుజనా!" ఆవేదనగా అన్నాడు.

"వెళ్ళు, మరెప్పుడు ఆ ఆలోచనలు పెట్టుకోకు. నీకూ నాకూ తగదు. లెక్కకి మించిన పరిమితులున్నాయి. వాటిని దాటడం ఇద్దరికీ సాధ్యంకాదు. సంఘం కట్టుబాట్లు దాటిన ఎవరూ సుఖపడలేదు".

"అంత మాటనకు సుజనా! నీవు లేనిదే బ్రతుకను...నాకు జీవితమే లేదు"

"కాలం దేన్నయినా మాన్పుతుంది. నీ ఆలోచనలు చదువుమీదికి మళ్ళించు, గాయమయిన హృదయానికి అదే చికిత్స.

"అదే ఆఖరిమాటా!"

"చిట్టచివరి మాటేకాదు. చివరి చూపు కూడా" వెనుతిరిగింది.

గుండె ఆగినంత పనైయింది.

వెంకట్రామయ్యగారు...ప్రక్కనే శ్యామ్....సుజనకి గుండెల్లో గుబేల్ మంది.

ఈ సమయంలో తననిక్కడ చూస్తే.....

"అన్నయ్య! అన్నయ్య ఇటెందుకు వచ్చాడు?

"మనిద్దరిని ఇలా చూశారంటే మా తాతయ్య నిన్ను ఉప్పు పాతరేస్తారు. అలా పక్కకి పద" పరిగెత్తుతూ అంది.

సాహి కూడా ఆమె వెనక పరిగెత్తాడు. ఆ శబ్దం వెంకట్రామయ్యగారు విన్నారు.

"ఎవరు? ఎవర్రా అక్కడ?"

వడి వడిగా అటుకేసి వస్తూ అరిచారు.

సుజన పై ప్రాణాలు పైనే పోయాయి.

"శ్యామ్ ఆ చెట్టు వెనుక ఎవరో ఉన్నట్టున్నారు. బయటికి లాక్కురా" ఆజ్ఞాపించారు.

శ్యామ్ ముల్లుకర్ర తీసుకుని...."రండి....బయటికి....తప్పుడు పనులు చేసేటప్పుడు లేని సిగ్గు ఇప్పుడెందుకు. అయ్యగారిని అడిగితే బుట్టలు బుట్టలు ఇచ్చేవారుగా. ఈ కక్కుర్తి పనులెందుకు"

"వాళ్ళలా రారు....చెట్టు వెనక్కి వెళ్ళి ఈడ్చుకురా" శ్యామ్ కర్ర అదిలిస్తూ వెళ్ళాడు.

వెళ్ళీ వెళ్ళటంతోనే ఆశ్చర్యంగా నోరు తెరిచాడు. చేతిలో కర్రని జారవిడిచాడు.

సుజన, సాహి బిత్తరువుల్లా ఉండిపోయారు.

"ఏంటి, అలా బిగుసుకుపొయ్యావ్, ఎవరున్నారక్కడ" అని తానే వచ్చాడు.

చెట్టు వెనకున్న వాళ్ళని చూసారు వెంకట్రామయ్యగారు.

తలొంచుకుని ఇద్దరూ చెట్టుచాటు నుంచి వచ్చారు.

ఓ జ్వాలా వలయమే చుట్టినట్లనిపించింది. భగ.....భగ.....భగ.... భగలాడిపోయాడు. మనిషి మొత్తం ఉడికిపోయి కదిలిపొయ్యాడు.

"సు......సుజ........నువ్వు నువ్వు ఇంతకి తెలిగించావా?"

"తాతయ్యా....." భోరున ఏడుస్తూ రెండుకాళ్ళమీద పడింది.

"ఛీ....లే....నిన్ను తాకితే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయ్" చేతిలోని కర్ర సహాయంతో వెనక్కి అడుగు వేసాడు.

సుజన లేచి తాతయ్య దగ్గరికొచ్చింది.

"నేనే తప్పు చేయలేదు తాతయ్యా"

"నోర్ముయ్" అని విసురుగా చెంపకేసి కొట్టాడు.

సుజన చెంపలదిరిపోయాయి. ఏడుస్తూ పరిగెత్తింది ఇంటివైపు.

సాహికి ముల్లుగుచ్చుకున్నట్లయింది.

"వెధవ....నిన్ను చిన్నప్పట్నించి చదివిస్తున్నానురా, మీ కుటుంబాన్ని ఆదుకుంటున్నాను. దానికి ప్రతి ఫలం ఇదా, తుచ్ఛుడా.....పో......నా కళ్ళముందు నుంచి....."

"పోరా...పాపిష్టి పని చేశావ్ కదరా" తోసాడు సాహిని శ్యామ్...

సాహి తలొంచుకుని వెళ్ళాడు.

వెంకట్రామయ్యగారు బాధపడి శోకతప్త హృదయంతో వెను తిరిగారు.

ఆయన కూడా కనుమరుగు కాగానే దూరంగా ఈ డ్రామా అంతా చూస్తున్న థామస్ శ్యామ్ దగ్గరికొచ్చాడు.

"నీ ఎత్తేమిటో అర్థం కావటం లేదురా పెద్దోడా"

"ఇప్పటిదాకా వేసినవన్నీ జిత్తులే, ఈ రాత్రికి వెయ్యబొయ్యేదే అసలు ఎత్తు.... సాహి ఎక్కడున్నాడు"

☞ ☞ ☞ ☞ ☞

"ఆకాశంలో నక్షత్రాలు ఎన్నిసార్లు లెక్కపెడతావురా! లే...లేచి అన్నం తిను...."

"నాకొద్దు" ముభావంగా ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

"తినకపోతే చస్తావురా" శ్యామ్ అనునయంగా చెప్పాడు.

"మీకు కావలసింది అదేగా. అందుకేగా వెంకట్రామయ్యగారిని తెచ్చింది.... ప్రారంభంలోనే మా ప్రేమని తుంపింది"

"నేనా.....నేనా వెంకట్రామయ్యగారిని తెచ్చింది?"

"లేకపోతే నేనా, సుజనని తోటలోకి రప్పించే బాధ్యత నాదని చెప్పి నన్ను పంపించింది నువ్వు.....ఆమె అక్కడ ఉందని, వస్తుందని తెలిసింది నీ ఒక్కడికే. మరి నువ్వే వెంకట్రామయ్యగారిని వెంట బెట్టుకొస్తే ఏంటి అర్థం".

"పిచ్చివాడా.....మీ ఇద్దరికి కాపలాగా ఎవరూ చూడకూడదని తోపు మొదట్లో ఉన్నాను....ఊహించని విధంగా వెంకట్రామయ్యగారు వచ్చారు. దానికి నాదా బాధ్యత....ఇంత చేసినదానికి ప్రతిఫలం ఇదా" ప్రపంచంలోని అమాయకత్వాన్ని మొత్తం తెచ్చుకుని మరీ చెప్పాడు.

"అయితే నువ్వు తేలేదన్నమాట"

"అలాంటి తప్పుడు పనులు అన్నయ్య చేస్తాడనే అనుకుంటున్నావా"

"క్షమించన్నయ్యా.... అపార్థం చేసుకున్నాను".

"నా సంగతి సరే. పాపం ఆ అమ్మాయిని వారెలా అర్థం చేసుకున్నారో.... ఎన్ని బాధలు పెడుతున్నారో"

సాహి గుండెలు కదిలిపొయ్యాయి.

"కొడతారా అన్నయ్యా"

"లేదురా ముద్దు పెట్టుకుంటారు" కసిగా అన్నాడు థామస్.

"పాపం సుజన..."

"నేను అట్నుంచే వస్తున్నాను. పాపం సుజన అశోక చెట్టుకింద సీతమ్మోరిలా ఉందంటే నమ్ము"

సాహి హృదయం విచిలితమైంది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. బాధగా కళ్ళు వత్తుకున్నాడు.

"ఇక్కడుండి తలకొట్టుకోవటం కాదు. వెళ్ళి ఆ అమ్మాయిని ఓదార్చు"

"ఇప్పుడా" సాహి అడిగాడు.

"మరో గంటాగి, ఊరు నిద్రలో మునిగాక"

"అప్పుడెలా...ఎలా సుజనాని కలుసుకోవటం"

శ్యామ్, థామస్ కింద నుంచి పైకి చూసారు.

"చిన్న బొప్పమ్మ. అర్ధరాత్రి రెండింటికి ఆమె గదిలోకి వెళ్ళి వచ్చి, ఎంత అమాయకంగా అడుగుతున్నాడో చూడు"

"మళ్ళీ గోడ దూకా....వద్దు.....తన మాట మీద నాకు గౌరవం .....మరోసారి రావద్దని చెప్పింది..... నేను వెళ్ళను"

"నీ మర్యాద మండినట్టే ఉంది. అక్కడా అమ్మాయి ఎంత కుళ్ళిపోతోందో, మరెంత హింస పడుతుందో ఆలోచించు".

"అయితే వెళతాను, కన్నీళ్ళు తుడుస్తాను. ఇదే చివరిసారి. నిన్ను కలుసుకోను. ఈ ఇబ్బంది మరోసారి రానీయనని చెబుతాను"

"అప్పుడే పది దాటింది. వెళ్ళేదేదో త్వరగా వెళ్ళిరా. భోజనం చేసి పడుకుందాం".

"ఇప్పుడేనా?"

"అప్పుడే ఊరు సగం నిద్రపోయింది. బంగ్లాలో అంతా ఏడింటికే పక్కలు సర్దుతారు....పో.....పోయి త్వరగా వచ్చేయ్".

"ఓరోయ్ పెద్దోడా, నీ ఎత్తేమిటో అర్థం కావటం లేదురా" వెళుతున్న సాహినే చూస్తూ అడిగాడు థామస్.

"చెప్పానుగా చివరి ఎత్తని.....పద"

"మనమెందుకు....."

"ముందు పదండి దొంగగారు" చెప్పాడు శ్యామ్.

ఆరుబయట చల్లగాలిలో మంచాలేసుకుని హాయిగా నిద్ర పోతున్నారు. చీకటిని ఆసరాగా తీసుకుని ఇద్దరన్నదమ్ములు దొంగల్లా నక్కుతూ వచ్చారు.

"ఈ దొంగ బ్రతుకెందుకు, నక్కి నక్కి నక్కటమెందుకు....." థామస్ గుసగుసగా అన్నాడు.

"నువ్విప్పుడు దొంగవి.....గట్టిగా అరుస్తూ పరిగెత్తాలి..."

"ఓర్నాయనో నేనా? జనం పట్టుకుంటే చితక కొడతారు. ఇందాక దొంగగారు పదండి అన్నప్పుడే అన్పించింది. ఇలాంటి పితలాటకం పెడతావని"

"ఆ మాత్రం తెగింపు లేకపోతే కనపడుతున్న బంగ్లా ఎలా సొంతమవుతుందిరా"

"అయితే వెళతాను"

"నువ్ అరుస్తూ పరిగెత్తుతూ వెళ్ళు.....ఆ తరువాత కథ నేను నడిపిస్తాను. గుంపుగా మేం చేరగానే నువ్వు వెనకనుంచి వచ్చి మాలో కలిసిపో....జాగ్రత్త...."

"థామస్ ఓసారి పైకి చూసి.....పైవాడే రక్ష" అని పరిగెత్తాడు.....

"దొంగ.....దొంగ" అరిచాడు శ్యామ్ దిక్కులు దద్ధరిల్లేలా.

థామస్ నల్లటి దుప్పటి కప్పుకుని "ఏయ్" అని అరుస్తూ పరుగులు తీసాడు.

నిద్ర పోతున్నవారు ఉలిక్కిపడి లేచారు....ఎవరో దుప్పటి కప్పుకుని పరిగెడుతున్నారు.

సరిగ్గా అప్పుడు శ్యామ్ 'దొంగ....దొంగ' అని అరుస్తున్నాడు. అందరికీ అర్థమయింది.

యువకులు మంచం ప్రక్కనే పెట్టుకున్న దుడ్డు కర్రలు తీశారు.

ఆడాళ్ళు మెదలు పమిట చెంగుతో కప్పుకున్నారు.

అందరూ ఒకే చోట కలిశారు.

"ఏడి? ఏడి? ఎటు పోయాడు?"

"అడుగో.....వెంకట్రామయ్యగారి బంగ్లా వైపు పట్టుకుని " చెప్పాడు శ్యామ్.

నిజానికి ఆ పైపు పట్టుకుని సాహి ఎప్పుడో గదిలోకి వెళ్ళాడు.

"ఎక్కడ, ఎక్కడ" చూశారు.

చీకటి తప్ప మరేం లేదు.

"ముందు పదండి....అది సుజనమ్మ గది...." చెప్పాడు శ్యామ్ చల్లగా.

అందరూ మూకుమ్మడిగాకదిలారు....

ఊరంతా మేల్కొంది....

వెంకట్రామయ్యగారు ఆవులిస్తూ బైటికొచ్చారు.

"దొంగయ్యా.....దొంగ......"

"మన ఊరిలో దొంగా....ఎక్కడా?" వెంకట్రామయ్యగారు ఆశ్చర్యంగా అన్నాడు.

"మీ మనవరాలి గదిలో......పైపు లైను పట్టుకుని దూకాడు".

వెంకట్రామయ్యగారు హడావుడిగా కంగారుగా కదిలారు. వారి వెనుక జనం....

గుంపులో అప్పుడే చేరిన థామస్ జనంతో ముందుకు కదలబోతూంటే శ్యామ్ ఆపాడు.

"ఎక్కడికి....గదిలో సాహి ఉన్నాడు. ముందు మనల్ని చూశాడంటే ఇదంతా మనమే చేశామనుకుంటాడు. వెనక్కి నడువ్"

"పెద్ద ప్లానే వేశారు అన్నదమ్ములు"

ఇద్దరూ దిగ్భ్రాంతిగా తిరిగారు. అరుంధతి విలాసంగా నవ్వుతూ

"నువ్వా" తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ

"మిమ్మల్ని మొదట్నించి గమనిస్తూనే ఉన్నాను. ఈ సమయంలో మీకేం పనా అని వెంబడిస్తూ వచ్చాను. పూర్తిగా అర్థమవ్వలేదు గాని, మొత్తానికి ఏదో జగన్నాటకమే ఆడుతున్నారు"

థామస్ ఆమె చెయ్యి పట్టుకుని "సమయానికి కనిపించావ్. నువ్వోపనిచేయాలి...." చెప్పాడు గుస గుసగా.

అక్కడ సుజన గదిలో సాహి దోషిలా తల వంచుకుని ఉన్నాడు.

నిప్పులు చెలరేగుతున్న ఆదిశక్తిలా ఉంది సుజన.

"నన్ను ప్రశాంతంగా బ్రతకనీయవా? తోటలో జరిగిన దానికే సగం చచ్చిపోయాను. తాతయ్యకి మొహం చూపించలేకపోతున్నాను.

ఈ విషయం మా అమ్మకి తెలిసిందంటే గుండె ఆగిపోతుంది. వెళ్ళు మమ్మల్ని ప్రశాంతంగా బ్రతకనీయ్. ఈ ఇంటి పరువుని బజారులో వెయ్యకు".

"నిన్ను మీవాళ్ళు కొడుతున్నారని తెలిసి..."

"ఎవరు చెప్పారు....కనీసం తాతయ్య ఒక్క మాట కూడా అనలేదు. నేనే స్వయంగా వెళ్ళి ఎదురు నిలబడితే....ఆయన ఏమన్నారో తెలుసా, తొందరపడి కొట్టినందుకు బాధపడుతున్నానన్నారు. నా మనవరాలి మీద సంపూర్ణ నమ్మకం ఉందన్నారు...వెళ్ళు.....ఈసారి మరో వంకతో వచ్చావంటే విషం తీసుకుని చస్తాను....ఇంకెప్పుడూ రావద్దు. నీకు నాకు జత కలవదు...."

సాహి ఏదో అనబోయేంతలో శబ్దమయ్యింది.

సుజన గబ గబా కిటికీదగ్గరికి వెళ్ళి చూసింది. జనం.....లాంతర్లు. కర్రలు పట్టుకుని.......

"ఏమైంది?"

"అదే తెలియటంలేదు.... నువ్ బట్టల స్టాండ్ పక్క నుండు నేను కిందకెళ్ళి చూసి వస్తాను".

సాహి స్టాండ్ వెనక్కి వెళ్ళాడు.

సుజన వెళ్ళి తలుపు తీయబోయేంతలో శబ్దమయింది.....సుజన గుండెలు గుబ గుబ లాడాయి.

మొండి ధైర్యంతో తలుపు తీసింది.

ఎదురుగా తాతయ్య....ఆ పక్కనే అరుంధతి...వెనుక ఊరి జనం....

"దొంగటమ్మా, గదిలో దూరాడట" చెపాడు వెంకట్రామయ్య గారు.

సాహి పై ప్రాణాలు పైనే పోయాయి.

"వేసిన తలుపులు వేసినట్టే ఉంటే ఎలా వస్తాడు దొంగ, నా గదిలోకి ఎవరూ రాలేదు"

"పదండి, పక్క గదిలో చూద్దాం" వెంకట్రామయ్యగారు అన్నారు.

శ్యామ్,అరుంధతికి సైగ చేశాడు.

"అదేంటమ్మా, దొంగ నీకు చెప్పి వస్తాడా, చెప్పి దాక్కుంటాడా" అని చొరవగా లోపలికి వెళ్ళింది. అడ్డుకోబోయిన సుజనను సుతారంగా తప్పించి,

ఆమెతోపాటు జనం కూడా చొరబడ్డారు.

శ్యామ్ వికృతంగా నవ్వాడు. వెనక అడుగు వేశాడు. తమ్ముడితో పాటు.

"వెతకండి.... ఏ మూలయినా దాక్కున్నాడేమో దొంగవెధవ" అరిచాడు వెంకట్రామయ్యగారు.

"ఏమయిందమ్మ?" అడిగింది అలికిడికి లేచి వచ్చిన సుజన తల్లి.

సుజన తెల్ల మొహం వేసింది.

"వెంకట్రామయ్యగారూ! బట్టలు మార్చుకునే స్టాండ్ వెనక ఎవరో ఉన్నట్లున్నారు" అరిచింది అరుంధతి.

మగాళ్ళు కర్రలు పట్టుకుని సిద్ధమయ్యారు.

"రా....బయటకు రా.....లేకపోతే కర్రలు నీ మీద నాట్యం చేస్తాయి".

అంతా ఉత్కంఠతగా చూశారు.

సాహి ఇక తప్పదనిపించి లేచాడు. మౌనంగా బయటకు వచ్చాడు.

పైకి లేవబోయిన కర్రలు ఆగాయి.

వెంకట్రామయ్యగారు నోరు తెరిచారు

సాహి.....సాహి.....సాహి....

ఊరి జనం బుగ్గన వేలేసుకున్నారు!

"అమ్మో.....ఎంత జాణ....."ఎవరో అన్నారు.

మరికొందరు వెంకట్రామయ్య వంక జాలిగా చూశారు. ఎగతాళిగా నవ్వారు.

సుజనకి ఆ క్షణమే తల బద్దలు కొట్టుకు చావాలనిపించింది.

"సుజన..... నువ్వు....నువ్వు......నువ్వేనా ఈ పని చేసింది" తల్లి కళ్ళు తిరిగి కింద పడిపోయింది.

"అమ్మా" గట్టిగా అరిచింది సుజన.

వెంకట్రామయ్య గారు ముందుకు వెళ్ళలేదు. వెనక్కి తిరిగారు. ఊతకర్ర సాయంతో వెళ్ళారు....తన గదిలోకి.

ఊరి జనం సుజన తల్లి చుట్టూ చేరారు.

అరుంధతి పరీక్షిస్తోంది. "మరేం ఫర్వాలేదు. షాక్ తింది..." చెప్పింది అరుధంతి.

"వెంకట్రామయ్యగారు గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నారు. ఎంత కొట్టినా తియ్యటం లేదు"– "చెప్పారెవరో"

సుజన ఒక్క ఉదుటన లేచింది ఉరుకులు పరుగల మీద తాతయ్య గది ముందెకెళ్ళింది. రెండు చేతులతో తలుపులు దబ దబ మని బాదింది.

"తాతయ్యా తలుపు తీయ్ తాతయ్య –" పిచ్చిపట్టినట్లు ఆరుస్తోంది తలుపులు పగల కొట్టండి" అరిచారెవరో.

ఆడాళ్ళు సుజనని వెనక్కి లాగారు. మగాళ్ళు తలుపులు భుజంతో బలంగా 'ఢీ' కొన్నారు.

"ఫట్....లోపల గడియ విరిగి పోయింది. విరిగి వెనక్కి పడిపోయిన తలుపుల స్థానంలో....కాళ్ళు..... వెంకట్రామయ్యగారి కాళ్ళు ఊగుతూ కనిపించాయి గాలిలో. ఆయన కాళ్ళ క్రింద టేకు చెక్క కుర్చీ కింద పడిపోయి ఉంది.

అంతా నివ్వెరపోయారు. సుజన అడుగు ముందుకేసింది.

పై కండువాతో దూలానికి ఉరి వేసుకున్న వెంకట్రాయ్యగారి కళ్ళు సుజనాని చూడటం ఇష్టం లేనట్లు మూసుకుని ఉన్నాయి.

"తాతయ్య" కప్పుకూలిపోకుండా వేలాడుతున్న ఆయన కాళ్ళు పట్టుకుని బోరు మంది సుజన.

☟ ☟ ☟ ☟ ☟

ఓ మనిషి ప్రాణం పోతుందని తెలిస్తే , చస్తే ఆ పని చేసే దాన్నికాదు. నన్ను పాపాత్మురాలిని చేశావు...

"పాపం....పుణ్యం చూసుకుంటే కోటీశ్వరులం అవ్వం...."

"పాపం పెద్దాయన, ఆ కుటుంబానికి పెద్ద దిక్కు పోయాడు"

"పోతే పోనీయ్ మనం ఉన్నాంగా"

అరుంధతికి అర్థం కానట్టు చూసింది.

"అవును మేడమ్, నువ్విప్పుడు సుజన తల్లి దగ్గరికి వెళుతున్నావ్

"నేనా...ఇక నా వల్ల కాదు. ఇప్పటికే పాపం మూటకట్టుకున్నాను."

"మేమూ పాపం మూట కట్టుకున్నాం కాంపౌడర్‌ని డాక్టర్ అని ఊరి జనాన్ని నమ్మించి".

"దానికి ప్రతిఫలం తీసుకున్నాడుగా నీ తమ్ముడు"

"ఏది నీ అందమా బజారులో వంద పెడితే వస్తుంది.

అరుంధతి రోషంగా లేచింది.

''ఆఁఆఁకోపమెుద్దు. బాగా ఆలోచించి చెప్పు.....అనుకున్న దనుకున్నట్లయితే యాభై ఎకరాల కొబ్బరితోట నీ పేర ఉంటుంది".

"యాభై ఎకరాలా?"

"నీ ఇష్టం...దానికి తోడు భద్రత....ఈ వూరిలో నీకు ఎదురు ఉండదు"

"ఆలోచించేది లేదు...చెప్పండి? మీరేం చెయ్యమంటే అది చేస్తాను. కాని మాట తప్పకూడదు".

"కోట్ల ఆస్తి ముందు నీకిచ్చే యాభై ఎకరాలు ఓ లెక్కకాదు. నువ్ ఏం చేస్తావో తెలీదు...తండ్రి పోయి దుఃఖంలో ఉన్న ఆ కూతురికి నూరిపోయి.... సాహితో పెళ్ళి చెయ్యమని, కనీసం కొద్దిపాటి గౌరవాన్నయినా రక్షించుకోమని. ఏం మాట్లాడతావో ఎలా చెబుతావో సుజన తల్లి నాకు కబురు చెయ్యాలి..."

☟ ☟ ☟ ☟ ☟

"గౌరవం పోయింది, వంశ ప్రతిష్ట పోయింది... మర్యాద పోయింది. నా తండ్రి పొయ్యారు...రేపో మాపో నేనూ పోతాను....అప్పుడది ఒంటరిదవుతుంది. మచ్చపడ్డ ఆడపిల్లకి ఎన్ని ఉన్నా ఎంత ఆస్థి ఉన్నా ఆమె బ్రతుకు విస్తరే....అలా కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాను సాహిని నా కూతురికిచ్చి పెళ్ళి చేయాలని నిర్ణయించుకున్నాను".

"కాని మీ స్థితికి మేం....వద్దమ్మా...."

"అలా అనొద్దు....మంచో చెడో ....కాలం మారుతోంది.. ఇప్పుడిప్పుడే, కులాలూ మతాలు కలగా పులగం అవుతున్నాయి. యుగధర్మం – కాదనటానికి మనమెవ్వరం – సాహి, సుజన నా కళ్ళ ముందే ఉండాలి –

"మీరింతగా చెబుతూంటే కాదనేదేముంది"

"త్వరలోనే ఆర్భాటం లేకుండా చేసేద్దాం" చెప్పి లేచింది–

అనుకున్నట్లుగానే వారం రోజుల్లో సాహి,సుజనాల పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది.

ఊరు ఊరంతా ముక్కునేలేసుకుంది. ఊరి పెద్దలు వెలివేయాలని కూడా తీర్మానించారు. కాని వెంకట్రామయ్యగారిని దృష్టితో పెట్టుకుని ఆ పని చెయ్యలేక పొయ్యారు.

సుజన సాహితో మాట్లాడటం లేదు – తల్లి నిర్ణయానికి కట్టుబడి చేసుకుంది గాని ఇష్టముండి కాదు – పక్కన కూడా పడుకోలేదు. పట్టె మంచాన్ని సమీపించలేదు–

సాహి కూడా పలకరించే ధైర్యం చెయ్యలేకపోయాడు. ఒకే ఇంట్లో ముగ్గురున్నా ఎవరి దారి వారిదే–

పెళ్ళయిన పది రోజుల తరువాత సాహి మొదటిసారి బయటికి అన్నయ్యల కోసం ఇంటికేసి వెళ్ళాడు.

అప్పుడా సమయంలో అరుంధతి కూడా ఉంది.

"మొత్తానికి మీ తమ్ముడ్ని ఆ ఇంటికి అల్లుడిని చేశారు....."

"అంతా చేసింది నువ్వేగా" నవ్వాడు థామస్.

ఆ ముసలామెని ఒప్పించటానికి నచ్చచెప్పటానికి తలప్రాణం తోకకొచ్చింది. ఎట్టకేలకి ఓప్పించగలిగాను. నా మాట నిలబెట్టుకున్నాను మీ మాటే మిగిలిపోయింది".

"ముందు కోటలో పాగా వెయ్యాలిగా....దాని కోసమే ఆరాటం మా వాడు ఓ సారి వస్తే మాట్లాడతాను"

"దేని గురించి"

నా పెళ్ళి గురించి అదయితే తప్ప, కోటలో పాగా వెయ్యటం సాధ్యం కాదు.

"అడుగో సాహి....మాటల్లోనే వచ్చాడు" చెప్పాడు థామస్.

శ్యామ్ హడావుడిగా లేచి "రా,రా– ఇన్నాళ్ళకి గుర్తుకొచ్చామా మేం" అన్నాడు.

"అదేం మాట అన్నయ్యా – మీరే వస్తారని చూస్తున్నాను. ఎలా ఉన్నారు".

"ఆс ఏముంది – మామూలు బ్రతుకేగా – వండుకోవటం తినటం"

"ఎన్నాళ్ళు ఇలా చేతులు కాల్చుకోవటం. మీకు పెళ్ళవ్వకుండా నేను పెళ్ళి చేసుకున్నందుకు నాకూ ఎబ్బెట్టుగా ఉంది."

"దానికేం ఉంది లేరా మనమేమన్నా ఓ తల్లి కన్నబిడ్డలమా....పట్టింపు లేదులే"

"ఛ....ఛ అలా అనొద్దు. మిమ్మల్ని తోడబుట్టిన అన్నయ్యలనే అనుకుంటున్నాను"

"అలా అనుకుంటే శ్యామ్ అన్నయ్య పెళ్ళి గురించి ఆలోచించే వాడివి" చెప్పింది అరుంధతి.

"నేనా"

"అవును నువ్వే – రోజీనడగొచ్చుగా" అన్నాడు శ్యామ్.

"ఇంతకు ముందు అడిగితే మామయ్య వాళ్ళు కాదన్నారుగా" చెప్పాడు సాహి.

అది ఎప్పుడో, ఇప్పుడు నువ్ అడిగితే కాదనరు. – అప్పుడంటే ఆస్థి లేదు గౌవరం లేదు అన్నారు. ఇప్పుడు నీకు నాకు విలువిస్తారేమో వెళ్ళి అడగొచ్చుగా – నేను చేసుకుంటే రోజీనే చేసుకుంటాను"

"సాహి నవ్వి – అన్నయ్య పెళ్ళి మాటలు తమ్ముడు మాట్లాడటం ఎంత విచిత్రం" అన్నాడు.

"అరుంధతి కూడా వస్తుంది. వెళ్ళి ఓ సారి కదిలించు చూద్దాం" చెప్పాడు.

"వద్దులే, నేనూ, సుజనా వెళతాం మామయ్యతో స్వయంగా మాట్లాడతాం"

"ఏం చేస్తావో నా జీవితం నీ చేతుల్లో పెడుతున్నాను."

సాహి మరి కొద్ది సేపు ఉండి – సాయంత్రమే వెళతాం రేపీపాటికి శుభవార్తతో వస్తాము" అన్నాడు.

"నువ్వు కాదనవనే నమ్మకంతో వచ్చాను" చెప్పాడుసాహి.

"కాదనటానికి ఇప్పుడు కొత్తగా చెప్పే కారణం లేదురా! నా కూతురికి వరసవుతాడు కదాని యిస్తే దాని బ్రతుకు దుర్భరమౌతుంది. పైగా ఆస్థిలేనివాడిని కట్టుకుని ఏం సుఖపడుతుంది చెప్పు".

"ఆస్థే కారణమైతే నేను ఇస్తాను" చెప్పింది సుజన.

సాహి అభినందనగా భార్య వంక చూశాడు.

పక్కనే ఉన్న రోజీ అభ్యంతరం చెప్పింది శ్యామ్‌ని చేసుకోవటానికి.

"ఆస్థి సరే! చదువు.....చదువులేని పల్లెటూరి వాడ్ని చేసుకోను, చదువుకోని వాడికి ఎంత ప్రేమ ఉన్నా దాని ప్రదర్శించటం చేత కాదు"

**"ఆ చదువూ నేను నేర్పిస్తాను. కేవలం ఆరు నెలల్లో ఇంగ్లీషు మాట్లాడిస్తాను"**

"ఏది మీరు ఆ బంగ్లాలో ఉండి, మేం ఆ ఊరిపాకలో ఉండి అంతేనా?" అంది రోజీ.

సుజన చిన్నగా నవ్వింది.

"ఆ అవసరంలేదు. మీరూ మాతోపాటే....అందరం కలిసే....మాకు మాత్రం ఎవరున్నారు అంతా మీరేగా?"

"అలా అన్నారు బాగుంది. ఇక నా అభ్యంతరం కూడాయేమీ లేదు"

రోజీ సిగ్గుగా లోపలికెళ్ళింది.

"మంచి రోజు చూసి వస్తాం మామయ్యా" లేచారు భార్యాభర్తలు.

వారిద్దరి కారు రోజీ ఇంటి ముందునుంచి వెళ్ళడం ఆలస్యం....శ్యామ్ ఆ ఇంట్లోకి వచ్చాడు.

"కాయా, పండా?" అడిగాడు.

"పండే, కాళ్ళా వేళ్ళా పడుతున్నావని ఒప్పుకుంటున్నాను. రోజీని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి. నా కూతురికోసం నువ్వు అడగమన్నట్టు అడిగాను.

మీ పెళ్ళయిన తరువాత మీరూ వాళ్ళతోపాటే బంగ్లాలో ఉంటారు నిన్ను చదివిస్తానని కూడా చెప్పింది ఆ మహాతల్లి... నా అల్లుడు డబ్బుగలవాడే కాదు...విద్యావంతుడు కూడా అవ్వాలి. ఇక ఈ నాటకాలాడడం మాని హాయిగా వృద్ధిలోకి రండి".

"ఎంతమాట..... మీ కూతురి సుఖం కోసమేగా.... ఇంతకీ పెళ్ళెప్పుడు"?

ఫిబ్రవరి ఇరవై. ఇంకా పది రోజులు కూడా లేదు. థామస్ నువ్వు అటూ ఇటూ బలాదూర్‌లా తిరగకు. అన్ని పనులు దగ్గర ఉండి చూడు".

చెప్పాడు సాహి.

"అంతేలే....మా కంత కంటే విలువా గుర్తింపు ఏముంటుంది?" నిష్ఠూరంగా అన్నాడు థామస్.

"ఏమయిందిరా నీ విలువకేం తక్కువేమయింది?"

"అతడికి కూడా ఈ ముహూర్తంలోనే పెళ్ళిచేస్తే సరి" నవ్వింది సుజన అన్నదమ్ముల మధ్యలోకి వచ్చి.

"పెళ్ళయితే విలువ పెరుగుతుందా?" అడిగాడు సాహి.

"మరి! వాళ్ళిద్దరికంటే చిన్నవారు మీరు, ఇప్పుడు పెద్దరికం చేస్తున్నారు. వారికి మాత్రం బాధగా ఉండదూ.... ఇదిగో చూడయ్యా, నీ పెళ్ళి చేసే బాధ్యత నాది. ఎవరన్నా ఉంటే చెప్పు. మీ అన్నయ్య పెళ్ళితో పాటు చేసేద్దాం....రెండు పెళ్ళిళ్లు ఒకేరోజు"

"నాకలాంటి వాళ్ళెవరూ లేరు"

"అలాంటి వాళ్ళెందుకు ఉంటారు? అంతా మురికివాళ్ళేగా...." కడుపుమండి అన్నాడు శ్యామ్.

"సరే ఇప్పుడెందుకులే వాళ్ళ టాపిక్.....అయితే ఇప్పుడేమంటావురా?"

"నేనొక్కడ్ని మిమ్మల్ని వదిలి ఉండను. నాకు భయం...." అన్నాడు.

"నిన్నెవరు ఉండమన్నారు? మాతోనే ఉండు"

"పెళ్ళి కాకుండా నేనుండలేను"

సాహి ఏదో అనబోతుండగా సుజన వారించి..

"మంచి సంబంధం వెదికి ఈ పెళ్ళితోపాటే చేసేద్దాం"

థామస్ ఆప్యాయంగా సుజన వంక చూశాడు.

"పెళ్ళి చేసుకోవటం కాదు. కాస్త అలవాట్లు తగ్గించాలి. మాటి మాటికి పక్కనున్న పట్నం వెళ్ళి పది రోజులు కాపురం పెట్టి రాకూడదు...."

"పెళ్ళయితే ఎందుకెళతాను? నాకామాత్రం తెలీదా?"

సుజన నవ్వుకుని పక్కకెళ్ళింది.

అప్పటికప్పుడే పెళ్ళి కూతుర్ల లిస్టు తెప్పించింది.

పెళ్ళిళ్ళు చేయడంలో ఆరితేరినట్టు అన్ని విషయాలు విచారించి అమ్మాయి మంచిదని, మంచి కుటుంబమని నిర్ణయించుకుని ఓ సంబంధము సెలెక్టు చేసింది.

"పేరు రాగిణి బావుందా?"

థామస్ తలూపాడు.

"సిగ్గుపడాల్సింది ఆమె. తలెత్తి చూడు" అంది సుజన.

థామస్ మెల్లగా తలెత్తాడు.

థామస్ కళ్ళు మెరిసాయి.

అన్నయ్య వైపు వంగి....

"చూడ చక్కగా కసెక్కించేలా ఉంది.ఎర్రటి శరీరం దబ్బ పండులాంటి బుగ్గలు..యమా ఉంది..." అన్నాడు శ్యామ్‌తో గుసగుసగా.

"నోరుముయ్యి, పెళ్ళికూతురిని అలా కసెక్కించేలా ఉంది....యమా ఉందని అనకూడదు– బావుంది అనాలి"

"బావుంది" చెప్పాడు పెద్దగా.

అంతా గట్టిగా నవ్వేశారు.

సుజన సాహి వంక చూసింది.

'నీ ఇష్టమన్నట్టు' తలాడించాడు.

"ఫిబ్రవరి ఇరవై.... రెండు పెళ్ళిళ్ళు ఒకసారి చేద్దామండి" అంది.

"మీ ఇష్టమమ్మా! చిన్నవారయితే మీ మాటే మా శిరోధార్యం"

అనుకున్నట్టుగానే ఫిబ్రవరి ఇరవైన రెండు పెళ్ళిళ్ళు వైభవంగా జరిగాయి.

శ్యామ్, థామస్ ఎవరి అత్తగారింటికి వాళ్ళు వెళ్ళారు.

సాహి బుక్ చదువుకుంటూ ఉన్నాడు.

సుజన అటుకేసి తిరిగి పడుకుని ఉంది.

రెండు పెళ్ళిళ్ళు ఒకేసారి చెయ్యడం వల్లనేమో మనిషి సగం తగ్గింది.

సాహికి భార్యమీద జాలేసింది.

నెమ్మదిగా మీద చెయ్యివేసాడు.

చల్లటి పాము ఒంటిమీద పడ్డట్టు దిగ్గున లేచింది.

రోషంగా సాహివంక చూసింది.

"చెప్పానుగా మీరంటే నాకయిష్టమని...మీ వల్ల నా తాతయ్యని పోగొట్టుకున్నాను. తల్లి ప్రేమను దూరం చేసుకున్నాను. అలాంటి నేను మీకు భార్య ప్రేమ ఎలా అందిస్తాననుకున్నారు"?

"అందుకోసం కాదు"

"మరి?"

"అది....అది....."

సాహివైపు సూటిగా చూసింది.

"బైటమాత్రమే మనం భార్య భర్తలం...మీ భార్యగా మీకూ మీ కుటుంబానికి ఎప్పుడూ నా సహకారం ఉంటుంది. ఒక్క గదిలో తప్ప. గుడ్‌నైట్...పడుకోండి. ఉదయాన్నే రాగిణి,రోజీ కాపురానికి వస్తున్నారు. హారతి ఇవ్వకపోయినా మీ ఆచారాలేవో ఉన్నాయి కదా!"

☞ ☞ ☞ ☞ ☞

"ఊఁకానివ్వండి. పది నిమిషాల్లో వంటలన్ని పూర్తి అవ్వాలి. అవతల ఇద్దరాడపిల్లల తరుఫునుంచి యాభై మంది దాకా వస్తారట" వంట వారిని పురమాయిస్తూ హడావుడి పడుతోంది సుజన.

సాహి మురిపంగా భార్య వంక చూశాడు. తనని పట్టించుకోకున్నా రాత్రిళ్ళు అంటీ అంటనట్టు ఉన్నా తన కుటుంబమంటే ఎంత ఆపేక్ష.....ఎంత ఆదరణ....

ఎందుకో ఆ క్షణం సాహికి అనిపించింది. తననికూడా ఎక్కువ కాలం దూరంగా ఉంచదని. తొందరలో ఆమె మనసులో పడ్డగాయం మానుతుందని.

"ఈ పనివారంతా ఎక్కడికి పోయారు. అరటితోట కెళ్ళి ఆకులు కోసుకురమ్మని చెబుదామంటే ఒక్కడూ అందుబాటులో కనపడడూ" అరుస్తూ తిరుగుతోంది.

"దండాలమ్మా"

"నువ్వెవరు" అతన్ని ఎగాదిగా చూసి అంది.

"బ్రతుకు తెరువు కోసం పొట్ట చేత పట్టుకొచ్చిన అభాగ్యుడినమ్మ. నా పేరం సలీం....ఈ ఊరిలో పనివాళ్ళని పెట్టుకునే స్థోమత మీకే ఉందని తెలిసి వచ్చాను ఆపై మీ దయ....

"సరి.....సరి.....ఏ ఊరు"

"ఇక్కడికి చాలా దూరమమ్మా. ఇక్కడే మీ పంచన ఉండి పోతాను.

సుజన ఓ క్షణం ఆలోచించి "సరే, రాత్రిళ్ళు ఏ పనివాళ్ళు వుండటము

లేదు. అందరూ రాత్రయ్యేసరికి....వాళ్ళ గూటికి వెళుతున్నారు. మాకు ఆ ఇబ్బందీ, కొరత తీరుతుంది. ఉండు" సలీం దండం పెట్టి పక్కకొచ్చాడు.

"అప్పుడాగాయి ఇంటి ముందు కార్లు"

"సలీం లగేజీలోపల పెట్టు" అని సుజన ఇద్దరు కొత్త పెళ్ళి కూతుళ్ళని ఆహ్వానించింది.

రోజీ కారు దిగుతూనే సుజనకి వంగి నమస్కారం పెట్టబోయింనది. సుజన అభ్యంతరం చెప్పి....అక్కున చేర్చుకుంది.

రాగిణి చేతిలోని బ్రీఫ్ కేస్ సలీం అందించింది. అతను హడావుడిగా చేతిలోని సూట్‌కేస్ తీసుకుంటుండగా చేయి తగిలింది. రాగిణి కోపంగా చూసింది.

సలీం తత్తరపడ్డాడు. సూట్‌కేస్ హ్యాండిల్ ఆమె చేతిలో ఉంది. తాను హ్యాండిల్ పట్టుకుందామని ముందుకు చాపటంతో హ్యాండిల్ బదులు ఆమె చెయ్యి తగిలింది.

రాగిణి సూట్‌కేస్ కింద పెట్టి రోజీ, సుజన దగ్గరకి వెళ్ళింది.

సుజన అందరిని ఆప్యాయంగా పలకరించి లోపలికి తీసుకుపోయింది. అప్పటికే సిద్ధంచేసిన గదులను వారికి చూపించింది.

కొత్తగా కాపురానికి వచ్చిన ఇద్దరికి తల్లి ఆశీస్సులు ఇప్పించింది.

ఆ రాత్రి శ్యామ్ హడావుడిగా భోజనం ముగించి రోజీ కోసం గదిలోకి వెళ్తుంటే సుజన ఆపింది.

"ఇలా రండి, టేబుల్ ముందు కూర్చోంది....శ్యామ్ బుద్ధిగా వచ్చి కూర్చున్నాడు.

"గదిలోకి వెళ్ళాలంటే...ఓ కండీషన్... A టూ Z వరకూ ఇరవైసార్లు కాపీరైటింగ్ రాసి వెళ్ళండి.

"ఇప్పుడా"

"మరింకెప్పుడూ, మీ ఆవిడకు మాటిచ్చాను. ఆరునెలల్లో ఇంగ్లీషు మీచేత గడ గడ మాట్లాడిస్తానని"

"దానికి పొట్టకోస్తే అక్షరం ముక్క రాదు. నాకెందుకు" అయిష్టంగా పుస్తకం తీస్తూ చెప్పాడు.

"ఆమెకి ఆ ముక్క రాదు కాబట్టే.

ఆ బాధ ఇప్పుడు తెలుసుకోబట్టే ఆ కోరిక కోరింది. తన భర్త చదువుకోవాలని షరతు పెట్టింది.

"తప్పదా...."

"నేను కూడా నీ ఎదురుగానే కూర్చుంటాను అంతేకాదు..ప్రతి రోజు రోజు ఏడు నుంచి తొమ్మిది వరకూ ఖచ్చితంగా నా ముందు కూర్చోవాలి.

"రోజూనా" శ్యామ్ దిగులుగా తలెత్తి తన గదివైపు చూసాడు.

రోజీ అక్కడే గది ముందు నుంచుని చూస్తూ ఉంది. తన బుంగమూతి చూసి ముసి ముసి నవ్వులు చిదుముతూ లోనికెళుతోంది సిగ్గుగా–

☟ ☟ ☟ ☟ ☟

"అన్నయ్య పెళ్ళయ్యింది. శోభనం కూడా. తమ్ముడూ చేసుకున్నాడు కార్యం గది వదిలి బయటకు రాడు...ఇదిగో ఇన్నాళ్ళకి దొరికారు ఇద్దరూ రెండు నెలల నుంచి మీ కోసం చూస్తున్నాను. నా సంగతేంటి?"

"అరుంధతి అర్థం చేసుకో....మాట తప్పేవాళ్ళం కాదు"

"అని నేననలేదు....దీనికోసమా అంత చేసింది....బంగ్లాలో ఉంటూ ఆమె దయాదాక్షిణ్యాలమీద బ్రతుకుతూ.....కేవలం దానికోసం అంతగా ప్లాన్ చెయ్యనవసరం లేదు"

"తక్కువంచనా వేస్తున్నావ్ అరుంధతీ....ఈ రోజు నా పొజిషన్ తెలిస్తే అలా మాట్లాడవ్. ఇప్పటికిప్పుడు నేను వెళ్ళి సుజనని అడిగితే వేలు కుమ్మరిస్తుంది".

"ఏదీ చేయి చాపితే, యాచిస్తే....."

"నువ్వేమయినా అనుకో. తొందరపడ కూడదు....ఆచి తూచి అడుగు వెయ్యాలి... సర్వం చేజిక్కించుకోవాలి.....అప్పటిదాకా నువ్ ఆగేలా లేవ్.....నీ కోసం అడుగుతాను"

......

........

"అడుగు......ఎలాంటి డౌట్స్ పెట్టుకోవద్దు" చెప్పింది సుజన.

"అడిగితే ఏం అనుకోవుగా"

"డబ్బు దగ్గర, పోట్లాడేటప్పుడు, వైద్యుడి దగ్గర, గురువు దగ్గర మొహమాటం పనికి రాదు"

"డి......ఐ.....ఎ......ఎ.......ఎమ్......ఎమ్.....ఎ.....అంటే...."

"డైలమా"

"దాని అర్థం" అమాయకంగా అడిగాడు.

"క్లిష్టపరిస్థితి...ఏమి తోచని స్థితి....ముందు నుయ్యి, వెనుక పోను గొయ్యి అనుస్థితి"

"Misfortune అంటే?"

"గొప్ప ఆపద"

"మనీ...అంటే"

"మనీ...అంటే సింపుల్" చెప్పబోయిన సుజన ఆగింది. మొదట్నించి శ్యామ్ అడిగిన పదాలను వల్లించుకుంది.

క్లిష్ట పరిస్థితి....గొప్ప ఆపద....డబ్బు....

"డబ్బేమయినా కావాలా?"

శ్యామ్ తలొంచుకున్నాడు.

సుజన బుక్ మడిచేసి నడుంకున్న తాళాలగుత్తి తీసి శ్యామ్‌కిస్తూ చెప్పింది.

"పైన బీరువాలో డబ్బుంది కావలసినంత తీసుకోండి. ఇది మీ స్వంత ఇల్లే అనుకోండి"

శ్యామ్ ఆతృతతగా అందుకున్నాడు.

"ఈ పూటకి చదువుచాలు... మీ అవసరాలకి కావలసిన డబ్బు తీసుకుని తాళాలు ఉదయాన్నే ఇవ్వండి" చెప్పి లేచింది.

నేరుగా తల్లి గదికెళ్ళి పలకరించి, దగ్గరుండి మందులేసి తన గదిలోకి వెళ్ళింది.

సుజన లోనికెళ్ళి తలుపువేసుకోవటం ఆలస్యం....శ్యామ్ బీరువా ఉన్న గదివేపునడిచాడు.

నిలువెత్తు బీరువా.....శ్యామ్ హడావుడిగా తెరిచాడు.....కళ్ళుజిగేల్ మన్నాయి....

బంగారం....బంగారం.....

గుట్టగా వస్తువుల రూపంలో పోసి ఉంది.

ఆపై అరలో కాగితాలు...ఎన్నో....ఏమిటో.....కూడాచూడలేదు...అర

మొత్తం ఉన్నాయి. ఆస్తులను తెలియచేసే పత్రాలు....వాటి జోలికి పోలేదు....కళ్ళన్ని పై అరమీదే ఉన్నాయి.

**మూడో అరలోనే ఉంది డబ్బు.... మనిషిని మృగంలా చేసే డబ్బు, మానవత్వాన్ని నిలువునా చీల్చే డబ్బు.....అన్నకి,తమ్ముడికి, తమ్ముడికి, అన్నకి, భార్యకి,భర్తకి, స్నేహితుడికి, సన్నిహితుడికి, వారూ వీరు అని లేకుండా విడగొట్టి విభజించగల డబ్బు.....బ్లడీ మని....**శ్యామ్ రెండు చేతులూ డబ్బుమీద పెట్టాడు.

అతని చేతులతోపాటు...అతని వెనకే మరో రెండు చేతులు వచ్చాయి డబ్బు మీదకి.

అవి థామస్ చేసతులు.

శ్యామ్ ఉరిమి చూశాడు.

థామస్ వెలికిగా నవ్వి “పక్క నుంచి అంతా విన్నాను. మరి నాకూ కావాలిగా డబ్బు....

శ్యామ్ నవ్వాడు...ఇద్దరూ జేబుల్లో దోసిట్లో నింపుకున్నారు. మళ్ళీ తాళం వేసారు.

“వస్తా” అన్నాడు థామస్ జట్టు సరవించుకుంటూ.

“ఎక్కడికి?” ఆశ్చర్యంగా అడిగాడు శ్యామ్.

“అరుంధతికి డబ్బిచ్చి తోట కొనుక్కోమని చెబుతాను”

“త్వరగా రా...ఎటూ వెళ్ళకు....”

“అన్నయ్యా,.....డబ్బుండగానే సరా, అనుభవించాలి. ఖుషీ చేయాలి ఇంత డబ్బుకి ఎన్ని అందాలో – మరెన్ని మకరందాలో.....”

“కొత్తగా పెళ్ళయిందిరా వెధవ... వెధవ తిరుగుడు తిరిగి ఆరోగ్యము పాడుచేసుకోకు, ఆ పిల్ల ఆరోగ్యం చెడగొట్టకు”

“డబ్బుంటే ఎంతసేపు...విదేశాలెల్లి బాగుచేసుకోవచ్చు...ఉంటా” అని సమాధానం కోసం ఎదురు చూడకుండా చెయ్యి ఊపివెళ్ళిపోయాడు.

శ్యామ్ మాత్రం డబ్బు భద్రంగా తీసుకెళ్ళి భార్యకి చూపించాడు.

మొగుడి తెలివితేటలకి మురిసిపోయింది రోజీ. నోట్లకట్టలను పరుపుకింద పెట్టి దానిమీద హాయిగా నిద్రపోయారు దంపతులు ఇద్దరూ.

ఆ రాత్రి నిద్రపోనిది రాగిణే.

భర్త కోసం చూసి చూసి విసుగుపుట్టి బయటకొచ్చి హాల్లో తిరుగుతూ కాలక్షేపం చేసింది.

రెండయింది రాలేదు....కళ్ళు కూరుకుపోతున్నాయి.. పెట్టుకున్న మల్లెలు వాడిపోతున్నాయి.

కోర్కెలతో నిండిన శరీరం నిద్రపోనంటుంది....అయినా కూర్చుని కళ్ళు మూసుకుంది మూడు....టంగు.....టంగున......గంటలు మ్రోగాయి.

రాగిణి దిగ్గున కళ్ళు తెరిచింది.

సలీం....కాఫీ కప్పుతో....

రాగిణి కోపంగా చూసింది.

"మూడింటికి కాఫీ ఏంటిరా?" కళ్ళెత్తి చూసింది.

"అయ్యగారి కోసం మీరు ఎదురు చూస్తూ పచార్లు చేస్తూండటం గమనించాను. ఆయనొచ్చేదాకా మీరు వెళ్ళేట్టు లేరు...ఆయనేమో రాలేదు....అందుకే కాఫీ పెట్టుకొచ్చాను"

"అంటే రాత్రంతా నన్ను చూస్తూ పరిశీలిస్తూ ఉన్నావా?" ముక్కు పుటలు రోషంగా కదిలాయి రాగిణికి.

"లేదండి. మావాళ్ళు గుర్తొచ్చారు. నిద్రపట్టలేదు. రెండుసార్లు మంచినీళ్ళకి లేచినప్పుడు ఆలికిడి అయితే వంట గదిలోంచి బయటకొచ్చి మిమ్మల్ని చూసి మళ్ళీ లోనికెళ్ళాను ఇదిగో ఇప్పుడు మూడోసారి....ఈ కాఫీ తాగండి....

లేదా ఆయన కోసం ఎదురు చూడటం ఆపి వెళ్ళి పడుకోండి. మీరు నిద్రపోకుండా ఇక్కడుంటే, అక్కడ నాకు నిద్ర రావటం లేదు" సలీం ఆ మాటలన్నప్పుడు చూపు కిందకి దిగింది.

రాగిణి పమిట సర్దుకుని కప్పు తీసుకుంది.

ఆమె తాగుతున్నంతసేపు సలీం కళ్ళు. తెల్లగా మెరిసే రాగిణి నడుం మీదే ఉన్నాయి. దాన్ని గమనించింది.

"ఆయనొచ్చేవరకూ ఇక్కడే ఉంటాను. మరో గంటాగి మళ్ళీ టీకప్పుతో రాకు"

సలీం వినయంగా తల ఊపి వెళ్ళాడు.

రాగిణి చెప్పినట్లు ఆ రోజు మళ్ళీ సలీం రాలేదు. కాని....మరుసటి

రోజు వచ్చాడు. రెండింటికి వచ్చి థామస్ కోసం ఎదురు చూస్తున్న రాగిణికి టీ ఇచ్చి వెళ్ళాడు.

ఆ రోజే కాదు వరుసగా...అంతకన్నా ఏ మగాడికి అవకాశం రావాలి.

పెళ్ళయిన కొత్తలోనే ఉదయం బయల్దేరి వెళ్ళినవాడు తెల్లవారుజామున వస్తుంటే ఏ ఆడదయినా మారటానికి, భర్తమీద అసహ్యం పెంచుకోవటానికి ఎంతసేపు....

థామస్‌ని మరచిపోవటానికి సలీంని ఆహ్వానించటానికి రాగిణికి అట్టేకాలం పట్టలేదు.

ఓ మంచిరోజు రాగిణి సలీంని అదృష్టవంతుడ్ని చేసింది. ఇప్పుడు అర్ధరాత్రుళ్ళు రాగిణే సలీం కూడా కలిపి టీ పెడుతూ ఉంది.

☟ ☟ ☟ ☟ ☟

"నాకు డబ్బుకావాలి?"

"నాకూ కావాలి డబ్బా! కాని ఏదీ?"

"అన్నయ్యా! " అరిచాడు థామస్.

"ఊరికే అరవకు. ఇప్పటికే చాలా ఇచ్చాను. అడిగిన ప్రతిసారి కాదనకుండా కట్టలు కట్టలు ఇచ్చాను"

"ఆ కట్టలే ఇప్పుడూ ఇవ్వు"

"ఉండాలిగా...నా దగ్గర ముద్రించే మిషన్ లేదు"

"బీరువాలో ఉంది ఇవ్వు. అట్టే విసిగించకు"

"తాళాలు నా దగ్గర లేవ్. నిన్నే సుజన తీసుకుంది"

"అన్నయ్యా నీ మర్యాద పోగొట్టుకోకు"

"అదెప్పుడో నువ్వు పోగొట్టుకున్నావ్.నువ్వు ఏ రోజున్నా ఇంటి పట్టునున్నావ్‌రా. అవతల ఆ పిల్ల చూడరా,కొత్తగా పెళ్ళయి, కోటి కోర్కెలతోకలలు కంటూ వచ్చింది. ఇప్పుడు కంటిమీద కునుకు లేకుండా నీ కోసం ఎదురు చూస్తోంది."

"నా సంసారం గురించి నాకు తెలుసు. నాకు డబ్బు కావాలి"

"దేనికయ్యా" అంటూ వచ్చింది సుజన.

"అది..అది....వ్యాపారానికి" టక్కున అబద్ధం ఆడేశాడు.

"ఎంత కావాలి?"

"కొద్ది మొత్తమే"

"బావగారు తాళాలివ్వండి" అంది సుజన.

శ్యామ్ ఏడ్వలేక నవ్వి. "వాడలాగే అంటాడు...నువ్వెళ్ళమ్మా" అన్నాడు.

"వ్యాపారం చేసుకుని బాగుపడతానంటే అడ్డుచెప్పకూడదు"

"అలా చెప్పువాడికి" అక్కసుగా అన్నాడు థామస్.

శ్యామ్ గత్యంతరంలేక తాళాలిచ్చాడు.

"ఇక్కడే ఉండండి తెస్తాను" అని సుజన బీరువా గదిలోకి వెళ్ళింది.

"ఇందాక అడిగితే తాళాలు సుజన దగ్గరున్నాయని చెప్పావు" ఉరిమి అడిగాడు శ్యామ్‌ని.

"ఓరి నీ నట్టుతెగా, ఆ బీరువాలో ఏమీ లేదురా! ఇప్పుడు సుజన వచ్చి అడిగితే ఏం సమాధానం చెపుతావో చెప్పు"

"ఏమీలేదా? అంతడబ్బూ, బంగారం ఏమైంది?"

"కాకెత్తుకుపోయింది...అడిగినప్పుడల్లా వేలకు వేలు ఎక్కడ్నించి తెచ్చి ఇచ్చాననుకున్నావ్....అందులోదేగా!".

"అంతా ఖర్చుపెట్టానా? ఇందులో ఏదో మోసం ఉంది. నువ్వే అంతా మింగేసి ఉంటావ్".

శ్యామ్‌కి థామస్‌ని నమిలి మింగేయోలన్నంత కోపం వచ్చింది. తమాయించుకున్నాడు.

సుజన విసురుగా వస్తుండటంతో –

"బీరువాలో చిల్లుకాణిలేదు ఏమయిందంతా?" ఆశ్చర్యంగా అడిగింది.

శ్యామ్ నీళ్ళు నమిలాడు.

థామస్ భుజాలెగరేసాడు.

"బంగారం కూడా లేదు. ఏడువారాల నగలూ, బంగారపు ముద్దలు. ....ఇంకా....చాలా .....చాలా....ఏమయిందంతా?"

"ఏమవుతుంది మింగేసి ఉంటారంతా" ఎప్పుడు వచ్చిందో సుజన తల్లి గుమ్మం దగ్గర నిలబడి ఉంది.

ఆవేశంతో వూగిపోతోందామె.

"మేం అలాంటివాళ్ళం కాదు"

"ఎలాంటి వాళ్ళురా పుండాకోరు వెధవల్లారా? అయినా నా బుద్ధి ననుకోవాలి. తీసుకొచ్చి కుంపటిని నెత్తిమీద పెట్టుకున్నాను చూడు, నా చెప్పుతో నేను కొట్టుకోవాలి. కొంపని గుండం చేస్తున్నారు కదరా" చివరలో ఆవేశం ఎక్కువయి ఊపిరాడక ఖళ్ఖళ్ మని దగ్గింది.

"అమ్మా! నువ్వు మాట్లాడకు...." సుజన తల్లి ఆవేశం చూసి దగ్గరకెళుతూ అంది.

"ఏం? నీ వాళ్ళనంటే కోపం పొడుచుకు వచ్చిందా?"

"అదికాదమ్మా......" సుజన చెప్పబోయింది.

"ఒసేయ్! ఈ ఆస్థి నా తండ్రి తరువాత నాకొస్తుంది. అన్ని హక్కులు నావి. నా తరువాతే నువ్వు....అన్నీ పోగొట్టుకుంది... కులసంకరానికి కూడా ఒప్పుకుంది. నీ సుఖం కోసమేనే....చూస్తుంటే అది కూడా మిగిల్చేలా లేరు వీళ్ళు.....

ఆస్థి మొత్తం మింగేసి నిన్ను, నీ భర్తని బయటికి గెంటుతారు. కానీ అది నా కంఠంలో ప్రాణముండగా జరగదు"

"ఊరుకోమ్మా! ఆయన వింటే బాధపడతారు. వచ్చే వేళకూడా అయింది"

"దేనికే బాధ? మీ ఆయనగారి స్వంత అన్నదమ్ములేమీకాదు. అయినా చేరదీసి ఆశ్రయం ఇచ్చి అన్నీ చేస్తే ఇంత హీనంగా ప్రవర్తిస్తారా? రానివ్ మీ ఆయన్ని ఆయన్నే అడుగుతాను"

"అమ్మా!" అంది సుజన.

కూతురి మాటలు వినేస్థితిలో లేదు.

"నా పుట్టింటి వారి నగలు...అవి నా కూతురు దగ్గర ఉండాలి. ఆ నగలేమి చేసారో నాకు తెలీదు. అవి నాకు కావాలి.

రేపు ఉదయానికల్లా అవి నా కళ్ళముందు లేకుంటే వెంకట్రామయ్యగారి కూతురి ఆవేశం చూస్తారు. మెడపట్టుకు బయటికి గెంటించటానికి కూడా వెనుకాడను'

"అమ్మా!" సుజన పెద్దగా అరిచింది.

"నోరుముయ్యి....ఈ బాధ నీకిప్పుడు తెలీదే! రేపు ఇదే పరిస్థితి నీ కన్న..... కూతిరింట్లో జరుగుతుంటే తెలుస్తుంది. మాట్లాడొద్దు.. నీ గదిలోకి వెళ్ళు– అంతే".

అని గుండెపట్టుకుని శ్యామ్, థామస్‌ల వంక చీత్కారంగా చూసి వెళ్ళింది.

☟ ☟ ☟ ☟ ☟

"బాగా ఆకలిగా ఉంది. అరగంట...అరగంటకి తిన్నా ఆకలి అవుతోంది"

"ఇంకా"

"పెందలాడే నిద్రపోవాలనిపిస్తుంది. ఎక్కువగా కళ్ళు తిరుగు తున్నట్టనిపిస్తుంటుంది"

"ఔట్ ఆఫ్‌డోర్స్, ఐమీన్ పీరియడ్స్ నీకు మంత్ ఎప్పుడు?"

"అర్థం కాలేదు" చెప్పింది రాగిణి.

"సారీ.....మీకు ఇంగ్లీషు రాదు కాదూ....మీకు నెలెప్పుడు?"

"పది, పదిహేను మధ్య"

"అంటే, మంత్ ఆగిపోయి పదిహేను రోజులువుతుందన్నమాట! వాంతులేమన్నా అవుతున్నాయా?"

రాగిణి భయంగా చూసింది.

అరుంధతి కూర్చున్న సీట్ వెనక అబ్బాయి బొమ్మ నవ్వుతూ కనిపించింది.

రాగిణి భయంగా తలూపింది.

అరుంధతి చెయ్యి పట్టుకుని నాడి చూసి....

"పులుపు వస్తువులు తింటున్నావా'?" అడిగింది.

"పులుపు వస్తువులా ఆవెందుకు తినటం?" తెలిసినా నిర్ధారణకోసం అడిగింది.

"మరీ చిన్న పిల్లాల మాట్లాడకు...నీకు రెండో నెల– థామస్ తండ్రి కాబోతున్నాడు"

"అయినా అంత తొందరెందుకు పడ్డారు? కొత్తగా పెళ్ళయింది. ఆనందగా నాలుగేళ్ళ జీవితాన్ని అనుభవించక – నేను ఈ సమయంలో అనకూడదు – ఏమైనా తొందరపడ్డారు"?

రాగిణి భోరున ఏడ్చింది.

అరుంధతి దడుసుకుంది.

"నా తల్లే నేనేదో చనువుగా అన్నాను. దానికే ఈ ఏడుపా?"

రాగిణి తల అడ్డంగా వూపి.....

"అందుక్కాదు. ఆయనకి తెలిస్తే చంపేస్తారు" అంది.

"ఎవరికి?" అడిగింది అనుమానంగా.

"మా ఆయనకి"

"అంతేకదా! నేనెవరికో అని భయపడ్డాను. సొంత మొగుడే కదమ్మా ఇదేదో ఆయనకి తెలియకుండా అయినట్టు ఏడుస్తావే"

"నిజంగానే ఆయనకి తెలియదు డాక్టర్"

అరుంధతికి పగలే చుక్కలు కనబడ్డాయి. కళ్ళుబైర్లు కమ్మి.

"అర్థం కాలేదు మళ్ళీ చెప్పమ్మా!"

"దీనిక్కారణం ఆయన కాదు"

"మరెవరు?" అరుంధతి ఉద్వేగంగా ముందుకు కదిలింది.

"అది మాత్రం అడగొద్దు...ఓ చీకటి రాత్రి తప్పని సరి పరిస్థితుల్లో తప్పక లొంగిపోయాను" చాకచక్యంగా చెప్పింది రాగిణి.

అరుంధతి అపనమ్మకంగా చూసింది.

ప్రియుడెవరో చెప్పడం ఇష్టం లేదని తెలిసి రెట్టించలేదు.

రాగిణి ఊహించని విధంగా అరుంధతి చేయిపట్టుకుని....

"నన్ను తల్లిలా మీరే కడుపులో పెట్టుకోవాలి"

"అంత అవసరం లేదులే. తన కడుపులో బిడ్డకి అసలు తండ్రి ఎవరో కొంత మంది ఆడాళ్ళకు తెలుసు. అంతమాత్రాన దాన్ని బయట పెట్టుకోకూడదు. నీకు పెళ్ళయింది కాబట్టి నీ కడుపులో పెరుగుతున్నది థామస్ కొడుకే"

"నిజమే... ఆ అవకాశముంటే ఒంటరిగా ఎందుకొస్తాను?మా శ్రీవారిని కూడా వెంట పెట్టుకుని మరీ వచ్చేదాన్ని. ఆ అవకాశం నాకు లేదు"

"ఏ అవకాశం?"

"నా కడుపులో బిడ్డని థామస్ బిడ్డగా కనే అవకాశం...ఆయన నన్ను తాకి రెండు నెలలపైన అవుతుంది. ఇంటిలో నిద్రచేసి అన్ని రోజులవుతుంది మావారు"

"మా తల్లే" మెటికలు విరిచింది అరుంధతి.

"అందుకే అనుమానం వచ్చి మీ దగ్గరికి వచ్చాను. నన్ను నీ బిడ్డలా భావించి మీ కడుపులో...."

"పెట్టుకుంటాను, అర్థమైంది. ఏమిస్తావ్......"

"ఎంత కావాలి?"

"రేపురా...ముందు నీ కడుపుని క్లీన్ చేసి, ఆ తరువాత ఏం కావాలో చెబుతాను" అంది.

రాగిణి లేచింది, అప్పుడే విసురుగా తలుపులు తోసుకుంటే లోనికొచ్చారు శ్యామ్,థామస్‌లు రాగిణి అవాక్కయిపోయింది, అరుంధతి బిత్తర పోయింది.

"ఏంటిక్కడ ఉన్నావ్" అడిగాడు థామస్ లోనికొస్తూనే భార్య కనపడటంతో–

"అది....అది" నసిగింది.

"డాక్టర్ దగ్గరికి ఎందుకొస్తారురా" అని తమ్ముడితో అని రాగిణి వైపు తిరిగి–

"ఒంట్లో బావుండకపోతే కబురుచేస్తే వస్తుంది. మీరే ఇంతదూరం రావక్కరలేదు" చెప్పాడు శ్యామ్ మరదలితో.

రాగిణి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

"పో....నేను తరువాత వస్తాను" చెప్పాడు థామస్.

భర్త పక్కనే శ్యామ్ ఉండటంతో మారు మాట్లాడకుండావెళ్ళింది.

"కూర్చోండి. ఏంటి అన్నదమ్ములు ఏకంగా వచ్చారు. ఊరకరారు మహాత్ములు".

"ఊరకే రాలేదు. ఓ గడ్డు పరిస్థితుల్లో ఇరుక్కున్నాం"

"నాకు తెలుసు...లేకపోతే మీరా నా దగ్గరికి"....

"దెప్పి పొడుపులెందుకుగాని, ఈ రోజు ఇంట్లో గొడవయ్యింది"

"ఎవరితో"

థామస్ డబ్బులు అడగటం దగ్గర్నించి సుజన రావటం....చివరలో ఆమె తల్లి ఎంట్రన్స్, చివరి వార్నింగ్ అంతా చెప్పాడు.

"అయితే రేపట్నించి ఇద్దరన్నదమ్ములు నులకతాడు అల్లుకోవటమే నన్నమాట".

"అంత ఖర్మ మళ్ళీ నా జీవితంలో రాదు"

"నిజమే, ఎందుకొస్తుంది. బాగానే కూడబెట్టి ఉంటారు".

"నా దగ్గర చిల్లిగవ్వలేదు. అంతా ఖర్చయ్యింది" చెప్పాడు థామస్ నిజాయితీగా.

"నీ గురించి నాకు తెలీదూ. మీ అన్నయ్య దగ్గర ఉండే ఉంటుంది".

"అవును ఉంది. అలా అని తిరిగిస్తే మనం మరీ హీనమవుతాం. ఇవ్వకపోతే అది మనల్ని ఊరికే వదిలేలా లేదు. ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు."

"అర్థం కావటానికేముంది వెళ్ళి ముసలామె కాళ్ళు పట్టుకుని – మరోసారి ఇలాంటి పనులు చెయ్యమని చెప్పండి. ప్రస్తుతానికి అంతకు మించి గత్యంతరం లేదు"

"అవును, నువ్ చెప్పింది ఆచరించ తగ్గదే. సలహా చెప్పినదానివి ఆపని కూడా నువ్వే చేయకూడదు.

"నేనా?"

"అవును నువ్వే....పట్టుకోవాల్సింది ఆమె కాళ్ళుకాదు...గొంతు. ముసలామెని గొంతు పిసికి చంపు"

"నేను హత్యా......!?

మతి ఉంటే మాట్లాడుతున్నావా?"

"ఏం కొబ్బరితోటకి డబ్బు ఊరికే ఇచ్చామనుకున్నావా?కష్టములో ఆదుకుంటావనేగా"

"కాని హత్య"

"మాకు కొత్తే అయినా నిన్నెందుకు చెయ్యమంటున్నామో తెలుసా? కొద్దో గొప్పో వైద్య పరిజ్ఞానం ఉన్న దానివని. హత్య అని తెలీకుండా చంపుతావని"

"మీరెన్నయినా చెప్పండి. నాకు భయం".

"భయం గియం అనవసరం. నువ్ చేస్తున్నావ్ అంతే, నీకు మరో యాభై ఎకరాల కొబ్బరితోట ఇస్తున్నాం. నువ్ తీసుకుంటున్నావ్"

అరుంధతి ఆశగా చూసింది.

"ఏమొచ్చినా మీరే చూసుకోవాలి."

"నీ ప్రాణానికి మా ప్రాణం అడ్డు" రాత్రి తొమ్మిందింటికి సిద్ధంగా ఉండు. థామస్ వచ్చి తీసుకొస్తాడు. దగ్గు ఎక్కువయిందన్న వంకతో గదిలోకి వెళ్ళు...."

"సాహీ,సుజనా"

"ఇద్దరి సంగతి నేను చూసుకుంటాను...సుజన బయటికి రాదు. సాహి ఉండకపోవచ్చు. రాత్రికెప్పుడో వస్తాడు ఇకపోతే రోజీ అంటావా? ఆమెతో సంప్రదించే వచ్చాం. మిగిలింది రాగిణి, సలీం...వాళ్ళిద్దరూ గదులు వదిలి బయటకు రారు... నీ పని నిమ్మళంగా శబ్ధం కాకుండా చేసుకుపో....వెనకుండి అన్నీ మేం చూసుకుంటాం....

☟ ☟ ☟ ☟ ☟

"అన్నయ్య వాళ్ళు ఎందుకలా కోపంగా వెళుతున్నారు" ఇంట్లోకి వస్తూనే అడిగాడు భార్యని సాహి.

"ఏం లేదండి"

"ఏం లేకపోవటమేమిటి? నేను ఇంట్లో అడుగుపెట్టబోతుండగా, మీ అమ్మగారి కేకలు కూడా విన్పించాయి. ఏం జరిగింది.మా వాళ్ళేమన్నా తప్పు చేశారా?"

"అబ్బే....అదేం లేదు" ముక్తసరిగా చెప్పి పరుపుమీద బెడ్‌షీట్ మారుస్తూ అంది.

"తెలియక ఏదన్నా పొరపాటు చేస్తే మీరే సర్దుకోండి. ఎందుకంటే మాకు చిన్నప్పట్నించి చెప్పేవాళ్ళు లేరు. ఏది మంచో ఏది చెడో తెలియదు. మనసుకి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించడమే తెలుసు"

సుజన వెనక్కి తిరిగి సాహి వంక చూసి, ఎలాంటి ఫీలింగ్ ప్రదర్శించకుండా తిరిగింది. సాహి టాపిక్ మార్చే ఉద్దేశ్యంతో "శ్యామ్ అన్నయ్య బాగా చదువుకుంటున్నాడా?" అడిగాడు.

సుజన తలాడించింది.

"అనుకున్నాను....మొన్న ఇంగ్లీషులో తప్పు లేకుండా నాతో మాట్లాడితే, నిన్ను మెచ్చుకోకుండా ఉండలేకపోయాను."

సుజన దిండ్లకి గలీబులు మార్చే ప్రయత్నంలో ఉంది. భర్త మెచ్చుకోలుకి, పొగడ్తకి కూడా వెనక్కి తిరగలేదు...

సాహి ఉడుక్కున్నాడు. తనకూ ఎదుటివాళ్ళని ఉడికించటం తెలుసు అనుకుని....

"సుజన ఎందుకలా ఇరవై నాలుగుగంటలూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటావ్...దాని వల్ల ఎంత శక్తి వృధా అవుతుందో తెలుసా? పియానో వాయిస్తే....0.8....గట్టిగా పాడితే కూడా 0.8.. పక్క సర్దుతుంటే 3.0 కేలరీల శక్తి ఖర్చవుతుంది"

సుజన పక్కని నీట్‌గా సర్ది....భర్తకేసి తిరిగి-

"ఆపకుండా మాట్లాడితే 0.9 కేలరీలు ఖర్చవుతుంది. ముందు అది తెలుసుకోండి" అంటించింది.

"హాయ్, నీకూ తెలుసే, భర్త పక్క సర్దుతుంటే 3.0 అదే పక్కలోకి వస్తే...."

సుజన విసురుగా తిరిగింది.

సాహి తడబడ్డాడు.

"ప.....ప....పక్కలోకి.....వ......స్తే...."

"ఏం పది కేలరీల శక్తి వృధా చెయ్యాలని ఉందా?"

సాహి బిత్తరపొయ్యాడు. అంత చురుగ్గా సమాధానం ఇస్తుందని ఊహించలేదు. సరదాగా ఉడికిద్దామనుకున్నాడు. ప్రతి రోజు పక్కనే పక్కలో ఉంటూనే దూరంగా ఉంచే భార్యమీద చిరుకోపాన్ని అలా తీర్చుకోవాలనుకున్నాడు. అలా మాట్లాడితే సిగ్గుగా పక్కకి పోతుందనుకున్నాడు.

సుజన సాహి దగ్గరికొచ్చి భుజం తట్టి..."ఏమిటండి ఈ మాత్రానికి ఎక్కడికో పోయారు" అంది.

"నిజంగా...నువ్ నిజంగా అన్నావా?"

"నేను ఆడదాన్నే...నాకు మనసుంది. ఆ మనసులో భర్త పట్ల ప్రేమ, వాత్సల్యం ఉన్నాయి. నా మనసులో తాతయ్య పోయినబాధ అది మీవల్లేనన్న కసి, నన్ను అలా ఇన్నాళ్ళు ప్రవర్తించేలా చేశాయ్"

"మరిప్పుడు"

"ఏ అద్భుతం జరగలేదు....కాలం...కేవలం కాలమే నాలో గాయాన్ని మాన్పేసింది"

"అయితే ఇప్పుడు నీ హృదయంలోనే ఉన్నానన్నమాట"

"ఇప్పుడేమిటి ఎప్పుడో ఉన్నారు. తొలిసారి సాహసం చేసి నా గదిలోకి వచ్చినప్పుడే నా మనసులో పడ్డారు. కానీ నేనే బలవంతంగా అణుచుకున్నాను. కులం,మతం,సంఘం,గుర్తుకు తెచ్చుకుని బలవంతాన వద్దనుకున్నాను".

"ప్రేమకి కులమతాలు అడ్డుకావు సుజన"

**సుజన నవ్వింది. "ఒక్కమాట అడుగుతాను చెప్పండి. రేపు మనిద్దరికి పిల్లలు పుడితే, స్కూల్లో చేర్పించేటప్పుడు తల్లిదండ్రుల పేర్లు మన ఇద్దరివి వస్తాయి. కులం దగ్గర ఏం రాయాలి, కిస్టియన్ అనా? హిందూ అనా?"**

"అది...అది......"

"పోనీ రేపొద్దున వాళ్ళకి పెళ్ళి చేయాలంటే, ఏవైపున సంబంధాలు వెతకాలి....అసలు వాళ్ళకి పెళ్ళవ్వటం ఎంత కష్టమో ఆలోచించారా?"

"నువ్ పొరబడుతున్నావ్ సుజనా....అన్ని మతాలు కులాలు కలిసిపోయి ఐక్యమత్యంగా ఉండే అవకాశం,ఈ ప్రేమ పెళ్ళిళ్ళవల్ల అవుతుందిగా".

"సర్లెండి....నాతో అంటే అన్నారు...బయటెక్కడ ఆనకండి. నవ్వుతారు".

"దేనికి నవ్వేది...." రోషంగా అన్నాడు.

"నాకే నవ్వు వస్తుంది మీ మాటలు వింటుంటే"

"అయితే నవ్వు, నువ్ నవ్వితే నాకానందం, సంతోషం సౌరభం".

"ఇంకేమీ కలగవా?...వెళ్ళి స్నానం చేయండి" అంది చెయ్యిపట్టుకుని లేపుతూ...

"ఇప్పుడా....చాలా ముఖ్యమైన పని.......

పక్కనున్న పల్లెలో మన ఇరవై ఎకరాల పొలాన్ని ఆ ఊరివాళ్ళు ఆక్రమించుకుంటున్నారట...వెళ్ళి ఆ ఊరి వాళ్ళతో మాట్లాడి, ఇది పద్ధతి కాదని చెప్పిరావాలి. వస్తానని కబురు చేశాను కూడా".

"అబ్బ పోనిద్దు....మనకున్న ఎకరాల్లో అదెంత? పేదలు పాపం? ఇళ్ళేసుకుంటారో...సాగుచేసుకుంటారో చేసుకోని"

"ఆc.....ఆc....

అలా అని చనువిస్తే మన పొలాలన్నీ ఆక్రమించుకుంటారు. మనమిస్తే అది దానం......కాని అదిప్పుడు దౌర్జన్యం"

"అయితే వీరుడిలా వెళ్ళి ఆ దౌర్జన్యాన్ని అడ్డుకుంటారా? అదీ ఒక్కరే"

"అన్నయ్యలకి చెప్పాను - వారు రావలసినంత పనికాదు. అదీగాక వాళ్ళిద్దరిది దుడుకు స్వభావం. తొందరపడి మీద చెయ్యి చేసుకునే పద్ధతి. దాని వల్ల లేనిపోని ఇబ్బందులు రావచ్చు. అందుకే నేనే వద్దన్నాను".

"తొందరగా వచ్చేస్తారుగా"

"భోజనాల వేళ మించకుండావస్తాను. మనసిక్కడే ఉంటుంది."

"ఏది రాత్రి పదింటికా?" నవ్వింది సుజన.

సాహి కూడా నవ్వి- "ఈ రోజు నాకు వెళ్ళాలనిలేదు. కాని తప్పదు. నేను వచ్చే వరకూ నా కోసం మెలుకువగా ఉండకు. పడుకో. వచ్చి లేపుతాను" చెప్పాడు ప్రేమగా.

సుజన తలాడించింది.

తలుపు కిర్రున చప్పుడయింది.

శ్యామ్ నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ తలుపు దగ్గరికి వెళ్ళాడు. అరుంధతి దొంగలా చూస్తోంది నలువైపులా.

"ఎవరూ లేరులే రా లోపలికి" గుసగుసగా అన్నాడు.

"సుజన.....సుజన...." అంది చిన్నగా.

"ఆ పిల్ల గదిలో ఉంది, సాహి వచ్చేదాక లేవదు"

అరుంధతి మెడికల్ కిట్ పట్టుకుని లేచి లోనికొచ్చింది. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి.

"నేరుగా ఆ రోగిష్టిదాని గదిలోకి వెళ్ళి, మాటలు చెప్పి మాయపుచ్చి నీకు తెలిసిన మెడికల్ మందుల ద్వారా హతమార్చు"?

"నాకు తెలిసింది ఒక్కటే మత్తు మందు ఇచ్చి గొంతుపిసకటం"

"ఏదో ఒకటి అలికిడి, గొడవ లేకుండా చేయ్" చెప్పాడు శ్యామ్.

అరుంధతిని గదిదాకా వదిలిపెట్టి "బయట నేనూ, థామస్ ఉన్నాం. భయపడకు, కామ్‌గా పీక పిసికివేయ్"

అరుంధతి తలాడించి లోనికెళ్ళింది.

లోపల సుజన తల్లి దగ్గుతూ ఉంది. అలికిడికి అరుంధతిని చూసి "నువ్వా రా" అంది.

అరుంధతి మంచం పక్కనున్న స్టూల్‌మీద కూర్చుని “ఎలా ఉంది మీ ఆరోగ్యం” అంది.

“ఈ సంసారంలానే ఏడ్చింది” అంది నిష్టూరంగా–

“మీరెందుకు ఇంకా అనవసర విషయాల్లో తలదూరుస్తారు. హాయిగా విశ్రాంతి తీసుకుంటే మీ జబ్బు ఎన్నో రోజులుండదు”

“నిజమే, కాని చూస్తూ ఉండలేను. అయినా ఈ కుంపట్లు నువ్వు తెచ్చిపెట్టినవేగా – ఆ రోజు పక్కన చేరి ‘సాహి’తో సుజనకి పెళ్ళిచేయమని సతాయించావ్. అన్ని పోయిన దాని బ్రతుకు నాశనం చేయవద్దంటూ ఒప్పించావ్. ఏ కళనున్నానో నా తండ్రి చనిపోవటానికి కారణమైన ఆ కుటుంబంలోని వ్యక్తికే సుజన నిచ్చి పెళ్ళి చేశాను. అతనితోపాటు మందమందంతా వచ్చి ఇంటిమీద పడి ఇల్లు గుల్లచేస్తున్నారు”.

అరుంధతి ఊఁ అంటూ వూకొడుతూనే మెడికల్ కిట్ తెరిచింది.

“ఆరువారాల నగలూ పొయ్యాయి, డబ్బు దస్కం అన్నీ సర్వనాశనం చేశారు వెధవలు”.

అరుంధతి నీడిల్‌ని ఇంజెక్షన్‌లోని మందుకి గుచ్చి లాగుతోంది.

“అసలిదంతా నా ఖర్మ....ఎలా ఉండే ఇల్లు ఎలా అయిందో. కుల సంకరం, వర్ణ సంకరం....అవునూ సూదిమందు చేస్తున్నావ్ ఎవరికి?” అంది.

“ఇంకెవరికి నాకే అంది” నవ్వి అరుంధతి.

“నీకే రోగమొచ్చింది?” తాపీగా అడిగింది.

అరుంధతి కింద నుంచి పైదాకా చూసి.

“మీకే...” నాకే రోగమూ లేదు.

“అమ్మో...నాకే....వద్దు.....నాకు భయం....”

“మరేం ఫర్వాలేదు. హాయిగా నిదరపడుతుంది”.

“మరి మొన్నేమో సూదిమందు అవసరంలేదు అన్నీ మాత్రలు వాడితే సరిపోతుందన్నావ్. ఇప్పుడేమో ఇలా చేస్తున్నావ్”.

అరుంధతి గతుక్కుమంది.

“మధ్య మధ్యలో సూదిమందు పడాలి...లేకపోతే దగ్గు ఎక్కువై పోతుంది....ఇది కంట్రోల్ చేసేమందు” చూపించింది ఖాళీ ఇంజెక్షన్ బాటిల్.

"ఇదా" చేతిలోకి తీసుకుని చూసింది.

"ఎడమ భుజమా? కుడి భుజమా?" అడిగింది గాలిలోకి నీడిల్‌ని వత్తుతూ.

"ఇది దగ్గుని కంట్రోల్ చేసేమందా?" అడిగింది మరోసారి.

"అవును" అరుంధతి ముందుకు జరిగి భుజం పట్టుకుంటూ అంది.

"కాదు, ఇది దగ్గుని తగ్గించే మందు కాదు...నాకు తెల్సు....ఎందుకో తెలుసా....రోగి ముదిరితే డాక్టరవుతాడట....పది సంవత్సరాల నుంచి మందులూ, సూది మందులూ వాడుతున్నాను. దేనిది దేనికో నాకు బాగా తెల్సు. దగ్గు ఎక్కువయి వూపిరాడకపోతే ఇచ్చే మత్తుమందు. నేను అప్పుడప్పుడు చేయించుకుంటాను ఇదే".

అరుంధతి తెల్లబోయింది. సర్ది చెబితే సరిపోయేది. కాని ఆవేశపడింది.

బలంగా భుజం పట్టుకుని ఇంజక్షన్ చెయ్యబోయింది.

"వద్దు....సమాధానం చెప్పకుండా...బలవంతంగా చేస్తావే" అని విదిలించుకుంది.

అరుంధతి కోపంగా "నోరు ముయ్యి" అని గుచ్చబోయింది.

దాంతో సుజన తల్లికి అనుమానం వచ్చింది.

లేని శక్తి తెచ్చుకుని శరీరాన్ని ఇష్టం వచ్చినట్లు కదిలించింది....ఓ చేత్తో సిరంజ్‌ని కొట్టింది.

అరుంధతి చేతిలోని సిరంజ్ వెళ్ళి నేలమీద పడింది. గాజుది కావటంతో టప్పున పగిలింది.

అరుంధతి ఆవేశంగా చూసింది.

కోపంగా చెయ్యెత్తి పెఢీమని కొట్టింది.

"ఓసి నీ నట్టు తెగ, నీశ్రాద్ధం పెట్టా, నీ శిరస్సున దీపం పెట్ట....."

"నోరు ముయ్యి అరిచావా చంపేస్తాను" అంది రెండు చేతులతో గొంతును బిగిస్తూ...

"నువ్, అరవక పోయినా చంపుతావ్, అందుకే వచ్చావ్...ఈ భవనంలో నన్ను ఏం చేసినా అడిగే దిక్కు లేదనుకున్నావేమో – నా కూతురుంది" అని–

"సుజనా....సుజనా....." అరిచింది బిగ్గరగా

అరుంధతి ఆందోళనగా...నోరు ముయ్యబోయింది. అప్పటికే అరిచేసింది.

ఇక ఆలోచించలేదు అరుంధతి. దున్నపోతులా మీదపడి గొంతు నొక్కింది.

"ఏమయింది?" లోనికొచ్చి అడిగాడు శ్యామ్.

గొంతు నులుముతున్న అరుంధతి – "అరుస్తోంది" అంది.

"నీ బొంద, ఈ మాత్రం దానికి ఇక్కడి దాకా రావాలా? నువ్వేదో కామ్‌గా చేస్తావనుకుంటే ఊరు ఊరు తెలిసేలా హత్య చేసేలా ఉన్నావే"

సుజనతల్లి ఆశ్చర్యంగా చూసింది. ఆమెకు ఊపిరాడక కొట్టుకుంటోంది.

శ్యామ్ వెనక వున్న థామస్ "త్వరగా చంపు....కేకలకి సుజన రాగలదు" అన్నాడు.

రోజీ లోనికొచ్చి "సుజన తలుపులు వేసి ఉన్నాయి. బహుశ ఆమెకు వినపడి ఉండదు. త్వరగా కానివ్వండి" అంది.

అరుంధతి రోజీ కేసి చూసి"కాళ్ళు పట్టుకో....బ్యాలెన్స్ కుదరటంలేదు. అప్పుడయితే ఈజీగా గొంతు పిసకచ్చు".

రోజీ ఆమె కాళ్ళు కదలకుండా పట్టుకుంది.

ఆ హడావుడిలో సుజన గది తలుపులు తెరుచుకోవటం ఎవరూ గమనించలేదు.

కేక వినపడి కాదు బయటికొచ్చింది. నిద్రపట్టక సాహితీపి ఆలోచనలతో బయటికొచ్చి ఎదురుచూస్తోంది.

అప్పుడే కనిపించాయి తల్లి గది తలుపులు తెరిచి – ఓసారి పలకరిద్దామని అటు నడిచింది.

తల్లి గదిలో కాలు పెట్టగానే స్టన్ అయింది.

"ఏం చేస్తున్నారు?" కంగారుగా అడిగింది.

మొత్తం అంతా నిర్ఘాంతపోయారు.

"సుజనా...సుజనా..." తల్లి కంఠం కీచుమంది.

అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

మొదట శ్యామే తెగించాడు.

"కనబడటంలేదూ.... నీ తల్లిని చంపుతున్నాం"

"బావగారూ!" అరిచింది.

"ఇంతదాకా వచ్చాక ఇక అనవసరం. ఈ ఆస్థికోసమే, సాహిని

రెచ్చగొట్టాము. నీ గదిలోకి పంపాం. దొంగ...... దొంగ......అని అరిచి ఊరి జనాన్ని తీసుకొచ్చి నీ గదిలోని సాహిని, నిన్ను వీధి పాలు చేసింది మేమే...నీ తాతయ్య ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించిది మేమే నవ్వాడు. సుజన నిర్ఘాంతపోయింది. అంత దుర్మార్గం చేసింది వీళ్ళా ?

"పాపం సాహి తన పిచ్చి ప్రేమ కోసం, నీ మీద వెర్రి వ్యామోహంతో అమాయకంగా మమ్మల్ని నమ్మి మేం చెయ్యమన్నదల్లా చేశాడు. మేం అనుకున్నది సాధించాం...."

సుజన దిగ్భ్రాంతిగా చూస్తోంది....

"ఇప్పుడు నీ తల్లి ప్రాణం తీస్తున్నది మేమే. అరుంధతి కానియ్" చెప్పాడు శ్యామ్.

అరుంధతి మరింతగా నొక్కుతోంది.

సుజన పరుగున వెళ్ళింది.

అరుంధతిని బలంగా లాగుతూ–

"వద్దు....అంతపని చేయకండి. ఈ ప్రపంచంలో నాకున్న ఏకైక జీవి ఈమే. కావాలంటే ఈ ఆస్థింతా తీసుకోండి".

"మీరు బ్రతికుంటే ఈ ఆస్థి మాకెలావస్తుందే. రోజీ అరుంధతి వల్ల కావటం లేదు. నువ్ కానీయ్" అన్నాడు.

రోజీ సుజన వైపు చూసి.

"క్షమించు భర్తమాటే వేదవాక్కు భారతస్త్రీకి" అని అరుంధతి స్థానంలోకి వెళ్ళింది.

సుజన ముందుకెళ్ళబోయింది.

థామస్ ఆమె రెక్క పట్టుకుని ఆపాడు.

సుజన పెనుగులాడుతోంది. థామస్ బలంముందు ఆమె పెనుగులాట పనిచేయటం లేదు...ఎంత విదిలించుకున్న థామస్ వదలటం లేదు.

చాలా క్లియర్‌గా తెలుస్తోంది – తన తల్ల ప్రాణాలు కళ్ళలోకి వచ్చాయని.

అరుంధతి, రోజీ ఇద్దరూ కలిసి దిండు మొహం మీద వేసి నొక్కుతున్నారు.

సుజన థామస్ చేతిని కొరికింది.

అతను చప్పున వదిలేశాడు.

సుజన పరుగున వెళ్ళి రోజీ, అరుంధతుల కాళ్ళమీద పడింది.

"మీకు దండం పెడతాను. అంతపని మాత్రం చెయ్యకండి."

సుజన కన్నీళ్ళు వాళ్ళని కరిగించలేదు. రాక్షసంగా, హేయంగా ఊపిరి స్థంభించేలా చేశారు.

దిండు తీశారు....

సుజన తల్లి వంక చూసింది....

చిగురుటాకులా కదిలిపోతూ....

సుజన గుండెలు గుబ గుబ లాడాయి.

కళ్ళు పైకి చూస్తున్నాయి. శరీరంలో కదలిక ఆగిపోయి ఉంది. నోరు తెరుచుకుని ఉంది.

సుజన దగ్గరికెళ్ళింది.

వణుకుతున్న చేతులతో తల్లిని తాకింది. శరీరంలో కదలికలేదు. చల్లగా తగిలింది.

"అమ్మా" భూనభోనాంతరాలు దద్ధరిల్లేలా అరిచింది సుజన.

రెండుగా విరిచిన వెదురుపుల్లే అయింది. ప్రచండ వాత హత నీపశాఖవలే కదిలిపోయింది.

"నువ్వెన్ని కేకలు పెట్టినా ఈ భవనంలోంచి బయటకు కేకలు వినపడవే..."

"కాని నాకు వినపడ్డాయి."

"అవును, మాకు వినపడ్డాయి"

పిడుగుల్లా విన్పించాయి.

సుజనతోసహా తిరిగి చూసారు.

రాగిణి, సలీం..అగ్నివర్షం కురిపించే కళ్ళతో–

"ఛీ....ఛీ మీరు మనుష్యులా, రోగాలతో రొప్పులతో ఉన్న ఆడదాన్ని ఇంత మంది కలిసిహత్య చేస్తారా? మీకు నైతిక విలువులున్నాయా? మానవత్వం ఉందా? పశువుల్లో పుట్టాల్సిన వాళ్ళు మీరంతా"

అరుంధతి రాగిణి వైపు చూసింది.

థామస్ కోపంగా భార్య వైపు వెళ్ళబోయాడు. అరుంధతి అతన్ని ఆపి, తానే వెళ్ళింది.

"పక్కకిపద" అంది రాగిణితో.

"ఏం నన్నూ చంపుతావా? అదేదో ఇక్కడే కానివ్వండి. నీతిజాతి లేని దానికి నీకు మళ్ళీ చాటెందుకు ముదనష్టపుదానా...మా కొంపకి చేటే నువ్వు".

అరుంధతి లాగిపెట్టి చెంపకేసి కొట్టింది. రాగిణి జుట్టుపట్టుకుని విసురుగా..తీసి...బాగా దగ్గరికి వెళ్ళి చిన్నగా అంది.

"జాగ్రత్త! నీ రహస్యం నా దగ్గరుంది. నీ కడుపులో బిడ్డ...ఏం బిక్కమొహం వేశావ్. మాకు నీతి లేదన్నదానివి. మరి నీకుందా? పోనీ థామస్‌ని అడుగుదామా? అప్పుడు సుజన తల్లినేకాదు నిన్ను కూడా వూడ్చిపెడతాడు.

థామస్ గురించి తెలుసుగా. కోపం వస్తే కడుపులో బిడ్డని బైటికి తీసి మరీ చంపుతాడు. ఏం చెప్పనా, ఇక్కడే నీ కడుపు రహస్యం"

"వద్దు" అంది అప్రయత్నంగా రాగిణి.

"అది, తెలివిగలవారి లక్షణం" అని థామస్ వైపుకి వచ్చింది.

"ఏంటది వాగుతోంది. ఏమిటా గుసగుసలు...వంగి జట్టుపట్టుకు గుద్దితేసరి. చిన్నప్పుడు తాగిన ఉగ్గుపాలు కూడా కక్కుతుంది"

" ఆ అవసరం లేదు.నేను చెప్పానులే"

"ఏం చెప్పావ్?" అడిగాడ్ థామస్.

"ఎంత ఆస్థి వస్తుందోనని. సలీం నీ సంగతేమిటి?"

కళ్ళెగరేసింది అతని వంక చూసి. రాగిణి సరండర్ అయిపోవటంతో సలీం నీరు కారిపోయాడు.

పైగా అతని ప్రియురాలు వాళ్ళ పక్షం చేరిపోయింది.

తానెందుకు ఒంటరిగా 'ఏకాకిగా'

థామస్ రౌద్రంగా చూసాడు సలీం వైపు.

సలీం వణికిపోయాడు. చేతులెత్తేసాడు.

"పెద్దోళ్ళు, పెద్దోళ్ళ వ్యవహారం. నేనేమీ చూడలేదు. నాకేమీ తెలియదు" జారుకోబోయాడు.

"ఆఁ....ఆఁ జారుకోకు.....తలాపాపం పిడికెడు" అంది సలీంని ఆపింది అరుంధతి.

సుజన ఆ అపూర్వ సన్నివేశాన్ని నోరప్పగించి చూస్తోంది. ఓ పక్క తల్లి

శవం...మరోపక్క వాళ్ళందరి అపూర్వ కలయిక....మనుష్యులు ఇంతలా మారిపోతారా? కేవలం నిమిషాలమీద...

కేవలం డబ్బుకోసం, ఇంతమంది? ఇంతమంది...అతి హేయంగా రాక్షసత్వానికి తలవగ్గుతారా? పాలు పంచుకుంటారా? అందుకేనేమో ఈ భూమి మీద సకాలంలో వర్షాలు పడనది. కరువు కాటకాలతో అన్నమో రామచంద్రా అని ఆక్రోశించేది.

"సుజననేం చేద్దాం" అడిగింది అరుంధతి.

"శత్రుశేషం ఉండకూడదు. ఇదిపోతే ఆస్తి మొత్తం సాహిదే వాడి గురించి దిగులే లేదు. పిచ్చాడు. ఏం చెబితే అది చేస్తాడు."

సుజన అప్పుడు నోరు తెరిచింది. గట్టుతెగిన వరద గోదారిలా మారింది.

"ఒరేయ్ పోతారురా పురుగులుపడి..అన్నం పెట్టిన చేతిని నరికినవాడెవడూ ఈ భూమిమీద బాగుపడలేదు"

"కాని...మేం సుఖపడతాం" అంది రోజీ నవ్వి.

"అది తర్వాత విషయం. ముందు దీన్నెలా చంపాలో ఆలోచించండి" చెప్పాడు థామస్.

"పెట్రల్ పోసి చంపితే సరి" చెప్పాడు సలీం.

"అమ్మా నా...అని" బూతు మాట వాడి సలీం భుజం తట్టాడు థామస్.

రాగిణి వినలేనట్టు తలపక్కకి తిప్పుకుంది.

శ్యామ్‌కి కూడా సలీం సలహా నచ్చింది.

"నీ ఆలోచన అద్భుతం...తల్లి మరణంతో సుజన పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుందని ప్రజల్ని నమ్మించొచ్చు. సాహికి కూడా అనుమానం రాదు. ఇక ఈ సామ్రాజ్యంలో మనకి అడ్డు లేదు. అదుపులేదు"

సుజన రోషంగా అరిచింది.

"అంత పిచ్చివాడు నీ తమ్ముడయితే కావచ్చుగానీ, ఈ ఊరి ప్రజలు కారు పిచ్చికుక్కని కొట్టినట్టు కొడతారు" అంది ఆవేశంగా.

"పిచ్చిదానా! ఆ తరువాత మా దగ్గర డబ్బుంటుంది. ఏదొచ్చినా అదే చూసుకుంటుంది" అని "థామస్ తీసుకురారా పెట్రోల్" అన్నాడు.

థామస్ అన్న ఆజ్ఞ ఇవ్వటం ఆలస్యం వెళ్ళాడు.

సుజన తల్లిని కన్నీళ్ళతో చూసింది. కాని గుండె మాత్రం మండిపోతోంది.

కళ్ళ ముందు తల్లి శవం సుజనలో ఆక్రోశం, ఆవేశం పెంచుతోంది.

మనిషి మనిషితో ఆడే ఆటలో తానెంత మోసపోయింది. తల్చుకుంటే ఒళ్ళు వేడెక్కింది.

"తీరుస్తానమ్మా...పగతీరుస్తాను...ఒక్కొక్కరిని గొంతు పిసికి చంపుతాను" అనుకుని....

"రేయ్...." అని అడపులిలా శ్యామ్ గుండెలమీద గుద్దింది.

సుజన అంత వేగంగా, అంత సడన్‌గా కదులుతుందని ఎవరూ ఊహించలేదు.

రోజీ, అరుంధతి వచ్చి సుజనని ఆపారు.

"నన్ను..నామీదే చెయ్యెత్తుతావా" అని శ్యామ్ కళ్ళెర్రచేసి లాగి చెంపమీద కొట్టాడు.

సుజన చెంప చెళ్‌మంది.

సుజన పిచ్చిపట్టినట్లు అరుస్తూ, తనని పట్టుకున్న ఇద్దరి చేతులని కొరికింది కండలు వూడొచ్చేలా.

సుజన నోరు ఎర్రగా అయింది.

"అమ్మా" అరిచారు ఇద్దరూ చేతులు పట్టుకుని.

థామస్ కళ్ళు ఎరుపెక్కాయి. ఉగ్రనరసింహంలా వూగిపోయాడు.

సుజన కొరికి కొరకటంతోనే పరిగెత్తింది. అడ్డు వచ్చిన అరుంధతిని విసురుగా తోసి....

"పట్టుకోండి పారిపోతోంది..అది బయటికెళ్ళిందంటే ఊరి మొత్తాన్ని నిద్రలేపుతుంది" అని అరిచాడు శ్యామ్.

సుజన ఆలోచన కూడా అదే....

థామస్ పరిగెత్తాడు, సుజన మెట్లుదిగి ప్రధాన ద్వారం దాటి వెళ్ళింది.

అందరి గుండెలు దడదడలాడాయి. వెనుకే పరిగెత్తారు. సుజన అప్పటికే బయట కొచ్చింది.

వెనుక పరిగెడుతున్న శ్యామ్, థామస్ చేతిలోని టిన్ను తీసుకుని విసిరేశాడు బలంగా – అది వెళ్ళి సుజనదగ్గర పడింది.

మరుక్షణమే శ్యామ్ దూసుకొచ్చి అగ్గిపుల్ల గీసాడు.

భగ్గున మంటలు.....

"దొంగలు, బందిపోటు దొంగలు, లోపలికెళ్ళి తలుపేసుకోండి" అరిచాడు. మిగతావార్ని కూడా అరవమన్నాడు.

అరుంధతి, రోజీ, రాగిణి, సలీం కలియతిరుగుతూ అరిచారు. నిద్రలేచిన ఊరిజనం కంగారు పడ్డారు. నిలువెత్తు మంటలు. పైగా బందిపోటు దొంగలని అరుపులు, పిల్లా పాపలని తీసుకుని లోనికి పరిగెత్తారు.

బందిపోటు దొంగలొచ్చారంటే వారందరిని చితక్కొట్టి డబ్బు ధ్యానం దోచుకుపోవటం కొత్తకాదు. అపుడపుడు జరిగేయే. ఆ భయంతో వాళ్ళే వచ్చారని లోనికెళ్ళారు.

ఒక్కసారిగా మారిన పరిస్థితితో సుజన అతలా కుతలమయింది.

ఒకరిద్దరిని ఆపినా విన్పించుకునే స్థితిలో లేరు.

ఇక లాభం లేదనిపించి ముందుకు పరిగెత్తింది.

"అరేయ్ అది ఊరు దాటిపోయేలా ఉంది. వదలొద్దు. నువ్వులోనికెళ్ళి ఇంకో టిన్ను పెట్రోల్ తీసుకురా" చెప్పి శ్యామ్ మిగతా వాళ్ళని తీసుకుని సుజన వెనకే పరుగు ప్రారంభించాడు.

వింటినుంచి వెలువడిన బాణంలా వెళుతోంది.

తప్పించుకోవాలి.

వాళ్ళ బారి నుంచి ప్రాణాన్ని కాపాడుకోవాలి. అప్పుడే తన తల్లి తాతయ్య ఆత్మలు శాంతించేలా పగతీర్చుకోగలదు.

ఊరు దాటింది.... మామిడితోపు దాకా వచ్చింది.

సుజన గుండెలు పైకి క్రిందకి కదులుతున్నాయి. పరిగెత్తలేకపోయింది.

అప్పటికే ఆ పరుగు పోరాటం ప్రారంభించి గంటయింది.

సరిగ్గా అప్పుడు వెలుగుకనిపించింది.

కారులైట్లు, హెడ్‌లైట్లు...

క్షణ క్షణానికి దగ్గరగా వస్తున్నాయి.

తమ ఊరివేపే ఆ వాహనం వస్తుందంటే అది సాహినే...ఈ ఊరిలో కారు ఉంది తమకే.

ఆ కారు మరింత దగ్గరికి వచ్చింది. సాహిని దూరం నించే గుర్తుపట్టింది.

"సాహినే....తన భర్తే...."

సుజన లేని శక్తిని తెచ్చుకుని పరుగుతీసింది.

రోడ్డుకడ్డంపడి పరిగెత్తుకు వస్తున్న సుజనని చూడగానే సాహి కారాపాడు.

కంగారుగా డోర్ తీసుకుని బయటికొచ్చాడు కంపించిపోతున్న భార్యని పట్టుకుని..

"ఏం జరిగింది?" అడిగాడు ఆదుర్దాగా

ఒక్కసారిగా భర్తని చుట్టేసి–

"అమ్మని....అమ్మని" అంది.

"ఆఁ చెప్పు...అమ్మ....అమ్మకేమయింది? అత్తయ్యగారికేమయింది?"

"చంపేశాం"చెప్పాడు శ్యామ్ పరుగున వచ్చి.

వారి వెనుకే మిగతావాళ్ళు పరిగెడుతున్నారు.

సాహి స్టన్ అయ్యాడు.

"చంపేశారా దేనికి?" అడిగాడు అయోమయంగా.

"ఆస్థికోసం. నీ ఆస్థికోసం"రోజీ శ్యామ్ పక్కనే నిలబడి చెప్పింది.

"అవునండి! అందరూ కలిసి చంపేసారు"

సాహి ముక్కుపుటాలు రోషంగా కదిలాయి.

ఆవేశంగా లేచాడు.

ఈలోగా సలీం, రాగిణి కూడా వచ్చేశారు.

అందరూ చుట్టూ చేరారు.

సాహి వేగంగా శ్యామ్ చొక్కా పట్టుకుని వూపుతూ....

"మీరు మనుషులా పశువులా...." అడిగాడు సాహి వెనుకనుంచి వస్తున్న ప్రమాదాన్ని గుర్తించక.

"పశువులం, మధమెక్కిన పశువులం" చెప్పాడు శ్యామ్ తాపీగా.

"ఏవండి" అరిచింది సుజన.

సాహి వెనక్కి తిరిగాడు.

అప్పటికే ఆలస్యమయింది. థామస్ చేతిలోని కత్తి కస్సున దిగింది.

కడుపులో ప్రేగులని చీల్చుకుంటూ మరీ..

"అమ్మా" అరిచాడు పొట్టని చేతితో పట్టుకుని.

రక్తం ఫౌంటెన్‌లా విరజిమ్మింది.

"మంచి పని చేశావ్! ఉన్న పీడ విరగడయింది...." తమ్ముడిని మెచ్చుకున్నాడు శ్యామ్.

"నేవచ్చేసరికి అందరి మధ్యలోంచి సాహి కోపంగా వస్తున్నాడు. అందుకే తుప్పల్లోంచి పక్కకెళ్ళి వెన్నులో వెనుకగా ఒక్కటే పోటు....నవ్వాడు థామస్.

"శభాష్ తమ్ముడు" మెచ్చుకున్నాడు శ్యామ్.

సాహి కళ్ళు మూతలు పడుతున్నాయి. వెన్నులో దిగిన కత్తిని విసురుగా లాగాడు థామస్. లాగిన కత్తిని ఈ సారి సాహి పొట్టలో గుచ్చాడు. దిక్కుల పిక్కటిల్లేలా అరిచాడు. సుజన దిగ్భ్రాంతిగా చూస్తోంది.

అలాంటి సమయంలోనూ సాహి నోరు మెదిపాడు.

"వెళ్ళు సుజన...... పరిగెత్తి పారిపో....ఈ నీచులు నిన్ను బ్రతకనివ్వరు. పారిపోయి ప్రాణం కాపాడుకో. ఈ దుష్టుల ఆటలు సాగకూడదు. అందుకే ఒకటే మార్గం...నువ్ బ్రతికుండటం"

"ఏవండీ" అంది తెప్పరిల్లి సుజన.

"వద్దు.....దగ్గరికి రావద్దు.....పారిపో"

"ఎక్కడికే పారిపోయ్యేది?" అని రోజీ వచ్చి సుజన జుట్టుపట్టుకుంది.

సాహి తన పొట్టలో దిగబడిన కత్తిని బలంగా లాగాడు.

ప్రేగులతో సహా బయటికొచ్చింది కత్తి.

దాన్ని అందరికీ చూపిస్తూ...సుజన దగ్గరికెళ్ళి రోజికి చూపించి "వదులు" అన్నాడు కరుకుగా. రోజీ భయంగా వదిలేసింది.

"పారిపో సుజనా....ప్రాణాలు దక్కించుకో" చెప్పాడు.

"ఏవండీ" అంది ఏడుస్తూ.

"వెళ్ళు....ఏడ్పులకు ఇది సమయం కాదు. నా మాటల మీద గౌరవ ముంటే వెళ్ళు" అని తోసాడు.

సుజన దండం పెట్టి వెళ్ళనన్నట్టు తలాడించింది.

"నా చివరి కోరిక తీర్చి పారిపో" చెప్పాడు సాహి.

సుజన పరిగెత్తింది.

గత్యంతరం లేక భర్తనా స్థితిలో వదిలి వెళుతున్నందుకు వెక్కిళ్ళు పడుతూ ఏడుస్తూనే...

అందరూ ముందుకడుగేసారు.

సాహి కత్తిని జూలిపించి "ముందుకు అడుగేసారంటే పొడిచేస్తాను" అన్నాడు.

అందరూ ఆగారు.

సాహి ప్రాణాలు కళ్ళలోకి వచ్చాయి.

అంతా ముందుకొచ్చారు మూకుమ్మడిగా.

సాహి వాళ్ళంతా దగ్గరికి రాకుండానే క్రిందికి వాలిపోయాడు.

"చచ్చాడు వెధవ" అని సాహి శరీరాన్ని కాలితో తన్ని సుజన పరిగెత్తినవైపు పరిగెత్తాడు పెట్రోల్ టిన్నుతో థామస్.

అతన్ని మిగతావారు అనుసరించారు.

**తర్వాతం ఏమి జరిగిందో మీకు తెలుసు. ప్రారంభం చదివారు కదా? మరింత వివరంగా ఉండాలనుకుంటే మళ్ళీ మరోసారి ప్రారంభం చదవండి...**

ఫాదర్ దీర్ఘంగా నిట్టూర్చారు.

రోజీ తలపట్టుకుని కూర్చుండిపోయింది.

శ్యామ్ చేతుల్లో మొహం దాచుకుని ఉండిపోయాడు.

ఫాదర్ కళ్ళు మూసుకుని ప్రభువుని తలచుకుని....

"చాలా ఘోరం...మనిష్యులనే వారేవ్వరూ ప్రనవర్తించకూడని రాక్షసత్వం చేసారు.... ఆ ప్రభువు పాదాల మీద పడ్డా క్షమాపణ రాదు".

"అందుకే ఫాదర్...చివరిసారి చేసిన తప్పుకి ఆమె ఆత్మ ముందు కన్నీళ్ళతో నిలబడతాం...ఆమె ముందు ఆత్మత్యాగం చేస్తాం".

"మీరు కావాలనుకున్నప్పుడు రావటానికి, వద్దనుకున్నప్పుడు రాకుండా ఉండటానికి, ఆమె మామూలు మనిషి కాదు – పగా, ప్రతీకారంతో ప్రజ్వరిల్లిపోతున్న అగ్ని గుండం..."

"ఆ అగ్ని గుండంలో ఆహుతవ్వటానికే నిశ్చయించుకున్నాం – ఇక ఈ టెన్షన్‌ని భరించలేం...కాని ఒక్కటే మనవి...ఆ పాపం మేం చేశాం...శిక్ష కూడా మేమే అనుభవిస్తాం... ఆ పసివాడ్ని మాత్రం వదిలెయ్యమనండి....అదే వేడుకోలు...."

ఫాదర్ మౌనంగా బయటికెళ్ళి...కొంత సేపటికి రాజీవ్‌ని తీసుకొచ్చారు.

తల్లిదండ్రుల ముందు నిలబెట్టి....

"తీర్చుకో....నీ దాహం తీర్చుకో...ఆ పసివాడి శరీరంలో చేరి ఎందుకు తాత్సర్యం చేస్తావ్. ఎప్పటికైనా నువ్వు పగతీర్చుకోవలసిందే అదేదో ఇప్పుడే చేసేయ్".

రాజీవ్ అయోమయంగా చూశాడు.

బిక్క మొహం పెట్టాడు.

శ్యామ్, రోజీ ఇద్దరూ రాజీవ్ వైపే చూస్తున్నారు.

"ఇంకా ఆలస్యమెందుకు కానీయ్...ఇక ఎక్కువసేపు ఆ బాలుడితో ఉండకు" ఫాదర్ గదమాయించారు.

రాజీవ్ ఏడ్పు లంకించుకున్నాడు.

ఫాదర్ అనునయంగా దగ్గరికి తీసుకుని ఓదార్చారు.

రోజీ కొడుకుని ఫాదర్ దగ్గరి నుంచి తీసుకుని తల నిమిరింది.

"ఏడ్వకమ్మా ఏడ్వకు"

"నేనెందుకు ఏడుస్తాను అటు చూడండి" అన్నాడ్ సడన్‌గా.

రాజీవ్‌మాటే తెలుస్తోంది...గొంతులో తేడానే తెలుస్తోంది.

అప్పుడే అతన్ని ఆత్మ ఆవహించింది.

అంతా ఊపిరి బిగపట్టి చూశారు.

"నా మొహంలో ఏముంది అటు చూడండి" అన్నాడు వేలిపెట్టి చూపిస్తూ.

అంతా కిటికీ గుండా కనపడే ఆకాశం వంక చూశారు.

అక్కడ వారికేమీ కనపించలేదు...

తలలు తిప్పబోయేంతలో కనపడింది.

ఏదో పక్షి ఎగురుతూ వస్తోంది.

అంతా ఆ పక్షి వంకే చూశారు... క్షణక్షణానికి ఆ పక్షి దగ్గరవుతోంది.

ఇప్పుడు లీలగా కాకి క్లియర్‌గా తెలుస్తోంది.

“అది....అది...పక్షికాదు” చెప్పాడు ఫాదర్.

రోజీ కళ్ళప్పగించి చూసింది.

శ్యామ్ అప్రయత్నంగా అన్నాడు.

“అది గబ్బిలం...”

“మైగాడ్ పట్టపగలే వస్తోంది”

రాజీవ్ నవ్వాడు...

“ఆ నవ్వు....ఆ నవ్వు...అచ్చుటం సుజనదే” శ్యామ్ చెప్పాడు.

ఫాదర్ ముందుకు అడుగేశారు...

అప్పటికే కిటికీలోంచి గబ్బిలం భయంకరంగా శబ్ధం చేసుకుంటూ ఎగరడం ప్రారంభించింది.

గది మొత్తం గందరగోళంగా తిరుగుతోంది.... దానికితోడు వినలేని శబ్ధం.....

చెవులు పగిలిపోయేలా అరుస్తోంది....

శ్యామ్‌తోపాటు అంతా చెవులు మూసుకున్నారు.....

రాజీవ్ నిశ్చలంగా చూస్తున్నాడు....

గబ్బిలం కిటికీ దగ్గరికి వెళ్ళి మరింతగా శబ్ధం చేస్తూ- అరవటం ప్రారంభించింది....

దాని అరుపు వినో లేక మరో కారణమోగాని కిటికీలోంచి ఒక్కొక్కటిగా రావటం ప్రారంభించాయి.

చూస్తుండగానే గది మొత్తం గబ్బిలాలతో నిండిపోయింది.

అన్నీ శ్యామ్, రోజీల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాయి.

ఓ గబ్బిలం శ్యామ్‌ని తాకింది.

అంతే!

శ్యామ్ పెడబొబ్బలు పెడుతూ అరిచాడు. అతని చెంప చీరుకుపోయింది.

మరొకటి.... రోజీ మీద వాలింది.

ఆమె గది గోడలు పగిలేలా అరుస్తూ మొహం పట్టుకుంది....

అప్పుడు కదిలారు ఫాదర్.

ఒక్క వుదుటున ముందుకురికి రోజీని పట్టుకుని ఆమె మెడలో తన మెడలో వున్న శిలువ గొలుసుని తీసి వేశారు.

ఫాదర్ శిలువ గొలుసుని రోజీ మెడలో వెయ్యటం ఆలస్యం.... గబ్బిలాలు వెనక్కి తగ్గాయి... వెనుకడుగేసిన గబ్బిలాలు శ్యామ్ మీదికి మరలాయి.

రాజీవ్ గొంతు వికటంగా ప్రతిధ్వనిస్తోంది......

శ్యామ్ గబ్బిలాల మధ్య చావు బ్రతుకుల పోరాటం చేస్తున్నాడు.

శరీరం మొత్తం మీద ఇష్ట మొచ్చినట్టు నాట్యం చేస్తున్నాయి.

శ్యామ్ హృదయ విదారకంగా రోధిస్తున్నాడు.....

ఫాదర్ రోజీని అలానే పట్టుకుని.... చేతిలోని బైబిల్‌ని శ్యామ్ వైపుచూపించి.....

"శ్యామ్..... శ్యామ్" అని పిల్చారు.

అది విన్పించుకునే స్థితిలో లేడు. తనమీద దాడిచేస్తున్న గబ్బిలాలను అదిలిస్తూ వాటి బారిన పడుకుండా వుండటానికి శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు.

ఫాదర్ గొంతు చించుకు అరిచాడు.

"శ్యామ్.... ఇది పట్టుకో" అని.....

ఫాదర్ గొంతు వినికాదు చూసింది. అసంకల్పితంగా చూశాడు.

రోజీ ఫాదర్ దగ్గర క్షేమంగా వుంది. ఒక్క గబ్బిలం కూడా ఆమెని తాకటం లేదు.....

ఏమిటీ మాయ!?

సరిగ్గా అప్పుడు చెప్పారు ఫాదర్.

"శ్యామ్ దీన్ని తీసుకో" అని విసిరేశారు.

చటుక్కున బైబిల్‌ని అందుకున్నాడు.

అంతే....

ఎవరో ఆజ్ఞాపించినట్టు వెనకడుగు వేశాయి. కీచుగొంతుతో కీసర బాసరగా అరుస్తూ దూరం దూరంగా జరిగాయి. కిటికీలోంచి మాత్రం బయటికివెళ్ళటం లేదు. ఇద్దర్నీ పట్టుకుని ఫాదర్ తలుపుల దగ్గరికి వెళ్ళారు. ఓ చేత్తో పట్టుకుని లాగారు రావటంలేదు. బోల్ట్ తీసినా రావటం లేదు.

తలుపులు రావటం లేదు.

రాజీవ్ తీసుకుని లోపలికి వస్తూ తానే పైన బోల్ట్ బిగించాడు. కాని ఇప్పుడు బోల్ట్ తీసినా రావటం లేదు. బయటి నుంచి ఎవరూ వెయ్యరు....

రాజీవ్ గొంతు ఎగతాళిగా నవ్వింది....

ఆ తలుపు రాదు వృధా ప్రయాస. అంతేకాదు.... గొంతునాళాలు తెగేలా అరిచినా మీ గొంతు బయటికి వినపడదు.... ఈ చుట్టు ప్రకృతి నా ఆధీనం.... నా ఆధీనం...."

ముగ్గురూ హతాశులయ్యారు.

"నా నుంచి రక్షించి వీళ్ళని బైటికి తీసుకెళ్ళటం మీకు సాధ్యం కాదు ఫాదర్!"

శ్యామ్, రోజీ పరుగున వెళ్ళి రాజీవ్ కాళ్ళముందు నిల్చున్నారు.

రాజీవ్ కళ్ళు కసిగా చూశాయి. చేతులు పైకెత్తి గబ్బిలాలవైపు చూపిస్తూ సైగ చేశాయి.

మంత్రం వేసినట్టు, ఎవరో ఆజ్ఞాపించినట్టు ఒక్కొక్కటి కిమ్మనకుండా వచ్చినదారినే వెళ్ళాయి.

"అమ్మా.... క్షమించు నీకు తీరని ద్రోహం చేశాను."

"ఎవర్ని క్షమించాలి..... నిన్నా. నీ భార్యనా, లేక నీ కొడుకునా....?"

"నన్ను నా భార్యని కాదు... నా కొడుకుని."

"ఏం పాపం.... మీలో ఆ పాపభీతి కూడా వుందా!"

"పాపం చేసింది, ఘోరం చేసింది మేము. మా ప్రాణాలు నీ కాళ్ళదగ్గరున్నాయి.... నీ యిష్టం..."

"మీరు దీనంగా చూసినా, కాళ్ళా వేళ్ళాపడి ప్రాధేయపడినా లాభం లేదు మీ కొడుకు రక్తం చిందితే కాని తీరదు."

"వాడేం చేశాడు?"

"నా తల్లేం చేసింది?" విసురుగా అడిగింది సుజన

శ్యామ్, రోజీ తల వంచుకున్నారు.

"చెప్పండి.... నేనేం చేశాను. తాతయ్య చాటున, తల్లి ముద్దు మురిపాలచాటున, అమాయకంగా పెరుగుతున్న నేనేం చేశాను. అన్నెం పుణ్యం

ఎరుగని సాహి ఏం చేశాడు. అమాయకంగా నన్ను ప్రేమించటమేనా? మిమ్మల్ని చేరదీయటేమనా?"

శ్యామ్, రోజీలు జవాబులు చెప్పలేని ఆ ప్రశ్నలకు సమాధానాల్లా తలలు వంచుకునే ఉన్నారు.

"మా తాతయ్య పోయి, నా తల్లి ఎలా కుమిలిపోయిందో.... నా తల్లిపోయి నేనెలా మధనపడ్డానో, ఆ నరకం మీరూ అనుభవించాలి ప్రత్యక్షంగా...."

"అంటే....అంటే.... మా పాపానికి వాడికా శిక్ష!"

రాజీవ్ గొంతు అవహేళనగా పలికింది.

"ఏం పుత్ర ప్రేమ పెల్లుబుకుతుందా! కడుపుకోత తెలుస్తోందా? మరి ఆ రోజేమయింది. ఒహో..... మీకు పుట్టిన బిడ్డ కాదులే అనేగా....?"

"దానికి మమ్మల్నే మన్నా చెయ్. ఇప్పటికే సగం చచ్చివున్నాం. మిగతా సగం ప్రాణాల్ని ఆనందంగా యిస్తాం. డబ్బులో సుఖముంటుందని భ్రమసి నీచానికి వొడిగట్టాం. ఈ నికృష్టులని బలి తీసుకో... శాంతించు..."

"అంతేగాని నీ కొడుకునేం చెయ్యొద్దు. అంతేగా.... అది అసంభవం... కేవలం మీ రక్తం చిందటం ద్వారా నా దాహం తీరదు. మీరు బ్రతికుండి కుళ్ళి కుళ్ళి ఏడ్వాలి. కొడుకు మరణం చూసి చావలేక బ్రతకాలి... అప్పుడు– అప్పుడు చంపుతాను మిమ్మల్ని మాత్రం వదులుతాననుకోవద్దు."

రోజీ గుండెలు బాదుకుంది.

ఫాదర్ అచేతన స్థితిలో నిలబడి ఉన్నాడు.

"ఏడువ్..... ఇంకా ఇంకా ఏడువ్..... నా గుండె మంట మాత్రం చల్లారదు. అది తీరేది ఎప్పుడో తెలుసా? మీ ప్రాణాలు అనంత విశ్వంలో కలిసినప్పుడు మీ శరీరంలో రక్తం విహ్వాలంగా పీల్చి విలయ తాండవం చేసినప్పుడు."

"అదేదో ఇప్పుడే చెయ్. నీ కసి తీర్చుకో."

"ఇప్పుడే ఇక్కడే తీర్చుకోవాలని నాకూ వుంది. చేతిలోని బైబిల్‌ని మెడలోని శిలువను తీసేయండి."

ఇద్దరూ తియ్యబోయారు.

ఫాదర్ చప్పున కదలి "వద్దు... తియ్యద్దు....." అన్నాడు.

శ్యామ్, రోజీ ఫాదర్ కేసి చూశారు.

"అడ్డు చెప్పకండి ఫాదర్.... మేం బ్రతికుండి సాధించేదిలేదు... మాకు బ్రతుకుమీద తీపికూడా పోయింది. మా వంశాకురం, నా రక్తంలో రక్తం బ్రతికుంటే చాలు... ఈ పాపం మాతోనే పోతే అదే పదివేలు. మా బిడ్డకు అంటుకోకుంటే అదే తృప్తి..."

ఫాదర్ అనునయంగా చూసి అడిగాడు–

"చెప్పు.... వాళ్ళు చేసిన దానికి మీ ముందు బలి పశువుల్లా కూర్చున్నారు. అంతటితో తృప్తి పడతానంటే చెప్పు. నేనే వాళ్ళ మెడలోని శిలువని చేతిలోని బైబుల్‌ను తీసేస్తాను."

"నో..... రాజీవ్‌ని వదిలేది లేదు. వాళ్ళ వంశంలో ఎవరూ ఉండకూడదు. వాళ్ళ వంశం రాజీవ్‌తో అంతమైపోవాలి."

"అలా అయితే తియ్యరు" తేల్చి చెప్పారుఫాదర్.

"చూస్తాను... ఎంతకాలం తియ్యరో... ఎలా నా నుంచి జారిపోతారో...."

"గుర్తుంచుకోండి! మీ చేతే.... మీచేతే స్వయంగా మీచేతే మీ కొడుకుని మీరే పీల్చి పిప్పిచేసేలా చెయ్యకపోతే...."రాజీవ్ గొంతు తెరలు తెరలుగా నవ్వింది.

"మాచేత....మాచేత మా కొడుకునే చంపిస్తావా?"

సమాధానం చెప్పటానికి రాజీవ్ నోరు తెరవలేదు. పైగా కళ్ళు మూతలు పడుతున్నాయి.

"ఫాదర్...." అంది ఆందోళనగా రోజీ.

"మరేం పర్వాలేదు. రాజీవ్ శరీరంలోంచి సుజన ఆత్మ బయటికెళ్ళిపోతోంది."

దంపతులిద్దరూ పడబోతున్న రాజీవ్‌ని పట్టుకున్నారు.

☟ ☟ ☟ ☟ ☟

"మరణమేనది శరీరానికి విశ్రాంతి కాదు, ఆత్మకి.... కొన్ని సంవత్సరాలు శరీరాన్ని అంటిపెట్టుకున్న ఆత్మకి కొంతకాలం ఆట విడుపు... ఆ శరీరాన్ని అంటిపెట్టుకున్నప్పుడు ఉండే బంధాలు, అనుబంధాలు, ఆప్యాయతలు శరీరాన్ని వదిలినా ఆత్మలోపోవు.... అలాంటి కొన్ని సందర్భాల్లో..... ఆత్మ ఇక్కడే, ఈ

భూమి మీద తిరుగుతూంది. తీరని కోర్కెలు, తట్టుకోలేని అవమానాన్ని మరిచిపోదు... పగా, ప్రతీకారంతో శరీరాన్ని వీడిన ఆత్మ ఏదో రకంగా పగ తీర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది."

"మరలాంటప్పుడు ఈ భూమీమీద రోజుకి లక్షల మించినేరాలు, ఘోరాలు జరుగుతున్నాయి. అన్యాయంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరి వారందరూ యిలా దెయ్యాలుగా మారి పగ తీర్చుకోరే."

"దానికి కారణం చెప్పగల శక్తి నాకులేదు. మీ వాదనలో నిజం వుంది. నేననుకోవడం ఒక్కటే. మనిషి మరణించేముందు బలంగా ఓ కోర్కె కోరితే తీరుతుందని... మీరు సుజనిని చంపేటప్పుడు ఆమె దెయ్యంగా మారయినా మీమీద పగ తీర్చుకుంటాను  అని అనుకొని వుండవచ్చు. ఈ నేలమీద అప్పుడప్పుడు యిలాంటి అద్భుతాలు జరుగుతాయి. ఆ ఉనికిని మనిషి తెలుసుకునే స్థాయికి ఎదగలేదు..."

"ఎన్నో  సంవత్సరాల క్రితం సుజనని చంపాం యింతకాలం ఎందుకాగింది? అప్పటిదాకా ఆమె ఆత్మ ఏం చూస్తూంది?"

"తల్లి కడుపులోంచి పుట్టగానే ఆ బిడ్డకి మాట్లాడటం, తన పనులు తానే చేసుకోవటం కొన్ని సంవత్సరాలకుగాని రాదు. ఒక రకంగా శరీరం నుంచి విడిపోయిన ఆత్మ కూడా పసిపిల్ల లాంటిదేమో, ఇన్నాళ్ళు పెరిగి ఓ శక్తిగా ఏర్పడి ఇప్పుడు పగ తీర్చుకోవటానికి వచ్చిందేమో..."

శ్యామ్, రోజీ నమ్మలేనట్టు చూశారు.

"మన మిప్పుడు సమావేశమయ్యింది చనిపోయిన మనిషి ఆత్మ ఏమవుతుంది? ఎలా దెయ్యంగా, పిశాచంగా మారుతుందని కాదు..."

"దెయ్యం రక్తం తాగటం, యిలా మాట్లాడటం ఎక్కడయినా జరిగాయా? మీకు తెలిసి... నలుగురూ చెబితే వినటం ద్వారా కాకుండా"

"చాలా... అవన్నీ కాదు... నాకు తెలిసి యిలా ఆత్మ ఓ శరీరాన్ని ఎన్నుకోవాలంటే బలమైన కారణం వుండాలి. రాజీవ్‌లోనే ఎందుకు ప్రవేశిస్తోంది... నాలో ప్రవేశించి ఎందుకు పగ తీర్చుకోవటంలేదు.... దానికో కారణం వుండి వుండాలి?"

"ఉంది ఫాదర్.... "టక్కున చెప్పాడు శ్యామ్.

రోజీ ఆశ్చర్యంగా చూసింది.... తనకు తెలియని కారణం ఏముందా అని.

"గుర్తు తెచ్చుకో రోజీ... రాజీవ్‌ని కన్న ప్రదేశం.... వర్షం రాత్రి.... నువ్ నొప్పులతో బాధపడుతుంటే నేనే స్వయంగా తీసుకెళ్ళి ఓ పాడుబడ్డ కొంపలో పడుకోబెట్టాను."

రోజీకి అప్పుడు గుర్తొచ్చింది.

"అవును ఫాదర్. ఓ ముఖ్యమైన పెళ్ళికి వెళ్ళి వస్తుండగా విపరీతంగా నొప్పులు వచ్చాయి.... దారి మధ్యలో ఉన్నాం. కనుచూపు మేరలో మనిషి కాదు కదా పిట్టకూడా లేదు....

పైగా భయంకరమైన వర్షం.... ఆ వర్షంరాత్రే.... రాజీవ్‌ని కన్నది."

"ఎక్కడ?" అడిగాడు ఫాదర్.

"సుజనని కాల్చిన చోట.... మేం పెట్రోల్ పోసి తగలబెట్టిన చోట.... ఆమెని కాల్చి బూడిద చేసినచోటే...."

"ఆ తర్వాత శాంతి కూడా చేయించాం" చెప్పింది రోజీ.

"ఆతర్వాత రాజీవ్‌లో ఏదయినా మార్పు కనపడిందా? అంటే పుట్టిన రోజునాడు అరుంధతిని కొట్టడానికి ముందు, బాగా గుర్తు తెచ్చుకోండి"

రోజీ తల వూపింది

"నేను ఆయనకిగాని, ఇంకెవ్వరికిగాని ఇంతవరకూ చెప్పలేదు. అప్పుడు రాజీవ్‌కి ఆరునెలలు కూడా నిండలేదు. పాలు పట్టిస్తుంటే విదిలించుకున్నాడు... నేను బలవంతంగా పడుతున్నాను. కోపంగా తాగమని అరిచాను... అప్పుడు చూశాడు నా వైపు.... తలుచుకుంటే ఒళ్ళు గగుర్పాటు వస్తోంది."

" ఆ తర్వాత" అడిగాడు ఫాదర్.

"ఓ రోజు మా నాన్నగారు ఇంటికి వచ్చారు. ఆడిస్తూ ఆయన మెడలోని గొలుసు చూపిస్తూ కావాలా అన్నారు. నేను అదిరిపోయాను– వాడు తల అడ్డంగా వూపాడు. వాడు తల అడ్డంగా ఊపినందుకుకాదు– "నాకు గొలుసొద్దు" అన్నాడు అందుకు"

శ్యామ్ నోరెళ్ళబెట్టి విన్నాడు.

"మా నాన్నగారూ, మేం ఉలిక్కిపడ్డాం... మాట్లాడింది వాడా, లేక

ఇంకెవరన్నానా అని చుట్టుపక్కల చూశాం, ఎవరూ లేరు. నాన్న గారు కూడా వాడి వంక భయంగా చూశారు."

"వెరీ ఇంట్రస్టింగ్" అన్నారు ఫాదర్.

"ఇంతవరకు నాకూ తెలీదు ఫాదర్" చెప్పాడుశ్యామ్.

రోజీ తిరిగి చెప్పింది.

"నాన్నగారు కొద్దిసేపుండి వెళ్ళిపోయారు..... నేను అదే ఆలోచిస్తూ వున్నాను... అనుమానం తీరక వెళ్ళి రకరకాలుగా ప్రయత్నిస్తూ పలకరించాను. ఏ మార్పు లేదు.

మేమే పొరపాటు పడివుంటామని భావించి అక్కడితో ఆ విషయం వదిలేశాను.... మా వారికి కూడా చెప్పలేదు."

"ఎందుకు?" అడిగాడు శ్యామ్.

"ఏ తల్లి బిడ్డ గురించి అలాంటివి చెప్పదు. అదీకాక మేమే పొరపడి ఉంటామని అనుకున్నాను... ఆయనకి చెబితే లేనిపోని గోల అని చెప్పలేదు.

మరోసారి అలా జరిగితే చెబుదామనుకున్నాను... ఆ తర్వాత ఎప్పుడూ అలా జరగలేదు.

అదే చివరిసారి. మళ్ళీ రాజీవ్ తన పుట్టిన రోజు నాటి ఫంక్షన్‌లో అరుంధతిని కొట్టటమే."

"మీరు రాజీవ్‌ని కన్న దగ్గర....ఆ పసివాడి పెదాలకు అక్కడ మట్టి అంటుకుని వుంటుంది... అలా రాజీవ్ శరీరం మీద ఆధిపత్యం వచ్చి వుంటుంది"

"మైగాడ్, అప్పట్నించి ఇన్నేళ్ళుగా రాజీవ్‌లో...."

"రాజీవ్ శరీరంతోపాటు సుజన ఆత్మకూడా పెరుగుతూ వచ్చింది."

"మరి అదే నిజమయితే అంత చిన్నతనంలోనే మాట్లాడేశక్తి, ఎదుటివాళ్ళను శాసిస్తూ చూసే చూపు ఎలా వచ్చింది. అంతశక్తి అప్పుడే ఉంటే, ఇన్నాళ్ళు ఎందుకు ఆగినట్టు...."

"నేను చెబుతాను....."

ఆ గొంతు ముగ్గురిది కాదు.

ముగ్గురూ మంచం కేసి చూసారు.

రాజీవ్ లేచి కూర్చున్నాడు.

మొహం నిర్వికారంగా ఉంది.

చూపులు ఎటో ఉన్నాయి.

"అన్ని సంవత్సరాలు అలా అజ్ఞాతంగా ఎందుకున్నానో తెల్సా? మా తాతయ్య భిక్ష అది. ఆ రోజుల్లో మా తాతగారి తండ్రిగారికి ఓ విధమైన గాలిసోకింది.....

పిచ్చి పిచ్చిగా ప్రవర్తించేవారు. అప్పట్లో మా ముత్తాత శాంతి చేయించి ఇంటికి నలువైపులా రక్ష రేకులు కట్టించారు.... బీజాక్షరాలు వున్న ఆ రేకులు ఇంటి ప్రాంగణంలో పాతిపెట్టారు.

అందుకే ఈ శరీరంలో ఉన్నా ఏమీ చేయలేకపోయాను.... ఆ రక్షరేకులు ఆ ఇంటిలో ఉన్న వారందరికీ రక్ష.... నా శక్తి పని చెయ్యదు....

చాలా సంవత్సరాల తరువాత రాజీవ్ పుట్టినరోజునాడు విందు భోజనానికి కట్టెలతో వంట మొదలు పెట్టారు.... అప్పుడే.... అప్పుడే రక్ష రేకులు పాతిపెట్టిన స్థలంలో తవ్వారు.

మంటపెట్టి వంట మొదలుపెట్టారు.... దానితో వాటి ప్రభావం పోయింది. నాకు శక్తి వచ్చింది."

ఫాదర్‌కి ఏదో అనుమానం వచ్చింది.

"పవిత్రమైన హోలి వాటర్ చల్లాను... అయినా రాజీవ్ శరీరంలోకి ఎలా వచ్చావ్?" ఆశ్చర్యంగా అడిగారు.

"ఎక్కడ చల్లారు.... పడుకున్న నా చుట్టూనేగా... అందుకే లేచి మీదాక రాలేకపోతున్నాను. పరుపు మీద నుండే మాట్లాడుతున్నానుకుంటున్నారా? కాదు. నా గొంతు వినపడేది రాజీవ్ నోటి నుంచి కాదు....

గాలిలోంచి.... "కాని ఫాదర్ కేవలం గంటలు... హోలి వాటర్ కూడా నన్ను ఆపలేదు. ఆ శక్తి రాబోతోంది..."

ముగ్గురు బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డారు.

"ఫాదర్, అన్యాయానికి కొమ్ము కాస్తున్నారు...... అది మంచిది కాదు. ఎన్ని రోజులు శిలువ గొలుసులేసి, ఎన్ని బైబిల్స్ పట్టుకొనొచ్చి కాపాడుతారో చూస్తాను.... వాళ్ళచేత వాళ్ళ కొడుకుని చంపించకపోతే నాఈ పిశాచ జీవితానికి అర్థం లేదు.

"బ్లడీ డ్రాక్యులా" కసిగా అంటూ లేచాడు ఫాదర్.

"అవును డ్రాక్యులానే, రక్తం త్రాగే డ్రాక్యులానే"

"ఇంతకీ నువ్వు దెయ్యానివా, పిశాచివా? డ్రాక్యులావా?" అడిగింది అర్థం కాక రోజీ.

"రాముడు వేరు, అల్లావేరు,. జీసెస్‌వేరు కాదు. ముగ్గురూ ఒక్కరే పేర్లు వేరు..... అలాగే దెయ్యమైనా, భూతమైనా డ్రాక్యులా అయినా నేనే.... ప్రాంతాన్ని బట్టి, ఆచారాన్ని బట్టి రకరకాల పేర్లుతో పిల్చుకుంటారు"

"నీ ఇంటర్వ్యూ మండినట్టేవుంది" విరుచుకుపడ్డాడు శ్యామ్ భార్య మీద.

"అది కాదండి తెల్సుకుందామని " చెప్పింది రోజీ.

భార్యని తినేసేలా చూసి.... ఫాదర్ వైపు తిరిగారు. ఫాదర్ బైబిలుని తీసి పైకి చదవటం ప్రారంభించారు.

దగ్గరలో వున్న కిటికీ రెక్క టప్పున కదిలింది.... ఫాదర్ కళ్ళు తెరిచారు.

"ఇక ఎక్కువసేపు కాలయాపన చేయటం అనవసరం. రోజులు పెరిగేకొద్దీ ఆత్మశక్తి పెరిగిపోతుంది. అదే జరిగితే అదన్నట్టు అన్నంతపని చెయ్యగలదు"

"ఏం చేయగలం ఫాదర్! మానవమాత్రులం మనం"

"మానవుడే మహనీయుడు. మానవుడు తలుచుకుంటే చెయ్యలేనిది లేదు. అలాంటి మహనీయుడు ఒకరున్నారు.

వారి నాన్న ఒకప్పుడు ఇంగ్లాండ్‌ని ఉగ్రూతలూగించిన కౌంట్ డ్రాక్యులాని బూడిద చేసినవారు.

ఆ తర్వాత కొడుకుని తీసుకుని ఇండియా వచ్చారు. వారిని కలుసుకుందాం. మనకొకదారి చెయ్యకపోరు."

☟ ☟ ☟ ☟ ☟

"వీరిపేరు పీటర్" పరిచయం చేసారు ఫాదర్.

శ్యామ్ షేక్ హాండ్ ఇచ్చి తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"పీటర్ అంటే ఈ చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఈ నగరంలో తెలియని వారులేరు. ఈ చర్చి బిషప్‌గా ఎన్నో ఏళ్ళ నుంచి ప్రభువును కొలుస్తూ వుంటున్నారు"

"చెప్పండి.... ఇంతదూరం నాకోసం వచ్చారంటే తప్పక ఏదో ఉండి ఉంటుంది"

"మేం కష్టాల్లో ఉన్నాం. మీ సహాయం కోసం అర్థిస్తున్నాం"

"ప్రయాసపడి భారం మోయుచున్న ప్రతివారు తప్పక నా ప్రాంగణంలోకి వస్తారు. ప్రభువుభుజాన తన బరువుని దింపుతారు... ఆయన దాన్ని ఆనందంగా స్వీకరిస్తారు.

మీ బాధకి కారణమేమిటో మొదట్నించి చెప్పండి. చెయ్యగలిగేదయితే ప్రభువు అనుమతి తీసుకుని చేస్తాను"

శ్యామ్ ఫాదర్ వంక చూసాడు వారిని చెప్పమన్నట్టు.

ఫాదర్ ఓపికగా, వివరంగా అంతా పీటర్‌కి చెప్పారు. అంతా విని ఆయన అన్నారు.

"ప్రభువు కూడా ఆ ప్రేతాత్మవేపే వుంటారు. అంత పాపం చేసారు.

"చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నాం. దానికి మా బిడ్డని బలి ఇవ్వకూడదనే మా యత్నం"

"ఆ ప్రేతాత్మ తరచూ రాజీవ్ శరీరంలోకి వచ్చి భయకంపితులను చేస్తోంది. చెప్పారు ఫాదర్."

"ఆ ఆత్మని చూసినా, పలుకు విన్నా భరించలేకపోతున్నాం. మా బిడ్డని మీరే కాపాడాలి"

"లేదు నాయనా! ఆ ప్రేతాత్మని మీరు చూడలేరు... చూసిన మీ కళ్ళు తిరిగి ఈ లోకాన్ని చూడలేవు.

నిప్పులు కక్కేగోళ్ళు... మొసలివంటి మెడ.... రెక్కపాములా బారుగా ఉంటుంది. మీరు చూసి ఉండరు. కేవలం దాని గొంతువిని ఉంటారు"

"అవును గొంతే విన్నాం"

"జీవించిన మనిషికి చనిపోయిన ప్రేతాత్మ ఆవహించి తద్వారా కోర్కెలను తీర్చుకుంటుందని డెమనాలజి (భూతశాస్త్రం) చెబుతోంది.

ఆ శాస్త్రంలోనే వుంది "దెయ్యమనే మాట ఉచ్ఛరిస్తే చాలు.... అదే మనముందు వాలుతుంది... నీడలా అనుక్షణం భయపెడుతుందని"

"మీరు జరిగిందంతా విని కూడా ఇలా....?" ఆగాడు శ్యామ్.

"భూత ప్రేత పిశాచాలు ఉన్నాయనే నమ్మకాలు చాలా దేశాల నుండి అదృశ్యమయ్యాయి. అలాంటి ఈ రోజుల్లో...."

"లేదు– మేం మా కళ్ళారా చూశాం.... విన్నాం. ఫాదర్ కూడా వున్నారు. ఇంతకుముందు దెయ్యమెలా ఉంటుందో వర్ణించి ఇప్పుడు ఇలా..."

"మీరు సరదాగా అంటున్నారనుకొని నేను ఇలా చెప్పాను. అయినా ఈ రోజుల్లో... నో...."

"నేనే సాక్ష్యం... హోలి వాటర్ చల్లి, శిలువని మెడలోవేసి బైబిల్ అడ్డం పెట్టి కాపాడుతూ వచ్చాను" చెప్పారు ఫాదర్.

పీటర్ ఎందుకలా మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు ఒక్కప్పుడు పీటర్ తండ్రే ఇంగ్లాండ్‌లోని కౌంట్ డ్రాక్యులాని నాశనం చేసింది.

అలాంటి వ్యక్తి కొడుకు దెయ్యాలు లేవని చెప్పడం హాస్యాస్పదం.

పీటర్ నవ్వాడు.

"మీరు విన్నారా? ఆ ప్రేతాత్మతో మాట్లాడించారా? ఫాదర్ మీకేమన్నా నెక్రోమాన్‌సి (ప్రేతాత్మను పిలిచి జోస్యం చెప్పించే విద్య) తెలుసా?"

"నాకు తెలియదు. కాని వాళ్ళడిగిందానికి సమాధానం చెప్పింది. వీళ్ళని మీరు కాపాడుతారని మీ దగ్గరికి తెచ్చాను. కాని మీరలా అంతా విని..."

"మంత్రాలకి చింతకాయలు రాలవు. ప్రేతాత్మ పేరు చెప్పి ఎవరో ఆడుతున్న నాటకం కావచ్చుగా. అదే అయుంటుంది. తీసుకెళ్ళండి. నేను వీరికి ఏ రకంగా సహాయపడలేను"

"నాటకాలడటానికి? ఎవరున్నారని?"

"ఆమె పేరేమిటన్నారు?" అడిగారుపీటర్

"సుజన" చెప్పాడు శ్యామ్.

"సుజన తరుపు ఎవరూ లేరా?"

"ఎ....వరూ..... అం....టే.... లేరు" చెప్పాడు శ్యామ్.

"వుండవచ్చుగా. మీకు తెలియకపోవచ్చుగా.... వెనకుండి అంతా ఆడిస్తూ వుండచ్చుగా"

"అసాధ్యం.... ఎక్కడో ఇంగ్లాండ్‌లో నా తమ్ముడి మరణం, అరుంధతి చివరిమాటలు, గబ్బిలాలు మూకుమ్మడిగా రావటం, నాకళ్ళముందే తేళ్ళు గుంపుగా

వచ్చి రాగిణిని బలితీసుకోవడం ఇవన్నీ మనిషికి సాధ్యమా? సైన్స్ ఎంతో ప్రగతిని సాధించి వుండవచ్చుగాని ఇంతగా కాదు"

"ఎందుక్కాదు.... ఒకప్పుడు రష్యాలో ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ట్రాక్టర్లని ప్రవేశపెట్టినపుడు కొంతమంది వ్యతిరేకులు ట్రాక్టర్లని దెయ్యాలుగా భ్రమింపచేసారు. ప్రజలే రాళ్ళు రువ్వేలా చేసారు. ఆలోచించు! వాళ్ళు ఎంతగా భయపడివుంటే అలా రాళ్ళు రువ్వి వుంటారో–"

"అంటే మీరనేది?"

"ఎవరో వెనకుండి ఎందుకు చెయ్యకూడదు? సుజన తాలూకు వాళ్ళు పగతో రగిలిపోయి అవన్నీ చేసి వుండచ్చుగా"

రోజీ, శ్యామ్ ఆయన్ని వింతగా చూశారు. తమబాధెందుకు అర్థం చేసుకోవాటం లేదు అర్థంకాక.

ఇవన్నీ తెలియక దెయ్యమని భ్రమసి, భూతమని దడిచి డ్రాక్యులా అని బెంబేలెత్తిపోయి.... "భూతవైద్యం కోసం పరుగులు పెడ్తూ నా దగ్గరికి వచ్చి వుండచ్చుగా"

"మీరు మాకు సహాయం చేయడానికి ఎందుకో నిరాకరిస్తున్నారని అనిపిస్తోంది మీ మాటలు వింటుంటే" చెప్పాడు శ్యామ్.

"అదేంలేదు బాధితులకు ఇక్కడ ఎప్పుడూ రక్షణ దొరుకుతుంది"

శ్యామ్ ఫాదర్ వంక తిరిగి... "పీటర్‌గారు దెయ్యాలని నమ్మేలా లేరు. మనం మరో దారి చూసుకోవడం మంచిది"

"నేనేకాదు ఈ రోజుల్లో ఎవరూ నమ్మరు. అసలిదంతా భూటకం స్వార్థపరులు ఆడే నాటకం"

శ్యామ్ లేస్తూ చెప్పాడు–

"చాలా దూరం నుంచి ఆశగా శ్రమపడి వచ్చాం. మీ నుంచి సహాయము రాకపోయినా కొంత మానసికమైన ప్రశాంతతన్నా దొరుకుతుందని వచ్చాం. ఏదీ దొరకలేదు. కానీ ఒక్కమాట.... ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాలో సయితం శాటన్ సంతతివారున్నారు. ఇప్పటికి వారు క్షుద్రశక్తులని పూజిస్తారు. మాలాంటివారికి సహాయపడతారు"

ఫాదర్ కూడా లేచి షేక్ హ్యాండిచ్చారు.

శ్యామ్ బయటికెళ్ళిపోయాడు. అప్పుడడిగారు ఫాదర్.

"పీటర్ ఎందుకలా మాట్లాడావ్?" అని.

"మీరు చెప్పగానే అర్థమైంది. అది శాటన్ ప్రభావమే అని. కాని నేను సహాయపడను. ఎందుకో తెలుసా? వారు క్షమించలేని పొరపాటు చేసారు.

పవిత్రమైన గార్డెన్ ఆఫ్ ఈడెన్ (మనమున్న భూమి)లో పుట్టి పాపం చేసారు.

పాపాత్ములకి సహాయం చేయటం పాపమే అవుతుంది. ఆ ప్రభువు సహకారం వారికి ఉండదు."

"మనం సహాయపడేది వాళ్ళకి కాదు, ఆ పసిబాలుడికి, ఒక్కసారి బయటకొచ్చి చూడు, కారులోపల తోటకూర కాడలా వున్నాడో."

"మైగాడ్ బయట వున్నాడా?"

"అవును పవిత్రమయిన హోలి వాటర్ కారులో చల్లి, కారుదిగవద్దని చెప్పాను.

"నాకెందుకో మనస్కరించటంలేదు. వాళ్ళకి నేను ఎలాంటి సహాయమూ చెయ్యలేను. సుజనకి చేసిన నీచానికి వారికి శిక్ష పడక తప్పదు."

"ఫాదర్ వస్తున్నారా?" అడిగాడు బయటనుంచి శ్యామ్

ఫీటర్ నవ్వి "చాలా కోపంగా వున్నట్టుంది శ్యామ్‌కి" అన్నారు ఫాదర్‌తోపాటు లేచి.

శ్యామ్ వెళతానన్నట్టు మరోసారి చెప్పాడు పీటర్‌తో.

"మిష్టర్ శ్యామ్! మీరు బ్రిటన్ వెళ్ళటం మంచిది" శ్యామ్ కెందుకో అర్థం కాలేదు.

"బ్రిటన్‌లో దెయ్యాలని పసిగట్టగలం, బంధించగల డిటెక్టివ్ ఏజెన్సీలున్నాయి. నిజం.... చెప్పాడు."

శ్యామ్ రెండు చేతులతో దణ్ణం పెట్టి నడిచాడు.

పీటర్ వెనక్కు తిరుగుతుండగా వినిపించింది......

భయంకరమైన కేక.... అంతే! పీటర్ ఆలోచించకుండా బయటికి వచ్చారు.

కారుచుట్టూ మంటలే... అద్దాల్లోంచి రోజీ, రాజీవ్ బిగ్గరగా అరుస్తున్నారు.

శ్యామ్, ఫాదర్‌కి ఎలా మంటలార్పాలో అర్థంకాలేదు. అసలెలా మంటలేర్పడ్డాయో కూడా తెలియదు. పీటర్ దగ్గర శెలవు తీసుకుని బయటికి రాబోతుండగా వినపడింది రోజీ కేక.....

ఆ వెనువెంటనే పరుగుతీశారు,. వస్తూనే కనపడ్డ దృశ్యమిది.

ఒక్కసారిగా ఈదురుగాలి వీచింది జయ్‌మని. మట్టి అరగజం లేచింది. దుమ్ము కడ్డుగా శ్యామ్ చెయ్యి అడ్డుపెట్టాడు.

అదే సమయంలో గ్లాస్ డోర్ కిందకి దిగుతోంది.

ఫాదర్ మంటల్లోంచి కనపడుతున్న రోజీకేసి చూసి-

"రోజీ విండో మిర్రర్‌వేయి." చెప్పారు.

రోజీ బయటికి రావటానికి విశ్వప్రయత్నం చేస్తూనే- "ఫాదర్! విండోస్ మిర్రర్ నేను దించలేదు. దిగకుండానే దిగిపోయింది. ఎంత ప్రయత్నించినా డోర్ మాత్రం తెరుచుకోవటంలేదు" చెప్పింది.

"ఆ డోర్ తెరుచుకోదు. మెడలోవున్న శిలువా, కారులో వున్న బైబుల్‌ని ఇటు విసిరేయండి" చెప్పారు ఫాదర్.

శ్యామ్ తల విదిలించి విన్నాడు.

"చెప్పింది ఫాదరే, మెడలో శిలువని ఎలాంటి పరిస్థితుల్లో తియ్యవద్దని చెప్పి, ఆయన మెడలోని శిలువని తన మెడలోవేసి పవిత్రమైన హోలి వాటర్ చల్లి మరి చెప్పిన ఆయన తియ్యమంటున్నారా?"

"ఫాదర్ తియ్యద్దన్నారుగా" అంది రోజీ ఆ సమయంలోనూ.

"తియ్యమని నేను చెబుతున్నానుగా, తియ్యి"

రోజీ మెడలోంచి తియ్యబోయింది.

అప్పుడు వినపడింది గట్టిగా.

"వద్దు, తియ్యద్దు, అది తీసావంటే అదే నీకు చివరిక్షణం......" చెప్పారు పీటర్.

శ్యామ్ అపనమ్మకంగా చూశాడు.

పీటర్ కళ్ళుమూసుకుని ధ్యానం చేసారు.

మరోసారి గాలి బలంగా వీచింది.

కారుమీద మంటలారిపోయాయి. పీటర్ ఫాదర్ దగ్గరికొచ్చి చేయి తగిలించారు. ఆయన ఉలిక్కిపడ్డారు. మామూలయ్యారు.

"ఏమైంది... కారుమీదేమిటలా కాలిన గుర్తులు" అడిగారు ఆశ్చర్యంగా.

పీటర్ తల పంకించి "ఆ ప్రేతాత్మ మిమ్మల్ని ఆవహించింది" జరిగింది చెప్పారు.

"మైగాడ్, నన్ను ఆవహించే శక్తి వచ్చిందన్నమాట" అన్నారు ఫాదర్.

"అవును బహుశ ఆ ప్రేతాత్మకి భూమిమీద వుండే ఆయుష్షు తీరిపోతూ వుండాలి. అందుకే దాని శక్తి అపారం అవుతోంది."

శ్యామ్ పీటర్ దగ్గరకొచ్చి "ఇప్పటికయినా నమ్ముతారా?" అన్నాడు.

"ముందు కారులోని వాళ్ళని లోపలికి తీసుకురండి" చెప్పారు పీటర్.

రోజీ, రాజీవ్‌ని తీసుకొని లోనికెళ్ళాక, అందరినీ ఉద్దేశించి చెప్పారు.

"నేను మొదట కాదన్నది దెయ్యాలు లేవని బుకాయించింది సహాయం చేయటం ఇష్టంలేక, కాని ఇప్పుడు చేయటానికి కారణం ఉంది.

ఆ ప్రేతాత్మని ఎదుర్కొంటాను. ఎందుకో తెలుసా? ఆ ఆత్మ చర్చిముందు కూడా కారుమీద అగ్నిజ్వాలలని కురిపించి ఫాదర్‌లో ప్రవేశించిందంటే అర్థం ఒక్కటే.

అపార శక్తి సంపన్నురాలిగా మారిందని, అలాగే వదిలేస్తే కౌంట్ డ్రాక్యులాని కూడా నిద్రలేపగలదు. తిరిగి పుట్టించగలదు. నా తండ్రి సమాధి చేసిన కౌంట్ డ్రాక్యులాని ఖచ్చితంగా పునర్జీవిని చేస్తుంది."

"కౌంట్ డ్రాక్యులానీ పుట్టించడమేమిటి?"

"ఒకప్పుడు కొన్ని సంవత్సరాల క్రితం మేం ఇంగ్లాండ్‌లో ఉండేవాళ్ళం. మా నాన్నగారు నాలాగే బిషప్.

ఇంగ్లాండ్ వణికిపోయ్యేది అప్పుడు డ్రాక్యులాకే ఎలా వచ్చిందో, ఎలా పుట్టిందో తెలీదు.

ఇంగ్లాండ్‌మీద విరుచుకుపడింది. ప్రతిరోజూ ఇద్దరి శరీరాలు దానికి బలి అయ్యేవి.

అలాంటి ఆ సమయంలో ఆ ప్రభువు ఆశీస్సులతో ఎదుర్కొన్నారు. బూడిదచేసి అక్కడే పూడ్చి పెట్టారు. అప్పుడే చెప్పారు.

తిరిగి ఆ డ్రాక్యులా లేవటం అంటూ జరిగితే మొదట నా కోసం వస్తుందన్నారు. ఆయనలేరు అయినా అది వదలదు. ఆ తండ్రి కొడుకుగా నా మీదకి వస్తుంది.

అది లేవటానికి, తిరిగి జన్మించటానికి దానికి అసాధ్యమే, కాని సుసాధ్యమే. తీరని కోర్కెలతో పగా ప్రతీకారంతో ఓ ఆడది చనిపోయి ప్రేతాత్మగా మారి వాళ్ళని పీడిస్తూ సాధిస్తూ విజయం సాధించిందా?

అదే గుర్తు..... ఆ ప్రేతాత్మకే కౌంట్ డ్రాక్యులాని లేపే శక్తి ఉంటుంది. అందరిమీద పగ తీర్చుకున్నా దాని దాహం తీరదు. ఇంకా ఇంకా రక్తం కావాలి. అందుకే కౌంట్ డ్రాక్యులాని నిద్రలేపుతుంది."

"అంటే, ఇప్పుడు సుజన ఆత్మ...." అన్నాడు ఎలా అడగాలో తెలియక.

"మా నాన్నగారు చెప్పిన స్టేజిలో ఉంది. చర్చి ముందు కూడా భీభత్సం సృష్టించగలిగిందంటే, ఓ ఫాదర్ శరీరంలోకి కూడా ప్రవేశించగలిగిందంటే... అర్థం..... అపరిమితమైన శక్తి వచ్చేసిందని... ఒక్క చర్చిలోకి రావటం మినహా అన్నీ చేస్తుంది. ఏదైనా సాధించగలుగుతుంది.

మీ ముగ్గురి మీద కసి తీర్చుకుందా....దాని శక్తి అపారం. ఆపటం సాధ్యం కాదు. కౌంట్ డ్రాక్యులాని తిరిగి బ్రతికిస్తుంది. రెండూ కలిసి మరోసారి కొన్ని సంవత్సరాల క్రితం ఇంగ్లాండ్‌ని వూపినట్టు వూపేస్తాయి. ప్రజలని భయభ్రాంతులను చేసి విరుచుకుతింటాయి."

"మైగాడ్!" భయంగా కొడుకుని దగ్గరికి తీసుకుంది.

"దాన్ని చంపే దారిలేదా పీటర్!"

"చంపటానికి దానికి శరీరం వుంటేగా"

"మరెలా....."

"ఒక్కటేదారి.... కాని ఈ ముగ్గురూ బయటికెళ్ళాలి"

"మేమా!" రోజీ వణికిపోతూ అంది.,

"తప్పదు, మీ భయం నాకు తెలుసు... కాని తప్పదు, మీ వెనుక నేను ఉంటాను."

"పోనీ నే ఒక్కడినే వెళతాను. నేను పోయినా, నా భార్య వుంటే చాలు నా బిడ్డకి తోడుగా."

"త్యాగాలకి, సెంటిమెంట్లకి ఇది సమయం కాదు. మీ ముగ్గురూ ఉంటేనే ఆ ప్రేతాత్మ ఏదో ఒక రూపంలో వస్తుంది."

"ప్లీజ్ ఫాదర్ మీరయినా చెప్పండి... నా భార్యనిక్కడ వుంచి నేను ఒక్కడినే వెళ్ళటానికి ఒప్పుకోమని...."

"నో మిస్టర్ శ్యామ్, మీకింకా అర్థం కావటంలేదు. ముగ్గురూ వుంటే తప్ప ఆమె ఎదుటికి రాదు... రాజీవ్‌ని చూస్తేనేవస్తుంది."

శ్యామ్ చాలాసార్లు అడగాలనుకుంటూ అడగలేకపోయింది పీటర్‌ని అడిగాడు.

"మాచేత మా కొడుకుని ఎలా చంపిస్తుంది. అంటే మా శరీరములో ప్రవేశించా...."

పీటర్ జాలిగా నవ్వాడు. "ఒకప్పుడేమోగాని, ఇప్పుడు మాత్రం ఆలా చెయ్యదు. ఎందుకంటే ఇప్పుడా ఆత్మ దాదాపు కౌంట్ డ్రాక్యులాగా మారిపోయి ఉంది. ఇప్పుడది దాదాపు డ్రాక్యులాలా రారాజు కౌంట్ డ్రాక్యులాగా మారటానికి సిద్ధంగా వుంది..."

"మరైతే ఎలా మాచేత మా బిడ్డని చంపిస్తుంది" అడిగాడు శ్యామ్.

"నే ననుకోవటం ఒకేలా.... కాని అలా జరగకూడదని ఆ ప్రభువుని ప్రార్థిస్తున్నాను. అదే జరిగితే మిమ్మల్ని చంపక తప్పదు" చెప్పారు పీటర్ బాధగా.

## ముగింపు :

రెండు పొడవాటి పదునైన రెండు కర్రలని తీసుకొచ్చి మరింత పదునుగా చెక్కారు పీటర్.

శ్యామ్‌కి రోజీకి అవెందుకో అర్థం కాలేదు. పీటర్‌ని అడిగారు....

"ఒకప్పుడు రాజద్రోహులకి, నేరస్థులకి, దేశద్రోహులకి కట్టి మేకులు కొట్టి హింసించి చంపారు. ఏసుక్రీస్తుని శిలువ వేశాక ఆయన రక్తం చింది పరమ పవిత్రంగా తయారయ్యింది శిలువ... క్షుద్ర శక్తులకి ఈ నీడే యమపాశం...."

"ఇప్పుడు మనకి ఈ శిలువతో అవసరం."

"చెబుతాను ముందు అందరూ కారెక్కండి" అన్నారు పీటర్.

ఫాదర్‌తో సహా అందరూ కారెక్కారు.

పీటరే స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ ఊరి పొలమేరల్లోకి తీసుకువచ్చారు.

అందరూ కారు దిగారు.

పీటర్ కర్రలతో చేసిన శిలువని పైకి పట్టుకుని మనసులో ధ్యానం చేసుకున్నాడు.

ఆ తర్వాత భద్రంగా పవిత్రంగా తలకి తాకించుకుని కార్ బ్యాక్ సీట్లో పెట్టి, డోర్ తెరిచే వుంచారు.

చల్లటి గాలి తగులుతుంది. దాన్ని ఆస్వాదించే స్థితిలోలేరు.

ఫాదర్‌బైబిల్ చదువుకుంటున్నారు దీక్షగా పైకి–

రాజీవ్ కొత్త ప్రదేశాన్ని.... చుట్టూ వాతావరణాన్ని చూస్తూ తల్లి పక్క నిలబడ్డాడు.

శ్యామ్ నలువైపులా చూస్తున్నాడు.

అంతా చీకటి... రవాణా సౌకర్యం లేని ప్రదేశం.....

పీటర్ హోలివాటర్ తీసి ఒక్కొక్కరి మీద చిలకరించాడు. తన మీద కూడా చిలకరించమని బాటిల్‌ని తిరిగి జేబులో పెట్టుకున్నాడు.

అప్పుడురిమింది ఆకాశం.... ఎవరో శక్తివంతమయిన ఆయుధాలు పెట్టి పేల్చినట్టు.....

ఆకాశంలోంచి మెరుపులు ప్రత్యక్షమైనాయి. అదే సమయంలో దిక్కులని దద్దరిల్లేలా చేస్తూ పిడుగుపడింది.

ఒక్కసారిగా ప్రకృతిలో మార్పు వచ్చింది. గాలి వేగంగా వీచటం ప్రారంభించింది. సన్నగా తుప్పర ప్రారంభమయ్యింది.

చలి..... ఎముకలు కొరికే చలి.... అందరూ వణికిపోతున్నారు.

పీటర్ మాత్రం ధ్యానించుకుంటూనే ఉన్నాడు.

రాజీవ్ తల్లిని కరుచుకుపోయాడు.

అప్పుడొచ్చింది అక్కడికో జంతువు.... కుయ్....కుయ్..... మని అరుస్తూ.. మొదట అది కుక్క అనుకున్నారు.

కాని కాదు... కుక్కకాదు నక్క. శవాలని పీక్కుతినే పిశాచిలా వస్తూనే చూసింది అందరినీ....

ఫాదర్ గట్టిగా బైబిల్ చదువుతున్నారు.

శ్యామ్, రోజీ ఆ నక్క వంకే చూస్తున్నారు కళ్ళప్పగించి.

రాజీవ్ భయంగా తల్లిని కరుచుకుపోయాడు.

అది వున్నట్లుండి అరిచింది... చుట్టూ దాని కేక ప్రతిధ్వనించింది.

హూ.....హూ...... హూ....

అని వాసన చూస్తూ శ్యామ్ దగ్గరికొచ్చింది.

ఫాదర్ బైబిల్ పఠనం మరింతగా పెంచాడు.

ఆ నక్క కోపంగా చూసింది ఫాదర్ వైపు....

ఫాదర్ ఆపలేదు... ఆపకుండా చదువుతూనే ఉన్నాడు.

మరో పక్క పీటర్ కళ్ళుమూసుకుని ధ్యానం చేస్తూనే ఉన్నాడు.

నక్క వెనకడుగు వేసింది.

రోజీ, శ్యామ్‌కారుని ఆనుకుని నిలబడ్డారు.

వర్షపు చినుకులు వారి శరీరాన్ని తడిపేశాయి.

ఆ నక్క మరో రెండడుగులు వెనక్కి వేసి మళ్ళీ అరిచింది.

ఈసారి దాని అరుపుకు చుట్టూ నలువైపుల నుంచి కొన్ని వందల నక్కలు బయటకొచ్చాయి. అంతవరకూ ఎక్కడున్నాయో, ఏ చీకటి మాటున నక్కి వున్నాయోగాని, పిలుపు వచ్చినట్టు ఒకేసారి నలువైపుల నుంచి వచ్చేశాయి.

అరికాలి నుండి వణుకు ప్రారంభమయ్యింది రోజీ శ్యామ్‌కి.

అన్నీ ముక్కు పుటలు కదిలిస్తూ వాసన చూస్తున్నాయి. అడుగులో అడుగేసుకుంటూ కదులుతున్నాయి. భయం పుట్టించేలా గాలి జయ్‌మని వీస్తోంది. ఆ నక్కలు చెవులు హోరెత్తించేలా అరుస్తూ కదులుతున్నాయి.

ఫాదర్‌కి తెలుస్తూనే వున్నా బైబుల్ చదవటం మాత్రం ఆపలేదు. పీటర్ మరీ మరీ చెప్పాడు ఎలాంటి స్థితిలోనూ ఆపొద్దని... ఆపితే చుట్టూ ప్రకృతి కూడా ఎదురుతిరుగుతుందని.

అందుకే వణికే నోటితో చదివేస్తున్నాడు.

నక్కలు చుట్టూ వచ్చేశాయి.... కానీ ఫాదర్ నోటినుంచి వెలువడుతున్న పవిత్ర సూక్తులకు అవి అదురుతున్నాయి. అవి కళ్ళని చిట్లించి ఫాదర్‌నే చూస్తున్నాయి.

నోటితో ఉప్...ఉప్ మని వూదుతున్నాయి.

గాలికి ఎగిరిపోయేలా వుంది చేతిలోని గ్రంథం. గట్టిగా పట్టుకుని వల్లిస్తున్నారు ఫాదర్. ఉరుములు మెరుపులు ఎక్కువయ్యాయి.

"పరలోకంలో వున్న ఓ ప్రభువా..... నీ బిడ్డలను కాపాడు..... వారు తెలియక చేసిన పాపములకు శిక్షింపకుము...."

ఓ నక్క విసురుగా లేచింది. ఫాదర్ వెనుకడుగు వేశారు. ప్రయత్నంగా గ్రంథం జారింది. నోరు ఆగింది.

అంతే.... కీసర బాసరగా అరిచాయి నక్కలన్నీ.

ఫాదర్‌ని బెదిరించి అదిలించిన నక్క ఒక్క ఉదుటున విసురుగా లేచింది. లేచి లేవటంతోనే బాణంలా దూసుకెళ్ళి వెనుకఅడుగ వేస్తున్న ఫాదర్ మోకాలిని కొరికింది.

దాని పళ్ళు కస్సున దిగాయి.

రోజీ కొడుకుని చంకనేసుకొని పరిగెత్తబోయింది.

ఆమె పరిగెత్తకుండా చుట్టూ నక్కలు కాపుకాశాయి. అన్నీ మూకుమ్మడిగా ఎదురెళ్ళాయి.

రోజీకి మళ్ళీ తానున్న ప్రదేశానికి రావటం తప్ప గత్యంతరం లేని పరిస్థితిని కల్పించాయి.

శ్యామ్ భార్యా బిడ్డల్ని పట్టుకున్నాడు.

నక్కలు మరింతగా ముందుకు వచ్చాయి. దంపతులు రాజీవ్‌తో సహా వెనక్కి జరిగారు. వున్నట్లుండి నక్కలు ఎగిరాయి. ఆనందంగా నాట్యం చేస్తున్నట్టు కదులుతున్నాయి.

రోజీ వాళ్ళు మరింతగా భయంగా వెనక్కి పరిగెత్తారు. వెళ్ళి ఫాదర్‌కి తగిలారు. ఉలిక్కిపడి చూశారు.

ఫాదర్....

వారు తనకు తగలడంతోనే ఫాదర్ నవ్వారు.

శ్యామ్, రోజీకి గుండాగినంత పనయ్యింది రాజీవ్ కెవ్వున అరిచాడు.ఆ అరుపుకి పీటర్ కళ్ళు తెరిచాడు.

ఫాదర్ మరోసారి నవ్వారు.

తెల్లటి ఆయన పళ్ళతోపాటు ఆచివరా, ఈ చివరా రెండు కోరలు మెరిసాయి.

పీటర్ అవాక్కయిపోయాడు. ఏది జరగకూడదని అంతసేపు దేవస్తోత్రములు చేశాడో, అదే జరిగింది. ఫాదర్‌ని కమ్మేసింది మాయ. పీటర్ ఫాదర్ వంక జాలిగా చూశారు.

రోజీ, శ్యామ్ చాటుకెళ్ళింది.

ఫాదర్ తలని అటూ ఇటూ తిప్పుతూ ముందు కదుగేశారు,.

నిద్రలో దడుచుకుని ఏడ్చే పసిపిల్లలా అరుస్తోంది రోజీ.

ఫాదర్ చేయిచాపారు. వెదురు బొంగులా పొడుచుకు వచ్చింది. బారుగా పొడుగ్గా, చేయి మొలుచుకువస్తోంది. వచ్చి శ్యామ్‌ని పట్టేసింది.

పీటర్ పరుగున వచ్చి... స్తోత్రం చదువుతూ శ్యామ్‌ని పట్టుకున్నాడు. ఫాదర్ చేయి విసురుగా పీటర్‌ని తాకింది. వెళ్ళి అల్లంత దూరంలో పడ్డారు.

ఫాదర్ శ్యామ్‌ని దగ్గరకు లాక్కుని కళ్ళల్లో మత్తు చూపిస్తూ దగ్గరికి తీసుకున్నారు. సరిగ్గా శ్యామ్ మెడ దగ్గర వంగి కోరలు దించారు.

సప్..... మెడ తెగింది. రక్తం బుస్సున పొంగింది. శ్యామ్ మెడ తెగిన మేకలా అరిచాడు. మరుక్షణమే తల ఎత్తాడు. ఫాదర్‌ని చూసి నవ్వాడు. జన్మ జన్మల బంధమన్నట్లు ఒకరి నొకరు చూసుకున్నారు. కళ్ళతోనై సైగ చేసుకుని కదిలాడు పళ్ళు యికిలిస్తూ–

రోజీకి వాంతి వచ్చింది. కడుపులో చేయి పెట్టి మెదిపినట్టు అన్పించింది శ్యామ్‌ని చూస్తుంటే. ఇప్పుడతని కళ్ళ చిత్రంగా మెరుస్తున్నాయి. పళ్ళు పొడుచుకు వచ్చాయి. ఆ చివరా ఈ చివరా కోరలు.

తన భర్త.... తన భర్త.... భగవాన్... ఆక్రోశించింది.

శ్యామ్ భార్యవైపు తిరిగాడు. నవ్వాడు. చీకటిలో తళుక్కున మెరిశాయి కోరలు.

పీటర్ తల కొట్టుకున్నారు. జరగకూడనిది జరిగిపోయింది. ఇక యింతటితోనయినా ఆపాలి. పీటర్ కారువైపు వెళ్ళబోయాడు. దాన్ని గ్రహించినట్టు శ్యామ్ ఉఫ్‌మని వూదాడు.

ఇనుప హస్తం వచ్చి నెట్టినట్టు అరగజం దూరం వెళ్ళిపడ్డాడు.

నక్కలన్నీ సంతోషంగా ఎగిరాయి. పీటర్ కారువైపు వెళ్ళనీయకుండా నక్కలు అడ్డుకున్నాయి.

శ్యామ్ రోజీ వైపే వస్తున్నాడు. చంకనున్న కొడుకుని కిందకి దింపి "వద్దండి... నేనండి....మీ భార్యనండి" అంది.

శ్యామ్ కోరలు బయటపెట్టి ''దాహం దాహం....'' అంటూ కదులుతున్నాడు.

రోజీ వెనక్కి వెనక్కి అడుగేస్తోంది,

ఇద్దరూ ఆమె వైపే.... ఫాదర్, శ్యామ్ ఆమెనే ఆకలిగా చూస్తూ కోరలని బయటపెట్టి నడుస్తున్నారు....

పీటర్ అసహాయంగా లేచాడు. తాను కారు దగ్గరికి వెళ్ళాలి. శిలువని తియ్యాలి. అప్పుడే ఈ దహనకాండ ఆగేది... కాని వెళ్ళటానికి దారి లేదు.

నక్కలు తన దాకా రాలేక,.... దూరం నుంచి రౌండ్‌గా వుండి కదలకుండా చేస్తున్నాయి.

సరిగ్గా కారు దగ్గరే రోజీ ఉంది. ఆమె కోసమే వస్తున్నారు ఫాదర్, శ్యామ్‌లు.

రాజీవ్ దూరంగా నిలబడి నిర్ఘాంతపోయి చూస్తున్నాడు.

"ఈహి...ఈహి...." నవ్వాడు శ్యామ్, రోజీని చేజిక్కించుకుని. ఫాదర్ మరోవైపు పట్టుకొని "ఈహి....ఈహి.... " అన్నాడు.

ఇద్దరూ చెరో వైపు వంగారు. మధ్యలో రోజీ చిగురుటాకులా వణికిపోతోంది.

సప్....

అటూ యిటూ రెండు పక్కల కోరలు దిగాయి.

మొదట బాధ కలిగింది. తర్వాత హాయిగా అన్పించింది. మత్తుగా కళ్ళు మూసుకుంది.

ఇద్దరి తలలు రోజీ మెడ నుంచి లేచాయి. అప్పుడు కళ్ళు తెరిచింది రోజీ, ఇద్దరి వంకా చూసి హాయిగా నవ్వింది.

నాలుకతో కోరలని తడుముకుంది.

ఇప్పుడు ఇద్దరు కాదు ముగ్గురు కలిసి చూశారు.

పీటర్, రాజీవ్‌లు కనపడ్డారు. తనవైపు దృష్టిపడకుండా పీటర్ మెడలోని

శిలువని తీసి పైకి పట్టుకున్నాడు. మెడలో వున్నది మామూలు శిలువకాదు పీటర్ తండ్రిది.

ముగ్గారు రాజీవ్‌కేసి నడిచారు.

పీటర్ రాజీవ్‌వైపుగా చేతికందిన రాయి విసిరాడు. రాజీవ్ పీటర్‌ని గమనించటం లేదు.

కదిలివస్తున్న ముగ్గురిని చూస్తున్నాడు పీటర్.

మరొక రాయిని తీసుకొని.... “రాజీవ్” అని అరుస్తూ విసిరాడు. ఈసారి చూశాడు.

రాజీవ్ తనని చూడగానే.... “కారులో శిలువ ఉంది వెళ్ళి తీసుకో” చెప్పాడు.

రాజీవ్ టక్కున కదిలి కారువైపు పరిగెత్తాడు.

అది చూసి ముగ్గురూ లంఘించారు. పెద్ద పెద్ద అంగలు వేస్తూ.....

“రన్ రాజీవ్... రన్ రాజీవ్” అరుస్తున్నాడు పీటర్.

రాజీవ్ పరుగున వెళ్ళితెరిచిన కారు డోరులో దూరి శిలువ పట్టుకున్నాడు.

అక్కడిదాకా వచ్చిన ముగ్గురి చేతులు కారులోవున్న రాజీవ్‌ని పట్టుకోవటానికి ప్రయత్నించాయి.

లోపలికెళ్ళిన చేతులు కరెంట్ షాక్ కొట్టినట్టు బయటికి తీశారు. వెనక్కి అడుగేశారు.

అదేసమయంలో.....

పీటర్ ఒక్క ఎగురు ఎగిరి నక్కలని చేధించుకుని కారుకి మరో వైపున్న డోర్ తీసుకుని... ముందు రాజీవ్‌ని తీసుకొని ఆపై శిలువ తీసుకున్నారు పీటర్. ముగ్గురూ వికృతంగా అరిచారు.

పీటర్ శిలువ చేత్తో పట్టుకుని రాజీవ్‌ని వదలకుండా గట్టిగా స్తోత్రం చదివారు.

పీటర్ అలా చదువుతూ ముందుకు కదిలాడు.

వారు పీటర్ ముందుకు వస్తున్నప్పుడల్లా వెనుకడుగు వేస్తున్నారు.

శిలువ వారిలో భయాన్ని పుట్టిస్తోంది.

బ్రహ్మాండమయిన వెలుగు వారికి గోచరిస్తోంది.

కోరలు విరిగిపోయేలా కొరుక్కుంటున్నారు కసిగా.

పీటర్ గట్టిగా స్తోత్రం చెపుతూ శిలువని వారి ముందుగా పెట్టారు.

శరీరాలు చిట్లిపోయేలా అరిచారు.

మరోసారి గట్టిగా ధ్యానించి.... శిలువని పైకెత్తి విసురుగా శ్యామ్ పొట్టలో పొడిచారు.

సగం నక్కలు పరుగు ప్రారంభించాయి దిక్కులు చూకుండా.

శ్యామ్ పొట్టలో శిలువ దిగటంతోనే వాంతి చేసుకున్నాడు.

నోటి లోపల్నించి పచ్చటి ద్రవం బయటికొచ్చింది. ఆ తర్వాత ఐస్ కరిగినట్టు శరీరం కరగటం ప్రారంభించింది.

మొదట తల... ఆ తర్వాత మొండెం... అలా... అలా....

పీటర్‌కు వాంతు వచ్చేలా వుంది. అయినా నిగ్రహించుకుని ఈసారి రోజీ కడుపులో గుచ్చాడు.

ఆమె నోటినుండి అదే ద్రవం.... ఇద్దరూ మెలికలు తిరిగిపోతూన్నారు. నోటిలోని కోరలు వూడి క్రిందపడ్డాయి.

పళ్ళు అన్నీ రాలిపోతున్నాయి. జుట్టు ముద్దలుగా రాలుతోంది.

పీటర్ ఫాదర్ వంక తిరిగారు.

పీటర్‌కి కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. తప్పదు,

"సారీ ఫాదర్! ఇలా జరుగుతుందని అనుకోలేదు. ఏదయితే జరగకూడదని ధ్యానం చేశానో అదే జరిగిపోయింది... క్షమించు తప్పదు. ఈ భూమిమీద ప్రజలు సుఖ సంతోషాలతో బ్రతకాలంటే కొంతమంది నీలాంటి వారు బలిదానం అవ్వక తప్పదు... ఆ ప్రభువునన్ను క్షమించుగాక...." అని విసురుగా పొడిచాడు.

'ఆవ్' దిక్కులు పిక్కటిల్లేలా అరిచారు.

కోరలు టప్పున వూడి కింద పడ్డాయి....

అదే సమయంలో  అతని శరీరం నుంచి తెల్లగా ఏదో పైకి లేచింది. పీటర్ చూస్తుండగానే శూన్యంలో కలిసిపోయింది.

నక్కలు మాయమయ్యాయి....

ప్రకృతి మామూలయ్యింది. ఫాదర్ జుట్టు రాలుతోంది. చూడలేక పోయారు పీటర్.... గిర్రున తిరిగి రాజీవ్‌ని ఎత్తుకొని కారు వైపు అడుగులు వేశారు.

రాజీవ్ వెనక్కి చేయి చూపించి... "మమ్మీ, డాడీ!" అని అరుస్తూనే ఉన్నాడు.

"రిలాక్స్ రాజీవ్... మమ్మీ డాడీ ఇక అన్నీ నేనే" చెప్పారు పీటర్ కారు స్టార్ట్ చేస్తూ....

-: అయిపోయింది :-

ఈ నవల మొత్తం కల్పితం

హర్రర్ సబ్జక్ట్‌లో ఉండవలసిన పరిమితుల దృష్ట్యా దెయ్యాల గురించి, ఊహించి రాయటం జరిగింది. ఇది నిజమని, అక్కడక్కడ చెప్పినవి వాస్తవమని అనుకోవద్దు. పాత్రలూ, సంఘటనలూ అన్నీ రచయిత ఊహ- అల్లికగా మలచబడిందని గమనించగలరు.

**మైథిలీ వెంకటేశ్వరరావు**